ఈనాడు

విజయవాడ 6-8-2025 బుధవారం సిటీ సంపుటి 51 . సంచిక 358 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఉత్తర కాశీలో ఉత్పాతం

ధరాలీ గ్రామాన్ని తుడిచిపెట్టిన వరద ● నలుగురి దుర్మరణం

వరదల్లో చిక్కుకున్న 60 నుంచి 70 మంది.. ● శిథిలాల కింద మరో 12 మందిదాకా..






ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో ధరాలీ గ్రామంపైకి దూసుకొస్తున్న వరద

ఉత్తర కాశీ: ఒక్కసారిగా విరుచుకుపడ్డ ఆకస్మిక వరదలతో ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీ అల్లకల్లోలమైంది. గంగోత్రికి వెళ్లే మార్గంలో ఉన్న ధరాలీ గ్రామం సగభాగం తుడిచిపెట్టుకుపోయింది. అక్కడి ఇళ్లు, కార్లు, చెట్లు వరదల్లో కొట్టుకుపోయాయి. 60 నుంచి 70 మంది ఈ వరదల్లో చిక్కుకుపోయారు. కనీసం నలుగురు మరణించారు. మరో 12 మందిదాకా శిథిలాల కింద ఉండి ఉంటారని భావిస్తున్నారు.

ఖీర్ గంగా నది పరీవాహక ప్రాంతంలో మంగళవారం ఉదయం మేఘ విస్ఫోటంతో ఒక్కసారిగా విరుచుకుపడ్డ బురదతో కూడిన వరద.. అతి వేగంగా ధరాలీ గ్రామంలోకి దూసుకొచ్చింది. దీంతో 3, 4 అంతస్తుల భవనాలూ పేకమేడల్లా కుప్పకూలి వరదలో కొట్టుకుపోయాయి. ధరాలీలో 20 నుంచి 25 హోటళ్లు, హోంస్టేలు వరదలో కొట్టుకుపోయాయి. ఈ గ్రామానికి సమీపంలోని కొండకు మరోవైపున చీలిపోయిన వరద.. సుక్కీ గ్రామాన్నీ ముంచెత్తింది. ఈ ప్రాంతంలో వర్షాలు మంగళవారం మధ్యాహ్నానికీ ఆగలేదు. దీంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

- వరదల్లో గల్లంతైన వారి గురించి కచ్చితమైన సమాచారం లేకపోయినప్పటికీ చాలా మంది ఆచూకీ తెలియడం లేదని అధికారులు తెలిపారు. ఆకస్మికంగా వరదలు రావడంతో తప్పించుకునే మార్గం లేకపోయిందని వివరించారు.
- వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడటంతో 163 రోడ్లు మూసుకుపోయాయి. అందులో 5 జాతీయ, 7 రాష్ట్ర, 2 సరిహద్దు రహదారులున్నాయి.
- సమీపంలోని హర్సిల్‌లో ఉన్న సైనిక బృందాలు వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నాయి. మిగిలిన ప్రాంతాల నుంచి సహాయక బృందాలు (మిగతా 3లో)

- ధరాలీలో 40 నుంచి 50 ఇళ్లు కొట్టుకుపోయాయని ఉత్తరాఖండ్ ముఖ్య కార్యదర్శి ఆర్‌కే సుధాంశు తెలిపారు. హెలికాప్టర్ వెళ్లడానికీ వాతావరణం సహకరించడం లేదని వెల్లడించారు.
- ధరాలీలో మార్కెట్ మొత్తం తుడిచిపెట్టుకుపోయిందని స్థానికులు చెప్పారు.



నేతన్నలపై వరాల జల్లు

- చేనేత వస్త్రాలపై జీఎస్టీ మినహాయింపు
- రూ.5 కోట్లతో థ్రిఫ్ట్ ఫండ్
- సమీక్షలో సీఎం చంద్రబాబు నిర్ణయం

ఈనాడు, అమరావతి: నేతన్నలపై కూటమి ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. చేనేత రంగానికి ఊతమిచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు ప్రకటించారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీని ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. ఆ మొత్తాన్ని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించనుంది. కార్మికుల కోసం రూ.5 కోట్లతో థ్రిఫ్ట్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తామని వెల్లడించారు. (మిగతా 3లో)

మానవత్వం ఉన్న వారంతా పీ4 మార్గదర్శులే
ఎంపిక స్వచ్ఛందమే.. బలవంతం లేదు: చంద్రబాబు 3లో

రాబోయే 4 రోజుల్లో భారీ వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో ఉత్తర తమిళనాడు తీరంతో పాటు రాయలసీమ పరిసర ప్రాంతాల్లో వేర్వేరు ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయి. వీటి ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. బుధవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ప్రకాశం, కర్నూలు, (మిగతా 3లో)

నాలా రద్దుపై ఆర్డినెన్స్!
నేటి కేబినెట్ భేటీలో ఆమోదం 14లో

'వైకాపా' గుప్పిట్లోకి ఆర్టీజీఎస్!
ఆ పార్టీ మద్దతుదారులకే పోస్టులు 2లో



24 గంటల్లో

సుంకాల బాంబు పేలుస్తా

భారత్‌పై భారీగా భారం మోపుతా

- రష్యా చమురు తీసుకోవద్దంటున్నాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

న్యూయార్క్, మాస్కో: భారత్‌పై భారీ సుంకాల బాంబును పేల్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమయ్యారు. 24 గంటల్లోగా ఈ సుంకాల బాంబును వేస్తానని హెచ్చరించారు. భారత్ తమకు మంచి వ్యాపార భాగస్వామి కాదని, ఆ దేశం రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. 'భారత్ అత్యధిక సుంకాల దేశం. ఎవరిపైనైనా ఆ దేశం అధికంగానే సుంకాలను విధిస్తుంది. అందువల్లే ఆ దేశంతో మాకు స్వల్ప వాణిజ్య లావాదేవీలున్నాయి. మాతో ఆ దేశం బాగానే వ్యాపారం చేస్తోంది. కానీ మేం ఆ దేశంతో వ్యాపారం తక్కువగానే చేస్తాం. అందుకే 25శాతం సుంకాలను విధించాం. కానీ 24 గంటల్లో దీనిని భారీగా పెంచనున్నాం. రష్యా నుంచి చమురును కొనడంద్వారా వారు యుద్ధ ఇంజిన్‌కు ఇంధనాన్ని (మిగతా 3లో)

అమెరికా పర్యాటకులపై బాండ్ పిడుగు! 10లో

అనుమతుల్లేని లేఔట్లు 13,667

- 78,452 ఎకరాల్లో విస్తరణ.. 85% వైకాపా హయాంలోనివే
- ఎల్‌ఆర్‌ఎస్ నేపథ్యంలో వెలుగుచూసిన అక్రమాలు

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో అనుమతులు తీసుకోకుండా 78,452 ఎకరాల్లో 13,667 లేఔట్లు వేసినట్లు అధికారులు గుర్తించారు. వీటిలో 85%పైగా వైకాపా హయాంలో వేసినవే. ఆ పార్టీ నాయకులు, వారి అనుచరులు అడ్డగోలుగా వేసి స్థలాలు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ తేవడంతో అనుమతుల్లేని లేఔట్లను గుర్తించేందుకు అధికారులు సర్వే చేశారు. 2019-24 మధ్య వేసినవే ఎక్కువగా ఉన్నాయి. వీటిలో కృష్ణా జిల్లాలో అత్యధికంగా 1,591, తూర్పుగోదావరిలో అత్యల్పంగా 16 లేఔట్లు ఇలాంటివి ఉన్నాయి

ప్రభుత్వాదాయానికి రూ.కోట్లలో గండి

అనుమతులు తీసుకోకుండా వేసిన లేఔట్ల కారణంగా ప్రభుత్వాదాయానికి రూ.కోట్లలో గండి పడింది. డెవలప్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు చెల్లించకుండా వీటిని అడ్డగోలుగా వేసేశారు. ప్రత్యేకించి కృష్ణా, అనంతపురం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాల్లో వైకాపా నేతలు భారీగా లేఔట్లు వేశారు. చిత్తూరు, నెల్లూరు, కృష్ణా జిల్లాల్లో కొందరు అధికారులైతే నేతలతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలున్నాయి. వీటిపై విజిలెన్స్ అధికారులు ఇచ్చిన నివేదికలూ గత ప్రభుత్వంలో బుట్టదాఖలయ్యాయి.




రెరాలోనూ రిజిస్ట్రేషన్లు లేవు

అనుమతులు తీసుకోని లేఔట్లకు సంబంధించి గత ప్రభుత్వంలో ఏపీ రెరా కూడా ప్రేక్షకపాత్ర వహించింది. పురపాలక, పట్టణాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారిణి ఒకరు రెరాను పూర్తిగా తన చేతుల్లోకి తీసుకుని (మిగతా 3లో)

అమరావతికి పచ్చల తాపడం

6,974 ఎకరాల్లో పార్కులు, హరిత వనాల అభివృద్ధి



ఈనాడు, అమరావతి: రాజధానిని హరిత వనాలు, తటాకాలు, కాలువలతో 'గ్రీన్ అండ్ బ్లూ' సిటీగా తీర్చిదిద్దేందుకు 6,974 వేల ఎకరాల్లో పార్కుల అభివృద్ధి, చెట్లు పెంచేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రధాన రహదారులు, ఎల్‌పీఎస్ లేఔట్లలోని రహదారుల పక్కన, రహదారులకు మధ్యలో (మీడియన్), కాలువలు, చెరువుల ఒడ్డున పెద్ద ఎత్తున చెట్లు పెంచడంతో పాటు, నాలుగు ప్రధానమైన పార్కుల్ని అభివృద్ధి చేయబోతోంది. శాఖమూరులో 190 ఎకరాలు, మల్కాపురంలో 21 ఎకరాల్లో పబ్లిక్ రిక్రియేషన్ పార్కులు, అనంతవరంలో 31 ఎకరాల్లో లంగ్‌స్పేస్ పార్కు, (మిగతా 3లో)

మనిషిని జైల్లో పెట్టడమంటే పరువు తీయడమే

దెబ్బకొట్టినోడికీ నొప్పి తెలిసేలా చేసేందుకే 'యాప్'

వైకాపా న్యాయవిభాగం ప్రతినిధుల సమావేశంలో జగన్



ఈనాడు, అమరావతి: ఒక మనిషిని జైల్లో పెట్టడమంటే ఆ వ్యక్తి పరువు, ప్రతిష్ఠలతో ఆడుకోవడమేనని వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ అన్నారు. 'తమకు గిట్టనివారు, నచ్చనివారు, ప్రభుత్వ వ్యతిరేక స్వరం వినిపించేవారిపైనా దొంగ సాక్ష్యాలు సృష్టించి కేసులు పెడుతున్నారు. జైలుకు పంపి వారి పరువు తీస్తున్నారు. ఒక కేసులో బెయిల్ వచ్చి బయటకొచ్చేలోపే మరో కేసు పెట్టి, వారిని జైల్లోనే ఉంచేస్తున్నారు. 14 నెలల చంద్రబాబు పాలన చూస్తే (మిగతా 3లో)

ఇదీ సంగతి!



'వైకాపా' గుప్పిట్లోకి ఆర్టీజీఎస్!

- ఇటీవల నియామకాల్లో ఆ పార్టీ మద్దతుదారులకే పోస్టులు
- అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తికి కీలక ఉద్యోగం
- డేటా కోసమే పోస్టింగ్ పొందారా?
- నియామకాలపై సీఎంవో ఇప్పుడు ఆరా

ఈనాడు – కర్నూలు: వైకాపా సానుభూతిపరుడికి రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)లో కీలక పోస్టును కూటమి ప్రభుత్వం కట్టబెట్టింది. గత ఎన్నికల్లో కర్నూలు నగరంలో తెదేపా అభ్యర్థి ఓటమి కోసం పనిచేసిన ఆ వ్యక్తికి 'సమాచార- పౌరసంబంధాల' సమన్వయ బాధ్యత అప్పగించింది. ఇంకెవరూ అర్హులు కాదన్నట్లు ఏరికోరి ఆయన్ను ఎంపిక చేయడం చర్చనీయాంశమైంది. వైఎస్ కుటుంబానికి విధేయుడిగా ముద్రపడిన ఆ వ్యక్తి.. వైకాపా పేరు స్ఫురించేలా రాజకీయ పార్టీ ప్రకటించి 'అన్నా' అనిపించారు. ఆ పార్టీ తరఫున కర్నూలు నుంచి పోటీ చేసిన 'సత్తా' ఆయనది. 'మైనారిటీ' ఓట్లలో చీలిక తెచ్చి కర్నూలు జిల్లాలో కూటమి అభ్యర్థుల ఓటమి కోసం ప్రయత్నించారు. అలాంటి వ్యక్తికి కూటమి కొలువు ఇచ్చిందంటే.. 'మంచి ప్రభుత్వం' అనుకుని సరిపెట్టుకోవాల్సిందే అంటూ స్థానిక తెదేపా కార్యకర్తలు వ్యంగ్యంగా మాట్లాడుకుంటున్నారు. దీంతోపాటు ఆర్టీజీఎస్‌లో ఇటీవల నియామకాల్లో పలు కీలక పోస్టుల్లో వైకాపా మద్దతుదారులే చోటు దక్కించుకున్నారు. దీంతో ఈ నియామకాలపై సీఎంవో ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

ఇంకా ఉన్నారు!

ఇటీవల ఆర్టీజీఎస్‌లో జరిపిన నియామకాల్లో వైకాపా మద్దతుదారులు మరికొందరికీ పోస్టింగ్‌లు దక్కాయని సమాచారం. వైకాపా ప్రభుత్వంలో ఒక వెలుగు వెలిగిన కొందరికి కూటమి ప్రభుత్వం రూ.లక్షల్లో జీతాలిస్తోంది. పోస్టింగ్ ఇచ్చే ముందే వారి గురించి పూర్తి స్థాయి విచారణ నిర్వహించని ఫలితమిది. దీనివల్ల రాష్ట్రానికి సంబంధించి 'కీలక డేటా' భద్రపరిచే వ్యవస్థ మొత్తం ప్రత్యర్థి చేతుల్లో పెట్టినట్లయింది. జీతం కోసం కాకుండా ఆ డేటా కోసమే వారు పోస్టింగ్ కోసం ప్రయత్నించారన్న ఆరోపణలున్నాయి. సీఎం చంద్రబాబు 'మానసపుత్రిక'గా భావించే సంస్థలో చేపట్టిన నియామకాల్లోనూ అధికారులు ఇంత అజాగ్రత్తగా వ్యవహరించడం గమనార్హం.

మచ్చుకు కొన్ని..

◆ వైకాపా హయాంలో డిజిటల్ కార్పొరేషన్‌లో ఉద్యోగం వెలగబెట్టి.. ఆ పార్టీ కార్యకర్తలా పనిచేసిన మరొకరికీ కీలక పోస్టింగ్ ఇచ్చినట్లు సమాచారం.

◆ రైల్వే ఉద్యోగి ఒకరు వైకాపా వీరాభిమాని. అక్కడ సెలవు పెట్టి మరీ ఆర్టీజీఎస్‌లో డైరెక్టర్ పోస్టు పొందారు. అతని గురించి తర్వాత తెలియడంతో అధికారులు రాజీనామా చేయించినట్లు తెలిసింది.

ప్రభుత్వ సమాచారమంతా నిక్షిప్తం

ఆర్టీజీఎస్‌లో కీలక ప్రభుత్వ శాఖల సమాచారం నిక్షిప్తమై ఉంటుంది. ప్రజలకు వాట్సప్ గవర్నెన్స్ కింద 'మన మిత్ర' ద్వారా ప్రభుత్వ సేవలందించేందుకు అన్ని శాఖలకు సంబంధించిన డేటా లేక్‌ను రూపొందించారు. ఇలాంటి సంస్థలో నియామకాలు జరిపేటప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలి? అభ్యర్థుల అర్హతలతో పాటు నేపథ్యం కూడా తెలుసుకుని పోస్టింగ్ ఇవ్వాలి. ఈ జాగ్రత్తలు తీసుకోని కారణంగా కీలక డేటా మొత్తాన్ని ప్రత్యర్థి చేతుల్లో పెట్టినట్లయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రైవేటు వర్సిటీతో నియామకాలా?

ఇటీవల ఆర్టీజీఎస్‌లో జరిపిన నియామకాలను ఒక ప్రైవేట్ విశ్వవిద్యాలయం పర్యవేక్షించినట్లు తెలుస్తోంది. ఇంటర్వ్యూ ప్యానల్‌లో ఆర్టీజీఎస్ తరఫున ఒక్క అధికారీ లేకపోవడం గమనార్హం. అభ్యర్థుల నేపథ్యం గురించి కనీస పరిశీలన చేయలేదని తెలుస్తోంది.

◆ వైకాపా ప్రభుత్వం ఆర్టీజీఎస్‌ను తమ పార్టీ వారితోనే నింపేసింది. అప్పట్లో సంస్థ సీఈవో నుంచి అటెండర్ వరకు వైకాపా మద్దతుదారులే ఉన్నారు. గత తెదేపా ప్రభుత్వంలో నియామకాలు పొందిన వారిని వేధించి, బయటకు పంపారు. పది మందిని కొనసాగించినా.. వారిని వర్క్ ఫ్రం హోంకే పరిమితం చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చినా.. ఆర్టీజీఎస్ మాత్రం వైకాపా సానుభూతిపరుల చేతుల్లోనే ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎంపీ కుమారుడినంటూ మోసాలు

- ఖరీదైన కార్లలో తిరుగుతూ జనాన్ని బురిడీకొట్టిస్తున్న కేటుగాడి అరెస్టు



నిందితుడు వెంకటేశ్వర్లు

ఈనాడు– హైదరాబాద్: రాజకీయ నాయకుడు, డాక్టర్, నగల దుకాణం యజమాని, నిత్య పెళ్లి కొడుకు... ఇవన్నీ సినిమా పాత్రలు కావు. ఓ కేటుగాడు జనాన్ని మోసగించేందుకు వేస్తున్న వేషాలు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీ కుమారుడినని చెప్పుకొంటూ తెలుగు రాష్ట్రాల్లో మోసాలు చేస్తున్న కేటుగాడు హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ పోలీసులకు చిక్కాడు. బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ మంగళవారం వివరాలు వెల్లడించారు. ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన వాయిల వెంకటేశ్వర్లు ఎలియాస్ విక్రాంత్ రెడ్డి(29) ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. పబ్బులు, జల్సాలకు అలవాటుపడ్డాడు. 2017 నుంచే మోసాలు చేయడం మొదలుపెట్టాడు. కొంతకాలంగా ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో న్యూరోసర్జన్‌గా పనిచేస్తున్నట్లు తనను తాను పరిచయం చేసుకుంటూ పలువుర్ని మోసగిస్తూ వస్తున్నాడు. ఇటీవల ఎంపీ కుమారుడి అవతారం ఎత్తి హైదరాబాద్‌కు మకాం మార్చాడు. ఆలయాలు, బహిరంగ ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఎంపీ కుమారుడినని చెప్పుకొంటూ స్థానిక పోలీసులను ఎస్కార్టుగా వాడుకునేవాడు. నమ్మించేందుకు ఖరీదైన కార్లు అద్దెకు తీసుకొని, బౌన్సర్లను నియమించుకున్నాడు. ఇటీవల కేపీహెచ్‌బీ పరిధిలో మహిళా హాస్టల్ నిర్వాహకురాలితో పరిచయం పెంచుకున్నాడు. తనకు జూబ్లీహిల్స్‌లో బంగారు ఆభరణాల దుకాణం ఉందని నమ్మించాడు. రీమోడలింగ్ చేయిస్తానంటూ ఆమె దగ్గర నాలుగు తులాల బంగారు గొలుసు తీసుకున్నాడు. అదనపు బంగారం కోసమని రూ.లక్ష తీసుకుని తర్వాత మొహం చాటేశాడు. 'బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశాం. అతడి కదలికలపై నిఘా ఉంచాం. డాక్టర్‌నని నమ్మించి మియాపూర్‌లో ఓ యువతిని వివాహం చేసుకునేందుకు సిద్ధమైనట్లు తెలుసుకున్నాం. పెళ్లి చూపులకు వెళ్లినట్లు గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకున్నాం. అతనిపై రెండు రాష్ట్రాల్లో మొత్తం 14 కేసులున్నాయి'' అని డీసీపీ తెలిపారు.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల కొట్టివేతపై ఏసీబీ అప్పీలు

ఈనాడు, అమరావతి: ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించారంటూ పలువురు ప్రభుత్వాధికారులపై 2016-20 మధ్య నమోదు చేసిన వాటిల్లో 15 కేసులను కొట్టేస్తూ హైకోర్టు ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులపై అప్పీలుకు వెళ్లాలని ఏసీబీ నిర్ణయించింది. ఏసీబీలో అంతర్భాగమైన సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) పోలీస్‌స్టేషన్‌గా నోటిఫై కాక ముందు కేసులు నమోదు చేశారనే సాంకేతిక కారణాలతో హైకోర్టు వీటిని కొట్టేసింది. ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఏసీబీ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించింది. సంబంధిత కసరత్తు పూర్తి చేసింది.

హైకోర్టు కేసులు కొట్టేసింది వీరిపైనే..

1. పాము పాండురంగారావు, ప్రజారోగ్య విభాగం ఈఎన్‌సీ
2. దొడ్డపనేని వెంకయ్యనాయుడు, సబ్ రిజిస్ట్రార్
3. గేదెల లక్ష్మీగణేశ్వరరావు, సర్వే ఇన్‌స్పెక్టర్
4. కరణం వెంకట రంగ సాయికుమార్, సంయుక్త కార్యదర్శి, సాధారణ పరిపాలన విభాగం
5. గోపురం ముని వెంకటనారాయణ, జాయింట్ డైరెక్టర్, ఉపాధి కల్పన, శిక్షణ శాఖ
6. దయం పెదరంగారావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్
7. కె.వెంకటప్ప, పోలీస్ ఇన్‌స్పెక్టర్
8. రాంపల్లి సత్య ఫణి దత్తాత్రేయ దివాకర్, జూనియర్ అసిస్టెంట్, పంచాయతీరాజ్
9. సగడం వెంకటరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్
10. ముమ్మన రాజేశ్వరరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే
11. బత్తు హనుమంతురావు, అసిస్టెంట్ జియాలజిస్ట్, శ్రీకాకుళం
12. రాచూరి శివరావు, తహసీల్దార్, విజయవాడ

వెంకటేశ్‌నాయుడు జగన్, చెవిరెడ్డిల సన్నిహితుడే

- వివేకా హత్యలా దీన్నీ డైవర్ట్ చేసేందుకు వైకాపా నీచ రాజకీయాలు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ ధ్వజం



ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే జరిగిందని, దానిపై విస్తుపోయే నిజాలు, నగదు కట్టలు, వీడియోలు బయటకు రావడంతో వైకాపా మీడియాలో అబద్ధాలు వండి వారుస్తున్నారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ధ్వజమెత్తారు. వివేకా హత్య తరహాలోనే.. మద్యం కుంభకోణంలో నిందితుడైన వెంకటేశ్‌నాయుడిని తెదేపాకి అంటగట్టాలని చూస్తున్నారని మంగళవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ మండిపడ్డారు. "మద్యం కుంభకోణంలో ఉన్న వెంకటేశ్ నాయుడు.. చెవిరెడ్డి భాస్కరరెడ్డికి అత్యంత సన్నిహితుడు. చెవిరెడ్డి ఆర్థికాంశాలు చూసే వ్యక్తి. అలాంటిది అతను తెదేపాకు చెందినవాడని ఫొటోలు బయటపెడుతున్నారు. ప్రజాదర్బారుల్లో కొన్ని వందలమంది వచ్చి చంద్రబాబు, లోకేశ్‌లతో ఫొటోలు దిగుతారు. అంత మాత్రాన.. ఫలానావాళ్ల మనిషి అని చెప్పలేం. కానీ వెంకటేశ్‌నాయుడు జగన్, చెవిరెడ్డిలకు అత్యంత సన్నిహితుడని చెప్పడానికి సాంకేతిక ఆధారాలున్నాయి'' అని పట్టాభి పేర్కొన్నారు.

సహ నిందితులతో అనేకసార్లు భేటీలు

"వెంకటేశ్‌నాయుడు 2023 జూన్ 6న విజయసాయిరెడ్డి, బాలాజీ గోవిందప్ప, చాణక్యలతో జర్నలిస్ట్ కాలనీలో ఉన్నారు. జూన్ 18న అపోలో ఆస్పత్రి వద్ద మిథున్‌రెడ్డిని, జూన్ 27న సైమన్‌ను బయోలాజికల్ ఈ లిమిటెడ్ వద్ద, ఆగస్టు 8న కృష్ణమోహన్‌రెడ్డిని మెహదీపట్నంలోను, ఆగస్టు 9న ఈశ్వర్‌కుమార్‌రెడ్డిని జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిదగ్గర, ఆగస్టు 13న సజ్జల శ్రీధర్‌రెడ్డిని మెహదీపట్నంలోను కలిశారు. ఇంతమందిని కలిసినా మీవాడు కాదని ఎలా చెబుతారు?'' అని ధ్వజమెత్తారు. ''చెవిరెడ్డి తనతో పాటు వెంకటేశ్‌నాయుడిని కొలంబో తీసుకెళ్లాలని చూశారు. ఏ సంబంధం లేకపోతే ఎందుకు తీసుకెళ్లాలనుకుంటారు? 2024 ఎన్నికల్లో చెవిరెడ్డికి డమ్మీ అభ్యర్థిగా ఎందుకు నామినేషన్ వేస్తారు?'' అని మండిపడ్డారు.

సునీతకు అండగా ఉంటాం: వివేకా కుమార్తె సునీతకు తాము అండగా ఉంటామని పట్టాభి తెలిపారు. వివేకా హత్యకేసులో నిందితులకు శిక్ష పడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

రోడ్లపై నిరీక్షించకుండా శ్రామికులకు సమీకృత భవనాలు: మంత్రి వాసంశెట్టి

ఈనాడు, అమరావతి: ప్రతి పట్టణంలో శ్రామికులు (కూలీలు) రోడ్లపై గంటల తరబడి నిరీక్షించకుండా వారి కోసం సమీకృత భవనాలు నిర్మించనున్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. విజయవాడలో మంగళవారం ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను ఆయన వెల్లడించారు. 'భవనాలను ప్రయోగాత్మకంగా విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాల్లో నిర్మించనున్నాం. క్రమంగా ప్రతి నియోజకవర్గంలో ఒక భవనం నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. కార్మికులు, వారి కుటుంబ సభ్యుల నైపుణ్యం పెంచేందుకు శిక్షణ ఇవ్వనున్నాం. ప్రతి ఫ్యాక్టరీలోనూ ఒక భద్రత అధికారిని ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా రంగాల కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేసింది' అని తెలిపారు.

గ్రహం అనుగ్రహం

6–8–2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం
ద్వాదశి: మ. 12-39 తదుపరి త్రయోదశి
మూల: మ. 12-40 తదుపరి పూర్వాషాఢ
వర్జ్యం: ఉ. 10-57 నుంచి 12-42 వరకు
తిరిగి రా. 10-51 నుంచి 12-32 వరకు
అమృత ఘడియలు: ఉ. 5-46 నుంచి 7-30 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-40 నుంచి 12-31 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5.43; **సూర్యాస్తమయం:** సా.6.29
దామోదర ద్వాదశి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	41.0	29.0
తాడేపల్లిగూడెం	37.9	27.8
ఒంగోలు	37.4	28.0
తిరుపతి	35.6	24.3
నరసాపురం	35.5	27.9
విజయవాడ	35.4	27.8
నెల్లూరు	35.1	28.0
విజయనగరం	35.0	26.0
ఖమ్మం	35.0	24.2
కర్నూలు	34.7	25.7
విశాఖపట్నం	34.4	28.4
అనంతపురం	33.4	24.2
గుంటూరు	33.0	28.0
శ్రీకాకుళం	33.0	27.0
కడప	33.0	25.0
హైదరాబాద్	32.2	22.2

మానవత్వం ఉన్నవారంతా పీ4 మార్గదర్శులే

కొందరు రాక్షసులు అడ్డుకోవాలని చూస్తారు.. వారిని పట్టించుకోను

9,37,913 బంగారు కుటుంబాలు, 1,03,938 మంది మార్గదర్శుల గుర్తింపు

ఈ నెల 19 నుంచి ప్రారంభం ● కార్యక్రమంపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

మార్గదర్శిగా మారిన పారిశుద్ధ్య కార్మికురాలికి అభినందన

ఈనాడు, అమరావతి: పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన పీ4 కార్యక్రమంలో మార్గదర్శుల ఎంపిక స్వచ్ఛందమేనని.. ఎవరిపైనా ఎలాంటి బలవంతం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. 'మార్గదర్శుల ఎంపికలో ఎక్కడా వ్యతిరేకత రాకూడదు. మానవత్వం ఉన్నవారే ఇందులో చేరతారు' అని చెప్పారు. ఈ నెల 19 నుంచి పీ4 అమలుపై మంగళవారం ఆయన సచివాలయంలో సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 9,37,913 బంగారు కుటుంబాలు.. 1,03,938 మంది మార్గదర్శులను గుర్తించాం. బంగారు కుటుంబాలతోపాటు గ్రామాలు, మండలాలను దత్తత తీసుకునేందుకూ కొందరు ముందుకొస్తున్నారు. 'ఫండ్ ఎ నీడ్' అనే అంశాన్ని కూడా పీ4లో పెట్టాం. మూడు నెలలకోసారి అమలును సమీక్షిస్తా. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనవచ్చు' అని సీఎం పేర్కొన్నారు. 'నేనూ మార్గదర్శిగా నమోదు చేయించుకుని 250 కుటుంబాలను దత్తత తీసుకున్నా. వారి సంక్షేమం కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తా. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నాం' అని వివరించారు.

హేమలత.. అందరికీ మార్గదర్శి

అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు హేమలత మార్గదర్శిగా మారి ఒక వృద్ధురాలిని ఆదుకుంటున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం ఆమెకు అభినందనలు తెలిపారు. 'పేదల్ని ఆదుకునేందుకు స్పందించే మనసు ఉన్న ఎంతోమంది ముందుకొస్తారు. బంగారు కుటుంబాలకు చేయూత అందిస్తారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో బిల్‌గేట్స్, వేదాంత తదితర సంస్థలు పనిచేస్తున్నాయి' అని వివరించారు.

అదనపు సాయాన్ని అందించాలి

'గతంలో జన్మభూమి, శ్రమదానం, నీరు-మీరు కార్యక్రమాలు చేపట్టినప్పుడు కొందరు విమర్శించారు. మంచి కార్యక్రమాలను అడ్డుకునేందుకు కొందరు రాక్షసుల్లా వ్యవహరిస్తారు. ప్రజల మనసుల్లో దానిపై వ్యతిరేకత తెచ్చేందుకు ప్రయత్నిస్తారు. నేను అలాంటివి పట్టించుకోను. కొందరికి ఆర్థిక వనరులున్నా పేదల్ని ఆదుకోవడానికి మనసు రాదు' అని చంద్రబాబు విమర్శించారు. 'సాయం చేయాలనే మనసు ఉన్నా కొందరికి సమయం ఉండకపోవచ్చు. అలాంటి వారిని గుర్తించండి. వారికి పీ4 అనే వేదిక ఉందని చెప్పండి' అని చంద్రబాబు అధికారులకు సూచించారు. 'ఇవాళ బంగారు కుటుంబంలో సాయం పొందిన వారే రేపు మార్గదర్శి కావచ్చు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకుంటున్నా.. బంగారు కుటుంబాలకు పీ4 ద్వారా అదనపు సాయాన్ని అందించాలి. ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలను కలిసి వారిలో ఆలోచన రేకెత్తించండి' అని నిర్దేశించారు. 'ప్రతిపక్షంలో ఉన్నా గతంలో ఉత్తరాఖండ్ వరదల సమయంలో బాధితుల్ని ఆదుకునేందుకు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేశాం. వారిని ఇళ్లకు పంపేందుకు బస్సులు పెట్టాం. కర్నూలును వరదలు చుట్టుముట్టినప్పుడు పిలుపు ఇవ్వగానే ఎంతోమంది ముందుకువచ్చి బాధితులను ఆదుకున్నారు. మార్గదర్శుల్లో స్ఫూర్తే బంగారు కుటుంబాలకు ఆసరా' అని పేర్కొన్నారు.



సచివాలయంలో పీ4పై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ విజయానంద్, పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ఇతర ఉన్నతాధికారులు

బంగారు కుటుంబాల ఆశలు ఇవీ..

పీ4 కార్యక్రమం అమల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 లక్షల బంగారు కుటుంబాల అవసరాలను ప్రాధాన్య క్రమంలో గుర్తించారు. 11 ప్రశ్నలకు వివరాలు సేకరించారు. వాటిని ఏఐతో విశ్లేషించారు. ఈ సందర్భంగా వెల్లడైన బంగారు కుటుంబాల అవసరాలు ఏంటంటే..

- ఉద్యోగావకాశాలు కల్పించమని అడిగిన వారు : 33%
- వైద్య చికిత్సలు అవసరమని చెప్పినవారు : 21%
- చిన్న చిన్న వ్యాపారాలకు సహకారం కోరినవారు : 9%
- పిల్లల చదువులు, కుటుంబ, ఇతరత్రా అవసరాలకు సాయం కోసం అభ్యర్థించిన వారు : 37%

అనుమతుల్లేని లేఔట్లు 13,667

(మొదటి పేజీ తరువాయి)

అధికారులను ఉత్సవ విగ్రహాలను చేశారు. రెరాలో విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్న నిబంధనను లేఔట్లు వేసిన వైకాపా నేతలు పట్టించుకోకపోయినా చర్యల్లేవు.

ఎల్ఆర్ఎస్‌తో 9.41 లక్షల మందికి లబ్ధి: కూటమి ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్‌తో సీఆర్‌డీఏ మినహా మిగిలిన పట్టణ స్థానిక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో అనుమతులు తీసుకోని లేఔట్లలో ప్లాట్లు కొన్న 9,41,244 మందికి లబ్ధి చేకూరనుందని అధికారుల అంచనా. 'లేఔట్ క్రమబద్ధీకరణ పథకం మరోసారి వచ్చే అవకాశం లేదు. అనుమతులు తీసుకోని లేఔట్లలో ప్లాట్లు కొన్నవారంతా వెంటనే దరఖాస్తు చేసుకోవాలి' అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ సూచించారు.

రాబోయే 4 రోజుల్లో భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో పలు ప్రాంతాల్లో భారీ వానలు పడతాయని అంచనా వేస్తున్నారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశముందని పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్ కడప, చిత్తూరు, ఎన్టీఆర్, పల్నాడు, అనకాపల్లి, తిరుపతి, ప్రకాశం, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, కృష్ణా తదితర జిల్లాల్లో వర్షాలు పడ్డాయి.

- మరోవైపు ఆగస్టు 11 తర్వాత నైరుతి రుతుపవనాలు, బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ సహా కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో భారీ నుంచి కుండపోత వర్షాలు కురుస్తాయని ప్రపంచ వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది.

24 గంటల్లో సుంకాల బాంబు పేలుస్తా

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్నారు. దీంతో నేను సంతోషంగా లేను' అని మంగళవారం సీఎన్‌బీసీ స్క్వాక్ బాక్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు.

భారత్‌కు రష్యా అండ

అమెరికా హెచ్చరికల నేపథ్యంలో భారత్‌కు రష్యా గట్టిగా మద్దతు పలికింది. తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు వీలుగా వాణిజ్య, ఆర్థిక భాగస్వాములను ఎంచుకునే హక్కు సార్వభౌమ దేశాలకు ఉంటుందని స్పష్టం చేసింది. ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందించారు.

కుప్పకూలిన కౌగిలింతల దౌత్యం: కాంగ్రెస్

ట్రంప్ హెచ్చరికలపై ప్రధాని మోదీ స్పందించకపోవడాన్ని కాంగ్రెస్ ప్రశ్నించింది. 'దోస్త్ దోస్త్ న రహా' అనే ముకేశ్ హిందీ చిత్ర గీతాన్ని ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించింది. ట్రంప్‌తో మోదీ కౌగిలింతల దౌత్యం కుప్పకూలిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మంగళవారం వ్యాఖ్యానించారు. గతంలో టమాటా, ఆనియన్, పొటాటో (టాప్) ధరలు సవాలుగా మారాయని ఒకప్పుడు మోదీ వ్యాఖ్యానించారని, ఇప్పుడు చైనా, అమెరికా, పాకిస్థాన్‌ల (క్యాప్) నుంచి రాజకీయ సవాళ్లు ఎదురవుతున్నాయని విమర్శించారు.

మనిషిని జైల్లో పెట్టడమంటే పరువు తీయడమే

(మొదటి పేజీ తరువాయి)

కలియుగమంటే ఇదే కదా అనిపిస్తోంది. ఎక్కడా న్యాయం, ధర్మం లేదు' అని విమర్శించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులతో క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో జగన్ మాట్లాడారు.

అంతా డేటాబేస్‌లోకి.. 'పార్టీ కోసం ఎవరెవరు పనిచేస్తున్నారో పక్కాగా డేటాబేస్ తయారు చేస్తున్నాం. అధికారంలోకి రాగానే దాని ఆధారంగానే వారికి గుర్తింపునిస్తాం. యూనిఫాం, అధికారం ఉందని అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ వైకాపా కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న వారి డేటాబేస్‌నూ సిద్ధం చేస్తున్నాం. ఇందుకోసం లాయర్ల పర్యవేక్షణలో సిద్ధం చేసిన 'యాప్'ను త్వరలో ఆవిష్కరించబోతున్నాం. ఏ కార్యకర్తయినా వారిని ఇబ్బంది పెట్టిన అధికారి పేరు, హోదాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే అది మా దగ్గర డిజిటల్ లైబ్రరీకి చేరుతుంది. దెబ్బతగిలినోడి బాధ, ఆ దెబ్బ కొట్టినోడికీ తెలిసేలా చేసేందుకే ఈ యాప్. అధికారంలోకొచ్చాక ఈ డిజిటల్ లైబ్రరీని తెరిచి, అందులో ఉన్న డేటా ప్రకారం కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరినీ జైలుకు పంపిస్తాం' అని అన్నారు. అమరావతి నిర్మాణం పేరుతో యథేచ్ఛగా దోచేస్తున్నారని ఆరోపించారు. ఇన్ని అబద్ధాలు చెప్పి, ఇన్ని మోసాలు, దారుణాలు చేస్తున్నవారిని దేవుడు, ప్రజలు తంతే ఎక్కడ పడతారో.. నేను ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని జగన్ వ్యాఖ్యానించారు.

ఉత్తర కాశీలో ఉత్పాతం

(మొదటి పేజీ తరువాయి)

చేరుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- ఆకస్మిక వరదలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారమయ్యాయి. బురద కొట్టుకువచ్చిన దృశ్యాలు భయానకంగా ఉన్నాయి. ప్రజలు భయంతో అరవడం వీడియోల్లో కనిపించింది.
- ఉత్తర కాశీలో ఆకస్మిక వరదలపై ప్రధాని మోదీ స్పందించారు. చనిపోయిన వారికి సంతాపం తెలిపారు. సహాయక చర్యల్లో ఎటువంటి లోపం లేకుండా చూడాలని ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామికి ఫోన్‌లో సూచించారు.
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. సీఎం ధామితో మాట్లాడారు. ఏడు సహాయక బృందాలను పంపుతున్నట్లు ఆయనకు తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు.
- ఘటన తీవ్రత ఎక్కువగా ఉండటంతో సైన్యం రంగంలోకి దిగింది. 150 మంది సైనికులను ఘటనా స్థలానికి పంపినట్లు 'ఎక్స్'లో సైన్యం ప్రకటించింది. హర్సిల్‌లోని సైనిక స్థావరానికి దాదాపు 4 కి.మీ. దూరంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలిపింది.

ముఖ్యమంత్రి ఏపీ పర్యటన రద్దు

ధరాలీలో ఆకస్మిక వరదలు రావడంతో ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి.. తన ఆంధ్రప్రదేశ్ పర్యటనను రద్దు చేసుకున్నారు. దేహ్రాదూన్‌కు వెంటనే తిరిగివచ్చారు. 'మేఘ విస్ఫోటం కారణంగా ధరాలీలో జరిగిన భారీ నష్టం అత్యంత విషాదకరమైంది. బాధాకరమైంది. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి' అని ధామి తెలిపారు.

నేడూ ముప్పు!

ఉత్తరాఖండ్‌లోని నైనితాల్, చంపావత్, ఉధం సింగ్ నగర్, బాగేశ్వర్, పౌరీ తెహ్రీ, హరిద్వార్, దేహ్రాదూన్ జిల్లాలకు బుధవారమూ వర్షాల ముప్పు ఉందని ఐఎండీ హెచ్చరించింది. ఆరెంజ్ హెచ్చరిక జారీచేసింది.


ముందే హెచ్చరించిన వాతావరణశాఖ!

ఈ నెల 10 వరకూ ఉత్తరాఖండ్‌లో, ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందే హెచ్చరికలు జారీ చేసింది. దీంతో స్థానికులు, పర్యాటకులు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.





ధరాలీలో ఇళ్లపైకి వరద పోటెత్తడంతో పరుగులు తీస్తున్న ప్రజలు ★ ఆకస్మిక వరద అనంతరం ధరాలీలో పేరుకుపోయిన బురద



ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే మీడియా బలంగా ఉండాలి

గ్రామీణ సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి

విలీనం-విభజన పుస్తకావిష్కరణలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు, హైదరాబాద్; ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియా బలంగా ఉండాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే మీడియా ఎంతో బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఇంకా 58% మంది వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి ఉన్నారని ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత పరిస్థితులకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మాజీ సంపాదకులు ఇనగంటి వెంకట్రావు రచించిన 'విలీనం-విభజన, గతం-స్వగతం, మన ముఖ్యమంత్రులు' పుస్తకాన్ని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయులు కట్టా శేఖర్‌రెడ్డి, భండారు శ్రీనివాసరావు తదితరులు ఇందులో పాల్గొన్నారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ వెంకట్రావు తన పుస్తకంలో సమకాలీన రాజకీయ చరిత్రను ఉన్నది ఉన్నట్లు రాశారన్నారు. ఆయన పెన్ను, వెన్ను ఎప్పుడూ నిటారుగానే ఉంటాయన్నారు. "కొందరు నాయకులు సమాజాన్ని చీల్చే విధంగా, కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు. అసభ్యంగా మాట్లాడుతున్నారు. వారి మాటలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదు. అసభ్యకరంగా మాట్లాడే నేతల నోరుని ఓటుతోనే మూయించాలి. అలా మాట్లాడిన నేతలు ఒక్కరూ ఇటీవల ఎన్నికల్లో గెలవలేదు. ఈ మధ్య పాత్రికేయం పేరిట కొందరు స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నారు. సమాజంలోని అవినీతి, అరాచక శక్తుల కుటిల యత్నాలను ప్రజలకు వివరించాలి. ప్రజల జీవితాల్లోకి చొచ్చుకొచ్చిన సోషల్ మీడియా యాంటీ సోషల్ మీడియాగా మారుతోంది. ఈ ధోరణి సమాజానికి నష్టం చేస్తుంది.



పుస్తకావిష్కరణలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పాత్రికేయులు కట్టా శేఖర్‌రెడ్డి, భండారు శ్రీనివాసరావు, మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రచయిత వెంకట్రావు

మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలి

తెలుగు పత్రికల్లో తెలుగే ఉండాలి. పత్రికలు, ప్రసార సాధనాలు మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలి. చక్కటి తెలుగు పదాలు ఉన్నప్పుడు ఆంగ్లం వాడాల్సిన అవసరం లేదు" అని ఉద్బోధించారు.

రామాయపట్నం పోర్టు సామర్థ్యం పెంపు!

ఈనాడు, అమరావతి: రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు తొలిదశ నిర్మాణ గడువు, సామర్థ్యం పెంపుతో పాటు పలు అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. సచివాలయంలో మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేష్ పోర్టు నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. పూర్తి ప్రతిపాదనలతో డీపీఆర్‌లు రూపొందించుకొని రావాలని, మరోసారి సమావేశమై చర్చించనున్నట్లు నిర్మాణ సంస్థకు సూచించింది.

దారి తప్పి శ్రీలంక నేవీకి చిక్కిన మత్స్యకారులు

- **జాఫ్నా జైలులో నలుగురి ఖైదు**
- **భారత రాయబార కార్యాలయంతో మాట్లాడిన కాకినాడ కలెక్టర్**

ఈనాడు, కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన నలుగురు మత్స్యకారులు పొరపాటున దారి తప్పి శ్రీలంక జలాల్లోకి ప్రవేశించి అక్కడి నేవీ అధికారులకు పట్టుబడ్డారు. అనుమతుల్లేకుండా తమ దేశ సరిహద్దులు దాటారంటూ శ్రీలంక అధికారులు వారికి 14 రోజులు రిమాండ్ విధించి, జాఫ్నా జైలులో పెట్టారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ శ్రీలంకలోని భారత రాయబార కార్యాలయంతో మాట్లాడి విడిపించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పంతాడి బ్రహ్మానందం (కాట్రేనికోన), కర్రి నూకరాజు (పామర్రు), చింత నాగేశ్వరరావు (యానాం), కొప్పిడి శ్రీను (జగన్నాథపురం) కాకినాడలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 2న బ్రహ్మానందం తమిళనాడులో ఓ బోటు కొని, మిగతా ముగ్గురితో కలిసి సముద్ర మార్గంలో కాకినాడ వస్తున్నారు. జీపీఎస్ సరిగ్గా పనిచేయకపోవడంతో దారి తప్పిపోయారు. శ్రీలంక ప్రాదేశిక జలాల్లోకి బోటు వెళ్లడంతో ఈ నలుగురిని నేవీ అధికారులు పట్టుకుని కారాగారంలో పెట్టారు. రెండు రోజుల తర్వాత కాకినాడ జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వగా కలెక్టర్ షాన్‌మోహన్ అక్కడి ఎంబసీ అధికారులతో మాట్లాడి మత్స్యకారులకు ఆహారం, ఔషధాలు అందించేలా ఏర్పాటు చేశారు. ఆందోళనతో ఉన్న కుటుంబసభ్యులతోనూ ఫోన్‌లో మాట్లాడించి, ధైర్యం చెప్పారు. సాంకేతిక సమస్యలతో దారి తప్పి వచ్చారని, వారిని విడిచిపెట్టాలని కోరినట్లు కలెక్టర్ 'ఈనాడు'కు తెలిపారు. శ్రీలంక అధికారులు సానుకూలంగా స్పందించారని, ఒకటి రెండు రోజుల్లో వారిని విడుదల చేస్తారన్నారు.

నేతన్నలపై వరాల జల్లు



చేనేత శాఖపై సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు పలు ఉత్పత్తులను చూపిస్తున్న ఆ శాఖ కమిషనర్ రేఖారాణి

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 7వ తేదీ (జాతీయ చేనేత దినోత్సవం) నుంచి ఈ నిర్ణయాలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో చేనేత, జౌళిశాఖపై సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం తర్వాత చేనేత రంగమే అత్యంత కీలకమైన రంగంగా ఉందని, దీనిపై ఆధారపడిన వారికి అండగా నిలవాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. ఇటీవల జమ్మలమడుగు పర్యటనలో చేనేత కుటుంబ సభ్యులతో మాట్లాడిన సమయంలో తన దృష్టికి వచ్చిన అంశాలను సమీక్షలో సీఎం ప్రస్తావించారు. ఏపీకి చెందిన చేనేత ఉత్పత్తులకు 10 జాతీయ అవార్డులు దక్కాయని, ఒకే జిల్లా-ఒకే ఉత్పత్తి విభాగంలోనూ మొదటి సారి అవార్డు దక్కిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా అధికారులను సీఎం అభినందించారు.

క్షణాల్లోనే గుండె పరీక్ష

- హృద్రోగ సమస్యలను గుర్తించే ఏఐ



డాక్టర్ దేవి శెట్టి

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: హృద్రోగ సమస్యలను పది క్షణాల్లోనే గుర్తించే కృత్రిమ మేధస్సును బెంగళూరులోని నారాయణ హెల్త్ అందుబాటులోకి తెచ్చింది. మేధా ఏఐ, నారాయణ హెల్త్ క్లినికల్ రీసెర్చ్ బృందాలు సంయుక్తంగా పరిశోధించి దీన్ని రూపొందించాయని నారాయణ హెల్త్ వ్యవస్థాపకుడు డాక్టర్ దేవి శెట్టి ప్రకటించారు. ఆయన మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ హృదయ ఆరోగ్యంపై సాధారణ ఈసీజీతోనే అత్యంత కచ్చితత్వంతో, అతి తక్కువ సమయంలో నివేదిక ఇచ్చేందుకు ఈ కృత్రిమ మేధస్సు సహకరిస్తుందన్నారు. నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ దీన్ని అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు. ఇరు సంస్థల ప్రతినిధులు డాక్టర్ ఇమాన్యుయేల్ రూపర్ట్, డాక్టర్ ప్రదీప్ నారాయణ, డాక్టర్ పీఎం ఉత్తప్ప, డాక్టర్ దీపక్ పద్మనాభన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

అమరావతికి పచ్చల తాపడం

(మొదటి పేజీ తరువాయి)

కురగల్లులో 200 ఎకరాల్లో జీవవైవిధ్య పార్కు అభివృద్ధి చేయనుంది. రాజధానికి భూములిచ్చిన రైతులకు స్థలాలు కేటాయించిన ఎల్‌పీఎస్ లేఔట్లలో 1,602 ఎకరాల్లో 497 పార్కులు అభివృద్ధి చేస్తుంది. ఉండవల్లి, నీరుకొండ, అనంతవరంలోని కొండలపైనా మొక్కలు పెంచనుంది.

ఆహ్లాదకరంగా ఎల్‌పీఎస్ లేఔట్లు

ఎల్‌పీఎస్ లేఔట్లలో ఎకరం కంటే తక్కువతో ప్రారంభించి, 10 ఎకరాల వరకు విస్తీర్ణం గల పార్కుల్ని అభివృద్ధి చేయనుంది. ఎకరం వరకు విస్తీర్ణం ఉన్న పార్కులు 290, 1-5 ఎకరాల వరకు 147, 5-10 ఎకరాల వరకు 42, 10 ఎకరాలకు పైన విస్తీర్ణం గల పార్కులు 18 చొప్పున ఉంటాయి.

ఏ రోడ్డులో వెళ్లినా నయనానందమే

- అమరావతిలో 30% భూభాగంలో హరితవనాలు, తటాకాలు, కాలువలు ఉండేలా ప్రణాళిక రూపొందించారు. దానిలో భాగంగా రహదారుల పక్కన, కాలువలు, చెరువుల ఒడ్డున పుష్పజాతుల చెట్లు పెంచనున్నారు.
- రాజధానిలో ఏడాది పొడవునా కనువిందు చేసేలా... వివిధ సీజన్లలో పుష్పించే మొక్కల్ని ఎంపిక చేసి నాటాలన్నది సీఎం చంద్రబాబు ఆదేశం.
- రాజధానిలోని వివిధ రహదారుల పక్కన, మధ్యలోనూ మొక్కలు నాటే భూమి విస్తీర్ణమే 3,068 ఎకరాలు కావడం విశేషం.
- రాజధానిలో మొత్తం 34 ప్రధాన రహదారులున్నాయి. వీటిలో చాలా రహదారుల వెంబడి మొత్తం ఎనిమిది వరుసలుగా చెట్లు పెంచబోతున్నారు. రహదారులకు రెండు పక్కలా సైకిల్ ట్రాక్‌లు, నడక మార్గాలు ఉంటాయి. వాటి మధ్యలో ప్రధాన రహదారికి అటు మూడు వరుసలు, ఇటు మూడు వరుసలు, మధ్యలోని రెండు మీడియన్లు కలిపి... మొత్తం 8 వరుసలుగా చెట్లు పెంచుతారు. దాదాపుగా ప్రతి ప్రధాన రహదారీ ఒక పార్కులానే కనిపిస్తుంది.



హోంమంత్రి అనితతో మహిళా సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు

మహిళల కోసం ఎట్రాసిటీ చట్టాన్ని తీసుకురండి

హోంమంత్రికి మహిళా సంఘాల విన్నపం

ఈనాడు, అమరావతి: మహిళలపై జరిగే వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేకంగా ఎట్రాసిటీ చట్టాన్ని తీసుకురావాలని హోంమంత్రి అనితకు మహిళా సంఘాల ఐక్యవేదిక విన్నవించింది. ఈ మేరకు అమరావతిలోని సచివాలయంలో మంగళవారం హోంమంత్రిని ఐక్య వేదిక ప్రతినిధులు కలిసి మహిళలు, బాలికల భద్రతపై చర్చించారు. 'మహిళల గురించి నీచంగా మాట్లాడే సంస్కృతి ఎక్కువైంది. రాజకీయ పార్టీల్లో ఉన్న వారితో పాటు ఉద్యోగాలు చేసే మహిళల్నీ లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీన్ని నియంత్రించేందుకు చట్టాలను బలోపేతం చేయాలి' అని కోరారు. దీనికి హోంమంత్రి స్పందిస్తూ సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు.

ఈనాడు

కలిసికట్టుగా... కొత్త చరిత్ర!

'కొన్ని గెలుపోటములు... కొన్ని ఓడిపోతాం... కానీ, ఎప్పటికీ లొంగిపోము' అన్న గౌతంగంభీర్ తాజా వ్యాఖ్యలో శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని నవభారత యువజట్టు పోరాటస్ఫూర్తి ప్రతిధ్వనిస్తోంది. చివరి టెస్టులో విజయనాదం చేసి ఇంగ్లాండ్‌తో సిరీస్‌ను డ్రాగా ముగించిన టీమిండియా- ఓడిన రెండు మ్యాచ్‌లలోనూ ప్రత్యర్థిని తుదికంటా ముప్పతిప్పలు పెట్టింది. అంత తేలిగ్గా తలవంచని తత్త్వం, అనుభవజ్ఞులు కాకపోయినప్పటికీ జట్టుగా ఆడి అత్యుత్తమ ఫలితాలను రాబట్టగలిగిన నైపుణ్యం వంటివే శుభ్‌మన్ సేనకు బలాలయ్యాయి. భారత జట్టుపై ఇప్పుడు క్రికెట్ ప్రపంచం కురిపిస్తున్న ప్రశంసలకు అవే కారణమయ్యాయి. ఏడు వికెట్లు చేతిలో ఉన్న ఇంగ్లాండ్ ఇంకో 73 పరుగులు చేస్తే చాలు, అండర్సన్-తెందుల్కర్ ట్రోఫీని సొంతం చేసుకునేది. బ్రూక్, రూట్ పరుగుల వరద పారిస్తున్న ఆ సమయంలోనూ కాడి వదిలేయని టీమిండియా- పేసర్ల ప్రతిభతో, ప్రధానంగా సిరాజ్ చలువతో అద్భుత విజయాన్ని అందుకుని అభిమానులతో ఆనందనృత్యాలను చేయించింది. 'టీ20' యుగంలో అయిదు రోజుల ఆటను చూసేవారు లేరన్న అభిప్రాయాలను పోటాపోటీగా సాగిన తాజా సిరీస్ పటాపంచలు చేసింది. మ్యాచ్‌లు జరిగినన్నాళ్లూ స్టాండ్స్‌ని నిండిపోవడం- కళాత్మక టెస్ట్ క్రికెట్‌కు కొత్త జీవం పోసింది!

అప్పటి వరకు జట్టు భారాన్ని తమ భుజస్కంధాలపై మోసిన సీనియర్లు పక్కకు తప్పుకొన్నాక, ఆ ఖాళీలను పూరించడం వర్తమాన ఆటగాళ్లకు అంత సులభమేమీ కాదు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్‌లు ఆటకు వీడ్కోలు పలికిన సంధి దశలో కఠినమైన ఇంగ్లాండ్‌లో పర్యటనకు వెళ్లిన టీమిండియాపై మొదట్లో ఎవరికీ పెద్దగా ఆశలు లేవు. నాసిర్ హుస్సేన్, మైఖేల్ వాన్, గ్రేమ్ స్వాన్, అలిస్టర్ కుక్ వంటి మాజీలైతే- ఇంగ్లాండ్ గెలుపు నల్లేరుపై నడకే అన్నట్లుగా మాట్లాడారు. మైదానంలో తమ పని తాము చేసుకుపోతూనే వాళ్ల నోళ్లు మూయించిన భారత ఆటగాళ్లు ఆ క్రమంలో ఎన్నో రికార్డులనూ సృష్టించారు. డాన్ బ్రాడ్‌మన్ తరవాత కెప్టెన్‌గా ఒక సిరీస్‌లో అత్యధిక పరుగులను సాధించిన రెండో వ్యక్తిగా నిలిచిన శుభ్‌మన్ గిల్- భారత క్రికెట్ చరిత్రలో నవశకానికి నాంది పలికాడు. 185 ఓవర్లకుపైగా బౌలింగ్ చేసినప్పటికీ చివరి వరకూ ఎక్కడా 140 కిలోమీటర్లకు తగ్గని వేగంతో బంతులేసిన సిరాజ్- ఇంగ్లాండ్‌లో అత్యధిక వికెట్లను నేలకూల్చిన భారత బౌలర్లలో ఒకడయ్యాడు. అయిదు మ్యాచ్‌ల్లోనూ సుదీర్ఘ స్పెల్స్ వేసినప్పటికీ అలసటను దరిచేరనివ్వని సిరాజ్ ఫిట్‌నెస్, జట్టుకోసం ఏదైనా చేసేందుకు సిద్ధంగా ఉండే అతని వ్యక్తిత్వాల నుంచి కొత్తతరం నేర్చుకోవాల్సిన పాఠాలెన్నో ఉన్నాయి. రాహుల్, జైస్వాల్, జడేజా, సుందర్, ఆకాశ్‌దీప్ తదితరులు సైతం తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడంతోనే టీమిండియా అంచనాలను మించి రాణించగలిగింది!

'బజ్‌బాల్' ఆటతో టెస్ట్ క్రికెట్‌ను పునర్నిర్వచించిన ఇంగ్లాండ్ దూకుడును నిలువరించడంలో భారత జట్టుకు సమష్టితత్వమే బాగా కలిసి వచ్చింది. ఆ క్రమంలో విరాట్, రోహిత్ వంటి స్టార్లు లేని లోటును మరిపించడం ఒక ఎత్తు అయితే- బుమ్రా, పంత్ లాంటి మ్యాచ్ విన్నర్ల గైర్హాజరీలోనూ ఓవల్‌లో గెలుపును ముద్దాడటమే గిల్ సేనను మరింత ప్రత్యేకంగా నిలుపుతోంది. అలాగని టీమిండియాకు సవాళ్లు ఏమీ లేవా అంటే, ఉన్నాయి. మూడో స్థానంలో సాయి సుదర్శన్ ఇంకా కుదురుకోవాల్సి ఉంది. నికార్సయిన పేస్ ఆల్‌రౌండర్ కొరత కూడా వేధిస్తోంది. ఇలాంటి వాటిని అధిగమించగలిగితే రాబోయే రోజుల్లో భారత జట్టు మరిన్ని ఘనవిజయాలను సాధించగలదు. ఐసీసీ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లోనూ మున్ముందుకు దూసుకుపోగలదు!

ఇక సరళమైన పన్ను విధానం!

పొదుపును ప్రోత్సహించడం, ఎగుమతులను పెంచడం, సమతుల అభివృద్ధికి పాటుపడటమే మన పన్నుల వ్యవస్థకు మూలసూత్రాలయ్యాయి. సబ్సిడీలు, పన్ను తగ్గింపులు, మినహాయింపులు.. ఏవైనా సామాజిక న్యాయ సాధనకు ఉపకరించాలి. కానీ, ఇటీవలి దశాబ్దాలలో పన్ను మినహాయింపులు అధికమై ఆదాయం కోసుకుపోతోంది. మరోవైపు నిర్వహణ ఖర్చులు, చట్టపరమైన సమస్యలు పెరిగి పోయాయి. ఈ నేపథ్యంలో కేంద్రం కొత్త ఐటీ బిల్లును సిద్ధం చేసింది.

సూర్యుడు భూమి నుంచి తేమను స్వీకరించి అంతకు వెయ్యిరెట్లు ఎక్కువగా వర్షాన్ని కురిపించినట్లే రాజు ప్రజల నుంచి వసూలుచేసే పన్నులను వారి శ్రేయస్సుకే ఖర్చు చేయాలని మహాకవి కాళిదాసు ప్రబోధించాడు. పన్నులూ పాలనా వ్యవస్థలూ ప్రజాహితం కోసమేనన్నాడు. చాణక్యుడు అర్థశాస్త్రంలో అతిగా పన్నులు విధించకూడదనీ, న్యాయమైన సుస్థిరమైన పన్నుల విధానం ప్రజలందరూ చక్కగా పన్నులు చెల్లించేలా ప్రోత్సహిస్తుందనీ పేర్కొన్నాడు. ఆర్థికపరంగా సమాఖ్యవాదాన్ని పాటించాలనీ, మూలధన నిర్మాణం జరిగేలా సబ్సిడీలను ఉపయోగించాలని నిర్దేశించాడు. కాళిదాసు, కౌటిల్యుల ప్రతిపాదనలు నేటి ఆర్థికానికీ చక్కగా వర్తిస్తాయి.



భారతీయ పన్నుల వ్యవస్థకు ఇంతకాలం 1961నాటి ఆదాయపన్ను చట్టమే పునాదిగా ఉంటోంది. అయితే దీనికి పదేపదే సవరణలు చేయడం, కాలంచెల్లిన పరిభాషను వాడటం, చట్ట నిర్మాణం సంక్లిష్టంగా ఉండటం వల్ల ఆదాయపన్ను చట్టానికి వక్రభాష్యం చెప్పడం సులభమైందనే విమర్శలున్నాయి. తమను వేధించడం కోసం చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు, చిన్న వ్యాపారులు, స్టార్టప్‌ల నిర్వాహకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని చక్కదిద్దడానికి కేంద్రం పూనుకొంది. 1961నాటి చట్టం స్థానంలో కొత్త శాసనాన్ని తీసుకొస్తామనీ, అది 2026 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. భారతీయ ఆదర్శాలు, నైతిక విలువలనూ, కాళిదాసు, కౌటిల్యుల ప్రబోధాలనూ కొత్త చట్టం ప్రతిబింబిస్తుంది.

సందిగ్ధతకు తావులేకుండా...

పాత ఆదాయపన్ను చట్టం 'క్రితం సంవత్సర' ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని, 'అసెస్‌మెంట్ ఇయర్'లో ఆదాయ మదింపు చేసి పన్నులు విధిస్తోంది. ఈ రెండు పదాలు అయోమయానికి దారితీస్తున్నాయి. కొత్త ఆదాయపన్ను బిల్లు ఈ రెండు పదాలను తొలగించి 'పన్ను సంవత్సరం' అనే పదాన్ని ముందుకుతెస్తోంది. అది కూడా ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు వర్తిస్తుంది. 2025 ఆదాయపన్ను బిల్లు కొత్త పన్నులేమీ విధించదు. ప్రస్తుతం ఉన్న పన్ను శ్లాబులు, రేట్లను మార్చదు. నిర్వచనాలు, నేరాలు, జరిమానాల్లో మార్పులు తీసుకురావడం లేదు. మునుపటి చట్టం కంటే ఇది ఎంతో సరళంగా ఉంటుంది. పాత చట్టంలో 700 సెక్షన్లు ఉంటే, కొత్త బిల్లులో అవి 536 మాత్రమే ఉన్నాయి. పాత చట్టం 823 పేజీలుంటే, కొత్త బిల్లును 622 పేజీలకు కుదించారు. కొత్త బిల్లు నిబంధనల్లో వేతన జీవుల జీతభత్యాలు, మినహాయింపులను అంతర్భాగం చేశారు. గ్రాట్యుటీ, పింఛన్ కమ్యుటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, స్వచ్ఛంద పదవీ విరమణ లేదా రిట్రెంచ్‌మెంట్ సందర్భంగా వచ్చే నగదు పరిహారాలను వేతన సెక్షన్‌లోనే కలిపేశారు. డబ్బు చెల్లించేటప్పుడూ, తీసుకునేటప్పుడూ పన్ను వసూలుకు సంబంధించిన టీడీఎస్, టీసీఎస్ నిబంధనలను సరళీకరించారు. రెసిడెంట్, నాన్-రెసిడెంట్, ఎనీ పర్సన్ అని పన్ను చెల్లింపుదారులను వర్గీకరించారు. నోట్యాక్స్ డిడక్షన్ నిబంధనలను సులభంగా అర్థమయ్యేలా ఒకే రిఫరెన్స్ పట్టికలో పొందుపరిచారు.

సిబ్బందికి మరిన్ని అధికారాలు

ఆదాయపన్ను చట్టం-1961లో లాభాపేక్ష లేని సంస్థలకు సంబంధించిన నిబంధనలు క్రమపద్ధతిలో లేవు. కొత్త బిల్లులో వీటిని ఒకే అధ్యాయంలో చేర్చారు. ఆధునిక సాంకేతికతల సాయంతో పన్నుల యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడానికి కొత్త బిల్లు చర్యలు తీసుకుంటుంది. బంగారం, ఆభరణాలు, డబ్బు, ఇతర విలువైన వస్తువులతోపాటు క్రిప్టోకరెన్సీలు, నాన్ ఫంజిబుల్ టోకెన్లను కూడా అప్రకటిత ఆదాయంలో భాగంగా పరిగణించి సోదాలు చేసే అధికారాన్ని ఆదాయపన్ను శాఖకు ఇవ్వాలని ప్రతిపాదిస్తోంది. పాత చట్టం- సరైన పత్రాలు సమర్పించని వ్యక్తుల ఇళ్లు, సంస్థల కార్యాలయాల తలుపులను బద్దలుకొట్టి సోదాచేసి కీలక పత్రాలను స్వాధీనం చేసుకునే అధికారాన్ని పన్ను సిబ్బందికి ఇస్తోంది. కొత్తబిల్లు దీనికి తోడు ఎలక్ట్రానిక్ రికార్డులు, ఈ-మెయిల్, సర్వర్లతో పాటు వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమ రికార్డులను, ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లను కూడా తనిఖీ చేసే అధికారాన్ని ఇవ్వాలని ప్రతిపాదిస్తోంది.

గోప్యతకు భంగం?

కొత్త బిల్లును ఫిబ్రవరిలో పార్లమెంటులో ప్రవేశపెట్టారు. తరవాత దాన్ని సెలెక్ట్ కమిటీకి పంపగా, 285 మార్పులను ప్రతిపాదించింది. వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు, గృహ యజమానులు, వేతన జీవులు, చిన్న పరిశ్రమలు, లాభాపేక్ష లేని సంస్థల పన్ను నిబంధనలకు సంబంధించిన మార్పులవి. క్యాపిటల్ అసెట్, మౌలిక వసతుల క్యాపిటల్ కంపెనీ, సహకార బ్యాంకుల నిర్వచనాలను మరింత పదునుగా తయారుచేసింది. మున్సిపల్ పన్నులు పోనూ మిగిలిన వార్షిక అద్దె ఆదాయంలో గృహ యజమానులకు 30శాతం స్టాండర్డ్ డిడక్షన్ ఇవ్వాలని సెలెక్ట్ కమిటీ ప్రతిపాదించింది. యజమాని నివసిస్తున్న ఇంటికీ, అద్దెకు ఇచ్చిన ఇళ్లకూ నిర్మాణానికి ముందు తీసుకున్న రుణంపై వడ్డీకి కూడా డిడక్షన్ ఇవ్వాలని సిఫార్సు చేసింది. ఇంటర్ కార్పొరేట్ డివిడెండ్ డిడక్షన్‌ను అనుమతించి డబుల్ టాక్సేషన్‌కు ఆస్కారం లేకుండా చేయాలనీ సూచించింది. పన్ను వివాదాలను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని పేర్కొంది. ఇక బిల్లుపై వచ్చిన విమర్శలలో ఒకటి- పౌరుల డిజిటల్ గోప్యతకు భంగం వాటిల్లజేసేలా ఉండటం. ఈ బిల్లులోని నిబంధనలూ, వ్యక్తిగత సమాచార రక్షణ చట్టం, సైబర్ చట్టాల్లోని నిబంధనలూ ఒకేలా ఉండటం వేర్వేరు భాష్యాలకు తావు ఇవ్వవచ్చు. ఇది తలెత్తకుండా చూడాలి. బిల్లు పట్ల పన్ను చెల్లింపుదారులు, నిపుణులకు అవగాహన కల్పించాలి. కొత్త బిల్లును సమాజ హితానికీ, పన్ను చెల్లింపుదారుల సౌలభ్యానికీ, దేశార్థిక ప్రగతికీ తోడ్పడే విధంగా ముందుకు తీసుకెళ్లాలి.



డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు
ఆచార్యులు, ఐఐఎం-ముంబయి



లిఫ్ట్ కావాలా!


బండి మొరాయించినప్పుడో, ఆటోనో బస్సో దొరక్కపోతేనో నడిచి వెళ్లక తప్పదు. అలా నడిచి నడిచి అలసిపోయినప్పుడు రోడ్డుమీద వెళ్లేవారు ఎవరైనా లిఫ్ట్ ఇస్తానంటే ఎంత రిలీఫ్‌గా ఉంటుంది? హుషారుగా థ్యాంక్స్ చెప్పి వాళ్ల బండెక్కి వెళ్లిపోతాం. ఇలాంటి సందర్భాల్లో పర్వాలేదు కానీ కొంతమంది ప్రతిచోటా లిఫ్ట్ కోసం ఎదురుచూస్తూనే ఉంటారు. అది ఎంతవరకు సమంజసం?

సినిమాకో, షాపింగ్ మాల్‌కో, మెట్రోస్టేషన్‌కో వెళ్లినప్పుడు మెట్లు ఎక్కకుండా లిఫ్ట్ ఉందా, ఎస్కలేటర్ ఎక్కడా అని వెతుకుతారు చాలామంది. అంతెందుకు... రోజూ వెళ్లే ఆఫీసులో ఎంతమంది మెట్లు ఎక్కుతారు? పెద్ద పెద్ద మల్టీ స్టోరీడ్ బిల్డింగ్‌లైతే తప్పదు కానీ ఒకటి రెండు అంతస్తులకు కూడా లిఫ్ట్ వాడే వాళ్లే ఎక్కువ. వాహనాలు పార్కింగ్ చేసేటప్పుడు ఎక్కువ దూరం నడవాల్సి వస్తుందని, గేటుకు దగ్గరగా ఉండే చోటు వెతుక్కోవడమూ మనకు అలవాటేగా. సమయం కలిసి వస్తుందని యంత్రాలూ, సౌకర్యాల మీద ఆధారపడుతుంటాం. అయితే అన్నివేళలా అది అంత అవసరం కాదు. లిఫ్ట్ కోసం ఎదురు చూసి, ఎక్కి, రెండో అంతస్తు చేరుకోవడానికి ఎంత సమయం పడుతుందో మెట్లమీద ఎక్కడానికీ అంతే సమయం పడుతుంది. ఇక్కడ ఆలోచించాల్సింది... సౌకర్యాలు ఉన్నాయని వాడుకుంటున్నామా లేక నిజంగా మనకు అవసరమై వాడుకుంటున్నామా?

నడక ఆరోగ్యానికి మంచిదని తెలిసినా దాని గురించి పక్కవారికి ఉపన్యాసం ఇస్తాం కానీ, మనం మాత్రం పాటించం. లైఫ్ స్టైల్ మారిపోయింది. ఎవరూ పట్టుమని పదడుగులు కూడా వేయట్లేదు. ఉద్యోగాల్లోనూ టీవీల ముందూ గంటల తరబడి కూర్చుంటున్నారు. జీవనశైలి వ్యాధులన్నిటికీ ఇదే కారణమని డాక్టర్లు చెవినిల్లు కట్టుకుని పోరుతున్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తినడమే కాదు, తిన్న కెలోరీలను కరిగించడమూ అంతే ముఖ్యం. అందుకు ఏకైక మార్గం.. శారీరక శ్రమ. మన దినచర్యలో దానికి చోటే లేదాయె! ఒళ్లు అలవకుండా రోజు గడిపేస్తుంటాం. అదేంటీ... పగలంతా ఆఫీసుల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటున్నాం కదా అంటారా? దానివల్ల కరిగించాల్సిన కెలోరీల్లో మూడోవంతు కూడా కరగవు. పైగా కదలకుండా కూర్చోవడం వల్ల శరీరంలో ఉండే కీళ్లూ కండరాలూ లాంటి వాటి పనితీరు క్రమంగా మందగించి చివరికి పనిచేయడం మానేస్తాయి. ఆ పరిస్థితి రాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక వ్యాయామం తప్పనిసరి. పనిగట్టుకుని జిమ్‌కో, పార్కుకో వెళ్లడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. అందుకని పనిలోనే వ్యాయామమూ కలిసేలా అలవాట్లను మార్చుకుంటే మనకే మంచిది కదా!

అడుగులు వేసే వయసులో పిల్లలు మన చేయందుకుని నడవాలని ప్రయత్నిస్తారు. అదే కాస్త నడవడం వచ్చాక మన చెయ్యి పట్టుకోమన్నా పట్టుకోకుండా పడుతూ లేస్తూనే పరుగులు తీస్తారు. వృద్ధులకు ఆసరాగా చేయందించబోతే చాలామంది 'అక్కర్లేదు, నేను నడవగలను' అని ధీమాగా చెబుతుంటారు. పిల్లలకీ పెద్దలకీ లేని ఈ డిపెండెన్స్... మనకే ఎందుకు?

– పోలిశెట్టి



వాటర్ లిటరసీ నేటి అవసరం. దానికి మూడు దశలున్నాయి. మొదట నీటి మూలాలను తెలుసుకుని, నీటి వనరులకీ జీవవైవిధ్యానికీ ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవాలి. ఆ తరవాత నీటి నిర్వహణ విధానాలను నేర్చుకోవాలి. చివరగా తెలుసుకున్న జ్ఞానాన్ని ఇతరులకూ నేర్పాలి.

– రాజేంద్రసింగ్, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత

సురక్షిత పరిధి

మూడు పూటలా తింటూ శరీరాన్ని సుఖపెడుతూ ఒళ్లు వంచకుండా కాలం గడిపే భద్రజీవులకు సృజనాత్మకమైన, విభిన్నమైన ఆలోచనలు రమ్మన్నా రావు. సురక్షితమైన పరిధి అంటే చాలామందికి తెలియదు. అందులోనే ఉంటారు. అక్కడే బతుకుతుంటారు. కాలు తీసి బయటపెట్టరు. ఆలోచనల్లో ఉన్న వేగం ఆచరణలో ఉండదు. పాముకు పుట్ట సురక్షితం. పిట్టకి గూడు సురక్షితం. అలాంటి సురక్షిత పరిధుల్లో ఉన్న మనుషులు కూడా అంతే. వాటిని వదిలి రారు.

జీవితంలో ఏదైనా సాధించాలంటే సాధ్యమైనంత త్వరగా కంఫర్ట్‌జోన్ నుంచి బయటపడే మార్గం వెతుక్కోవాలి. కష్టాలకు సిద్ధపడాలి. కల్లోలానికి సమాయత్తమవ్వాలి. బాధపడాలి. బాధ్యతలు నెత్తికి ఎత్తుకోవాలి. కొలిమిలా మండాలి. కొత్త ఆలోచనలకు పుటం పెట్టాలి. మండుతున్న బంగారంలా ప్రకాశించాలి. సీతాన్వేషణకు లంకకు చేరుకోవాలంటే ఎన్నో అవరోధాలు దాటాలి. ఒక పక్క వానాకాలం. మరో పక్క సముద్రం. సురక్షితంగా గుహలో కూర్చుని ఉండలేదు శ్రీరాముడు. నాయకులతో మంతనాలు జరిపాడు. హనుమంతుణ్ని ఎన్నుకున్నాడు. సేనను ముందుకు నడిపించాడు. విజయం సాధించాడు. సురక్షితమైన పరిధిలో జీవించడానికి మనిషి భూమ్మీదకు రాలేదు. ఇంత అభివృద్ధి సాధించామంటే ఎంతోమంది తమ తమ కంఫర్ట్ జోన్‌లను మరిచిపోయి పనిచేయడం వల్లనే. భద్రలోకంలో బతకడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చు. సంపాదించిన ఆస్తులు కరగదీయవచ్చు. ఏమీ నేర్చుకోకుండా, ఏమీ సాధించకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడేలా ఉండిపోవచ్చు కూడా. మనిషిగా పుట్టినవాడు తన ధర్మం తాను నెరవేర్చాలంటే తప్పనిసరిగా సవాళ్లను స్వీకరించాలి. జీవితమంతా సుఖమే ఉంటుందని అనుకోకూడదు. కష్ట సుఖాలు రెండూ ఉంటాయి. కంఫర్ట్‌జోన్ ఒక వలలాంటిది. దాని తాళ్లు తెంచుకుని బయటపడాలి. చాలామంది తాము అందులోనే ఉన్నామని తెలియకుండా భద్రలోకంలో బతికేస్తుంటారు. జీవితంలో ఏదైనా సాధించాలనుకునేవారు మాత్రం ఎంత త్వరగా దాని నుంచి బయట పడతామా అనుకుంటారు.



అంతర్యామి

విశ్రాంతిగా ఉండటం మంచిదే కానీ జీవితమే విశ్రాంతి అయిపోకూడదు. సురక్షితమైన పరిధిలో ఎలాంటి భయాందోళనలు లేకుండా బతకొచ్చు. అయితే అది మనిషి జీవితం కాదు. ఏ ఒక్కరూ జీవితకాలం సురక్షితమైన పరిధిలో ఉండలేరు. ఎన్నో అడ్డంకులు, ప్రకృతి వైపరీత్యాలు దాటుకుంటూ ప్రయాణం సాగించాలి. తల్లి గర్భమే సురక్షితం అనుకుంటే, అక్కడ ఉండే సమస్యలు అక్కడా ఉంటాయి. భూమ్మీదకు వచ్చిన తరవాత ఎదుర్కొనే ఇబ్బందులు ఎన్నో ఉన్నాయి. మానవ జీవితం యుద్ధంలాంటిది. ప్రతి క్షణం లోపల, బయట పోరాటాలు సాగుతూ ఉంటాయి. భద్రమైన పరిధిని దాటి ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధపడాలి. అప్పుడే విజయం వరిస్తుంది. ఈ సత్యం తెలుసుకున్నవాడు పాము కుబుసాన్ని విడిచి కొత్త జీవితం మొదలెట్టినట్లు, గద్ద తన ముక్కును పగలకొట్టుకుని కొత్తగా దీర్ఘ జీవితం పొంది ఆకాశంలోకి ఎగిరినట్లు తనను తాను తీర్చిదిద్దుకుంటాడు.

– ఆనందసాయి స్వామి



జననాలు తగ్గి...


తరాల మధ్య సమతుల్యం సక్రమంగా ఉండాలంటే మొత్తం సంతాన సాఫల్య రేటు (టీఎఫ్ఆర్) 2.1గా ఉండాలి. ఏడున్నర దశాబ్దాలకు ముందు మన దేశంలో టీఎఫ్ఆర్ అంతకు రెండు రెట్లకు పైగా ఉండేది. కాలక్రమంలో అది తగ్గింది. కొన్ని ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాదిలో టీఎఫ్ఆర్ మరింత తరుగుపడింది. మరోవైపు ఆధునిక వైద్య వసతులు అందుబాటులోకి రావడం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెరగడం తదితరాల వల్ల ఇండియాలో ప్రజల సగటు ఆయుర్దాయం పెరుగుతోంది. టీఎఫ్ఆర్ తగ్గి, ఆయుర్దాయం అధికమవుతుండటం వల్ల వృద్ధుల సంఖ్య భవిష్యత్తులో ఎక్కువకానుంది. గడిచిన సంవత్సరాల్లో దేశీయంగా సంతాన సాఫల్యతా రేటు, సగటు ఆయుర్దాయం, భవిష్యత్తులో అవి ఎంత ఉండవచ్చంటే...

కాలం	సంతాన సాఫల్యరేటు	సగటు ఆయుర్దాయం
1950–55	5.90	36.98
1970–75	4.97	52.51
2000–2005	3.14	63.50
2025–2030	2.05	71.43
2050–2055	1.79	75.34

(ఆధారం: ఏజింగ్ ఇన్ ఇండియా, ఛాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్ నివేదిక-2025)

ఎవరు ప్రతిపక్షం.. ఎవరు ప్రజాపక్షం!?

'సర్కారు మీదనే.. దండెత్తి రండి.. కోర్టులో పిటిషన్లు.. కుమ్మరించండి' అంటూ కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ జనానికి పిలుపిచ్చేసరికి అధికారపక్షానికన్నా ఎక్కువగా ప్రతిపక్షాలు చలికాలం రాకముందే గడగడా వణికిపోతున్నాయి. అలా మా పొట్టకొట్టడం భావ్యమా అని విపక్షాలు ఎక్కిళ్లు పడుతూ ముక్కు చీదుతున్నాయి. 'మంత్రే ప్రతిపక్ష మాయెగా' అంటూ రాజకీయ విశ్లేషకులు రాగాలు తీస్తున్నారు. ప్రజాపరిపాలన సక్రమంగా జరగాలంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేసులు వేయడం అవసరమని గడ్కరీ అనగానే ఇక తమకు చేతినిండా పనుంటుందని ప్లీడర్లంతా పండుగ చేసుకుంటున్నారు. మన మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తన ప్రభుత్వాన్ని విమర్శిస్తూ మారు పేరుతో పత్రికల్లో వ్యాసాలు రాసేవారట. ఇప్పటి నాయకులేమో అలా రాయడం కాదుకదా.. వేరే ఎవరైనా అలా వేలెత్తి చూపించినా కస్సుబుస్సులాడుతున్నారు. ఇలాంటి వాతావరణంలో గడ్కరీ మాటలు ఎవరికైనా ఎడారి ఎండలో పన్నీటిజల్లే కదా?



'ప్రభుత్వం మీద కేసులు వేసేవాళ్లు కొంతమంది ఉండాలి. అప్పుడు కోర్టులు ఇచ్చే తీర్పులు 'పవర్'లో ఉన్న మంత్రులు తీసుకునే నిర్ణయాలకంటే 'పవర్'ఫుల్‌గా ఉంటా' యని చెప్పారు గడ్కరీ. ప్రజాప్రయోజనాలను పరిరక్షించడానికి న్యాయవ్యవస్థను చక్కగా ఉపయోగించుకోవాలన్న ఒక కొత్త ఐడియాను ఆయన తెరమీదకి తెచ్చారు. ఒక ఐడియా జీవితాన్ని మారుస్తుందంటారు. గడ్కరీ ఐడియా ఎవరి జీవితాలను మారుస్తుందో మరి తెలియదు! మొత్తం మీద గడ్కరీ మాటలతో తేనెతుట్టె కదిలింది. మన ప్రజాస్వామ్యం మీద చర్చ మొదలైంది. మనది ఉత్తమ ప్రజాస్వామ్యమని కొంతమంది అంటుంటే, ఉత్త ప్రజాస్వామ్యమని మరికొంతమంది పెదవి విరుస్తున్నారు. అసలు ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం లేకుంటే, ఉన్నా అది తన పాత్ర పోషించకుండా ఉంటే ఏం చేయాలి? నేడదే పెద్ద సమస్యగా మారింది. అధికారపక్షమే ప్రతిపక్షాన్ని తయారుచేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

ఆంధ్రప్రదేశ్‌లో గత శాసనసభ ఎన్నికల్లో జనం అధికారపక్షాన్ని చిత్తుగా ఓడించి పదకొండంటే పదకొండు సీట్లే ఇచ్చారు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే అసెంబ్లీకి రానని ఆ పార్టీ నాయకుడు మొరాయిస్తున్నారు. ఆ పక్షం తరఫున గెలిచిన వాళ్లయినా ప్రతిపక్షపాత్ర నిర్వర్తిస్తున్నారా అంటే, అదీ లేదు. నాలుగేళ్ల తరవాత తాము మళ్లీ అధికారంలోకొస్తే ఇప్పుడు పవర్‌లో ఉన్నవాళ్లను ఎలా చీల్చి చెండాడతామో చెబుతూ పగటికలలు కంటున్నారు. ఇప్పుడు గడ్కరీ చెప్పిన మాటలకు తమ ప్రభుత్వ హయాంలో బాటలు వేసి సరికొత్త ప్రతిపక్షాన్ని తామే సృష్టించుకున్నామని చెవులు కొరుక్కుంటున్నవారూ ఉన్నారు. ప్రజాసేవకోసం సొంత తల్లినీ, చెల్లినీ ప్రతిపక్షం చేసుకున్నారని కొన్ని గొంతులు గొప్పగా అంటుంటే- ఆస్తుల్లోనో అధికారంలోనో వాటా ఇవ్వాల్సి వస్తుందని అలా చేశారని అందరికీ తెలిసిన విషయాన్ని మరికొందరు గుసగుసగా చెబుతున్నారు. పోనీ, ప్రజాసమస్యలపై కోర్టుల్లో కేసులు వేసి పోరాడవచ్చుగదా అని కొందరు ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఇంతకు మించిన అన్యాయం ఏమైనా ఉందా? గతంలో చేసిన పాపాలకు ఇప్పటికే కేసుల్లో ఇరుక్కొని కోర్టుల చుట్టూ తిరుగుతుంటే, మళ్లీ ప్రజాసమస్యల గురించి కొత్తగా కేసులు పెట్టి కాసులు పోగొట్టుకొమ్మనడం ఎంత అన్యాయమని అయినవాళ్లు కళ్లొత్తుకుంటుంటే పోయిన అధికారం గుర్తొచ్చి మనసు ఎంత విలవిల్లాడుతుందో పాపం! 'మరపునకురాని పవరు కన్నా బాధే లేదు' అని అధికార భగ్న ప్రేమికులు పాడుతుంటే ఎన్ని ఫ్యాన్లు తిరుగుతున్నా గాలాడదు!

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం కాకూడదంటే ఒక్కటే మార్గం. నిస్వార్థంగా ప్రజల్లో, ప్రజలతో ఉంటూ వారి సంక్షేమం కోసం నిరంతరం పాటుపడాలి. అంతే తప్ప, ఎన్నికలకు ముందు ప్రజల డబ్బునే వారికి తాయిలాలుగా పంచిపెట్టి సింహాసనం మీద టవల్ వేసినట్టు అధికారం ఎప్పటికీ మాదే అనుకుంటే ప్రజలు కచ్చితంగా గుణపాఠం చెబుతారు. కాదనే వాళ్ల చరిత్ర తిరగేస్తే సరి! బుర్ర గిర్రున తిరుగుతుంది. ఎక్కడ పప్పులో కాలేశారో తెలుస్తుంది. భూతకాలంలో చేసిన పనులు భూతంలాగా కనిపిస్తాయి. చట్టసభల్లోకి ప్రవేశించకుండా గేట్లు మూతపడతాయా అన్న భయాలు కలుగుతాయి. అందుకే, ప్రజాస్వామ్యంలో ప్రజల విషయంలో ముందు జాగ్రత్తకు మించిన మందు లేదు. 'పదండి మందితో.. పదండి ముందుకు' అనుకుంటేనే ప్రజాస్వామ్యంలో పార్టీలకు సుగతి! నాయకులకు ప్రగతి! దీనిపై కేసూ లేదు, అప్పీలూ లేదు. దేశాభివృద్ధికి సంబంధించి ఎంతో కాలం నుంచి ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ వింటున్నాం. ఇప్పుడు ప్రభుత్వం చురుగ్గా పనిచేయడానికి గడ్కరీ 'మంత్రీ కీ బాత్' వినిపిస్తున్నారు. ప్రభావం ఎలా ఉంటుందో రాజకీయ వెండితెరపై చూడాల్సిందే!

– శంకర నారాయణ

కబుర్లు చెప్పే అక్కాతమ్ముళ్లు!

హాయ్ ఫ్రెండ్స్..! మీకు కాస్త ఖాళీ సమయం దొరికితే ఏం చేస్తారు? 'ఏముంది అమ్మదో, నాన్నదో ఫోన్ తీసుకొని ఎంచక్కా యూట్యూబ్‌లో కార్టూన్లు చూస్తాం. లేదంటే.. ఏవైనా గేమ్స్ ఆడుకుంటాం' అంటారు. అంతే కదా! కానీ ఈ నేస్తాలు మాత్రం ఏకంగా యూట్యూబ్ వీడియోలే చేస్తున్నారు. ఇంతకీ వాళ్లెవరంటే..

కేరళలోని పాలక్కాడ్‌కు చెందిన తియాకు పదకొండేళ్లు.. అద్విక్‌కి తొమ్మిదేళ్లు. వీళ్లిద్దరూ అక్కాతమ్ముళ్లు. వాళ్ల అమ్మానాన్నల సాయంతో యూట్యూబ్ వీడియోలు చేస్తున్నారు. రకరకాల బొమ్మలు, వాటిని ఉపయోగించే విధానం, ఆహార పదార్థాలు, స్కూల్, హోంవర్క్ విశేషాలు, టూర్స్.. ఇలా బోలెడు విషయాలు మనందరికీ నచ్చేలా వీడియోల్లో పంచుకుంటున్నారు. 2018లో ఛానల్ ప్రారంభించారు. టేబుల్స్ రాయడం, చిన్నచిన్న పదాలు చెప్పడంతో మొదలుపెట్టారు. వీళ్ల వీడియోలకు మిలియన్లలో వ్యూస్ ఉన్నాయి. ఇలా చాలామంది వీడియోలు చేస్తున్నారు కదా! వీళ్ల ప్రత్యేకత ఏంటి? అనుకుంటున్నారా? చాలా తక్కువ సమయంలోనే ఈ అక్కాతమ్ముళ్లు 10 లక్షల



హాయ్! బుజ్జీ!!

ఫాలోవర్లను సొంతం చేసుకున్నారు. కేరళలో పదేళ్లలోపు వయసు వాళ్లలో మొదటగా ఇంతమంది సబ్‌స్క్రైబర్లు ఉన్నది వీళ్ల ఛానెల్‌కేనట. ప్రస్తుతం 43.1 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 'బెస్ట్ కిడ్స్ వ్లాగర్స్ అవార్డ్'తో పాటు ఇంకా చాలా అవార్డులు కూడా అందుకున్నారు. ఈ అక్కాతమ్ముళ్ల విశేషాలు మీకెలా అనిపించాయి నేస్తాలూ! ★

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ప్రారంభమయ్యే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవీ కలిసిపోయాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.

దుకాణం	కుక్కపిల్ల	ఇసుక
గోడ	చెంచా	బొమ్మ
నక్షత్రం	ఓడ	నిమ్మకాయ

ఒకే నంబరుతో 200కుపైగా సేవలు: కలెక్టర్

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వాట్సప్ గవర్నెన్స్ (మన మిత్ర యాప్)పై అవగాహన కల్పించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. ఒక నంబరు 95523 00009 తో 200లకు పైగా సేవలను పొందవచ్చని పేర్కొన్నారు. దీనిపై అవగాహన కల్పించే ప్రదర్శనను నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీ ఎంజీ (బందరు) రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రతి నెలా 5న గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు.



జెండా ఊపి ప్రదర్శన ప్రారంభిస్తున్న లక్ష్మీశ

జేసీ ఎస్.ఇలక్కియా, సచివాలయాల ప్రత్యేక అధికారిణి జి.జ్యోతి, వీఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన రహితం.. ఆరోగ్య హితం

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే వారి కోసం అదే ఆవరణంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో పురుగుల మందులు, రసాయనాలు వాడకుండా రైతులు పండించిన



కూరగాయలతో స్టాల్ ఏర్పాటు చేస్తున్నారు. సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలు కావడంతో ప్రజలు, అధికారులు వాటిని కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. - ఈనాడు, అమరావతి


మనసుపెడితే.. మన్ను దన్ను!

రాజధాని పక్కనే భారీగా మట్టి నిల్వలు

ఈనాడు, అమరావతి

'రాజధాని నిర్మాణ పనులకు.. అవసరమైనంత మట్టి.. చెంతనే ఉన్న విజయవాడ గ్రామీణ మండలంలో ఉంది. కేవలం పది కిలోమీటర్లలోపే ఈ ప్రాంతాలు ఉన్నాయి. ఎక్కడో 30 కిలోమీటర్లకు పైగా దూరం నుంచి మట్టిని తెచ్చే బదులు.. ఇక్కడి లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని ప్రభుత్వమే వాడుకుంటే.. అక్రమాలకూ అడ్డుకట్ట పడుతుంది. జక్కంపూడి రెవెన్యూలోని వడ్లకొండ, వేమవరం వద్ద నేలబోడుతిప్ప, కొత్తూరు తాడేపల్లిలోని వసంతరాయులతిప్ప, దొండతిప్ప... చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల్లో కావాల్సినంత నాణ్యమైన ఎర్ర మట్టి పుష్కలంగా ఉంది. పోలవరం కాలువ వెంట కూడా లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి కుప్పలు ఉన్నాయి. ఇప్పటికీ.. ఈ మట్టిని అర్ధరాత్రుళ్లు తవ్వేసి అమ్మేస్తున్నారు.'

వైకాపా జమానాలో విజయవాడ గ్రామీణంలో అక్రమ మైనింగ్‌కు పాల్పడి.. రూ.వందల కోట్లు దోచేశారు. ప్రధానంగా పోలవరం కట్ట వెంట మట్టి కుప్పలు, కొత్తూరు తాడేపల్లి, వేమవరంలోని కొండలు, గుట్టలు, ప్రభుత్వ, అసైన్డ్, కొండవాగు భూముల్లో విచ్చలవిడిగా మట్టి తవ్వేశారు. వైకాపా నేతలు... నందిగం సురేష్, అంబటి రాంబాబు, జోగి రమేష్, వల్లభనేని వంశీల కనుసన్నల్లో.. వారి అనుచరులే లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వేసి అమ్మేశారు. వీరిలో కొందరు ఇప్పటికీ అర్ధరాత్రి వేళ అక్రమంగా తవ్వేస్తున్నారు.


కొత్తూరు తాడేపల్లిలోని దొండతిప్ప(కొండ)

లక్షల క్యూబిక్ మీటర్లు ఉంది.. వడ్లకొండ 200 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని పక్కనే టిడ్కో ఇళ్లను గత తెదేపా ప్రభుత్వ హయాంలో కట్టారు. ఈ కొండ వేమవరం రెవెన్యూ పరిధి వరకూ ఉంది. ఇప్పటికే ఈ కొండను కొల్లగొట్టినా.. ఇంకా లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి ఉంది. పశ్చిమ బైపాస్‌కు కేవలం కిలోమీటరు దూరంలో ఉన్న ఈ కొండ మట్టిని రాజధాని అవసరాలకు వాడవచ్చు. వేమవరం ఐదు కిలోమీటర్లు, తాడేపల్లి కొత్తూరు 7-8 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి.

పోలవరం కాలువ వెంటా... పోలవరం కాలువ తవ్వినప్పుడు కట్ట వెంట దాచిన మట్టి నిల్వల్లో చాలా వరకూ వైకాపా హయాంలో కొల్లగొట్టారు. అయినా ఇప్పటికీ.. భారీగానే పోలవరం కట్ట వెంట మట్టి ఉంది. ఈ ప్రాంతాలన్నింటి నుంచి ఎలాంటి ట్రాఫిక్ లేకుండా నేరుగా పశ్చిమ బైపాస్ మీదుగా రాజధానికి మట్టి తీసుకెళ్లొచ్చు. ఇవన్నీ రాజధానికి కేవలం పది కిమీ లోపే ఉన్నాయి.

అసైన్డ్ భూములు కొనే ప్రయత్నాలు.. తాజాగా వేమవరం రెవెన్యూలో 30 ఎకరాల్లోని నేలబోడు తిప్పకొండ చుట్టూ ఉన్న అసైన్డ్ భూములు కొనేందుకు కొందరు యత్నిస్తున్నారు. 15 ఎకరాల అసైన్డ్ భూములను ఇటీవల పరిశీలించారు. మట్టి తవ్వే యంత్రంతో ఎంత లోతు దిగుతోంది. ఎలాంటి మట్టి వస్తోందో పరిశీలించారు. భారీ తవ్వకాలకు కన్నేశారు. వీటికి అడ్డుకట్ట వేయాలంటే.. ప్రభుత్వమే నేరుగా మట్టిని రాజధాని పనులకు తరలిస్తే మంచిది.

చిక్కులు వీడాలి.. చక్కగా సాగాలి..!

ఉచిత బస్సు ప్రయాణానికి ఆటంకాలు

ఈనాడు, అమరావతి

మహిళల ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి మొదలవనుంది. ప్రభుత్వం జరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో సమస్యలు అధికారుల వైపులాలను వెక్కిరిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో పథకం అమలు చేసినప్పుడు ఉత్పన్నమైన ఇబ్బందులను సరిదిద్దకపోవడంతోపాటు స్థానిక లోటుపాట్లపై కూడా దృష్టి సారించాల్సిన తరుణమిది.



అంశం	ఎన్టీఆర్	కృష్ణా
ఉన్న డిపోలు	08	05
మొత్తం బస్సులు	800	416
రోజులో ప్రయాణికులు	1,50,000	80,200
మహిళా ప్రయాణికులు	70,000	38,000
రోజుకు దూరం(కిమీ)	2,74,000	1,40,000

పూర్తి సన్నద్ధత అవసరం.. గతంలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ముందస్తు సన్నద్ధత లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ★ పథకం మొదలైనప్పటి నుంచి బస్సులు అన్ని ట్రిప్పులు 80 మంది ప్రయాణికులతో తిరుగుతాయి. ఫలితంగా తరచూ మరమ్మతులకు గురవుతాయి. బస్సుల కండిషన్ చూసే గ్యారేజ్ సిబ్బంది కొరత వేధిస్తోంది. పూర్తి స్థాయి బాధ్యతలు నిర్వహించే సిబ్బంది సగం మందే ఉన్నారు. కొందరిని ఒప్పంద విధానంలో ఎంపిక చేస్తున్నా సరిపోరు. సిబ్బంది నియామకంపై దృష్టిపెట్టాలి. ★ ప్రస్తుత బస్సుల్లో దాదాపు 40-50 శాతం బస్సులు 15 లక్షల కిమీ పైగా తిరిగినవే. గతంలో 10 లక్షల కిమీలకే ఆపేసేవారు. కేంద్రం 15 ఏళ్ల వాహనం వాడొద్దనే నిబంధనతో ఎన్ని కిలోమీటర్లు తిరిగినా 15 ఏళ్ల వరకు పట్టించుకోవడం లేదు. దీంతో బస్సుల కండిషన్ సవ్యంగా లేదు. ★ 109 బస్సులకు బాడీ మార్చినా వాటిలో చాలా బస్సుల ఇంజిన్ కండిషన్‌లో లేదు. ★ ఉమ్మడి జిల్లాలో 82 కొత్త బస్సులకు ప్రతిపాదించినా నేటికీ రాలేదు. నగరానికి 100 విద్యుత్తు బస్సులు వస్తాయన్నా.. అడుగులు పడలేదు.

సాంకేతిక సమస్యలు సరిదిద్దాలి.. ★ సాధారణ సమయాల్లో కంటే ఉచిత ప్రయాణంలో రెట్టింపు ప్రయాణికులు ఉంటారు. టికెట్ మిషన్‌కు ఛార్జింగ్ సరిపోదు. దీంతో ప్రయాణం మధ్యలో టికెట్లు కొట్టడానికి ఇబ్బందులు ఉంటాయి. బస్సుల్లో ఛార్జింగ్ పాయింట్లు పెట్టాలి. ★ ఉచిత ప్రయాణమైనా టికెట్ తప్పనిసరిగా తీసుకోవాలి. వారు దిగే ప్రాంతం తెలియకపోతే మధ్యలోనే దించి.. మళ్లీ టికెట్ తీసుకోవాలి. ★ ప్రయాణికులు పాటించాల్సిన నిబంధనలపై వారికి అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలి. ★ ఒకే బస్సులో ఎక్కువ మంది ఎక్కి తోపులాటలు, వివాదాలు జరగకుండా బస్సుల కాల పట్టిక ప్రదర్శించాలి. ★ బస్టాండ్లలో మైకుల్లో చెప్పే ఏర్పాట్లు చేయాలి. ★ సాంకేతిక సమస్యలను ముందే గుర్తించి చర్యలు తీసుకోవాలి. ★ క్షేత్రంలో సమస్యలు వేగంగా పరిష్కరిస్తామని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఆర్ఎంలు దానం, వెంకటేశ్వరరావులు తెలిపారు.

నడిపితే కష్టం.. నిలిపితే దుఃఖం




నడవలేని స్థితిలో ఉన్న రోగులను కూర్చోబెట్టి చికిత్స నిమిత్తం తీసుకెళ్లేందుకు వీలుగా ఉండేవి.. వీల్‌ఛైర్లు. జీజీహెచ్‌లో చాలా వరకు ఇవి సరిగా లేవు. ముందు చక్రాలు లేక రోగిని కూర్చోపెట్టి వదిలేస్తే ముందుకు పడిపోయేలా ఉన్నాయి. పోనీలే.. తోసుకుని వెళ్దామంటే... రోగిని వీల్‌ఛైర్‌తోపాటు వెనక్కి వాల్చాల్సిందే. ముందు చక్రాలు లేక.. ఉన్నా విరిగిపోయి లేదా ఒకటి మాత్రమే ఉండి.. ఇలా రకరకాల సమస్యలున్నాయి. నిత్యం వందల్లో రోగులు వైద్య సేవల కోసం వచ్చే ఆసుపత్రిలో కనీసం కొత్త వీల్‌ఛైర్లు దేవుడెరుగు.. పాత వాటిని కూడా బాగుచేయించకపోతే ఎలాగని రోగులు ప్రశ్నిస్తున్నారు. - ఈనాడు, అమరావతి

బ్యారేజీకి మళ్లీ వరద తాకిడి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రకాశం బ్యారేజీకి మళ్లీ వరద నీరు రానుంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి మంగళవారం సాయంత్రం సుమారు 50,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఇది బుధవారానికి బ్యారేజీకి చేరే వీలుంది. దీంతో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.

సముద్రంలోకి 2,900 క్యూసెక్కులు ప్రకాశం బ్యారేజీకి చెందిన నాలుగు గేట్లను మంగళవారం సాయంత్రం ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 2,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు 18,184 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 10,271, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 7,713, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 5,017, బందరు కాల్వకు 1,911, కేఈబీ కాల్వకు 1,832, ఏలూరు కాల్వకు 1,511 క్యూసెక్కుల నీరు ఇస్తున్నారు.

భవిష్యత్తు వైద్యానికి సాంకేతిక పరిజ్ఞానం ఆధారం

పటమట, న్యూస్‌టుడే: భవిష్యత్తులో వైద్యం సాంకేతిక పరిజ్ఞానంపై ఆధార పడుతుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని గోరా టెక్నో హబ్‌లో ఏర్పాటు చేసిన 'గోరా అడ్వాన్స్‌డ్ హెల్త్ సైన్సెస్' ఎగ్జిబిషన్‌ను మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో ఆరోగ్య రంగానికి శాస్త్రీయ దృక్పథాన్ని జోడిస్తూ... భవిష్యత్తు వైద్య పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. ఏఐ ఆధారిత ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు, క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికతను మంత్రి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ ప్రదర్శన ఆరోగ్య రంగానికి కొత్త దిశ చూపుతుందని అన్నారు. ప్రజలకు శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గోరా టెక్నో హబ్ ఛైర్మన్ జి.సమరం మాట్లాడుతూ.. సైన్స్, టెక్నాలజీ వైపు యువతను ఆకర్షితులను చేయడమే ధ్యేయంగా గోరా టెక్నో హబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సర్వే డ్రోన్ పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్ తదితరులు

రైల్వే ప్రయాణికుల సౌకర్యాల విషయంలో రాజీ పడొద్దు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు(జీఎం) సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ మంగళవారం విజయవాడ, గుంటూరు డివిజన్లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పగిడిపల్లి, కృష్ణా కెనాల్, విజయవాడ సెక్షన్‌లో విజయవాడ డీఆర్ఎం మోహిత్ సొనాకియా, గుంటూరు డీఆర్ఎం సుదేష్ణసేన్‌తో కలిసి సిగ్నలింగ్ వ్యవస్థ, భద్రతా అంశాలు, రైల్వే ట్రాక్‌ల నిర్వహణను పరిశీలించారు. వెయిటింగ్ హాళ్లు, దివ్యాంగుల మరుగుదొడ్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, తాగునీటి సౌకర్యం, ప్రయాణికులకు కల్పించిన మౌలిక వసతులను చూసి అధికారులకు పలు సూచనలు చేశారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. నిర్ణీత వ్యవధిలోనే వాటిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల సౌకర్యాల విషయంలో రాజీపడొద్దని సూచించారు. అనంతరం విజయవాడ కార్యాలయంలో డీఆర్ఎం మోహిత్ సొనాకియా అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో జరుగుతున్న రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు, ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధికారులు ఆయనకు వివరించారు.

రూ.900 కోట్లతో రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులు

అవినీతి అధికారులపై ఫిర్యాదు.. చర్యలకు మంత్రి సిఫార్సు

ఈనాడు - అమరావతి: "రాజధాని గ్రామాల్లో రూ.900 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తాం. ఆగస్టు ఆఖరుకు డీపీఆర్ సిద్ధం అవుతుంది. త్వరలో టెండర్లు పిలిచి.. రహదారులు, డ్రెయినేజీలు, తాగునీరు, తదితర పనులు ప్రారంభిస్తామని" పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో రాజధాని రైతు ఐకాస ప్రతినిధులతో మంత్రి, కమిషనర్ కన్నబాబు భేటీ కాగా.. రైతులు పలు సమస్యలు వివరించారు.


మంత్రి నారాయణతో సమావేశమైన రైతు ఐకాస ప్రతినిధులు

విన్నపాలు వినవలె.. అమరావతికి చట్టబద్ధత తెచ్చేలా పార్లమెంటులో చట్టం చేసేలా చొరవ చూపాలని రైతులు మంత్రిని కోరారు. ఆయన స్పందిస్తూ.. వీలైతే ఈ సమావేశాల్లో జరిగేలా చూస్తామనీ, లేదంటే తర్వాత సమావేశాల్లోనైనా అయ్యేలా బాధ్యత తీసుకుంటామన్నారు. ★ గ్రామకంఠం, పూలింగ్‌కు ఇవ్వని భూముల్లో వచ్చిన ప్లాట్ల సమస్యలు పరిష్కరించాలని కోరగా వెంటనే చక్కదిద్దుతామని చెప్పారు. ★ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న మూడు రాజధానుల పిటిషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని రైతులు సూచించారు. న్యాయ సలహా మేరకు సాగుతామని మంత్రి బదులిచ్చారు. ★ అర్హులకు ఇంకా కౌలు సరిగా జమ కావడం లేదని రైతులు తెలపగా.. నెలలోగా పరిష్కరిస్తామని చెప్పారు. ★ ఆర్5 జోన్ సమస్యనూ త్వరగా కొలిక్కి తెస్తామన్నారు. ★ వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో టిడ్కో ఇళ్లు పూర్తి కాకుండా ఈఎంఐలు కట్టాల్సి వస్తోందని రైతులు వాపోయారు. ★ జరీబు, మెట్ట భూముల ప్లాట్ల కేటాయింపులో తేడాలు సవరిస్తామనీ, హెచ్‌టీ లైన్లను భూగర్భంలోకి మార్చేందుకు రూ.1,200 కోట్లతో పనులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు. ★ మరో నెలలో మళ్లీ సమావేశమై.. మిగిలిన పెండింగ్ సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామన్నారు.

మా ప్లాట్లలో వాటాలు అడుగుతున్నారు..

'సీఆర్డీఏలో కొందరు అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు. బాగా ఇబ్బంది పెడుతున్నారు. మా ప్లాట్లలో వాటాలు అడుగుతున్నారు. ఇది మరీ దారుణం. మా భూములను రాజధాని నిర్మాణానికి ఇస్తే.. సీఆర్డీఏ ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలోనూ వాటాలు అడిగితే ఎలా?' అని మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ కన్నబాబును మంత్రి ఆదేశించారు. వారిని బదిలీ చేయాలని కోరారు.

విరాళాలపై దుష్ప్రచారం తగదు..

అమరావతి నిర్మాణంలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేసి.. వారిలో రాజధాని నాదనే భావన కలిగించేందుకే విరాళాలను సేకరిస్తున్నామనీ.. ఇందులో ఎలాంటి బలవంతం లేదని మంత్రి నారాయణ తెలిపారు. రైతులతో సమావేశం తర్వాత మీడియాతో మాట్లాడుతూ, ఇదే ఉద్దేశంతో గతంలోనూ 'మై బ్రిక్.. మై అమరావతి' పేరుతో విరాళాలను సేకరించామన్నారు. అమరావతికి అప్పు పుట్టక విరాళాలు సేకరిస్తున్నామనే దుష్ప్రచారం తగదన్నారు.

పథకం ఎర.. ఫలితం చెర!

అన్నదాత సుఖీభవ పేరుతో బురిడీ

ఈనాడు, అమరావతి

'అన్నదాత సుఖీభవ' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ప్రారంభించింది. అర్హులకు మూడు విడతల్లో ఒక్కొక్కరికి రూ.20 వేలు జమ చేస్తోంది. ఈ పేరుతో నేరగాళ్లు వారం రోజులుగా పలు ప్రాంతాల్లో రైతులకు ఫోన్ చేసి.. 'మీ ఖాతాలో సాయాన్ని జమ చేస్తామని' నమ్మిస్తున్నారు. నిజమేనని నమ్మి కేటుగాళ్లు చెప్పినట్లే చేస్తూ డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఏపీకే ఫైళ్లను వాట్సప్‌లో పంపి, తద్వారా ఫోన్లలో విలువైన సమాచారం తస్కరిస్తున్నారు. ఆపై ఖాతాల నుంచి డబ్బు డ్రా చేస్తున్నారు. విషయం తెలియక చాలా మంది మోసపోతున్నారు.



రూ.2.30 లక్షలు డ్రా

వత్సవాయి మండల రైతుకు ఇటీవల వాట్సాప్‌లో పీఎం కిసాన్ పేరుతో ఎస్ఎంఎస్... ఏపీకే ఫైల్ కూడా వచ్చింది. వెంటనే ఓ వ్యక్తి ఫోన్ చేసి.. నేను సచివాలయం నుంచి మాట్లాడుతున్నా.. పథకానికి అర్హత పొందాలంటే మీ వివరాలు నమోదు చేసుకోవాలి. ఇందుకు ఏపీకే ఫైల్‌పై క్లిక్ చేయాలన్నాడు. నిజమని నమ్మి.. పేరు, ఆధార్ నెంబరు, బ్యాంకు ఖాతా వివరాలు ఎంటర్ చేశారు రైతు. ఇటీవల బ్యాంకు ఖాతా పరిశీలించగా.. రూ.2.30 లక్షలు డ్రా అవడం చూసి నిర్ఘాంతపోయారు.

రూ.33 వేలు బదిలీ

తిరువూరులో ఓ రైతుకూ పీఎం కిసాన్ పేరుతో సంక్షిప్త సందేశం వచ్చింది. ఏపీకే ఫైల్‌పై క్లిక్ చేసి.. నిర్దేశిత ఫారంలో వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలని అపరిచితుడు ఫోన్ చేసి సూచించాడు. అతడు సూచించినట్లే రైతు వివరాలన్నీ నమోదు చేశారు. మర్నాడు ఖాతా నుంచి రూ.33 వేలు బదిలీ అయింది.

ఏపీకే ఫైళ్లతో ఖాతాలు ఖాళీ...

సైబర్ నేరగాళ్లు.. మాల్‌వేర్‌ను ఏపీకే ఫైళ్ల ద్వారా చొప్పిస్తున్నారు. 'అన్నదాత సుఖీభవ..' పథకానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. వీటిని క్లిక్ చేస్తే వివరాలు నమోదు చేసుకోవచ్చని నమ్మిస్తారు. ఇవి అత్యవసరం, తప్పనిసరి అని ఒత్తిడి తెచ్చి డౌన్‌లోడ్ చేయిస్తారు. వీటిని ఇన్‌స్టాల్ చేయగానే ఫోన్ హ్యాక్ అయి.. నియంత్రణ మోసగాళ్ల చేతిలోకి వెళ్తోంది. మొబైల్‌లో వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు, నెంబర్లు, ఎస్ఎంఎస్‌లు, వంటివి అవతల వ్యక్తులకు సులభంగా చేరతాయి. అందులో సమాచారాన్ని మార్చేసి.. అదనంగా మాల్‌వేర్‌లను ఇన్‌స్టాల్ చేస్తారు. ఫోన్‌లో బ్యాంకు ఖాతాలు, సోషల్ మీడియా ప్రొఫైల్స్, వ్యక్తిగత మెయిల్స్ మోసగాళ్ల నియంత్రణలోకి వెళ్తున్నాయి. బ్యాంకు ఖాతాల నుంచి అనధికార లావాదేవీలు నిర్వహించి నగదును తమ ఖాతాలకు బదిలీ చేసేస్తున్నారు.

అప్రమత్తత అవసరం...

✪ సంక్షేమ పథకాలపై సందేహాలు ఉంటే.. ప్రభుత్వ కార్యాలయంలోనే సంప్రదించాలి. ✪ అపరిచితులు పంపే ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్, క్లిక్ చేయవద్దు. ✪ ఫోన్ సెట్టింగ్‌లలో 'ఇన్‌స్టాల్ ఫ్రమ్ అన్‌నోన్ సోర్సెస్' ఆప్షన్ డిజేబుల్ చేసుకోవాలి. దీంతో అనుమతి లేని యాప్స్ ఇన్‌స్టాల్ కావు. ✪ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసే ముందు.. అది ఎక్కడి నుంచి వచ్చిందో పరిశీలించాలి. ✪ ఒకవేళ తెలియక మాల్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే.. వెంటనే ఆ ఫోన్‌ను రీసెట్ చేసేయండి.

ఒకటే ప్రణాళిక.. ఒకేలా బోధన!

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు చేతి పుస్తకాలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు రోజూ పాఠ్య ప్రణాళిక తయారు చేసుకొనేవారు. అందుకు చాలా సమయం పట్టేది. ప్రస్తుతం విద్యాశాఖ గురువుల సమయాన్ని ఆదా చేసేలా.. ప్రతి తరగతి పాఠ్య ప్రణాళికలతో కూడిన చేతి పుస్తకం (కర దీపిక) అందుబాటులోకి తెచ్చింది. ఫలితంగా ఉపాధ్యాయులు పూర్తి సమయం బోధనకు వెచ్చించడమే కాకుండా సత్ఫలితాలు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

☆ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మొత్తం 2500కు పైగా ప్రభుత్వ బడులున్నాయి. సుమారు రెండు లక్షల యాభై వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 756 ప్రాథమిక, 488 ఉన్నత కలిపి మొత్తం 1244 పాఠశాలలున్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు 90,509 మంది చదువుతున్నారు. 4,838 మంది ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు.

☆ కృష్ణా జిల్లాలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు కలిపి 1316 ఉన్నాయి. వాటిలో 1,54,074 మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. ఐదు వేల మందికిపైగా ఉపాధ్యాయులున్నారు. ప్రస్తుతం గురువులందరిపైనా.. రోజువారీ పాఠ్య ప్రణాళిక తయారు చేసుకునే భారం తగ్గింది.

అన్ని పాఠశాలల్లో ..

☆ ఎస్‌సీఈఆర్‌టీ సహకారంతో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కర దీపికలను నిపుణులతో తయారు చేయించారు. తరగతి గదిలో పాఠ్య పుస్తకంలోని అంశంతో పాటు.. అదనంగా విద్యార్థికి రోజువారీ ఏం బోధించాలనేది స్పష్టంగా తేదీలతో సహా ముద్రించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు సబ్జెక్టుల వారీగా చేతి పుస్తకాలను సమగ్ర శిక్ష తయారు చేసింది. ఫలితంగా ఉపాధ్యాయులకు మేలు జరగడంతోపాటు విద్యార్థులకు కూడా ప్రయోజనం కలుగుతుంది.


చేతి పుస్తకాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

☆ గతంలో ఉపాధ్యాయులు ఒక్కొక్కరూ ఒక్కో తరహాలో తమ పాఠ్య ప్రణాళిక తయారు చేసుకొనేవారు. ఇప్పుడు అందరి చేతుల్లోనూ ఒకే కర దీపిక ఉంది. అన్ని పాఠశాలల్లోనూ బోధన ఒకేలా సాగుతోంది. ఒక్కో ఉపాధ్యాయుడికి వారు బోధించే తరగతుల ఆధారంగా వాటిని అందజేశారు. ప్రధానంగా సామర్థ్య ఆధారిత బోధన.. అనంతరం అభ్యసన జరిగేలా చేతి పుస్తకాలను రూపొందించారు.

నాణ్యమైన విద్య అందించేందుకు దోహదం

కరదీపికలు అందరి ఉపాధ్యాయుల చేతుల్లో ఉన్నందున బోధన సులభమైంది. సమయం ఆదా అయింది. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించిన తర్వాత.. వారు పోటీ పరీక్షల్లో రాణించేందుకు అవసరమైన ఇతర వనరులను చేతి పుస్తకం ద్వారా అందుతున్నాయి. పక్కా ప్రణాళికతో అన్ని పాఠశాలల్లోనూ ఒకే సమయంలో ఒకేలా బోధన సాగడం వల్ల సత్ఫలితాలు వస్తున్నాయి. - యు.వి.సుబ్బారావు, జిల్లా విద్యాశాఖాధికారి

వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం


మాట్లాడుతున్న సీఎండీ పి.పుల్లారెడ్డి, వేదికపై డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, మూర్తి, మురళీకృష్ణయాదవ్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి విద్యుత్తు సిబ్బంది అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి సూచించారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విద్యుత్తు సర్కిల్ కార్యాలయంలో ఎన్టీఆర్, కృష్ణా, సీఆర్డీఏ, గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల సర్కిల్ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33/11 కె.వి. ఉపకేంద్రాలు, సరఫరా లైన్లలో అంతరాయాలు బాగా తగ్గించాలన్నారు. దీని కోసం ముందుగానే నిర్వహణ పనులు చూసుకోవాలని, అవసరమైన సామగ్రి అందించేందుకు అత్యవసర సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోయాయని, కరెంటు పోయిందని ఫిర్యాదులొస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఫీడర్‌లో ఎన్నిసార్లు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందో గణాంకాలు ఉన్నాయన్నారు. వ్యవసాయానికి 9 గంటలు నిరంతర సరఫరా అందించాలని, కొత్త కనెక్షన్లను తక్షణమే మంజూరు చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల ఇంటి పైకప్పుపై సౌర ప్యానళ్లు ఏర్పాటు చేసేందుకు సమ్మతి లేఖ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణయాదవ్, కె.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పీ-4 కార్యక్రమానికి మేము సైతం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగస్వాములు కావడానికి మేము సైతం అంటూ స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వస్తున్నాయి. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అంగీకారం తెలుపుతున్నాయి. స్పృహాప్తి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ వి.భారతీదేవి, కోశాధికారి టి.మాధురి తదితరులు కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశకు మంగళవారం అంగీకారపత్రాన్ని అందజేశారు. రోటరీ మిడ్ టౌన్ అధ్యక్షుడు వి.చంద్రశేఖర్, కార్యదర్శి పి.నాగవసంత్‌కుమార్ తదితరులు కలెక్టర్‌తో సమావేశమై తమ సమ్మతి తెలిపారు.

పేదల సంక్షేమం.. రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అన్ని రంగాలను అభివృద్ధిపథంలో నడిపిస్తూ... [illegible]



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, వేదికపై ఎమ్మెల్యే తాతయ్య, నెట్టెం, జనార్దన్ తదితరులు



బాయిలర్ ధరలు (కిలో లైవ్ రూపాయల్లో)

[illegible] బాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర 175, [illegible] - 200... [illegible] - 210.

ఆర్మీ నియామక ర్యాలీ ప్రారంభం

కాకినాడ, న్యూస్‌టుడే: కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని మంగళవారం తెల్లవారుజామున ఆర్మీ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ వరకూ జరిగే నియామక ప్రక్రియకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని... [illegible]

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 475 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

త్వరలో కొత్త అక్రిడిటేషన్ కార్డులు

విజయవాడ సిటీ: అతి త్వరలో రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇస్తామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు... [illegible]

ప్రజాప్రతినిధుల న్యాయస్థానానికి వల్లభనేని వంశీ

విజయవాడ(గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: 2019 ఎన్నికల్లో విజయవాడ పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసు విచారణ నిమిత్తం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మంగళవారం ప్రజాప్రతినిధుల న్యాయస్థానానికి... [illegible]

మరో కేసులో పోలీస్ వెంకట మహేష్.. [illegible]

ప్రజల ఆరోగ్య సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని... [illegible]



డాక్టర్ రాజన్ రవిచంద్రన్‌ను సన్మానిస్తున్న ఎం.టి.కృష్ణబాబు, డి.శ్రీహరిరావు, సుబ్రహ్మణ్యం, మనోజ్, సందీప్ తదితరులు

రోజుకు 5 గ్రాముల ఉప్పు చాలు

7 సంవత్సరాలు పైబడిన వారికి రోజుకు అన్ని రూపాల్లో 5 గ్రాముల ఉప్పు సరిపోతుంది... [illegible] -సేపియన్స్ హెల్త్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రాజన్ రవిచంద్రన్

ఉద్యాన సాగుతో రైతే రాజు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: సంప్రదాయ పంటల సాగుకు తగ్గించి ఉద్యానవన పంటలు సాగు చేస్తేనే రైతే రాజు అవుతాడని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు... [illegible]



అధికారులు, రైతు కూలీలతో కలిసి వరి నాట్లు వేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కొండపల్లిని సృజనాత్మక ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దుదాం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొండపల్లి బొమ్మల తయారీని... [illegible]

వంశీ బెయిల్ షరతుల సడలింపుపై ముగిసిన వాదనలు

ఈనెల 11న వెలువడనున్న తీర్పు

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసుకు సంబంధించి... [illegible]

'స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపకుంటే మరో ఉద్యమం'

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: [illegible] ...గాంధీ హిల్ విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్తు ఛార్జీల పెంపు, సర్దుబాటు, స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ... [illegible]



ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పక్కన సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు

జగన్మాత సేవలో మంత్రి అచ్చెన్నాయుడి కుటుంబం

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు... [illegible]



అచ్చెన్నాయుడి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇన్‌స్టాలో పరిచయం.. బాలిక అపహరణ

సాంకేతిక సాయంతో కేసు ఛేదించిన పోలీసులు

యువకుడిపై పోక్సో కేసు నమోదు

వత్సవాయి, న్యూస్‌టుడే: [illegible]

జాతీయ అక్వాటిక్స్‌లో సత్తా

విజయవాడ (క్రీడలు): [illegible]

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని మురుగు కాలువల్లో పందుల సంచారంతో దుర్గంధం వస్తోంది. **- వెంకటేశ్వరరావు, మైలవరం.** ✔ కాలువల్లో నీరు నిల్వ లేకుండా చూస్తాం. పందుల నివారణ చర్యలు తీసుకుంటాం. **- ఉమా మహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ –న్యూస్‌టుడే, మైలవరం**

? ఆత్కూరు గ్రామంలోని మురుగుకాలువల్లో పూడిక తీయక దోమలు, దుర్వాసనతో వ్యాధుల బారిన పడుతున్నాం. తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. **-రాజేష్, స్థానికుడు.** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించి పూడిక తీయిస్తాం. **-శ్యామ్, పంచాయతీ కార్యదర్శి –న్యూస్‌టుడే, జి.కొండూరు**

? కొండపల్లి అమెరికన్ ఆసుపత్రి సందులో పారిశుద్ధ్య పనులు నిర్వహించినా చెత్తను వేస్తూనే ఉన్నారు. ఆ ప్రాంతంలో రాకపోకలు సాగించలేకపోతున్నాం. **-శ్రీధర్, స్థానికుడు.** ✔ అక్కడ పారిశుద్ధ్య సమస్య వాస్తవమే. అయితే నిత్యం పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేస్తూనే ఉంటారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా ఐరన్ డంపింగ్ బల్లను ఏర్పాటు చేశాం. ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుద్ధ్యం మెరుగుపడాల్సి ఉంది. **-శ్రీను, పారిశుద్ధ్య మేస్త్రీ**

స్పందనకు వందనం

★ విద్యుత్తు వినియోగదారుల సేవా కేంద్రం వద్ద కాలువలో మురుగు నిలిచిపోయిందని మేమున్నాం. మీకు తోడుగా స్థానికులు తెలిపిన సమస్యపై పురపాలిక అధికారులు స్పందించారు. మంగళవారం ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తొలగించి మురుగు నీటిని సక్రమంగా పారేలా చేశారు. -న్యూస్‌టుడే, కొండపల్లి ★ రంగాపురం ఎస్సీవాడలోని డ్రెయినేజీలో గడి పెరిగి, పూడిక పేరుకుపోయి మురుగు సక్రమంగా పారడం లేదని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగాకు తెలిపిన సమస్యపై రంగాపురం పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి రామారావు స్పందించారు. పంచాయతీ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **-న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

★ పట్టణంలోని 1వ సచివాలయం పరిధిలో రహదారిపై చెత్త ఉందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ కె.మనోజ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక సిబ్బందితో రహదారిపై చెత్త లేకుండా శుభ్రం చేయించారు. ★ పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలో 9వ వార్డులో సుగాలి కాలనీ రోడ్డులో పిచ్చి మొక్కలు పెరిగాయని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును కమిషనర్‌కు తెలుపగా ఆమె స్పందించి పురపాలిక కార్మికులతో పిచ్చి మొక్కలను తొలగింపజేశారు.

-న్యూస్‌టుడే, తిరువూరు

గురుకులంలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

కృష్ణారావుపాలెం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణారావుపాలెం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలుర గురుకులంలో 5, 10వ తరగతి, ప్రథమ ఇంటర్ ఎంపీసీలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి బుధవారం పాఠశాలలో దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రిన్సిపల్ కె.సిద్దయ్య తెలిపారు. విద్యార్థులు నేరుగా గురుకులంలో దరఖాస్తుల అందజేస్తే ప్రతిభ ఆధారంగా వెంటనే ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మైలవరం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ సీనియర్ విభాగంలో తృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ (షాట్‌పుట్) పోటీలకు మండలంలోని వెల్వడం హైస్కూల్ విద్యార్థి ఎం.వరుణ్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.బసవారావు తెలిపారు. వ్యాయామోపాధ్యాయురాలు నాగమణిని ఉపాధ్యాయులు, సదరు విద్యార్థిని అభినందించారు.

డప్పుల వితరణ

మైలవరం: గణపవరానికి చెందిన డప్పు కళాకారులకు రూ.30 వేల విలువైన 14 డప్పులను గ్రామ తెదేపా మాజీ అధ్యక్షుడు ఉమ్మా రమణారెడ్డి వితరణగా అందజేశారు. ఎమ్మెల్యే వసంత సూచనల మేరకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

పాఠశాలకు కుర్చీల అందజేత

జి.కొండూరు: స్థానిక జడ్.పి.పాఠశాలకు కుర్చీల సమస్య ఉందని గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు సోలా రాఘవరాజు, రాంబాబులు పూర్వ విద్యార్థి పుప్పాల వెంకట భాస్కరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి రూ.6,500 విలువగల కుర్చీలు సమకూర్చారు. వాటిని మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్రీలత కు అందజేశారు. పాఠశాల సిబ్బంది దాతను శాలువాతో ఘనంగా సత్కరించారు.

నిర్దేశిత సమయంలో పూర్తి చేయండి

ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రసాద్ నగర్‌లో మంగళవారం నిర్వహించిన పీ4 సర్వేను విజయవాడ సబ్ కలెక్టరు చైతన్య పరిశీలించారు. నిబంధనల మేర నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దారు వెంకటేశ్వర్లు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

నెమలి కృష్ణాలయంలో పవిత్రాలకు శయనాధివాసం

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: నెమలి వేణుగోపాలుని ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం అగ్నిప్రతిష్ఠాపన, పవిత్రాలకు శయనాధివాసం నిర్వహించారు. యాగశాలలో రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య, తెదేపా నాయకులు బెల్లం మధుసూదనరావు పాల్గొన్నారు



పూజలందుకున్న రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులు

తెలుసుకోవాలి.. తెలియజెప్పాలి

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు

గొల్లపూడి, న్యూస్‌టుడే: అప్రమత్తంగా ఉండడం, అవగాహన పెంపొందించుకోవడం ద్వారా సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని పశ్చిమ ఏసీపీ ఎన్.ఎస్.వి.కె.దుర్గారావు పేర్కొన్నారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని గొల్లపూడిలోని నలంద కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..ప్రజలకు అవగాహన లేకపోవడం కారణంగానే సైబర్ నేరగాళ్లు మాయచేసి రూ.కోట్లు దోచుకుంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఏదైనా సంఘటన జరిగితే వెంటనే 1930 నంబరుకు సమాచారం ఇవ్వడం ద్వారా డబ్బులను రికవరీ చేయవచ్చని వెల్లడించారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్టుల పేరుతో దోచుకుంటున్నారని, చట్టంలో అలాంటి అరెస్టే లేదన్నారు. గతంలో బ్యాంకులో డబ్బులు ఉండే భద్రంగా ఉంటాయనే ఆలోచన ఉండేదని, ప్రస్తుతం అక్కడా భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇటీవల ఓ విశ్రాంత పోలీసు ఉన్నతాధికారి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని రూ.15లక్షలు పోగొట్టుకున్నారని తెలిపారు. అనవసరమైన లింక్‌లను క్లిక్ చేయవద్దని, లోన్, బెట్టింగ్ యాప్‌లు, తదితర వాటి జోలికి వెళ్లవద్దని సూచించారు. సీఐ కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ..బ్యాంకు అధికారుల పేరుతో ఫోన్ చేసి ఓటీపీలు చెప్పమని కోరితే స్పందించవద్దని, ఇండియాలో ఏ బ్యాంకు వారు ఫోన్ చేసి ఓటీపీలు అడగరనే విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. ఎస్ఐ రవితేజ మాట్లాడుతూ..వర్క్‌ఫ్రం హోం పేరుతో ఎక్కువగా మోసాలకు పాల్పడుతున్నారని, ఎలాంటి పని చేయకుండా ఎవరూ డబ్బులు ఇవ్వరనే విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ షేక్.ఖాశీం షా మాట్లాడుతూ..డబ్బులు పెట్టుబడి పెట్టే విషయంలోను అవగాహన కలిగి ఉండాలని, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన సంస్థల్లో మాత్రమే పెట్టుబడి పెట్టాలని వెల్లడించారు.



మాట్లాడుతున్న ఏసీపీ దుర్గారావు, వేదికపై సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ రవితేజ, ప్రిన్సిపల్ ఖాశీంషా



హాజరైన విద్యార్థులు

ఈనాడు ETV ఆంధ్ర ప్రదేశ్ చైతన్య సదస్సు

సైబర్ నేరాల గురించి తెలిసింది :ఆర్.ప్రణతి (డిగ్రీ ద్వితీయ)



ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఏవిధంగా దోచుకుంటున్నారనే విషయంపై పూర్తి అవగాహన ఏర్పడింది. నాతో పాటు కుటుంబసభ్యులు, మిత్రులు, బంధువులకు కూడా అవగాహన కలిగిస్తా. ఒక వేళ ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడితే ఎవరిని సంప్రదించి వారి డబ్బులు తిరిగి పొందే విషయం తెలుసుకున్నాను. ఈ విధమైన కార్యక్రమాలను నిర్వహించడం సంతోషంగా ఉంది.

అనవసర యాప్‌లతో చేటు: తేజ్‌దీప్(డిగ్రీ తృతీయ)



ప్రస్తుతం యువత ఎక్కువ మంది తల్లిదండ్రుల చరవాణులు తీసుకుని అనవసరమైన యాప్‌లు డౌన్‌లోడ్ చేయడం, ఏపీకే ఫైల్స్ వంటి వాటిపై క్లిక్ చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఎలాంటి నష్టం జరుగుతుంది, బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్న విధానాన్ని క్షుణ్ణంగా వివరించారు.

సమ్మె ప్రభావం..తాగునీరందని దైన్యం

మైలవరం, న్యూస్‌టుడే: కృష్ణా వాటర్ ప్రాజెక్టుపై పనిచేస్తున్న కార్మికుల సమ్మె ప్రభావం నీటి సరఫరాపై పడింది. కొండపల్లిలో కార్మికులు సోమవారం రాత్రి నుంచి సమ్మె చేస్తుండగా మైలవరం, జి.కొండూరు. రెడ్డిగూడెం మండలాలకు సైతం మంగళవారం సరఫరా ఆగిపోయింది. కృష్ణానీరు మైలవరం పట్టణంలోని ప్రధాన ప్రాంతాలకు ఆదరువు కాగా, సమ్మె విరమించకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు చూడాల్సిన పరిస్థితి. ఇప్పటికే పంచాయతీలో ఉన్న మోటార్ల ద్వారా ట్యాంకుల నుంచి దాదాపు 90 శాతం ప్రాంతాలకు నీరందుతుంది. అతి పెద్ద కాలనీగా ఉన్న తారకరామానగర్, చంద్రబాబునగర్, అంబేడ్కర్ నగర్ ప్రాంతాలకు కృష్ణానీరే అధికంగా సరఫరా జరుగుతుంది. ఇప్పటి వరకు పంచాయతీ సరఫరాలో సగం వరకు ఈ నీటితోనే సర్దుతుండగా, ట్యాంకుల నీటిని అన్ని ప్రాంతాలకు సరఫరా చేయాలంటే కొంత ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. కృష్ణానీరు సరఫరా జరుగుతున్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా పంపేందుకు చర్యలు చేపడతామని కార్యదర్శి రఫి తెలిపారు. చాలా వరకు పంచాయతీ నీటితోనే సర్దుకోవచ్చని పేర్కొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వేతన బకాయిలు చెల్లించాలంటూ ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు వాటర్ స్కీం వద్ద అర్ధనగ్న ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తమకు మూడు నెలలు బకాయిలు ఇప్పటికే రావాలన్నారు. తమ సమస్యను అధికార్ల దృష్టికి తీసుకెళ్లినా గుత్తేదారుతో బకాయిలు ఇప్పించడం లేదన్నారు. ఇదిలా ఉంటే పురపాలికతో పాటు నియోజకవర్గ గ్రామాల్లో మంగళవారం కూడా తాగునీటి కష్టాలు తప్పలేదు. దీంతో ఫిల్టర్ వాటర్ ప్లాంట్లకు తీవ్ర డిమాండ్ పెరిగింది. ఒక్కో చోట క్యానుకు రూ.5 పెంచి అమ్మకాలు చేస్తున్నారు.

ప్రజలకు చేరువలో పనులు

మైలవరం, న్యూస్‌టుడే: మనమిత్ర యాప్ ద్వారా ప్రజలకు కావాల్సిన పనులు చేరువలోకి వచ్చాయని పంచాయతీ అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన యాప్‌పై మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయ కూడలిలో ఫ్లెక్సీలను ప్రదర్శించారు. పంచాయతీల పరిధిలో గల గ్రామ సచివాలయాల వద్ద బ్యానర్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రఫి, సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం(గంపలగూడెం): మండలంలోని గోపాలపురంలో ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్‌పై సచివాలయ ఉద్యోగులు మంగళవారం అవగాహన కల్పించారు. వాట్సాప్ నంబరుకు మన మిత్ర యాప్ ద్వారా సంక్షిప్త సమాచారం పంపిస్తే వివిధ శాఖల నుంచి 200కు పైగా సేవలను పొందవచ్చని వివరించారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే: వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ప్రదర్శనను కొత్తూరుతాడేపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మనమిత్ర ఫ్లెక్సీలు ప్రదర్శిస్తున్న పంచాయతీ అధికారులు

తప్పులున్నాయ్.. సరిచేయించండి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : పొలాల రీసర్వేలో భాగంగా విసన్నపేట మండలం వేమిరెడ్డిపల్లిలో మంగళవారం జరిగిన గ్రామసభలో అన్నదాతలు ఆందోళన చేశారు. రైతుల ప్రమేయం లేకుండానే స్థానిక రెవెన్యూ అధికారులు పొలాల సరిహద్దులు నిర్ణయించి కొలతలు చేపట్టడంతో విస్తీర్ణంలో భారీగా తేడాలు వచ్చాయని భూయజమానులు వాపోయారు. సభలో సర్వే వివరాలను తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి సమక్షంలో సంబంధిత అధికారులు చదవగా అందులో అవకతవకలు ఉన్నాయని రైతులు అభ్యంతరం తెలిపారు. ఇదే సమయంలో ఆర్డీవో మాధురి అక్కడికి చేరుకోగా సమస్యను ఆమెకు తెలిపి న్యాయం చేయాలని కోరారు. పక్షం రోజుల్లో రికార్డులు పరిశీలించి మళ్లీ సర్వే నిర్వహింపజేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ భాస్కర్‌రావు, మండల సర్వేయర్ శంకరరావు, సచివాలయ, మండల సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్డీవో మాధురి, తహసీల్దార్‌కు సమస్య వివరిస్తున్న రైతులు

సీఎం చంద్రబాబుకు హజ్ కమిటీ సభ్యుల కృతజ్ఞతలు



సీఎం చంద్రబాబుతో అబ్దుల్‌హుస్సేన్

తిరువూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర హజ్ కమిటీని నియమించినందుకు సీఎం చంద్రబాబుకు సభ్యులు కృతజ్ఞతలు తెలిపినట్లు తిరువూరుకు చెందిన తెదేపా నాయకుడు హజ్ కమిటీ సభ్యుడు షేక్ అబ్దుల్‌హుస్సేన్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం 12 మంది హజ్ కమిటీ సభ్యులతో సీఎంను కలిసినట్లు చెప్పారు.

కొండపల్లి కోట కట్ట పరిశీలన

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లిలోని రాజుల కోటకు సంబంధించిన కట్ట పరిసర ప్రాంతాలతో పాటు ఆర్కియాలజీ భవనాన్ని ఆ శాఖ ఏడీ వెంకటరావు మంగళవారం పరిశీలించారు. బొమ్మల ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు ముఖద్వారం ఏర్పాటుకు చేయాలన్న ప్రతిపాదన నేపథ్యంలో పురావస్తు శాఖ అధికారులు పర్యాటన చేపట్టారు.

ఒక్కరినైనా ఉంచాలి కదా..?



గ్రామ సచివాలయం 2 వద్ద సేవల కోసం ప్రజలు

మంగళవారం ఉదయం 11 గంటల సమయం...మైలవరంలోని 2వ గ్రామ సచివాలయానికి వివిధ సేవల కోసం వచ్చిన ప్రజలకు ఇంకా తెరుచుకోని తలుపులు దర్శనమిచ్చాయి. సిబ్బందిపై ఆరా తీస్తే వేర్వేరు పనులకు వెళ్లారన్న విషయం తెలిసింది. కనీసం ఒక్కరినైనా కార్యాలయంలో ఉంచకుండా ఇతర పనులకు పంపటమేమిటోనని కుంటూ గంటల తరబడి అక్కడే ఎదురుచూస్తుండి పోయారు. తర్వాత సిబ్బంది వచ్చి తాళాలు తీశారు. అప్పటి వరకు ఎక్కడెళ్లారని ఆరా తీస్తే.. ఆ గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులు, వేర్వేరు కార్యక్రమాలకు హాజరయ్యారని తెలిసింది. ఒకరిద్దరు వాట్సాప్ గవర్నెన్స్ ర్యాలీకి వెళ్లారని, ఎస్ఆర్ తీసుకుని ఒకరు, ఒకరు శిక్షణకు వెళ్లారని ఎంపీడీవో అనురాధ తెలిపారు. **-న్యూస్‌టుడే, మైలవరం**

వృథాగా పోతున్నా..పట్టించుకోరా..?



చెవుటూరు బాపూజీ కాలనీలో పంచాయతీ నీరు మురుగు కాలువలోకి వృథాగా పోతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క మురుగు కాలువలో పూడిక పేరుకుపోయి నీరు పారక అవస్థలు పడుతున్నామని ఆ ప్రాంత వాసులు గగ్గోలు పెడుతున్నారు. దీనికి తోడు పంచాయతీ కుళాయి నిర్వహణ లోపంతో నీరు కాలువలో చేరుతుండడంతో సమస్య మరింత జటిలమవుతోందని మండిపడుతున్నారు. దీనికితోడు మురుగు కాలువలో దోమలు, దుర్వాసన కారణంగా తరుచు వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటి వృథాను అరికట్టి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, జి.కొండూరు**

భయపెడుతున్నాయ్..సరిచేయండి



ఈ స్తంభం చూశారా గట్టి గాలి వీస్తే పడిపోయేలా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అన్నదాతలు, ప్రయాణికులు భయపడుతున్నారు. ఇది ఎక్కడో కాదు విసన్నపేట మండలం పుట్రేల నుండి వేమిరెడ్డిపల్లి వెళ్లే రహదారి చెరువు కట్ట ప్రాంతంలోనే. దాన్ని సరిచేయాల్సిన విద్యుత్తు సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. అటుగా నిత్యం రాకపోకలు సాగించాలంటే భయాందోళనగా ఉందని పలు గ్రామాల ప్రజలు న్యూస్‌టుడేకి తెలిపారు. ప్రమాదకరంగా మారిన ఈ కరెంటు స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, విస్సన్నపేట**

కౌలు రైతులు పంట రుణాలు పొందాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కౌలురైతులు కౌలు కార్డులు తీసుకొని పంట రుణాలు పొందాలని రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మద్దులపర్వ ముచ్చినపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుగ్రాస పెంపకం, అధిక పాల దిగుబడి సాధించడం, ముప్పు నష్టపరిహారంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో పవన్, రైతులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఆశాలకు పనికి తగ్గ వేతనం చెల్లించడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై జీవోలు జారీ చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.కమల అన్నారు. మైలవరంలో జరగనున్న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలంటూ ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ వద్ద మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ నూతన కమిటీ ఎన్నికను నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.సులోచన, వనజ, సునీత, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ వద్ద ఆశాల నినాదాలు

పూర్తయిన భూముల రీసర్వే



గ్రామ సభకు హాజరైన ప్రజలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ముచ్చనపల్లి గ్రామంలో భూముల రీసర్వే పూర్తయిన సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద మంగళవారం రెడ్డిగూడెం ఇన్‌ఛార్జి తహసీల్దార్ సతీష్‌కుమార్ గ్రామ సభ నిర్వహించారు. భూముల రీసర్వే వివరాలను సభలో చదివి వినిపించారు. పంచాయతీ నోటీసు బోర్డులో ఉంచినట్లు చేసినట్లు ఆర్ఐ. బి.పుల్లయ్య తెలిపారు. ముచ్చనపల్లి, శ్రీరాంపురం గ్రామ సర్పంచులు డి.జమలయ్య, ఎ.శ్రీనివాసరావు, వీఆర్వోలు విజయ్ కుమార్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు

గంపలగూడెం, న్యూస్‌టుడే: డీపీఆర్టీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. డీపీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బూరుగు జమలయ్య, జిల్లా కార్యదర్శి కె.దయాకర్, ఎన్.ఆదినారాయణరెడ్డి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.నరసింహారావు, ఏవీ.నరసింహారావు, ఉపాధ్యాయులు కేవీ.రావూరావు పాల్గొన్నారు.



గంపలగూడెం: వినగడప పాఠశాలలో..

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలో మంగళవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.జనార్దన్, మండల శాఖ అధ్యక్షులు, కార్యదర్శులు బాల్జీనాయక్, రామ్ లక్ష్మణ్‌నాయక్, జ్ఞాన ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

జీతాల విడుదలకు డిమాండ్

విస్సన్నపేట: మండలంలోని యూటీఎఫ్ సభ్యత్వాల నమోదు మంగళవారం పూర్తి చేసినట్లు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ తెలిపారు. బదిలీయైన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు విడుదల చేయాలని, సరెండర్ సెలవులు, డీఏ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.చంటిబాబు, ఎ.మురళీకృష్ణ, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలకు నివేదిక

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శిరసాని వాణికి చెందిన రేషన్ దుకాణంలో మంగళవారం ఆర్డీవో మాధురి ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణంలో 67 కిలోల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించి చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. విస్సన్నపేటలో సాయిరాం ఫిల్లింగ్ స్టేషన్‌లో కూడా తనిఖీ చేసి..అక్కడ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వినియోగదారులకు అవసరమైన సేవలు లభించడంలేదని గుర్తించి యజమానిపై తగు చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు అనుమతించం

న్యూస్‌టుడే బృందం : స్మార్ట్ మీటర్లను రద్దు చేయడంతో పాటు పెంచిన విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు అన్నారు. ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్ వద్ద స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం రూ.కోట్లు ముడుపులు తీసుకొని ప్రజలపై భారాన్ని మోపిందన్నారు. నేటి కూటమి ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారం వేస్తుందన్నారు. తిరువూరు, మైలవరం నియోజక వర్గాల్లో వామపక్షాల నాయకులు విద్యుత్తు ఉపకేంద్రాల వద్ద ధర్నాలు చేసి ఆశాఖ ఉద్యోగులకు వినతి పత్రాలు అందజేశారు.



ఇబ్రహీంపట్నం ఏడీఈ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకుల నిరసన

గోడ దూకి పారిపోయిన విద్యార్థి

అమ్మమ్మ ఇంటికి చేరుకోవడంతో ఊపిరి పీల్చుకున్న ఉపాధ్యాయులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం అడ్డురోడ్డు వద్ద ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి అభ్యసిస్తున్న రామావతు బాబీనాయక్ మంగళవారం బడి గోడ దూకి పారిపోయాడు. ఆపైన తన అమ్మమ్మ ఇంటికి చేరినట్లు తెలియడంతో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. తెలిసిన వివరాల మేరకు..పల్నాడు జిల్లా మెరికపూడికి చెందిన సదరు బాలుడిని స్థానికంగా ఉన్న బంధువుల ద్వారా వారం రోజుల కిందట అడ్డరోడ్డు వద్ద ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు. ఈ క్రమంలో ఉదయం తరగతులు ప్రారంభమయ్యాక మూత్ర విసర్జనకు ఉపాధ్యాయుడి అనుమతితో బయటకు వచ్చి తిరిగి రాలేదు. అనుమానంతో విచారించగా..బడి నుంచి గోడ దూకి పారిపోయినట్లు గుర్తించి సమీప తండాలోని బంధువులకు సమాచారం అందించారు. వారి డిమాండ్ మేరకు ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆపైన ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. చరవాణి ద్వారా బంధువులను విచారిస్తుండగా కంచికచర్లలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్నట్లు తెలిసింది. కంచికచర్ల నుంచి తల్లి బాలుడిని పాఠశాలకు తీసుకురాగా..ఉన్నతాధికారులతో మాట్లాడి తిరిగి ఇంటికి పంపించారు.

అప్పుల బాధతో బలవన్మరణం

జి.కొండూరు, న్యూస్‌టుడే: సంతానలేమి, అప్పులతో మనస్థాపానికి గురై పురుగుమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కవులూరులో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు..గ్రామానికి చెందిన ప్రత్తిపాటి కరుణసాగర్ (43) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. వివాహమై 15 ఏళ్ల కాగా సంతానం కలగకపోవడం, కొద్దిపాటి అప్పులు ఉండడంతో మనస్థాపానికి గురై మంగళవారం మధ్యాహ్నం గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భార్యపై కోపంతో గడ్డి మందు తాగి ఆత్మహత్య

రాజుగూడెం(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని రాజుగూడెంలో చాట్ల వెంకటేశ్వరరావు(శివ)(49) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఎ.సంపత్‌కుమార్ తెలిపారు. కుటుంబ వ్యవహారాలపై భార్య లక్ష్మీతో వాగ్వాదం జరిగి మనస్థాపంతో సోమవారం వేకువ జామున ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించాడు. తల్లి కోటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశారు.

కట్లేరు వాగులో మృతదేహం లభ్యం

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలో శాంతినగర్‌కు చెందిన ఎస్‌కే.అమర్‌జానీ (గన్నా)(45) మృతదేహం బైపాస్ రోడ్డు సమీప కట్లేరు వంతెన వద్ద మంగళవారం లభించినట్లు ఏఎస్సైఐ వై.సీతామహాలక్ష్మి తెలిపారు. ఆరోగ్య, మానసిక స్థితి సరిగా లేని అతను గత నెల 25న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం వెతుకుతున్నారు. మంగళవారం కట్లేరు వంతెన వద్ద కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం ఉందన్న సమాచారంతో కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించగా అమర్‌జానీగా గుర్తించారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన అవసరం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు మండల స్థాయి అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని జిల్లా పంచాయతీ అధికారి లావణ్య కుమారి సూచించారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తడిపొడి చెత్తను వేరు చేసే విధానాలపై విజయవాడ డివిజన్ పరిధిలోని ఎంపీడీవోలకు, డిప్యూటీ ఎంపీడీవోలకు మంగళవారం జూపూడి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఒక రోజు శిక్షణ శిబిరంలో ఆమె వారికి మార్గదర్శనం చేశారు. ప్రతి రోజు గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులతో సమీక్షించాలన్నారు. సేకరించిన చెత్తను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మికంపోస్టు తయారీపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అనంతరం వ్యవసాయశాఖ ద్వారా రైతులకు విక్రయించేలా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి దేవమాత, విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్‌లతోపాటు ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఎఫ్‌టీసీలు రామసీత, లక్ష్మిలు పాల్గొన్నారు.



ప్రతిక్షాశ్రీ, రివత్రికాశ్రీ, దేవశ్రీ (పాతచిత్రాలు)

ముగ్గురు కుమార్తెల గొంతుకోసి.. తండ్రి ఆత్మహత్య

- నలుగురూ మృతి
- అప్పుల బాధతో దారుణం
- తమిళనాడులో ఘటన



గోవిందరాజ్

చెన్నై (విల్లివాక్కం), న్యూస్‌టుడే: ముగ్గురు కుమార్తెలను గొంతుకోసి చంపి.. తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. నామక్కల్ జిల్లా నామగిరిపేట యూనియన్ తిమ్మనాయకన్‌పట్టి సమీపంలోని వేంబాగౌండన్‌పుదూర్ గ్రామానికి చెందిన గోవిందరాజ్(35), భారతి(26) దంపతులు. వీరికి కుమార్తెలు ప్రతిక్షాశ్రీ(10), రివత్రికాశ్రీ(7), దేవశ్రీ(6), కుమారుడు అనీశ్వరన్(2) ఉన్నారు. ముగ్గురు కుమార్తెలు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. గోవిందరాజ్ బోర్‌వెల్ వాహనాల సంస్థలో మేనేజరుగా పనిచేస్తున్నారు. రెండు నెలల క్రితం పని నిమిత్తం కర్ణాటక రాష్ట్రానికి వెళ్లిన గోవిందరాజ్ వారం రోజుల క్రితం ఇంటికి వచ్చారు. ఇల్లు కడుతుండటంతో అప్పులు చేసినట్లు తెలుస్తోంది. అప్పులు పెరిగిపోవడంతో గోవిందరాజ్ మానసిక ఒత్తిడికి లోనయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి భార్య, కుమారుడు నిద్రించిన తర్వాత గోవిందరాజ్ వారి గది తలుపులకు బయట గడియపెట్టి హాల్‌లో పడుకున్న ముగ్గురు కుమార్తెలను వేటకొడవలితో గొంతులు కోసి కిరాతకంగా హత్య చేశాడు. అనంతరం ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉదయం భారతి తలుపు తీయడానికి యత్నించగా రాలేదు. దీంతో తలుపులు పగలగొట్టి బయటికి వచ్చింది. గొంతుకోసిన స్థితిలో ముగ్గురు కుమార్తెలు, భర్త మృతదేహాన్ని చూసి నిర్ఘాంతపోయింది.



అవి కేవలం పగటి కలలే!

రోజువారీ మీరు చేసే పనులు మీ లక్ష్యాలను అందుకునేందుకు దోహదపడేలా ఉండట్లేదా..? అయితే మీకున్నవి లక్ష్యాలు కానే కావు.. కేవలం పగటి కలలు! మీరేంటో, మీరు లక్ష్యం కోసం కృషిచేస్తున్నారో లేదో తెలియజెప్పేవి మీ మాటలు కాదు. మీ పనులే వాటిని చాటిచెప్తాయి. ఎవరూ చూడట్లేదు కదా అని పని చేయడం ఆపేస్తే.. మిమ్మల్ని మీరే మోసం చేసుకుంటున్నట్టు లెక్క.

– జోష్ రోచె, పర్ఫార్మెన్స్ కోచ్

హజ్ యాత్రికులకు రూ.72 లక్షల సాయం: మంత్రి ఫరూక్

ఈనాడు–అమరావతి: రాష్ట్రం నుంచి హజ్-2025కు వెళ్లేందుకు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ఎంపిక చేసుకున్న యాత్రికులకు ప్రభుత్వం రూ.72 లక్షలు మంజూరు చేసిందని రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఒక్కొక్కరికి లక్ష చొప్పున ఇస్తామన్న హామీ మేరకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని ఆయన వివరించారు.

మైనారిటీ ఆస్తుల పరిరక్షణకు చర్యలు

మైనారిటీ ఆస్తుల రక్షణ, అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు ఆ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖపై ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. మైనారిటీ వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని అనుబంధ శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. శాఖ పరిధిలోని ఆస్తుల జాబితా సిద్ధం చేసేందుకు కార్యాచరణ ప్రారంభించాలని సూచించారు.

పునరుత్పాదక ఇంధనంపై నైపుణ్య డ్రైవ్ నేడు

ఈనాడు, అమరావతి: గ్రీన్ వర్క్‌ఫోర్సు విప్లవానికి ఏపీ కేంద్ర బిందువుగా మారనుంది. విజయవాడలో బుధవారం పునరుత్పాదక ఇంధనంపై నైపుణ్య డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. సౌర, పవన విద్యుత్తుకు నైపుణ్య హబ్‌గా ఏపీ అనే నినాదంతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్త భాగస్వామ్యంతో ఈ డ్రైవ్‌ను చేపట్టాయి. దీనికి మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో 250కి పైగా పరిశ్రమల ప్రతినిధులు, ముఖ్యమైన అభివృద్ధి భాగస్వాములు హాజరు కానున్నారు.

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: పెంచిన విద్యుత్ ఛార్జీలను రాష్ట్రం ప్రభుత్వం తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. అదానీతో జరిగిన విద్యుత్తు ఒప్పందాలను రద్దు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విద్యుత్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు జయప్రదంగా జరిగాయని వెల్లడించారు.

'నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి'

ఈనాడు, అమరావతి: నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ప్రతినిధులు రాష్ట్ర సచివాలయాలశాఖ డైరెక్టర్ శివప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగంలో చేరిన తేదీని పరిగణనలోకి తీసుకుని ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని వారు కోరారు. ఉద్యోగుల ఐక్యవేదిక ఛైర్మన్ జానీ పాషా, ప్రధాన కార్యదర్శులు విప్పర్తి, నిఖిల్ కృష్ణ పాల్గొన్నారు.

స్థానికత నిబంధనను 2028 నుంచి అమలు చేయండి

- తెలంగాణకు సుప్రీంకోర్టు సూచన
- రెండేళ్లు బయట చదువుకున్నంత మాత్రాన ఎలా పక్కనపెడతారని సీజేఐ ప్రశ్న
- రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌లో ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వు చేసిన ధర్మాసనం
- స్థానికులకు ప్రయోజనం దక్కాలన్నదే తమ ఉద్దేశమన్న ప్రభుత్వం

ఈనాడు, దిల్లీ: ఎంబీబీఎస్‌లో స్థానిక కోటా కింద ప్రవేశాలు పొందాలనుకున్న విద్యార్థులు నీట్ రాయడానికి ముందు నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదివి ఉండాలని జారీ చేసిన నిబంధనలను తప్పుబడుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌లో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్‌చంద్రన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. మంగళవారం వాదనలు విన్న అనంతరం విచారణను ముగిస్తున్నట్లు ప్రకటించింది. ఇంకేమైనా వాదనలుంటే శుక్రవారంలోపు లిఖితపూర్వకంగా సమర్పించాలని ఆదేశించింది. స్థానికత సమస్యకు ప్రభుత్వమే పరిష్కార మార్గాలను చూపాలని, లేదంటే పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ గవాయ్ గత నెల 23న విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం జరిగిన విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణన్ పరిష్కార మార్గాలు చెప్పకుండా తాము వాదనలు వినిపించనున్నట్లు ధర్మాసనానికి చెప్పారు. దాంతో విచారణ ముగించి... "తెలంగాణ శాశ్వత నివాసులైన విద్యార్థులు ఇంటర్ పరీక్షలను తెలంగాణలో రాయకపోయినా ఎంబీబీఎస్ ప్రవేశాలకు అనుమతిస్తారా?" అని మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయడానికి సీజేఐ సిద్ధమయ్యారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. ధర్మాసనం అలాంటి ఉత్తర్వులు జారీ చేయడానికి ముందు తమ వాదనలు వినాలని అభ్యర్థించారు. అందుకు సీజేఐ అంగీకరించారు. దీంతో సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. "ఒక్కో ఎంబీబీఎస్ సీటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి ఖర్చుపెడుతోంది. ఆ ప్రయోజనాలను స్థానికంగా చదివిన పేద, మధ్యతరగతి విద్యార్థులకు కల్పించాలన్న ఉద్దేశంతోనే వరుసగా నాలుగేళ్లు రాష్ట్రంలో చదివి ఉండాలన్న నిబంధన తీసుకొచ్చాం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డీని అనుసరించే ఈ నిబంధన తీసుకొచ్చాం. కర్ణాటక, అస్సాం, హరియాణాల్లోనూ ఇలాంటి నిబంధనలు ఉన్నాయి" అని అభిషేక్ సింఘ్వీ వాదించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి హాజరై అంతర్రాష్ట్ర బదిలీలకు అవకాశం ఉండే అఖిల భారత సర్వీసు ఉద్యోగులు, న్యాయమూర్తులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, సైనిక దళాలు, పారామిలిటరీ దళాల్లో పనిచేసేవారి పిల్లలకు స్థానికత నిబంధన నుంచి వెసులుబాటు కల్పిస్తామని లిఖితపూర్వక హామీ పత్రాన్ని ధర్మాసనానికి సమర్పించారు.

విద్యార్థులను ముందే హెచ్చరించాలి: సీజేఐ

రాష్ట్ర ప్రభుత్వ వాదనలపై జస్టిస్ గవాయ్ పలు ప్రశ్నలు సంధించారు. "రాష్ట్రంలో పుట్టిన/పదో తరగతి వరకు చదివిన/తల్లిదండ్రులు ఇక్కడే శాశ్వత నివాసం ఉన్న విద్యార్థి వేరే రాష్ట్రంలో ఇంటర్ చదివారన్న కారణంతో ప్రవేశాలను నిరాకరించవచ్చా? జేఈఈ, నీట్ శిక్షణ నిమిత్తం రాజస్థాన్‌లోని కోటాకు దేశం నలుమూలల నుంచి విద్యార్థులు వెళ్తుంటారు. అలా వెళ్లినవారి పరిస్థితి ఏంటి? ఉదాహరణకు తెలంగాణకు ఐఏఎస్ అధికారి డిప్యుటేషన్‌పై దిల్లీకొచ్చినప్పుడు ఆయన కుమారుడు దిల్లీలో ఇంటర్ చదివాడని పక్కన పెట్టేస్తారా? తెలంగాణకు చెందిన న్యాయమూర్తి బిహార్‌కు బదిలీ అయినప్పుడు ఆయన కుమారుడు 11, 12 తరగతులు అక్కడ చదివితే... తన తప్పు లేకపోయినా అవకాశం కోల్పోతాడు కదా? అకస్మాత్తుగా తెచ్చిన స్థానికత నిబంధన గురించి తెలియని విద్యార్థులు వేరే రాష్ట్రంలో చదువుకోవడానికి వెళితే అక్కడ, ఇక్కడ స్థానికులు కాకుండా పోయే ప్రమాదముంది. ఇలాంటి నిబంధనల గురించి తెలియక విద్యార్థులు ఇబ్బందిపడటాన్ని మేం అంగీకరించం. ఇలాంటి విషయాల్లో విద్యార్థులను ముందే హెచ్చరించాలి. తల్లిదండ్రులు స్తోమత ఉన్నప్పుడు పిల్లలను మంచి చదువుల కోసం దుబాయ్, లండన్, అమెరికాకు పంపొచ్చు. వారంతా ఇక్కడివారే అయినా కేవలం రెండేళ్లు బయట చదివారన్న కారణంతో ఎలా కాదంటారు? అందువల్ల కావాలనుకుంటే 2028 నుంచి స్థానికత నిబంధనను అమల్లోకి తీసుకురండి" అని జస్టిస్ గవాయ్ సూచించారు.

సర్పంచుల ధర్నా ఉద్రిక్తం

- పీఆర్ కమిషనర్ కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నం
- వచ్చే నెలాఖరులోగా ఆర్థిక సంఘం నిధులు వస్తాయని కమిషనర్ హామీ



పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సర్పంచులు

ఈనాడు, అమరావతి: పంచాయతీలకు వెంటనే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని సర్పంచులు తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. సర్పంచులు ఒకానొక దశలో కార్యాలయం గేటు తోసుకుని లోపలికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ప్రతినిధులను కమిషనర్ కృష్ణతేజ పిలిపించి వచ్చే నెలాఖరులోగా నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని హామీ ఇవ్వడంతో సర్పంచులు ఆందోళన విరమించారు. పంచాయతీల్లో నిధుల కొరతతో పరిపాలనపరంగా ఇబ్బంది పడుతున్నామని పలువురు సర్పంచులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. 2024-25 సంవత్సరానికి రెండోవిడత రావలసిన ఆర్థిక సంఘం నిధులు రూ.1,120 కోట్లు వెంటనే విడుదల చేయాలని రాష్ట్రంలోని వివిధ జిల్లాల సర్పంచులు మంగళవారం ఉదయం కమిషనర్ కార్యాలయం ఎదుట ప్లకార్డులు పట్టుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే నెలాఖరులోగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, సర్పంచులు ఆందోళన చెందొద్దని సూచించగా.. కొందరు సర్పంచులు ఆయనతో విభేదించారు. ఆ విషయం కమిషనర్ చెప్పాలంటూ కార్యాలయం గేటు తోసుకుని లోపలికి వెళ్లేందుకు యత్నించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. కార్యక్రమంలో సర్పంచుల సంఘాల ప్రతినిధులు కృష్ణమోహన్, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సర్పంచులను ఉద్దేశించి ప్రతాప్‌రెడ్డి మరోసారి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటికే రెండు విడతల నిధులు విడుదల చేసిన విషయాన్ని గుర్తించాలని చెప్పారు. గత ప్రభుత్వంలో ఇదే నిధుల కోసం ఆందోళనలు చేస్తే కేసులతో ఇబ్బంది పెట్టారని అన్నారు.

ఏపీఎల్‌కు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు ఆహ్వానం

ఈనాడు, అమరావతి: విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 8 నుంచి 23 వరకు నిర్వహించే ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్-4కు హాజరు కావాల్సిందిగా సీఎం చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్‌లను ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ ఆర్వీ సుజయ్ కృష్ణ రంగారావు మంగళవారం వేర్వేరుగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని క్రికెట్ ఆటగాళ్లకు ఏపీఎల్ చక్కని వేదికగా నిలవాలని..ఇండియన్ ప్రీమియర్ లీగ్ తరహాలో నిర్వహించాలని సూచించారు.

హజ్ హౌస్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలి

ఈనాడు, అమరావతి: విజయవాడ లేదా గుంటూరు పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారి పక్కన 5 లేదా 6 ఎకరాల స్థలాన్ని హజ్ హౌస్ నిర్మాణానికి కేటాయించాలని రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ బాషా, సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. విజయవాడకు ఎంబార్కేషన్ పాయింట్ పునరుద్ధరణపై కృతజ్ఞతలు తెలిపారు.

మిథున్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

- 12న తీర్పు వెలువరించనున్న అనిశా కోర్టు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి (ఏ4) దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 12న తీర్పు వెలువడనుంది. ఈ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. మంగళవారం కోర్టులో వాదనలు జరిగాయి. మద్యం కుంభకోణంలో నిందితుడు కీలకపాత్ర పోషించారని, పలుకుబడి కలిగిన వ్యక్తి అని.. బెయిల్ ఇస్తే సాక్షులను బెదిరించే ప్రమాదం ఉందని ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదించారు. కొందరు విదేశాలకు పారిపోయారన్నారు. ఈ పరిస్థితుల్లో నిందితుడికి బెయిల్ ఇవ్వడం సబబు కాదని వాదించారు. మద్యం కుంభకోణం అంటూ సిట్ కట్టుకథలు అల్లుతోందని, కేసులో ఏమాత్రం పసలేదని. పిటిషనర్ మిథున్‌రెడ్డికి బెయిల్ ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయాధికారి పి.భాస్కరరావు. తీర్పును ఈ నెల 12కి వాయిదా వేశారు.

మిగిలిన నిందితుల పిటిషన్లపై..

◆ ఇదే కేసులో గోవిందప్ప బాలాజీ బెయిల్ పిటిషన్‌పైనా మంగళవారం వాదనలు పూర్తయ్యాయి. దీనిపై 12న ఉత్తర్వులు వెలువరిస్తామని న్యాయాధికారి వాయిదా వేశారు. ధనుంజయరెడ్డి బెయిల్ పిటిషన్ విచారణకు వచ్చింది. తదుపరి వాదనల నిమిత్తం బుధవారానికి వాయిదా పడింది.

◆ తనకు జైలులో ములాఖత్‌లు పెంచాలని నిందితుడు చాణక్య వేసిన పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 11కి కోర్టు వాయిదా వేసింది.

◆ ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, ఓఎస్డీ సత్యప్రసాద్‌ల ముందస్తు బెయిల్ పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఇవి12కు వాయిదా పడ్డాయి.

కృష్ణమోహన్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డిలకు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స

అనారోగ్యం నేపథ్యంలో మద్యం కేసులో నిందితులు కృష్ణమోహన్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డిలను జైలు అధికారులు బందోబస్తు మధ్య మంగళవారం ఉదయం విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న శ్రీధర్‌రెడ్డి.. గత వారం ఒకసారి ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. వైద్యుల సూచన మేరకు తిరిగి మంగళవారం తరలించారు. ఉదయం నుంచి శ్వాస సమస్యతో ఇబ్బంది పడుతున్న కృష్ణమోహన్‌రెడ్డిని కూడా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స తర్వాత మధ్యాహ్నం తిరిగి విజయవాడలోని జిల్లా కారాగారానికి తీసుకొచ్చారు.

రాజధానిలో హరిత వనాల అభివృద్ధి ఇలా..!

ప్రాజెక్టు	మొక్కలు పెంచే విస్తీర్ణం (ఎకరాల్లో)	ఎక్కడ
ప్రధాన రహదారుల సుందరీకరణ	1420	34 ప్రధాన రహదారులకు రెండు పక్కలా మొత్తం 640 కి.మీ.ల పొడవు
ఎల్‌పీఎస్ రహదారుల సుందరీకరణ	709	ఎల్‌పీఎస్ జోన్లలోని రహదారులకు పక్కన. మొత్తం 1,244 కి.మీ.ల పొడవు
సెంట్రల్ మీడియన్ల సుందరీకరణ	445	34 ప్రధాన రహదారుల మధ్యలో (మీడియన్‌లు). 450 కి.మీ.ల పొడవు
బఫర్ జోన్లలో మొక్కలు పెంపకం	494	22 ప్రధాన రహదారులకు సంబంధించిన బఫర్ జోన్‌లలో
పబ్లిక్ రిక్రియేషన్ పార్కు	190	శాఖమూరు
పబ్లిక్ రిక్రియేషన్ పార్కు	21	మల్కాపురం
లంగ్‌స్పేస్ పార్కు	31	అనంతవరం
జీవవైవిధ్య పార్కు	200	కురగల్లు
ఎల్‌పీఎస్ లేఔట్లలో పార్కులు	1,602	రైతులకు స్థలాలు కేటాయించిన ఎల్‌పీఎస్ లేఅవుట్‌లలో
కాలువల వెంబడి సుందరీకరణ పనులు	611	కొండవీటివాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్ వెంబడి 96.6 కి.మీ.ల పొడవు
నదీ అభిముఖ ప్రాంత సుందరీకరణ	----	కృష్ణా నది వెంబడి 22 కి.మీ.ల పొడవున
కృష్ణాయపాలెం రిజర్వాయర్ సుందరీకరణ	71	కృష్ణాయపాలెం
నీరుకొండ రిజర్వాయర్ సుందరీకరణ	158	నీరుకొండ
కొండలపై మొక్కల పెంపకం	400	ఉండవల్లి, నీరుకొండ, అనంతవరం కొండలు
జలవనరుల అభివృద్ధిలో భాగంగా	600	ఐనవోలు, నేలపాడు, నిడమర్రు, నవులూరు, తుళ్లూరు, వెలగపూడి, అనంతవరం, శాఖమూరు, నెక్కల్లులోని చెరువులు
మొత్తం	6,974	

సీసీ కెమెరాల ఫుటేజీ భద్రపరచాలని రాజ్ కెసిరెడ్డి పిటిషన్

ఈనాడు, అమరావతి: సిట్ అధికారులు ఇటీవల శంషాబాద్ మండలంలో స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్ల నగదుకు సంబంధించి సీసీ కెమెరాల్లోని దృశ్యాలను భద్రపరచాలని రాజ్ కెసిరెడ్డి (ఏ1) పిటిషన్ దాఖలుచేశారు. మంగళవారం సాయంత్రం విజయవాడలోని ఏసీబీ కోర్టులో నిందితుడి తరఫున మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి పిటిషన్ దాఖలుచేశారు. ఫామ్‌హౌస్‌తో పాటు వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల సీసీ కెమెరాల రెండు వారాల ఫుటేజీని భద్రపర్చేలా సిట్ అధికారులను ఆదేశించాలని అందులో కోరారు. బ్యాంకులో నగదు జమకు సంబంధించి మాచవరం ఎస్‌బీఐ, పోలీసులకు సోమవారం ఇచ్చిన ఆదేశాల మేరకు వారు ఇంకా చిత్రాలు, వీడియోలు, తగిన ఆధారాలు సమర్పించలేదని పొన్నవోలు ఈ సందర్భంగా న్యాయాధికారి దృష్టికి తీసుకొచ్చారు.

చెరువులో ఆక్రమణలు తొలగించండి

తెదేపా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం గుండుపాడు రెవెన్యూ పరిధిలోని దోర చెరువులో ఆక్రమణలు తొలగించి, దాన్ని రక్షించాలని టి.నాయుడుపాలేనికి చెందిన రాజు కోరారు. ఈ మేరకు తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆయా ప్రాంతాల బాధితుల నుంచి శెట్టి బలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు వినతులు స్వీకరించారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన నాడు-నేడు పనులు పూర్తిచేసి విద్యార్థులకు ఇబ్బందులు తొలగించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగికి చెందిన జి.పెద్దిరాజు అర్జీ ఇచ్చారు. తన తల్లి పేరున ఉన్న భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకుని దౌర్జన్యం చేస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా కేతనకొండకు చెందిన వెంకటనర్సమ్మ వాపోయారు.

కరేడులో అక్రమ అరెస్టులను ఆపాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కరేడులో అక్రమ నిర్బంధాల్ని, అరెస్టులను ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. "ఇండోసోల్ కంపెనీకి భూములు ఇవ్వటానికి కరేడు గ్రామ రైతులు నిరాకరించి పోరాడుతుంటే.. ప్రభుత్వం వారిని భయపెట్టి భూములను లాక్కోవాలని చూస్తోంది. రెవెన్యూ అధికారులను మంగళవారం గ్రామంలోకి పంపి, ఇళ్ల దగ్గర నుంచి ఆధార్, రెవెన్యూ, పట్టాపాస్ పుస్తకాల వివరాలు సేకరించడం మొదలుపెట్టింది. దీన్ని స్థానికులు వ్యతిరేకించడంతో రైతు సంఘం నాయకుడు కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పుల్లయ్య, జి.వెంకటేశ్వర్లు తదితరులను పోలీసులు అరెస్టు చేసి, ఉలవపాడు స్టేషన్‌కు తరలించారు" అని పేర్కొన్నారు.

వివేకా హత్యకేసు దర్యాప్తు పూర్తి

సుప్రీం కోర్టుకు తెలిపిన సీబీఐ

ఈనాడు, దిల్లీ: మాజీమంత్రి వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముగిసిందని అదనపు సొలిసిటర్ జనరల్ రాజ్‌కుమార్ భాస్కర్ ఠాక్రే సుప్రీం కోర్టుకు తెలిపారు. ఈ కేసులో నిందితుల బెయిళ్లు రద్దు చేయాలని, అంతిమ కుట్రదారులెవరో తేల్చేవరకు దర్యాప్తు కొనసాగించాలని కోరుతూ వివేకా కుమార్తె సునీతా నర్రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లు మంగళవారం జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. ఈ కేసులో తదుపరి దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందో లేదో చెప్పాలని గత విచారణ సమయంలో ధర్మాసనం ఆదేశించిన నేపథ్యంలో అదనపు సొలిసిటర్ జనరల్ స్పందిస్తూ 'మేం దర్యాప్తు ముగించాం. ప్రస్తుతానికి ఏమీ పెండింగ్‌లో లేదు. మీరు ఏవైనా ఉత్తర్వులు ఇస్తే వాటికి కట్టుబడి నడుచుకుంటాం' అని తెలిపారు. పిటిషనర్ సునీత తరఫున వాదనలు వినిపించడానికి సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అందుబాటులో లేకపోవడంతో ఆయన జూనియర్ న్యాయవాదులు పాస్ ఓవర్ కోరడంతో న్యాయస్థానం అంగీకరించింది. ఇరుపక్షాల అభిప్రాయం మేరకు తదుపరి విచారణను ఈనెల 19కి వాయిదా వేసింది.

రేషన్ దుకాణాల ద్వారా గిరిజన ఉత్పత్తులు

- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే: రేషన్ పంపిణీలో నగదు చెల్లింపు విధానం ప్రవేశపెట్టే ఆలోచన ఉందని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం ఆయన ఉత్తరాంధ్ర జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాలు, పౌర సరఫరాల సంస్థ, తూనికలు, కొలతల విభాగం అధికారులతో విశాఖపట్నం కలెక్టరేట్‌లో ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గిరిజన ఉత్పత్తులను రేషన్ డిపోల ద్వారా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈనెల 25న రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపడతామని చెప్పారు. ఇప్పటికే రేషన్ తీసుకుంటున్న వారితో పాటు కొత్తగా మంజూరైన వారికి స్మార్ట్ కార్డులు ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో దేశంలోనే తొలిసారిగా ఎన్టీఆర్ జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి డిజిటల్ వాలెట్ విధానాన్ని ప్రవేశపెడతామని చెప్పారు. రేషన్ పంపిణీకి సంబంధించిన సమస్యలను పరిష్కరించేలా గిరిజన ప్రాంతాల్లో 69 సబ్ డిపోలను ఏర్పాటుకు నిర్ణయించామని చెప్పారు.

ఆ గ్రామంలో ఒకే ఒక్కడు



సాధారణంగా ఏ మారుమూల గ్రామ జనాభా చూసినా పదుల సంఖ్యలోనే ఉంటారు. కానీ, తమిళనాడులోని శివగంగై జిల్లాలో నాట్టాకుడి అనే ఊరిలో ఒకే ఒక వృద్ధుడు నివసిస్తున్నారు. గతంలో ఇక్కడ 50 కుటుంబాలు ఉండేవి. చాలాకాలంగా కనీస సౌకర్యాలు లేకుండానే ప్రజలు జీవనం సాగించారు. తాగునీరు కోసం పక్క గ్రామానికి వెళ్లేవారు. పాఠశాలకు, వైద్య సదుపాయాలకు ఇదే పరిస్థితి. దీంతో స్థానిక యువతీ, యువకులను వివాహం చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. కొంతమంది శివగంగై, తిరుచ్చి, చెన్నై వంటి నగరాలకు వలస వెళ్లిపోయారు. గ్రామంలో వ్యక్తిగత గొడవలతో గత నవంబరులో ఓ హత్య చోటుచేసుకోగా మరికొందరు ఊరు విడిచిపెట్టారు. వారం క్రితం మరొకరు హత్యకు గురవడంతో మిగిలినవారు అదే బాట పట్టారు. ప్రస్తుతం నాట్టాకుడిలో తంగరాజన్ అనే వృద్ధుడు మాత్రమే ఉంటున్నారు. అతడికి కుటుంబ సభ్యులెవరూ లేరు. ఊరిలో సొంతిల్లు, పొలం ఉన్నా గ్రామస్థులు విడిచివెళ్లడంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

– న్యూస్‌టుడే, చెన్నై(ప్యారిస్)

ఎంబీబీఎస్ ఆల్ ఇండియా కోటా ప్రవేశాల గడువు పెంపు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ఎంబీబీఎస్ ఆలిండియా కోటా మొదటి విడత కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువును మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) పొడిగించింది. మొదటి రౌండ్‌కు సంబంధించి ఆగస్టు 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు రిజిస్టర్ చేసుకోవచ్చు. రుసుం అదేరోజు సాయంత్రం 6 గంటల్లోగా చెల్లించాలి. ఐచ్ఛికాలు 7వ తేదీ ఉదయం 8 గంటల్లోగా పెట్టుకోవాలి. సీట్ల కేటాయింపు వివరాలు 9న విడుదల చేస్తారు. సీట్లు వచ్చిన విద్యార్థులు ఆయా కళాశాలలో 9 నుంచి 18వ తేదీలోగా చేరవచ్చు.

- విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఎంబీబీఎస్/బీడీఎస్ కన్వీనర్ కోటా ప్రవేశాలకు వచ్చిన 14,431 దరఖాస్తులను మొదటి విడత పరిశీలన పూర్తయింది. రెండోదశలో 8,500 దరఖాస్తులు పరిశీలన చేయాలి. ప్రస్తుతం ఆల్ ఇండియా కోటా ప్రవేశాల గడువు పొడిగించిన నేపథ్యంలో రాష్ట్రంలోనూ పొడిగించే అవకాశం ఉంది.
- దివ్యాంగుల కోటా కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 6, 7 తేదీల్లో విశ్వవిద్యాలయంలో మెడికల్ బోర్డు ఎదుట హాజరుకావాలి. మొత్తం 59 మంది అభ్యర్థులుండగా.. 6న 30 మంది, 7న 29 మంది అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో హాజరు కావాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

రాష్ట్రంలో మళ్లీ బలమైన ఆర్థిక పురోగతి: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ బలమైన ఆర్థిక పునరుజ్జీవనాన్ని చూస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. "జులైలో రాష్ట్రం రూ.3,803 కోట్ల ఎస్జీటీ వసూళ్లు సాధించింది. 2017లో జీఎస్టీ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఇదే అత్యధికం. వార్షిక వృద్ధి రేటు 14 శాతంగా ఉంది. ఇది దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యధిక జీఎస్టీ వృద్ధి రేటు. ఈ విషయంలో దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో ఏపీ మూడో స్థానంలో నిలిచింది" అని 'ఎక్స్'లో లోకేశ్ వెల్లడించారు.

పీఎంశ్రీ నిధులు పెంచినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు

రాష్ట్రంలోని పీఎంశ్రీ పాఠశాలలకు నిధులను గణనీయంగా పెంచినందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ 'ఎక్స్' వేదికగా మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. ఏపీకి వైకాపా హయాంలో కంటే ఇప్పుడు సుమారు 120% అధికంగా నిధులు కేటాయించినట్లు ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన వార్తను పోస్టుకు జత చేశారు. "ఈ మద్దతు మన విద్యార్థులను శక్తిమంతం చేయడమే కాకుండా రాష్ట్ర విద్యా మౌలికసదుపాయాలను పూర్తిగా మార్చనుంది. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం మన పిల్లలకు అత్యుత్తమైన విద్యను అందించేందుకు కట్టుబడి ఉందని నేను మీకు హామీ ఇస్తున్నాను. మనం కలిసికట్టుగా దేశంలోని ప్రతి పిల్లవాడి భవిష్యత్తును ప్రకాశవంతంగా తీర్చిదిద్దుదాం" అని పేర్కొన్నారు.

కాంప్లెక్స్ బడుల్లో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం

ఈనాడు, అమరావతి: కాంప్లెక్స్ ఉన్నత పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి(ఈఎండీపీ) కార్యక్రమాన్ని అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందుకోసం ప్రతి జిల్లా నుంచి ఇద్దరు టీచర్లను రిసోర్సు పర్సన్లుగా గుర్తించాలని, మెంటార్ టీచర్లకు ఈ నెల 9 నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈఎండీపీ బోధన ఈ నెల 23 నుంచి ప్రారంభిస్తారు. ప్రతి శనివారం గంటపాటు బోధిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కాంప్లెక్స్ పాఠశాలలతోపాటు ఇతర ఉన్నత పాఠశాలలు సైతం ఆసక్తిని అనుసరించి లీప్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ కార్యక్రమంపై దిశా నిర్దేశం చేసేందుకు 26 జిల్లాలకు మేనేజర్లను నియమించారు.

'క్రీడా పరికరాల కొనుగోళ్లకూ ఇంజినీరింగ్ విభాగానికీ సంబంధం లేదు'

ఈనాడు, అమరావతి: 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా చేసిన క్రీడా పరికరాల కొనుగోళ్లకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఇంజినీరింగ్ విభాగానికి ఎలాంటి సంబంధం లేదని ఆ విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ (ఈఈ) ఎం.సిద్ధయ్య స్పష్టం చేశారు. ఈ నెల 1న 'ఇంజినీర్ సిద్ధయ్యపై తగ్గని ప్రేమ' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు ఆయన వివరణ ఇచ్చారు. ఇంజినీరింగ్‌కు సంబంధించిన పనులకే తాను పరిమితమన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

ఒక్క రీల్... 190 కోట్ల వ్యూస్!



దీపికా పదుకోణ్... దేశవ్యాప్తంగా ఈ పేరు తెలియని వారు ఉండరేమో! దాదాపు 20 ఏళ్ల కెరియర్‌లో ఆమె నటించిన ఎన్నో సినిమాలు సూపర్‌హిట్‌గా నిలవడమే కాదు వసూళ్లలోనూ రికార్డులు సృష్టించాయి. హాలీవుడ్‌లోనూ అవకాశాలు దక్కించుకుంది. ఎన్నో అంతర్జాతీయ సంస్థలకు గ్లోబల్ అంబాసిడర్ కూడా. దీంతో అంతర్జాతీయ స్థాయిలో అభిమానులూ ఉన్నారామెకు. ఫోర్బ్స్, టైమ్స్ జాబితాల్లోనూ నిలిచింది. ప్రముఖ మ్యాగజీన్ 'షిఫ్ట్' దీపికను ప్రభావవంతమైన మహిళల్లో ఒకరిగా ప్రకటించింది. 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026'కీ ఎంపికై, ఆ గౌరవం దక్కించుకున్న తొలి భారతీయ నటిగానూ నిలిచింది. తాజాగా తన పేరుమీద మరో రికార్డును లిఖించుకుంది దీపిక. ఇన్‌స్టాలో రీల్స్‌కి ఉండే క్రేజ్ ఏంటో తెలుసు కదా? ఎక్కువమందిని ఆకర్షించడానికి చాలామంది కొత్తకొత్తగా ఏవేవో ప్రయత్నిస్తుంటారు కూడా. తారలూ ఇందుకు మినహాయింపు కాదు. అభిమానులకు చేరువగా ఉండటానికి తమ వ్యక్తిగత, వృత్తి జీవితాలకు సంబంధించిన విషయాలను పంచుకుంటుంటారు. కానీ దీపిక మాత్రం ఈ విషయంలో బాస్ అనిపించుకుంది. 'హిల్టన్' సంస్థతో కలిసి ఇటీవల ఒక యాడ్ చేసిందామె. దాన్నే ఇన్‌స్టాలో పంచుకుంది. దానికి ఏకంగా 190 కోట్ల వీక్షణలు వచ్చాయి. ప్రపంచంలోనే ఈ వేదికగా ఎక్కువమంది చూసిన రీల్‌గా ఇది నిలిచింది. గతంలో ఈ విషయంగా రికార్డులు సృష్టించిన హార్దిక్ పాండ్యా, క్రిస్టియానో రొనాల్డోలనూ దాటి అందరినీ ఆశ్చర్యపరిచిందీమె. ఇది చూసినవారంతా సినిమాల్లోనే కాదు, సోషల్‌మీడియాలోనూ దీపిక క్వీన్ అంటున్నారు.



టెక్ రంగంలోని మహిళలకు నిరంతరం నేర్చుకోవడమనేది రాజీలేని ప్రక్రియ. ఆత్మవిశ్వాసంతో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఇది కీలకం. డిజిటల్ అడ్వర్టైజింగ్ రంగంలో ఉండటంతో... డేటా అనలిటిక్స్, మెషీన్ - డీప్ లర్నింగ్, జెన్ఏఐ వంటివి పరిశ్రమను ఎలా మార్చుతున్నాయో ప్రత్యక్షంగా చూశాను. అవి కేవలం పేర్లు కాదు, వృత్తి నైపుణ్యాలు. ఇతర అడ్డంకుల్ని దాటి మహిళల్ని ముందుంచేవి ఇవే.

- మేధావి సింగ్, కంట్రీ హెడ్, క్రిటియో ఇండియా

రుచులూ కలిస్తేనే... పెళ్లి!

ఒకప్పుడు పెళ్లంటే అటు ఏడు తరాలు... ఇటు ఏడు తరాలూ చూసేవారట. రానురానూ అంతస్తులు, అభిరుచులు, అలవాట్లు... ఇలా ఎన్నో చేరుతూ వచ్చాయి. తాజాగా అమ్మాయిలు ఏం కోరుకుంటున్నారో తెలుసా? తినే ఆహారమూ కలవాలి అనుకుంటున్నారు. దానిలో కొత్త, ఆశ్చర్యం ఏముంది అనుకుంటున్నారేమో! వాళ్లేమీ శాకాహారం, మాంసాహారం, వీగన్... ఇలా కలిస్తేనే చాలనుకోవట్లేదు. ఇప్పుడు వాళ్లు మాంసాహారులనుకోండి... సోమవారం తినరనుకోండి. ఆరోజు చేసుకోబోయే వ్యక్తీ తినకూడదు. కొన్నిరకాల కూరలు తినరనుకోండి... వాళ్లూ తినొద్దు. ఇంత క్షుణ్ణంగా చూస్తున్నారట. ఎందుకిలా అంటే... 'నాకు నచ్చిందొకటి, భర్త కోసం మరొకటి చేయాలి. ఇంకా అతని అమ్మానాన్నలూ ఉంటే వాళ్లకోసమూ చేయాలి. ఇవన్నీ చేయలేను అనిపిస్తే వాళ్ల ఇష్టాలను కాదనలేం కదా! అందుకోసం నాకు నచ్చినవే పక్కన పెట్టాలి. అప్పుడు నన్ను నేను కోల్పోతాను కదా' అని సమాధానం ఇస్తున్నారు.



అంతేకాదు, భోజన సమయమంటే కుటుంబమంతా ఒక్కచోట చేరే ప్రదేశం. అందరూ రుచుల్ని ఆస్వాదించినప్పుడే ఆనందం. నిజానికి దీన్ని అనుబంధాల్ని పెంచుకునే సమయంగానూ చెబుతారు. అలాంటప్పుడు నచ్చని వాసనలు పక్కనుంచి వస్తోంటే ప్రేమగా మాటలు ఎలా చెప్పగలం? అంటే తెలియకుండానే దూరం పెరుగుతున్నట్లేగా అంటున్నారు. అదే ప్రతిదీ కలిస్తే... చక్కగా కలిసి వండుకోవచ్చు. కొత్త రుచులు వెతకొచ్చు, ఊసులూ కలబోసుకోవచ్చు. దీంతో ఇద్దరి మధ్యా అనుబంధమూ పెరుగుతుంది. లేదంటే గొడవలే కదా! చిన్న అంశమే అని మనం తోసిపుచ్చేది ఎన్ని సమస్యలకు కారణమవుతుందో! అలాంటప్పుడు దాన్ని పట్టించుకోకుండా ఎలా ఉండగలం అంటున్నారు నేటి యువతులు. నిజమే అనిపించట్లేదూ?

గార్డెన్‌లో కూర్చుందామా!

కిటికీ, బాల్కనీ, టెర్రస్, గార్డెన్... ఇంటినుంచే బాహ్య ప్రపంచానికి దగ్గరయ్యేలా చేస్తాయివి. ఇక్కడ గాలీవెలుతురూ తగినంతగా అందడమే కాకుండా, పచ్చదనంతోపాటు పక్షుల్నీ వీక్షించే వెసులుబాటు ఉంటుంది. వీటివల్ల కలిగే ఉత్సాహమే వేరు.



అందుకే గార్డెన్, బాల్కనీ, టెర్రస్‌లను కేవలం మొక్కలు పెంచే చోటుగానే కాకుండా, మరో లివింగ్ రూమ్‌గా మార్చుతున్నారు. పొద్దున్నే కూర్చొని కాఫీ తాగడానికి, యోగా, ధ్యానం చేసుకోవడానికి, అతిథులకు ఆతిథ్యం ఇవ్వడానికి, కుటుంబ సభ్యులు మాట్లాడుకోవడానికి, సాయంత్రాలు కూర్చొని సేదదీరడానికి అనుకూలమైన చోటిది. కాబట్టి వీటి అలంకరణ కూడా కీలకమే. హ్యాండిక్రాఫ్టెడ్ ఫర్నిచర్, వేర్వేరు రంగులూ, ఆకారాలూ, సైజుల్లో కుండీలు ఉండాలి. వాటిలో విభిన్నమైన మొక్కలూ పెంచాలి. లైటింగ్ కూడా ముఖ్యమే. చిన్న బాల్కనీ, పెద్ద గార్డెన్... ఏది ఉన్నా కూడా... ఒక లో బెంచ్, ఎర్తీ కుషన్స్, టేబుల్ మీద లాంతరు, నేలమీద ఒక కార్పెట్, టేబుల్‌పైన పుస్తకాలు... ఇవన్నీ కొత్తలుక్‌ని తెస్తాయి. రోజంతా కంప్యూటర్‌లకు అతుక్కుని పనిచేసి, సుదూరాలు ప్రయాణించి... ఇంటికి చేరాకైనా కాసేపు సేదదీరేందుకు ఇవి కావాల్సిందే. ఎందుకంటే ప్రకృతి ఒకరకమైన థెరపిస్టు కూడా. మొక్కల్ని నాటడం వాటి బాగోగులు చూసుకోవడంద్వారా మనల్ని మనం రీఛార్జ్ చేసుకోవచ్చు.

అంబాసిడర్‌గా... సారా





అందం, తెలివి, అణుకువ వీటన్నింటినీ మించిన సేవాగుణం... సారా తెందుల్కర్ సొంతం. ఇవే ఆమెకు ఇన్‌స్టాలో కోట్ల ఫాలోయర్లను సంపాదించి పెట్టాయి. ఆస్ట్రేలియా పర్యటక రంగం చేస్తోన్న క్యాంపెయిన్‌కి... భారత్ తరపున బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించే అవకాశాన్నీ దక్కించుకునేలా చేశాయి. అమ్మాయిలంతా పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్)ను చూసి భయపడుతోంటే... తను పీసీఓఎస్ వారియర్‌నని చెప్పడమే కాదు, దాన్నుంచి బయటపడటానికి తీసుకున్న జాగ్రత్తలేంటో పలు వేదికల మీద పంచుకుందామె. దాంతో దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్ కూతురుగానే కాకుండా... తన కంటూ ప్రత్యేక గుర్తింపుని తెచ్చుకుంది సారా. అది మొదలు... పలు జాతీయ, అంతర్జాతీయ స్కిన్‌కేర్ బ్రాండ్‌లకు మోడల్‌గా వ్యవహరించిందామె. క్లినికల్ అండ్ పబ్లిక్ హెల్త్ న్యూట్రిషన్‌లో పట్టా పొందింది సారా. ఇటీవల సచిన్ తెందుల్కర్ ఫౌండేషన్‌కు డైరెక్టర్‌గా బాధ్యతలనూ తీసుకుంది. 1.1 లక్షలమంది పేద పిల్లలకు క్రీడలు, ఆరోగ్యం, విద్య సంబంధిత విషయాల్లో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సహాయపడిందీ సంస్థ. 'అమ్మానాన్నల సేవా దృక్పథాన్ని కొనసాగించి, విస్తరించడమే నా లక్ష్య'మనే సారా... మాతాశిశు ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం లాంటి విషయాల్లోనూ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ పనులన్నింటితో యువతలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ఆ క్రేజ్‌ను చూసే... కొన్ని మిలియన్లు ఖర్చుపెట్టి చేస్తోన్న 'కమ్ అండ్ సే జీ-డే (గుడ్ డే) క్యాంపెయిన్'కి ఆమెను ఎంపిక చేసుకుంది ఆస్ట్రేలియా. టీవీ, యూట్యూబ్, డిజిటల్ పోస్టర్ల సహాయంతో అక్కడి అందాలకి ప్రచారకర్తగా వ్యవహరిస్తుంది సారా. సిడ్నీ, మెల్‌బోర్న్, గ్రేట్ బారియర్ రీఫ్ లాంటి ప్రముఖ ప్రాంతాల గురించి వివరించే కార్యక్రమాల్లోనూ పాల్గొంటుంది. మొత్తమ్మీద ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వేదికగా తన అనుభవాల్ని పంచుకుని, అక్కడి పర్యటక రంగాన్ని ఎక్స్‌ప్లోర్ చేస్తుంది మన సారా.

మీకు తెలుసా?

మనదేశంలో టీనేజ్ పిల్లల్లో 82 శాతం కంటే ఎక్కువమందికి స్మార్ట్‌ఫోన్‌ని ఉపయోగించటం తెలుసట. అయితే, దాన్ని విజ్ఞానాన్ని పెంచుకోవటానికి వాడేది 57శాతం మాత్రమేనని యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్(ఏఎస్ఈఆర్) అధ్యయనాలు చెబుతున్నాయి.

బంగారం - వెండి



5న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,04,000	94,100	1,16,860
విజయవాడ	1,00,590	93,700	1,15,800
ప్రొద్దుటూరు	1,00,300	92,280	1,15,700
రాజమహేంద్రవరం	1,02,220	93,700	1,25,000
విశాఖపట్నం	1,01,850	93,700	1,25,000
తమిళనాడు	-----	93,700	1,25,000

జుట్టుని మెరిపించే మందారం!



నల్లగా, ఒత్తుగా, పొడవుగా ఉండే... శిరోజాలంటే మీకూ ఇష్టమేనా? అయితే, మందారంతో జుట్టుకి పోషణ అందించండి చాలు. అదెలాగంటారా?

- మందార పువ్వులు, ఆకుల్లో అమైనో ఆమ్లాలు, వివిధ రకాల పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కుదుళ్లను బలంగా మార్చి జుట్టు ఎదుగుదలను ప్రోత్సహిస్తాయి.
- జుట్టు పొడిబారి నిర్జీవంగా కనిపిస్తోందా? అయితే, మందార పూలను మెత్తగా రుబ్బి దానికి కాస్త పెరుగు కలిపి తలకు రాయండి. అరగంటయ్యాక ఈ ప్యాక్‌ను కడిగేస్తే సరి. చివర్లు చిట్లకుండా ఉంటాయి. జుట్టు రాలడమూ తగ్గుతుంది.
- మందార పువ్వుల్ని పేస్ట్ చేసి అందులో కాస్త నిమ్మరసం పిండి... తలకు రాయండి. ఈ ప్యాక్ సహజంగా కురులకు తేమను అందించడమే కాదు.. చుండ్రునీ తగ్గిస్తుంది. త్వరగా తెల్ల జుట్టు రాకుండా ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు యూవీ కిరణాల నుంచి రక్షణ కల్పిస్తాయి.

అందుకు... ఉద్యోగం మానేయాలా?

నేనో వర్కింగ్ మదర్‌ని. ఇద్దరు పిల్లలు. ఆఫీస్‌లో చేయాల్సిన పనుల జాబితానే చాలా ఉంటుంది. ఇంటి పనుల కోసం అసలు సమయం ఉండదు. ఇల్లు, ఆఫీస్... రెండింటి పనులూ చేయాలంటే అలసిపోతున్నా. నా భర్త నుంచి ఎలాంటి సాయమూ ఉండదు. దీని గురించి తనతో చెప్తే 'ఉద్యోగం మానెయ్' అంటున్నారు. నాకు నా జాబ్ అంటే ఇష్టం. ఈ ఓవర్‌వర్క్ ఫీలింగ్ నుంచి తప్పించుకునేదెలా? - ఓ సోదరి

డియర్ వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

నిజానికి ఇది మీ ఒక్కరి సమస్య కాదు, చాలామంది ఆడవాళ్లదీ ఇదే ఇబ్బంది. ఈ పరిస్థితి మారాలంటే... ముందు మీ టైమ్ టేబుల్‌ని మార్చుకోవాలి. ప్రాధాన్యతకు తగినట్లు పనుల విభజన చేసుకోండి. 'తప్పనిసరిగా చేయాల్సినవి', 'కాస్త ఆలస్యమైనా పర్లేదు'... ఇలా పనుల్ని విభజించుకోండి. అనవసరమైన పనుల కోసం అధిక సమయాన్ని కేటాయిస్తున్నారేమో చెక్ చేసుకోండి? అలానే, మిగతా పనులకీ, ఒక్కోదానికి ఎంత సమయం వెచ్చిస్తున్నారో చూసుకోండి. ప్రాక్టికల్‌గా ఆలోచించి, టైమ్ సెట్ చేసుకోండి. ఎప్పుడైనా ఒకసారి అనుకోకుండా ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తే, దానికి తగినట్లు ప్రణాళిక వేసుకోండి. ఇంకో విషయం ఏంటంటే... ఏదైనా అసైన్‌మెంట్ లేదా అదనపు ప్రాజెక్టులను ఒప్పుకొనే ముందే ఇది నేను చేయగలనా? అని ఆలోచించుకున్నాకే నిర్ణయం తీసుకోండి. ఇలా చేయటం వల్ల మీకూ ఒత్తిడిగా అనిపించదు. సమయమూ సర్దుబాటు అవుతుంది.

శోధిత

ఆ జ్ఞాపకాలు ఏమవుతాయ్?

అమ్మ కడుపులో మొదలవుతుంది బిడ్డ ప్రాణం. భూమ్మీదకు వచ్చాక, శిశువులుగా, పసిపిల్లలుగా అనేక విషయాలు నేర్చుకుంటారు. కానీ, పెరిగి పెద్దయ్యాక మన సంభాషణలన్నీ... 'ఊహ తెలిసినప్పటి నుంచి...' అంటూ మొదలవుతాయి. మరి అంతకు ముందు వరకూ చూసిన, విన్న, అనుభవించిన జ్ఞాపకాలు లేవా? అంటే ఉన్నాయి.... మరి అవేవీ మనకు ఎందుకు గుర్తుండవు?! ఈ అనుమానం మీకెప్పుడైనా వచ్చిందా? అందుకు 'ది నేచర్' పరిశోధనలు ఏం చెబుతున్నాయంటే... పసిపిల్లలుగా ఉన్నప్పటి విషయాలు గుర్తులేకపోవటాన్నే 'ఇన్‌ఫాంటైల్ అమ్నీసియా'గా పిలుస్తారు శాస్త్రవేత్తలు. ఈ పరిస్థితికి కారణం... అప్పటికి పిల్లల మెదడులోని హిప్పోక్యాంపస్, దీర్ఘకాల జ్ఞాపకాలు ఏర్పరచే బ్రెయిన్ నిర్మాణం పూర్తిగా అభివృద్ధి చెందకపోవడమేనట. పిల్లలకి మెమరీస్ ఉన్నప్పటికీ, దాన్ని మెదడు విశ్లేషించే తీరు కూడా పెద్దలకంటే భిన్నంగా ఉంటుందట. పైగా వేగంగా డెవలప్ అయ్యే న్యూరాన్లు, హిప్పోక్యాంపస్‌లో మార్పులూ కీలకపాత్ర పోషిస్తాయట. అంతేకాదు, జ్ఞాపకాలు గుర్తుతెచ్చుకునేందుకు కావాల్సిన భాషానైపుణ్యాలు, సెన్స్ ఆఫ్ సెల్ఫ్ వంటివి అప్పటికి వారిలో డెవలప్ అవ్వకపోవటమూ ఓ కారణమట. బయటి ప్రపంచాన్ని అర్థం చేసుకోవటం, కొత్త విషయాలు, భాషా నైపుణ్యాలు, సామాజిక బంధాలు, మోటార్ స్కిల్స్... వంటివి నేర్చుకోవటంపై మెదడు దృష్టి పెడుతుందట. ఈ డెవలప్‌మెంట్‌లో భాగంగా, వారి మెదడు పాత సమాచారాన్ని, జ్ఞాపకాలను మర్చిపోతుందట. అందుకే... పసి పిల్లలుగా ఉన్నప్పటి విషయాలు ఏవీ మనకు గుర్తుండవట.



తల్లిపాలకెంత తెలివో!

తల్లిపాలు తాగే శిశువులు తెలివిగా ఉంటారనీ సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతారనీ తెలిసిందే. కానీ మనకు తెలియనివి ఇంకా ఎన్నో. బిడ్డ బంగారు భవిష్యత్తుకు సాయపడే ఆ స్తన్యంలో సహజంగానే ఓ మ్యాజిక్ జరుగుతుంది. ప్రకృతి చేసే ఆ అద్భుతాలేంటో తెలుసుకుందామా...



- తల్లి పాలు తెలివైనవి. ఆశ్చర్యపోకండి... వీటికీ రాత్రీపగలూ తేడా తెలుసు మరి. జీవ గడియారాన్ని అనుసరిస్తూ... తల్లి ఉదయం ఇచ్చే పాలల్లో కన్నా రాత్రివేళ పాలల్లో మెలటోనిన్ ఎక్కువగా ఉంటుందట. పిల్లలు హాయిగా నిద్రపోయేందుకే ఈ ఏర్పాటు.
- ఏ ఇద్దరి వేలి ముద్రలూ ఒకలా ఉండనట్లే అందరు తల్లుల పాలూ ఒకేలా ఉండవు. ఎవరికి వాళ్లకే ప్రత్యేకం. ఆ బిడ్డ అవసరాలకు తగ్గట్లుగా రూపొందుతాయి. వీటిల్లోని పోషకాలూ అన్నివేళలా ఒకేలా ఉండవు. పాపాయి ఆరోగ్యం, ఇచ్చే సమయాన్ని బట్టి ఆ పాలల్లోని బయోయాక్టివ్ పదార్థాలైన హార్మోన్లు, రోగనిరోధక కారకాలు మారుతుంటాయి. తల్లి ఆరోగ్యం, తీసుకునే ఆహార ప్రభావం కూడా వీటిమీద ఉంటుంది.
- అమ్మ పాలు... ప్రొటీన్లు, కొవ్వులు, ఎంజైమ్‌లు, విటమిన్లు, ఖనిజాలు, ప్రొబయాటిక్స్... ఇలా వేలకొద్దీ పోషకాల సమాహారం. అందుకే ఆరునెలల వరకూ బిడ్డకు అవే సంపూర్ణాహారం. ఈ పాలల్లోని కొన్ని రకాల ఫ్యాట్స్ వల్ల అవి ఎక్కువగా తాగిన పిల్లల్లో కళ్లు మెరుగ్గా పనిచేస్తాయనేది ఓ అధ్యయనం.
- పాల ఉత్పత్తికి స్తన్యాల సైజుతో సంబంధం లేదు. పాపాయి ఎంత ఎక్కువగా పాలు తాగితే అంత ఎక్కువగా పాలు ఉత్పత్తి అవుతాయి. పాలు పడటం. క్షీర గ్రంథులమీద ఆధారపడి ఉంటుంది.
- తల్లిపాలు గొప్ప ఔషధం. తొలిసారి ఇచ్చే పాలల్లో (కొలొస్ట్రమ్) యాంటీబాడీలు సమృద్ధిగా ఉంటాయి. అందుకే మదర్ మిల్క్ బేబీకి తొలి వ్యాక్సిన్. పాపాయికి ఏమాత్రం ఆరోగ్యం బాగోకున్నా వాళ్లను కాపాడుకోవడానికి ఆ పాలల్లో మరింత ఎక్కువ రోగనిరోధక కణాలు ఉత్పత్తవుతాయట. అంటే- తల్లి స్తన్యం కస్టమైజ్‌డ్ ఔషధమన్నమాట.
- అమ్మ పాలల్లో 'హ్యూమన్ మిల్క్ ఆలిగోశాకరైడ్స్(హెచ్ఎంఓ)' అనే ప్రత్యేక కార్బోహైడ్రేట్లు ఉంటాయి. స్తన్యాన్ని అద్భుతం అనడానికి ఇవే ప్రధాన కారణం. హానికర బ్యాక్టీరియాని నిరోధించి మేలు చేసే బ్యాక్టీరియాని పెంచుతాయివి. అలాగే వీటిల్లోని ఇమ్యునోగ్లోబ్యులిన్లు తరచూ ఇన్ఫెక్షన్లు రాకుండా బిడ్డ జీవితాంతం ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడతాయి.
- బిడ్డకు తొలి రుచుల్ని పరిచయం చేసేదీ అమ్మ పాలే. తల్లి ఎంత ఆరోగ్యకరమైన ఆహారం తింటే, బేబీ అంత చక్కగా ఆస్వాదిస్తుంది. ఎక్కువ కూరగాయలూ పండ్లూ తింటే పాపాయి కూడా వాటిని ఇష్టపడుతుందనీ, ఈ అలవాటు జీవితాంతం ఉంటుందనీ 'ఇంటర్నేషనల్ మిల్క్ జీనోమిక్స్ కన్సార్టియం' తెలిపింది. అందుకేమరి... అమ్మలూ పాలిచ్చేటప్పుడు ఆహారంలో జాగ్రత్తలు పాటించాల్సిందే.
- అమ్మ స్తన్యం ఎంత గొప్పదంటే... మగబిడ్డ కోసం 25 శాతం ప్రొటీన్లూ, కొవ్వులూ ఎక్కువగా ఉండేలా... అంటే- దాదాపు 200 క్యాలరీల శక్తి ఎక్కువున్న పాలను ఉత్పత్తి చేస్తుందట. ఆడబిడ్డ అయితే ఎక్కువ పరిమాణంలో పాలను ఉత్పత్తి చేస్తున్నట్లు కొన్ని అధ్యయనాల్లో తేలింది. ఇవన్నీ చూస్తుంటే... సృష్టి ధర్మం ఎంత గొప్పదో అనిపించట్లేదూ!

– డా. చీపురుపల్లి వసుంధర, సీనియర్ గైనకాలజిస్ట్

వాళ్ల సురక్షితం కోసమే... సౌక్ష్య!





జలుబు దగ్గర్నుంచి ఏ చిన్న అనారోగ్యమొచ్చినా బయటకు చెబుతాం. కానీ నెలసరి సమస్యల్ని మాత్రం రహస్యంగా దాచడానికే చూస్తాం. ఈ పరిస్థితిలో మార్పు తేవాలనుకుంది విశ్వనాథుల మౌనిక. 'సౌక్ష్య' పేరుతో సంస్థను ప్రారంభించి, ఆ దిశగా కృషి చేస్తోంది కూడా!

ఓసారి కళాశాలలో రుతుస్రావమైంది. దుస్తులకు మరకలు అంటడం చూసి, 'బ్యాగో గొడుగో అడ్డుపెట్టుకుని వెళ్లు' అని స్నేహితులు సలహా ఇచ్చారు. అప్పుడే జ్వరం, జలుబు ఇలా ఏదొచ్చినా బయటకు చెబుతాం. మరి నెలసరి, దానికి సంబంధించిన సమస్యలను మాత్రం ఎందుకు దాయాలి? చిన్న దెబ్బ తగిలి రక్తమొస్తే అయ్యో అంటారు కదా! దీన్ని మాత్రం ఎందుకు పట్టించుకోరు? ఇలా ఎన్నో సందేహాలు. ప్రతి అమ్మాయీ దీనిపై ధైర్యంగా మాట్లాడినప్పుడే పరిస్థితిలో మార్పు వస్తుంది. అందుకోసం ఏదైనా చేయాలనుకున్నా. మాది నల్గొండ జిల్లా నకిరేకల్. అమ్మానాన్నలు రమాదేవి, వజ్రాచారి. పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివా. ఆపై బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తిచేశా. ప్రస్తుతం 'యాగ్లోటెక్' అనే అంకుర సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నా.

ఉద్యోగంలో చేరాక నా లక్ష్యంపై దృష్టిపెట్టా. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద బాలికల సురక్షిత జీవనమే లక్ష్యంగా మూడేళ్ల క్రితం 'సౌక్ష్య' ప్రారంభించా. మా సంస్థ, సోషల్ యాక్టివిస్ట్ శ్రీపాది నందన్, ఓ ఎన్జీఓ, కొందరు స్నేహితులతో కలిసి దీన్ని నిర్వహిస్తున్నా. సౌక్ష్య ద్వారా నల్గొండ జిల్లా నకిరేకల్, తాటికల్, మంగళపల్లి, చందుపట్ల పాఠశాలల్లోని ప్రభుత్వ విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్లు ఉచితంగా అందజేస్తున్నాం. ఏటా రెండు సార్లు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశాం. ఇవి పాఠశాల హెచ్ఎం, ఓ ఉపాధ్యాయురాలి ఆధ్వర్యంలో ఉంచుతాం. బాలికలు అవసరమైనప్పుడు వాటిని తీసుకోవచ్చు. ఏటా ఒక పాఠశాలను పెంచుకుంటూ వెళ్లాలనేది లక్ష్యం. ఇందుకు అవసరమయ్యే నిధులు మా వేతనాల నుంచే సమకూర్చుతున్నాం. ఇవేకాదు, నెలసరి సందేహాలనూ తీరుస్తున్నాం. తొలిరోజుల్లో విద్యార్థినులు మాట్లాడటానికే సంకోచించేవారు. ఎన్నో ప్రయత్నాల తరవాత వారిలో మార్పు కనిపిస్తోంది. లైంగిక వేధింపులు, గుడ్, బ్యాడ్ టచ్ వంటివాటిపై అవగాహన కల్పిస్తున్నా. వేధింపులు ఎదురైనప్పుడు ధైర్యంగా ఫిర్యాదు చేసేలానూ వారిని సిద్ధం చేయాలనుకుంటున్నా. నెలసరి ఆరోగ్యం, బాలికలపై హింస, లైంగిక వేధింపుల నిరోధంపై 'మెలడీస్ అండ్ హార్మనీస్', 'సౌండ్ ఆఫ్ సైలెన్స్' అనే పుస్తకాలు కూడా రాశాను. ఈ క్రమంలో అవార్డులూ అందుకున్నా. సౌక్ష్య పేరు వింటే.. ఆప్యాయత, భద్రత, ఆరోగ్యం గుర్తుకు వచ్చేలా సంస్థను తీర్చిదిద్దాలన్నది నా ఆశయం.

– ఇనుగుర్తి రాంబాబు, నకిరేకల్

ఇంట్లోనే పిండిమర...

స్మార్ట్ కిచెన్

టెక్నాలజీ, సృజనాత్మకతలను జోడిస్తేనే కదా... పనిలో వేగం పెరిగేది. అలా వంటింటి పనుల్ని చిటికెలో చేసేందుకు సాయపడేవే ఈ పరికరాలు కూడా...

పాడవ్వవిక...





కూరగాయలు, పండ్లు, పాలు... తరవాత వాడుకోవచ్చులే అని ఫ్రిజ్‌లో పెట్టేస్తాం. రోజులు గడుస్తాయ్ కానీ, వాటిని మాత్రం వాడం. తీరా ఎప్పుడో చూసి, మళ్లీ డస్ట్‌బిన్‌లో వేసేయాల్సిందే. అలాకాకుండా, మనకు ఎప్పటికప్పుడు పాడవుతున్నాయన్న ముందస్తు సమాచారం వస్తే... బావుంటుంది కదా! అయితే, ఈ 'స్మార్ట్ ఫ్రిజ్ కెమెరా'ను తీసుకురండి. దీన్ని ఫ్రిజ్ డోర్‌లో అమరిస్తే, దాన్లోని ట్రాకర్, ఎన్ని రోజుల్లో వాడాలో ఫోన్‌కి నోటిఫికేషన్ పంపిస్తుంది. ఫుడ్ వృథా కాదు... బావుంది కదా!



చిందకుండా...

కూరలు, వేపుళ్లు చేసేటప్పుడు మధ్యమధ్యలో మూత తీస్తూ, కావాల్సిన పదార్థాలు వేస్తూ ఉండాల్సి ఉంటుంది. ఈ సమయంలో చింది పడే ప్రమాదమూ ఉంటుంది. ఆ ఇబ్బంది లేకుండా చేస్తుందీ 'ఫోల్డబుల్ స్ప్లాష్‌గార్డ్'. పూర్తిగా మూత తెరవకుండా మడిచేలా ఉంటుంది ఇది. అవసరమైనప్పుడు ఫోల్డ్ చేసి, కావాల్సిన పదార్థాలు వేసుకోవచ్చు, కలియబెట్టుకోవచ్చు.





ఎప్పటికప్పుడు ఆడించేలా...



మిక్సీలో వేసిన దానికీ, మరలో వేసిన పిండికీ రుచిలో తేడా ఉంటుందంటారు కదా! మరి ప్రతిసారీ, బయటకెళ్లి మర పట్టించటమూ కష్టమే. అలాకాకుండా, ఎప్పటికప్పుడు కాస్త కాస్త పిండి మర పడితే బావుంటుంది. పైగా పాడవ్వదు. అందుకోసం ఉపయోగపడుతుందీ 'గ్రెయిన్ మిల్'. మిల్లెట్స్, మసాలాలు, గోధుమలు... ఇలా అన్నింటినీ మర పట్టేయొచ్చు.



ఉద్యోగం పోయి దొంగగా మారి..



పుణె: మణిపుర్‌కు చెందిన మాజీ టెకీ సంగ్ బోయ్ కామ్ సెర్టో (40) పుణెలోని ఓ బ్యాంకు మేనేజరు ఇంట్లోకి కొరియర్ ఏజెం టులా చొరబడి దోపిడీకి ప్రయత్నించాడు. మేనేజరు కుమారుడి తలకు తుపాకీ గురి పెట్టి బెదిరించాడు. అలవాటు లేని పని కదా.. ఇట్టే దొరికిపోయాడు. ఆ ఇంట్లో ఉన్న మరో వ్యక్తి అతణ్ని పట్టుకొని పోలీసు లకు అప్పగించాడు. పుణెలోనే ఉంటున్న సంగ్‌బోయ్ ఉన్న ఉద్యోగం పోయి, రెండు ఫ్లాట్లకు ఈఎంఐలు కట్టాల్సిన ఒత్తిడిలో ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

కటకటాల్లోకి మున్నాభాయ్



గువాహటి: అస్సాంలోని శ్రీభూమి జిల్లాకు చెందిన పులోక్ మలాకర్ నకిలీ ధ్రువపత్రాలతో వైద్యుడి అవతారమెత్తాడు. సిల్చార్‌లోని రెండు ప్రైవేటు ఆస్పత్రుల్లో గైనకాలజిస్టుగా పనిచేస్తూ 50కు పైగా సర్జరీలు చేశాడు. అతడి తీరుపై అనుమానంతో పోలీసులకు కొందరు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తులో బండారం బయటపడింది. సిల్చార్‌లోని ఆస్ప త్రిలో సర్జరీ చేస్తుండగా.. సోమవారం పోలీ సులు ఈ 'మున్నాభాయ్ ఎంబీబీఎస్'ను అరెస్టు చేశారు. గత పదేళ్లుగా ఈ నకిలీ వ్యవహారం కొనసాగుతోంది.

అమెరికాకొస్తే బాండ్ బాజా



న్యూయార్క్: అమెరి కాకు బీ1, బీ2 వీసాలపై వచ్చే పర్యాటకులు, వ్యాపారులపై బాండ్ పిడుగు పడనుంది. వారు నిర్దేశిత కాలాన్ని మించి అమెరికాలో ఉండకుండా నియంత్రించేందుకు ఈ బాండ్ విధానాన్ని తీసుకురావాలని అగ్ర రాజ్యం భావిస్తోంది. కొత్త విధానం ప్రకారం.. ఇక నుంచి అమె రికాకు రావాలనుకునేవారు.. రూ.13.17 లక్షల (15,000 డాలర్లు) బాండును సమ ర్పించాల్సి ఉంటుంది. దీనిని తొలుత పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది.

మంత్రిగారి నోటి దురుసు



ఇంటర్నెట్ డెస్క్: "గంగమ్మతల్లి తన బిడ్డల పాదాలు కడగడానికి వస్తుంది. వరదల్లో చనిపోతే నేరుగా స్వర్గానికి పోతారు".. యూపీ మంత్రి సంజయ్ నిషాద్ (60) చేసిన ఈ వ్యాఖ్యలతో వరద బాధితులు కంగుతిన్నారు. కాన్పుర్ గ్రామీణ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పర్యటించగా.. బాధితులు తమ గోడు వెళ్ల బోసుకున్నారు. అంతా విని మంత్రి చెప్పిన మాటలతో వారు అవాక్కయ్యారు. సంజయ్ అధ్యక్షుడిగా నిషాద్ పార్టీ యోగీ సర్కారులో భాగస్వామ్య పక్షంగా ఉంది.

సుందర ధరాలీ చిందరవందర

పర్యాటకుల విడిది ప్రాంతంలో పెను విషాదం



ఎత్తైన పర్వత సానువుల్లో ఉన్న ధరాలీ.. ఉత్తరాఖండ్‌లోని సుందర మైన ప్రాంతాల్లో ఒకటి. గంగోత్రి యాత్రకు వెళ్లే ప్రయాణికులకు విడిది.. ఆ ప్రాంతం ఇప్పుడు ఒక్క వరదతో తుడిచిపెట్టుకుపోయి తీవ్ర విషాదాన్ని నింపింది.


కేవలం గంట వ్యవధిలో సముద్రం వచ్చి మీద పడిందా అన్న స్థాయిలో మేఘం విరు చింది. దీంతో భారీ బురద వరద ధరాలీని కప్పేసింది. ఫలితంగా ఇప్పుడు ఆ ప్రదేశం మరు భూమిని తలపిస్తోంది.

ఎక్కడుందీ ప్రాంతం?

చార్‌ధామ్ యాత్రికులు ఎక్కువగా ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. యాపిల్ పండ్లకు ప్రసిద్ధి చెందిన ఉత్తరాఖండ్‌లోని హర్షిల్ లోయ ఇక్కడకు సమీపంలో ఉంది. రిషికేశ్ నుంచి బయల్దేరి చంబా, ఉత్తర కాశీ, హర్షిల్ మీదుగా ఇక్కడికి వెళ్లవచ్చు. సముద్ర మట్టానికి దాదాపు 2,680 మీటర్ల ఎత్తున ఈ ప్రదేశం ఉంది. ఇక్కడి నుంచి గంగోత్రి కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ధరాలీ గ్రామం మధ్య నుంచి భారీ రహ దారి వెళుతుంది. చార్‌ధామ్‌సహా ఇతర తీర్థ యాత్రల సీజన్‌లో ఈ గ్రామానికి సందర్శ కులు భారీ సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ పెద్ద సంఖ్యలో హోటళ్లు, అతిథి గృహాలు న్నాయి. తక్కువ ధరలకే వసతి లభిస్తుంది కూడా. యాత్రికులు వీటివైపు మొగ్గుచూపు తారు. ఇక్కడి నుంచి 32 కిలోమీటర్ల దూరంలో నీలాంగ్ లోయ ఉంది. భారత్-టిబెట్ మధ్య వ్యాపారం జరిగే ఈ లోయలో రాత్రిళ్లు బస చేయడానికి అనుమతి లేదు. ఈ ప్రదేశాలు వీక్షించాలన్న అటవీశాఖ అనుమతి ఉండాలి. దీంతో ఇక్కడికి వచ్చే వారు ధరాలీలో ఉంటారు. కేదార్ తాల్ ప్రదేశానికి ట్రెక్కింగ్‌కు వెళ్లేవారికి ఈ ప్రాంతం బేస్‌క్యాంప్‌గా ఉంటుంది. ధరాలీ సమీపంలోని ఖీర్ గడ పరీవాహక ప్రాంతంలో భారీ వర్షం కారణంగా నీరు నిలిచింది. ఇది ఒక్కసారిగా ధరాలీ మార్కెట్ ప్రాంతంపై విరుచుకుపడింది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత



దిల్లీ: జమ్మూకశ్మీర్ సహా పలు రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేసిన సత్యపాల్ మాలిక్(79) కన్నుమూశారు. దీర్ఘకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధ పడుతున్న ఆయన దిల్లీలోని రామ్ మనో హర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడి చారు. మాలిక్ ఆగస్టు 23, 2018 నుంచి అక్టోబరు 30, 2019 వరకు జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పనిచేశారు. ఆయన పదవీకాలం లోనే.. అధికరణ 370 రద్దయింది. జమ్మూక శ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించారు. రెండు ప్రాజెక్టులకు సంబం ధించి కొందరు తనకు లంచం ఇవ్వాలని చూశారని ఆయన గతంలో ఆరోపించారు. పుల్వామా ఉగ్రదాడి సంబంధించిన పలు అంశాలపై కేంద్రాన్ని ప్రశ్నించారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

ప్రతిపక్షాలది స్వీయ విధ్వంసం



● ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ భేటీలో మోదీ వ్యాఖ్య

దిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు పట్టుబట్టి విపక్షాలు తమను తామే దెబ్బతీసు కున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. పార్లమెంటులో ఈ అంశంపై ప్రత్యేక చర్చలో ప్రతిపక్ష నేతలు ప్రభుత్వం ముందు నిలవలేక ఓటమి పాలయ్యారన్నారు. ప్రభు త్వాన్ని ప్రశ్నించడానికి వచ్చిన ఒకేఒక్క అవ కాశాన్ని కూడా వారు వినియోగించుకోలేకపో యారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మంగళ వారం ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావే శంలో ప్రధాని ప్రసంగించారు. దేశ భద్రత విషయంలో విపక్షాల ధోరణి, నేతల్లో అభి ప్రాయ భేదాలు పార్లమెంటు చర్చలో బయట పడ్డాయని, ఇలాంటి ప్రతి పక్ష నేతలను ఇంకెక్కడా చూడలేదని వ్యాఖ్యానించారు. ఎప్పుడూ రాజ్యాంగం గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలు తాము అధికారంలో ఉన్నప్పుడు జమ్మూకశ్మీర్‌లో దానిని అమలుచేయలేదని విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో కూటమిలోని పార్టీల కంటే భాజపా బలహీనంగా ఉందని, అలాంటిచోట ఎన్డీయే పక్షాలు వివిధ కార్యక్రమాల్లో ఉమ్మ డిగా పాల్గొనాలని సూచించారు. దేశ సార్వ భౌమత్వం, రక్షణల గురించి చిన్నపిల్లాడిలా, నిరాధారంగా వ్యాఖ్యలు చేసే నేతకు సుప్రీం కోర్టు తగిన పాఠం చెప్పిందని పరోక్షంగా రాహుల్‌గాంధీని విమర్శించారు.

రూ.67వేల కోట్ల ఆయుధాలకు సై

దిల్లీ: భారత సైనిక దళాలను బలోపేతం చేస్తూ రక్షణశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.67వేల కోట్ల విలువైన ఆయుధాల కొనుగో లుకు పచ్చజెండా ఊపింది. వీటిలో దీర్ఘశ్రేణి డ్రోన్లు, పర్వతాల్లో మోహరించే రాడార్లు, క్షిపణి వ్యవస్థలు ఉన్నాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మంగళవారం ఇక్కడ జరిగిన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

● భారత నౌకాదళం కోసం చిన్నపాటి అటా నమస్ సర్ఫేస్ క్రాఫ్ట్, బ్రహ్మోస్ ఫైర్ కంట్రోల్ సిస్టమ్, లాంచర్ల కొనుగోలు, బరాక్-1 క్షిపణి రక్షణ వ్యవస్థ ఆధునికీకరణకు డీఏసీ పచ్చ జెండా ఊపింది.

● భారత వైమానిక దళం కోసం పర్వత ప్రాంత రాడార్లు, సక్షమ్/ స్పైడర్ ఆయుధ వ్యవస్థను ఆధునికీకరించి సమీకృత వాయు ఆదేశిక, నియంత్రణ వ్యవస్థతో అనుసంధానించ డానికి ఆమోదం లభించింది.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

మీ ఎదుగుదలను అడ్డుకునేది మీరే!



మీరు జీవితంలో సరైన ఎదుగుదల లేకుండా ఉన్నచోటే ఉండిపోతున్నారా..? అందుకు కారణం మీ ఉద్యోగమో, తల్లిదండ్రులో, పరిస్థితులో కాదు.. మీరే! చేయాల్సిన పనిని చేయాల్సిన సమయంలో చేయకుండా.. నిత్యం కంఫర్ట్‌గా ఉండటానికి మీరు మొగ్గుచూపుతుండటమే మీ ఎదుగుదలను అడ్డుకుంటోందన్న కఠిన వాస్తవాన్ని గుర్తించండి.

– రాజ్ శామనీ, మోటివేషనల్ స్పీకర్

అమిత్ షా.. హోంశాఖ బాద్‌షా



దిల్లీ: అత్యధిక కాలం కేంద్ర హోం మంత్రిగా పనిచే సిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. ఆయన పదవి చేపట్టి మంగళవారానికి 6 సంవత్సరాల 68 రోజులు పూర్తయ్యాయి. అంతకు ముందు అత్య ధిక కాలం కేంద్ర హోం మంత్రిగా పని చేసిన నాయకుడిగా ఎల్.కె.ఆడ్వాణీ (6 ఏళ్ల 64 రోజులు) నెలకొల్పిన రికా ర్డును అమిత్ షా అధిగమించారు. 2,258 రోజుల పాటు ఈ పదవిలో సాగిన అమిత్ షా ఖాతాలో అనేక విజయాలు నమోదయ్యాయి. జమ్మూక శ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన 370వ రాజ్యాంగ అధికరణం రద్దు, బ్రిటిష్ కాలం నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో మూడు న్యాయ సంహితల అమలు వంటి కీలక ఘట్టాలు ఆయన చేతుల మీదుగా జరిగాయి. ఆయన హయాంలో ఈశాన్య రాష్ట్రాల్లో పది వేల మంది మిలిటెంట్లు లొంగిపోయా రని అధికార వర్గాలు తెలిపాయి. అత్యధిక కాలం కేంద్ర హోం శాఖను నిర్వహించిన వ్యక్తిగా రికార్డు సృష్టించిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన చిరకాల సహచరుడు అమిత్ షాను ప్రశంసించారు.

గిరిజన నేతకు కన్నీటి వీడ్కోలు



పలు దశాబ్దాల పాటు జాతీయ రాజకీయాలపై ప్రభావం చూపిన గిరిజన నాయకుడు, ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్‌కు మంగళవారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. ఆయన స్వగ్రామమైన రామ్‌గఢ్ జిల్లా నెమ్రా గ్రామంలో జరిగిన అంత్యక్రియలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీతో పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు జాతీయ నాయకులు, వేలమంది అభిమానులు, కార్యకర్తలు హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు.

విద్యా సంస్థలకైనా సరే మినహాయింపులొద్దు




● పర్యావరణ ప్రభావ మదింపు అనుమతులపై సుప్రీంకోర్టు తీర్పు

దిల్లీ: 'ఇరవై వేల చదరపు మీటర్లకు మించిన విస్తీర్ణంలో చేపట్టబోయే ఏ నిర్మాణానికైనా ముందుగా పర్యావరణ ప్రభావాన్ని మదింపు చేసిన తర్వాతే అనుమతులివ్వాలి. పారిశ్రామిక కట్టడ మైనా, విద్యా సంస్థల భవనాలైనా, ఇంకా మరేదైనా అవసరం కోసం చేపట్టే నిర్మాణమైనా సరే... పర్యావరణ ప్రభావ మదింపు (ఈఐఏ)-2006 చట్టం నుంచి మినహాయింపు ఇవ్వరాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం పేర్కొంది. అడ వులు, పర్యావరణ మార్పుల మంత్రిత్వ శాఖ గత జనవరి 29న జారీ చేసిన నోటిఫికేషన్‌లోని వివాదా స్పద నిబంధన (8)ను కొట్టివేసింది. ఈ నిబంధన ప్రకారం 1,50,000 చద రపు మీటర్ల విస్తీర్ణం వరకు నిర్మించే పారిశ్రామిక షెడ్లు, పాఠశాలలు, కళా శాలలు, హాస్టళ్లకు పర్యావరణపరమైన ముందస్తు అనుమతులు అవసరంలే దని ప్రభుత్వం పేర్కొంది.

ఆ తీర్పు... ఘోర తప్పిదం

● సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యల సమర్థింపుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

● అలహాబాద్ హైకోర్టు జడ్జిపై చర్యలకు ఆదేశం



దిల్లీ: సివిల్ వివాదంలో క్రిమినల్ స్వభావ సమన్లను సమర్థించిన అలహాబాద్ హైకోర్టు జడ్జిపై సర్వోన్నత న్యాయస్థానం అసాధారణ రీతిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ న్యాయమూర్తి వెలువరించిన తీర్పును ఘోర తప్పిదంగా పేర్కొంది. న్యాయ నిబంధనలపై అవ గాహన లేమిని క్షమించలేమని తెలి పింది. పదవీ విరమణ వరకు ఆ జడ్జిని క్రిమినల్ కేసుల విచారణకు దూరంగా ఉంచాలని జస్టిస్ జె.బి.పార్దీ వాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మా సనం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సూచించింది. ఆ జడ్జి ఏ ధర్మాసనంలో ఉన్నా మరో సీనియర్ జడ్జితో కలిసి ఆసీనులు కావాలని స్పష్టం చేసింది. గడువు ముగిసినా తమకు బకాయిపడిన మొత్తాన్ని శిఖర్ కెమికల్స్ కంపెనీ చెల్లించలేదంటూ దానిని రాబట్టుకోవడం కోసం లలితా టెక్స్‌టైల్స్ సంస్థ క్రిమినల్ కంప్ల యింట్ దాఖలు చేసింది. దీనిపై మేజిస్ట్రేట్ కోర్టు జారీ చేసిన సమన్లను శిఖర్ కెమికల్స్.. హైకో ర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. పరిష్కారానికి సమయం పడు తుందనే కారణంతో సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలను హైకోర్టు జడ్జి సమర్థించారు. దీంతో శిఖర్ కెమికల్స్ సర్వోన్నత న్యాయస్థా నానికి వెళ్లింది. సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలను హైకోర్టు జడ్జి సమ ర్థించడం తమను దిగ్భ్రాంతికి గురిచేసిం దని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం పేర్కొంది. ఇది న్యాయ ప్రక్రియను దుర్వినియోగ పరచడమేనని స్పష్టం చేసింది. హైకోర్టు జడ్జి తీర్పులోని వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టింది. సివిల్ సమస్యల పరిష్కారానికి క్రిమినల్ చట్టాలను ఉపయోగించలేమని తెలి పింది. వివాదాస్పద తీర్పును ఉపసంహరించుకుని ఈ కేసును మరో జడ్జికి కేటాయించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆదేశించింది.

పీసీబీలకు ఆ అధికారం ఉంది

● నష్టపరిహారం విధింపునకు సుప్రీంకోర్టు సమర్థన

దిల్లీ: దేశంలోని కాలుష్య నియంత్రణ మండళ్ల (పీసీబీ) అధికారాలకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. పర్యా వరణ పరిరక్షణ కోసం ముందస్తు జాగ్రత్తలు తీసు కోవడంతో పాటు జరిగిన హానికి నష్టపరిహారాన్ని విధించే అధికారం పీసీబీలకు ఉందని స్పష్టం చేసింది. నష్టనివారణ చర్యలకు ఆదేశించడంతో పాటు పరిహార మొత్తాలను వసూలు చేయవ చ్చని, బ్యాంకుల హామీల రూపంలోనూ వాటిని ముందుగానే సేకరించవచ్చని జస్టిస్ పి.ఎస్.నర సింహా, జస్టిస్ మనోజ్ మిశ్ర ధర్మాసనం పేర్కొంది. జల, వాయు చట్టాల్లోని నిబంధనల ప్రకారం పీసీబీలకు ఈ అధికారాలు రాజ్యాంగబ ద్ధంగా సంక్రమించాయని తెలిపింది. అయితే, ఈ ప్రక్రియ అంతా చట్టనిబంధనలను, సహజ న్యాయ సూత్రాలను పాటిస్తూ పారదర్శకంగా నిర్వహించా లని ధర్మాసనం పేర్కొంది. పీసీబీల అధికారాలకు కళ్లెం వేస్తూ దిల్లీ హైకోర్టు 2012లో వెలువరించిన తీర్పును రద్దు చేసింది. పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ కాలుష్యాన్ని వెదజల్లే వ్యక్తులు తగిన మూల్యం చెల్లించాల్సిందేనని తెలిపింది.

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై సుప్రీంకోర్టు విచారణ 8న!

దిల్లీ: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పిం చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఈ నెల 8న సుప్రీంకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. ఈ వ్యాజ్యం విషయాన్ని మంగళ వారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది గోపాల్ శంక రనారాయణన్ ప్రస్తావించారు. సుప్రీంకోర్టు వెబ్‌సైట్ ప్రకారం... విచారణ 8న జరగనుం దని దీనిని తొలగించకుండా చూడాలని శంక రనారాయణన్ విజ్ఞప్తి చేయగా జస్టిస్ గవాయ్ అంగీకరించారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే అధికరణం 370ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి మంగళవారం నాటికి ఆరేళ్లు పూర్తయ్యాయి.

వైద్యుల భద్రత అంశంలో రాష్ట్రాల నివేదికలపై మీ వైఖరేమిటి?

జాతీయ కార్యదళాన్ని ఆదేశించిన సుప్రీం

దిల్లీ: ఆసుపత్రులలో వైద్యుల భద్రత కోసం, మహిళా సిబ్బందిపై దాడుల నిరోధానికి తీసుకోవా ల్సిన ప్రామాణిక చర్యలకు గాను రాష్ట్రాలు సమ ర్పించిన నివేదికలపై అభిప్రాయాన్ని తెలపాల్సిం దిగా జాతీయ కార్యదళాన్ని (ఎన్‌టీఎఫ్) సుప్రీం కోర్టు ఆదేశించింది. దీనికి 8 వారాల గడువు ఇస్తు న్నట్లు జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీ శ్వర్ సింగ్ ధర్మాసనం తెలిపింది. కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్యకళాశాల ఆసుపత్రిలో వైద్యవిద్యార్థినిపై హత్యాచారం నేపథ్యంలో గత ఏడాది ఆగస్టు 20న ఎన్‌టీఎఫ్‌ను న్యాయస్థానం ఏర్పాటు చేసింది. ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది రక్షణకు తీసుకో వాల్సిన చర్యలను సూచించాలని కోరింది.

సభను నడిపేది మీరా.. హోం మంత్రా?

● మేం ఉగ్రవాదులమా.. ఎందుకు అడ్డుకుంటున్నారు?

● రాజ్యసభలో నిలదీసిన ఖర్గే



దిల్లీ: 'రాజ్యసభ కార్యకలాపాలను నడిపేది మీరా.. లేక పోతే హోం మంత్రా? మేమేదో ఉగ్రవాదులం అన్నట్లు వెల్‌లోకి రాకుండా మమ్మల్ని సీఐఎస్ఎఫ్ బలగాలు అడ్డుకోవడమేమిటి?' అని రాజ్యసభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే నిల దీశారు. సభలో ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్న సమయంలో భద్రతాబలగాలు వచ్చాయన్న ఆరోపణలపై మంగళవారం రాజ్యసభలో అధి కార, విపక్షాల నడుమ వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌ను ఖర్గే సూటిగా ప్రశ్నిం చారు. ఇంతకుముందు ఛైర్మన్ స్థానంలో ఉన్న వారు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడాన్ని కూడా సమావేశాల్లో భాగంగానే భావించేవారన్నారు. ప్రస్తుతం సభలో మాట్లాడడానికి అవకాశం ఇవ్వకుండా తమ ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్నారంటూ మండిపడ్డారు. చట్టసభల్లో ప్రజాస్వామ్యయుతంగా నిరసనలు తెలపడం ఆనవాయితీ అని చెప్పారు.

సీఐఎస్ఎఫ్ ప్రవేశించలేదు: హరివంశ్



ఖర్గే వ్యాఖ్యలను హరివంశ్, మంత్రులు ఖండించారు. రాజ్యస భలోకి సీఐఎస్ఎఫ్ సిబ్బంది ప్రవేశించలే దని హరివంశ్ స్పష్టం చేశారు. తనకు రాసిన లేఖను ఖర్గే ముందు గానే మీడియాకు వెల్ల డించడంపై అభ్యంతరం తెలిపారు. సభలోకి ప్రవేశించేందుకు మార్షల్స్‌కు మాత్రమే అనుమతి ఉందన్నారు. ప్రజలను విపక్షనేత తప్పుదారి పట్టి స్తున్నారని, సభలో అసత్యాలు చెబుతున్నారని మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. తాను 40 ఏళ్లకు పైగా ప్రతిపక్షంలో ఉన్నానని, విపక్ష స్థానాల్లో ఉన్న నేతలు ఎలా ప్రవర్తించాలో నేర్చు కోవాలంటే తన దగ్గర ట్యూషన్ చెప్పించుకోవా లని రాజ్యసభాపక్ష నేత జె.పి.నడ్డా సూచించారు. వారు మరో 40 ఏళ్లు అక్కడే ఉండాలి కాబట్టి ఇలాంటి విషయాలు నేర్చుకోవాలని చురకలు అంటించారు. గందరగోళం నడుమ సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. తర్వాత బిహార్ ఓటర్ల జాబితాపై చర్చకు విపక్షం మరోసారి పట్టుబట్టడంతో చివరకు బుధవారానికి వాయిదా వేశారు. మణిపుర్‌లో మరో ఆరు నెల లపాటు రాష్ట్రపతి పాలనను పొడిగించే బిల్లును, కస్టమ్స్ సుంకాల చట్టానికి సంబంధించిన బిల్లును రాజ్యసభ అంతకుముందు ఆమోదించింది. మణి పుర్ బిల్లును లోక్‌సభ ఇప్పటికే ఆమోదించింది. గోవాకు సంబంధించిన మరో బిల్లును లోక్‌సభ ఆమోదించింది.



ఆందోళనలో పాల్గొన్న తన తల్లి సోనియాగాంధీకి కళ్ల జోడు పెడుతున్న ప్రియాంకా గాంధీ

ఎస్ఐఆర్‌పై మకరద్వారం వద్ద నిరసనలు

బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)పై పార్లమెంటులో విపక్షాల ఆందోళనలు కొనసాగాయి. సభల్లో పలే కాకుండా పార్లమెంటు మకరద్వారం సమీపంలో కూడా నిరసన ప్రదర్శనలు నిర్వ హించాయి. దీనిలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాం కాగాంధీ, ఇతర విపక్ష నేతలు పాల్గొన్నారు.

భారత్‌కు జెలెన్‌స్కీ సతీమణి



జైపుర్: ఉక్రెయిన్-రష్యా యుద్ధం కొనసాగుతోన్నవేళ ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ సతీమణి ఒలెనా జెలెన్‌స్కా ప్రయాణిస్తున్న విమానం జైపుర్‌లో దిగింది. ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒలెనా, ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రీ సిబిహా, ఇతర సీనియర్ అధికారులు ఇటీవల జపాన్ పర్యటనకు బయల్దేరారు. వీరి విమానం ఇంధనం నింపుకోవడం కోసం ఉదయం 6.30 గంటలకు జైపుర్‌లోని అంతర్జాతీయ విమానాశ్ర యంలో దిగినట్లు విదేశీ మంత్రిత్వశాఖ అధికా రులు వెల్లడించారు. దీనికోసం ఉక్రెయిన్ అధి కారులు ముందస్తు అనుమతి కూడా తీసుకు న్నట్లు తెలిపారు. భారత విదేశీ వ్యవహారాలశాఖ ఆదేశాల మేరకు.. పౌర విమానయాన భద్రతా సంస్థ ఉక్రెయిన్ ప్రతినిధులకు తగిన భద్రతా సౌకర్యాలు కల్పించింది. భారత్‌లోని ఉక్రెయిన్ దౌత్య కార్యాలయ అధికారులతో ఆమె సమావే శమైనట్లు తెలిపారు. అనంతరం ఉదయం 8.15 గంటలకు వారి విమానం టోక్యోకు టేకాఫ్ అయినట్లు పేర్కొన్నారు. రష్యాపై ఆంక్షలు విధించి ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి సాయం చేయాలని జపాన్‌ను ఒలెనా కోరారు.

వీసా గడువు తీరినా అమెరికాలోనే ఉంటే చర్యలే

వలసదారులను హెచ్చరించిన ఎంబసీ

దిల్లీ: నిర్దేశిత గడువు దాటి అమెరికాలో ఉంటున్నవారిని ఉద్దేశించి భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం కీలక హెచ్చరికలు జారీ చేసింది. "యూఎస్ వీసా గడువు నిబంధ నలను గౌరవించండి. ఉల్లంఘనలకు పాల్ప డితే.. వీసా రద్దు, బహిష్కరణకు గురయ్యే ముప్పు ఉంది. భవిష్యత్తులో వీసా రాకుండా అనర్హత వేటు పడొచ్చు. గడువు దాటి ఉండటం వల్ల అమెరికాలో ప్రయాణించడం, చదువుకో వడం, పని చేయడంపైనా శాశ్వత ప్రభావం పడొచ్చు" అని ఎంబసీ హెచ్చరించింది.

కాలిఫోర్నియాలో కార్చిచ్చు

కాలిఫోర్నియా: అమెరికాలోని సెంట్రల్ కాలిఫో ర్నియాలో ఈ నెల 1న అంటుకున్న భారీ కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తోంది. 'గిఫోర్డ్'గా పేర్కొన్న ఈ కార్చిచ్చు ప్రస్తుతం 65 వేల ఎకరాలకు పైగా విస్త రించింది. భారీగా మంటలు ఎగిసిపడుతుండ టంతో చుట్టుపక్కల దట్టమైన పొగ వ్యాపించింది. లాస్ ఏంజెలెస్, వెంచురా, కార్న్ వంటి దక్షిణ కాలి ఫోర్నియా కౌంటీల్లోని నివాసితులతో పాటు పొరు గున ఉన్న లాస్‌వేగాస్‌లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో పలు సూచనలు జారీచేశారు. ప్రభావం ఎక్కువగా ఉండే శాంటామారియా వంటి ప్రాంతాల్లోని వారిని తరలిస్తున్నారు. మరో వైపు.. మంటలను అదుపు చేసేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సోమవారం నాటికి 3 శాతం మాత్రమే అదుపులోకి తీసుకువచ్చినట్లు అధి కారులు తెలిపారు. చుట్టుపక్కల రహదారులను కూడా అధికారులు మూసేశారు. ఈ కార్చిచ్చు కార ణంగా ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రత్యేక విమా నంలో తరలించారు. ఇంకొన్ని రోజుల్లో పరిస్థితులు మరింత తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో గంగానదికి వరద పోటెత్తడంతో ఛోటా బఘాడా ప్రాంతంలో నీట మునిగిన నివాసాలు

పీఎం-కిసాన్ సాయం పెంచడం లేదు

లోక్‌సభకు తెలిపిన కేంద్రం

దిల్లీ: పీఎం కిసాన్ పథకం కింద రైతు లకు అందిస్తున్న ఆర్థిక సాయాన్ని పెంచే ప్రతిపాదనేదీ పరిశీలనలో లేదని కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభకు తెలి యజేసింది. పథకాన్ని విస్తరించాలన్న యోచన కూడా లేదని స్పష్టం చేసింది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభించిన పీఎం-కిసాన్ పథకం కింద రైతులకు ఏటా రూ.6 వేలు మూడు విడతల్లో అందిస్తున్న విషయం తెలిసిందే. పథకం ప్రారంభించిన ప్పటి నుంచీ ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం 20 విడతల్లో రూ 3.9 లక్షల కోట్లు లబ్ధిదారులకు పంపిణీ చేసిందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. కేవలం భూమిని కలిగివున్న రైతులకే ఈ పథకం వర్తిస్తుందని ఆయన అన్నారు. కౌలుదారులకూ ఈ పథకం కింద లబ్ధి చేకూర్చాల్సిందిగా కోరుతూ అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి ఈ సమాధానం ఇచ్చారు. పీఎం-కిసాన్ పథకం కింద డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పద్ధతిలో ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



రష్యా క్షిపణి దాడితో ఉక్రెయిన్‌లోని ఖర్కివ్ సమీపంలో ఉన్న లోజోవా పట్టణంలో ధ్వంసమైన రైల్వేస్టేషన్, రైలు బోగీలు

సిరాజ్.. చిరుతిళ్లు, బయటి బిర్యానీకి నో

దిల్లీ: సిరీస్‌లో అయిదు టెస్టులు ఆడాడు, అందరికంటే ఎక్కువ బంతులు విసిరాడు.. అత్యధిక వికెట్లు సాధించాడు.. టీమ్‌ఇండియాకు అసాధారణ విజయాన్ని అందించిపెట్టాడు పేసర్ మహ్మద్ సిరాజ్. అన్ని మ్యాచ్‌లు ఆడినా అలసట అనేది దరిచేరనీయకుండా ఆకట్టుకున్నాడు. దీనికి కారణం కఠిన డైట్, ఫిట్‌నెస్ విషయంలో క్రమశిక్షణే అంటాడు అతని సోదరుడు మహ్మద్ ఇస్మాయిల్. "ఫిట్‌నెస్‌పై సిరాజ్ చాలా దృష్టిసారిస్తాడు. చిరుతిళ్లకు దూరంగా ఉంటాడు. క్రమశిక్షణతో కూడిన డైట్‌ను అనుసరిస్తాడు. హైదరాబాద్‌లో ఉన్నా అరుదుగా బిర్యానీ తింటాడు. ఇంట్లో చేసిన బిర్యానీని మాత్రమే అప్పుడప్పుడు తీసుకుంటాడు. పిజ్జా, ఫాస్ట్ ఫుడ్‌కు పూర్తిగా దూరం. ఫిట్‌నెస్ విషయంలో క్రమశిక్షణతో ఉంటాడు. జిమ్‌కు అస్సలు దూరమవడు. ఛాంపియన్స్ ట్రోఫీ జట్టుకు ఎంపిక కాకపోయినా కసరత్తులు చేయడం మానలేదు. జిమ్‌కు వెళ్లి ఫిట్‌నెస్ కాపాడుకున్నాడు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం కష్టపడ్డాడు. మా కుటుంబమంతా సిరాజ్‌ను చూసి గర్వపడుతోంది" అని ఇస్మాయిల్ తెలిపాడు.

ఛాంపియన్స్

మేమున్నాం!


ఈసారి టీమ్ ఇండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్తుండగా ఎంతో ఆందోళన! అసలే జట్టు వరుస పరాభవాలతో సతమతం అవుతోంది. పైగా కోహ్లి, రోహిత్, అశ్విన్ రిటైరైపోయారు. ఈ స్థితిలో ఇంగ్లిష్ సవాలుకు జట్టు ఏమేర నిలుస్తుందో? దిగ్గజ ఆటగాళ్ల స్థానాలను ఎంతవరకు భర్తీ చేసుకోగలదో? అని సందేహాలు. కానీ సిరీస్ పూర్తయ్యేసరికి ఆ ఆందోళన అంతా తొలగిపోయింది. ఇంగ్లాండ్‌కు దీటుగా బదులివ్వడమే కాదు, ఆ జట్టుపై పైచేయి సాధించింది యువ భారత్. సీనియర్లు దూరమైనప్పటికీ ఆ లోటు కనిపించనివ్వకుండా కుర్రాళ్లు సమయోచితంగా రాణించడం భవిష్యత్తుపై భరోసానిస్తోంది.

ఈనాడు క్రీడావిభాగం


శుభ్‌మన్ గిల్

వారసుడొచ్చాడు

ఇంగ్లాండ్ పర్యటన ముంగిట ఒకే సారి భారత్‌కు రెండు భారీ షాకులు తగిలాయి. వారం వ్యవధిలో కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి టెస్టుల నుంచి రిటైరైపోయారు. ఇద్దరూ ఒకరి తర్వాత వీడ్కోలు పలకడంతో జట్టు కళ తప్పినట్లయింది. వీరి స్థానాలను భర్తీ చేయడం అంత తేలిక కాదనే అనిపించింది. కానీ శుభ్‌మన్ గిల్.. అభిమానులకు భరోసానిస్తూ బాధ్యత తీసుకున్నాడు. కెప్టెన్‌గా పగ్గాలు అందుకుని రోహిత్ లేని లోటు కనిపించకుండా చూశాడు. అలాగే బ్యాటింగ్‌లో స్థానం మార్చుకుని కోహ్లి ఆడే నంబర్-4లో అదరగొట్టాడు. విదేశాల్లో సరైన రికార్డే లేని శుభ్‌మన్ కెప్టెన్ ఏంటి అంటూ సిరీస్ ముంగిట చాలామంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు. బ్యాటర్‌గా సచిన్, కోహ్లి ఆడిన నాలుగో స్థానంలో శుభ్‌మన్ ఏమేర రాణిస్తాడో అన్న సందేహాలు కూడా కలిగాయి. కానీ తన ఆటతో అందరికీ సమాధానం చెప్పాడు శుభ్‌మన్. ఏకంగా 754 పరుగులతో అతను గొప్ప ప్రదర్శన చేశాడు. అతను ఓ డబుల్ సెంచరీ (269), మూడు శతకాలు (147, 161, 103) సాధించాడు. బ్యాటింగ్‌లో ముందుండి జట్టును నడిపించడంతోనే గిల్ సగం మార్కులు కొట్టేశాడు. ఇక దూకుడైన నాయకత్వంతోనూ అతను ఆకట్టుకున్నాడు. ఇంగ్లాండ్ ఆటగాళ్లకు మాటలతో అతను బదులిచ్చిన వైనం కోహ్లిని గుర్తుకు తెచ్చింది. టీమ్‌ఇండియా.. ఇంగ్లాండ్‌తో హోరాహోరీగా తలపడడంలో, సిరీస్‌లో ఎక్కువ శాతం పైచేయి సాధించడంలో కెప్టెన్‌గా, బ్యాటర్‌గా శుభ్‌మన్ పాత్ర అత్యంత కీలకం అనడంలో సందేహం లేదు.


సిరాజ్

మియా.. సరైన సమయంలో

కొన్నేళ్లుగా టెస్టుల్లో బుమ్రా మీద భారత జట్టు ఎక్కువగా ఆధారపడుతోంది. కానీ టెస్టు క్రికెట్ ఒత్తిడిని అతను తట్టుకోలేకపోతున్నాడు. గాయాలు వేధిస్తుండడంతో వరుసగా మ్యాచ్‌లు ఆడలేని పరిస్థితి. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లోనూ అయిదు టెస్టుల్లో మూడు మ్యాచ్‌ల్లోనే బరిలోకి దిగాడు. అయితే అతను అంచనాల మేర రాణించలేకపోయాడు. కానీ మరో పేసర్ సిరాజ్ (5 మ్యాచ్‌ల్లో 23 వికెట్లు) అదరగొట్టాడు. ముఖ్యంగా చివరి టెస్టులో ఈ హైదరాబాదీ పేసర్ ప్రదర్శన గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రధాన పేసర్‌గా బాధ్యత తీసుకుని అద్భుత బౌలింగ్‌తో జట్టును ముందుండి నడిపించాడు. ఫిట్‌నెస్ సమస్యల నేపథ్యంలో బుమ్రా ఇంకెంతో కాలం టెస్టుల్లో కొనసాగించేలా కనిపించడం లేదు. అతడి భవిష్యత్ మీద అనుమానాలు ముసురుకుంటున్న సమయంలో సిరాజ్ పేస్ దళాన్ని నడిపించగల బౌలర్‌గా ఈ సిరీస్‌లో పేరు తెచ్చుకున్నాడు. ఇదే సిరీస్‌లో ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ సైతం సత్తా చాటి పేస్ విభాగంపై నమ్మకం పెంచారు.


జైస్వాల్

కుర్రాడు కుదురుకున్నాడు


ఈ సిరీస్‌లో భారత బ్యాటింగ్ ఎంతో మెరుగైన ప్రదర్శన చేసింది. ఆస్ట్రేలియా పర్యటనలో, అంతకుముందు సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో సిరీస్‌లో బ్యాటింగ్ వైఫల్యమే జట్టును దెబ్బ తీసింది. కానీ ఈ సిరీస్‌లో మాత్రం బ్యాటర్లు అదరగొట్టారు. ఓపెనింగ్‌లో కేఎల్ రాహుల్‌తో కలిసి యశస్వి జైస్వాల్ జట్టుకు గొప్ప భరోసానిచ్చాడు. తన తొలి ఇంగ్లాండ్ పర్యటనలో జైస్వాల్ ఏమేర రాణించగలడో అని సందేహాలు వ్యక్తమయ్యాయి కానీ.. తొలి మ్యాచ్‌లోనే సెంచరీ (101)తో అదరగొట్టాడు. చివరి టెస్టులోనూ అద్భుత శతకం (118)తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతను మరో రెండు అర్ధశతకాలు కూడా సాధించాడు. జైస్వాల్ బ్యాటింగ్‌లో ఎంతో పరిణతి కనిపించిందీ సిరీస్‌లో. ఓపెనర్‌గా అతను సుస్థిర స్థానం సంపాదించినట్లే. ఈ సిరీస్‌లోనే అరంగేట్రం చేసిన సాయి సుదర్శన్ భారీ ఇన్నింగ్స్‌లు ఆడకపోయినా.. టెస్టులకు సరిపడా ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. తన టెక్నిక్ ఆకట్టుకుంది. మరిన్ని అవకాశాలిస్తే అతను రాటుదేలొచ్చు.


వాషింగ్టన్ సుందర్

బెంగ తీరింది

అశ్విన్ రిటైరైపోయాడు. జడేజా రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్నాడు. మరి వీరిలా బంతితో మాయ చేసి.. బ్యాటింగ్‌లోనూ ఉపయుక్తమైన ఇన్నింగ్స్‌లు ఆడే స్పిన్ ఆల్‌రౌండర్ ఎవరు అనే ప్రశ్నకు వాషింగ్టన్ సుందర్ సమాధానంగా నిలుస్తునాడు. ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌కు ఎంపికైనప్పటికీ.. అతడికి తుది జట్టులో స్థానం లభిస్తుందని ఎవరూ అనుకోలేదు. తొలి టెస్టుకు అతను జట్టులో లేడు కూడా. కానీ రెండో మ్యాచ్ నుంచి అవకాశం దక్కించుకున్న సుందర్.. అంచనాలకు మించి రాణించాడు. ఇంగ్లాండ్ పిచ్‌లపై ఓ స్పిన్నర్‌కు ఎక్కువ వికెట్లు దక్కడం కష్టమే. కానీ సుందర్ 7 వికెట్లతో పర్వాలేదనిపించాడు. లార్డ్స్ టెస్టులో అతడి బౌలింగ్ గొప్పగా సాగింది. ఇక బ్యాటర్‌గా సుందర్ ఆశ్చర్యపరిచాడు. నాలుగో టెస్టులో జడేజాతో కలిసి అద్భుత శతకం (101 నాటౌట్) జట్టును డ్రాతో గట్టెక్కించాడు. చివరి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లోనూ ఎంతో ఉపయుక్తమైన ఇన్నింగ్స్ (53) ఆడాడు. స్వదేశంలో సుందర్ బౌలింగ్‌లోనూ కీలకంగా మారొచ్చు. జడేజా కెరీర్ చరమాంకంలో ఉన్న నేపథ్యంలో.. తన తర్వాత స్పిన్ ఆల్‌రౌండర్ పాత్ర పోషించబోయేది సుందరే కావచ్చు.

జట్టు సంస్కృతే ముఖ్యం


గంభీర్

లండన్: కష్టపడటం.. మెరుగవ్వడం అనే లక్షణాలతో కూడిన బలమైన జట్టు సంస్కృతిని నిర్మించడం అత్యంత కీలకమని భారత జట్టు చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. సిబ్బంది, ఆటగాళ్లు మారినా.. జట్టు సంస్కృతి ముఖ్యమని తెలిపాడు. అయిదో టెస్టులో విజయానంతరం డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లతో మాట్లాడుతూ.. "సిరీస్‌ను 2-2తో ముగించడం అద్భుతమైన ఫలితం. ఆటగాళ్లందరికీ అభినందనలు. మనం మరింత మెరుగవుతూ.. కష్టపడుతూనే ఉంటాం. క్రమం తప్పకుండా మెరుగవుతుంటే సుదీర్ఘ కాలం క్రికెట్లో ఆధిపత్యం చెలాయించొచ్చు. సిబ్బంది, ఆటగాళ్లు వస్తుంటారు.. పోతుంటారు. కానీ జట్టు సంస్కృతి ఎల్లప్పుడూ అలాగే ఉండాలి. ఇందులో భాగం కావాలని ఆటగాళ్లు కోరుకోవాలి. మనం సృష్టించాలనుకునేది అదే" అని గంభీర్ సందేశాన్ని ఇచ్చాడు. ఈ సందర్భంగా సిరీస్‌లో రాణించిన వాషింగ్టన్ సుందర్‌కు 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డును బహూకరించారు.

సంబరాలు ముగించుకుని స్వదేశానికి..

లండన్: ఇంగ్లాండ్‌తో చివరి టెస్టులో అద్భుత విజయం సాధించి సిరీస్‌ను 2-2తో సమం చేసిన టీమ్‌ఇండియా.. మంగళవారం స్వదేశానికి పయనమైంది. సోమవారం తొలి సెషన్లోనే మ్యాచ్ ముగియగా.. ఆ రోజంతా భారత ఆటగాళ్లు గెలుపు సంబరాల్లో మునిగి తేలారు. మరుసటి రోజు లండన్ నుంచి జట్టు దుబాయ్‌కి చేరుకుంది. సాయంత్రం అక్కడి నుంచి ఆటగాళ్లు వారి వారి సొంత నగరాలకు విమానం ఎక్కారు. అయితే అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్‌దీప్ మాత్రం కొన్ని రోజులు లండన్‌లోనే విహరించి, కొన్ని రోజుల తర్వాత స్వదేశానికి రానున్నారు. చివరి టెస్టుకు దూరమైన బుమ్రా కొన్ని రోజుల ముందే ముంబయికి వచ్చేశాడు.


ఇక అలా కుదరదు!

ఆటగాళ్లు మ్యాచ్‌లు ఎంచుకునే సౌలభ్యానికి బీసీసీఐ చెక్

దిల్లీ

భారత క్రికెట్లో స్టార్ సంప్రదాయాన్ని కోచ్ గౌతమ్ గంభీర్ మొదటి నుంచీ వ్యతిరేకిస్తూనే ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌ను భారత్ 2-2తో సమం చేయడంతో అతడికి గొప్ప బలమొచ్చింది. గంభీర్, సెలక్టర్లు ఇక కొరడా ఝుళిపించనున్నారు. స్టార్లకు మినహాయింపు లేకుండా జట్టులో ఇక అందరికీ ఒకేరకమైన నిబంధనలు అమలు చేయనున్నారు. ఆటగాళ్ల పనిభార నిర్వహణ నెపంతో మ్యాచ్‌లు, సిరీస్‌లను ఎంచుకుని ఆడే సంప్రదాయానికి చెక్ పెట్టే విషయంలో కోచ్, సెలక్టర్లు, బీసీసీఐ పెద్దలు ఏకాభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. "ఈ విషయంపై చర్చ జరిగింది. ఇకపై మ్యాచ్‌లు ఎంచుకుని ఆడే సంప్రదాయాన్ని అనుమతించబోమని కాంట్రాక్టు ఆటగాళ్లందరికీ, ముఖ్యంగా మూడు ఫార్మాట్ల ఆటగాళ్లకు సందేశం వెళ్లనుంది" అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. "అంటే దానర్థం పనిభార నిర్వహణను పక్కన పెడతామని కాదు. ఆ విషయంలో మరింత పద్ధతిగా వ్యవహరిస్తాం. ఫాస్ట్‌బౌలర్ల పనిభార నిర్వహణ ముఖ్యమనడంలో సందేహం లేదు. కానీ ఆ పేరుతో కీలక మ్యాచ్‌లకు దూరం కావడం ఆమోదయోగ్యం కాదు" అని అన్నాడు.

గత ఆరు వారాల్లో విశ్రాంతి లేకుండా అయిదు టెస్టులాడిన సిరాజ్ 185.3 ఓవర్లు బౌలింగ్ చేశాడు. గంటలపాటు చేసిన ఫీల్డింగ్, నెట్స్‌లో బౌలింగ్ దీనికి అదనం. ఆటగాడి అత్యుత్తమ ఫిట్‌నెస్‌కు ఇది నిదర్శనం. ఇంగ్లాండ్ కెప్టెన్ స్టోక్స్ కూడా అనేక శారీరక ఇబ్బందులు ఉన్నా సుదీర్ఘ స్పెల్‌లు బౌలింగ్ చేశాడు. ఈ నేపథ్యంలో పనిభార నిర్వహణకు అవసరానికి మించిన ప్రాధాన్యత ఇస్తున్నారేమో అన్న చర్చ మొదలైంది. ఇంగ్లాండ్ పర్యటనలో భారత ప్రధాన పేసర్ బుమ్రా మూడు టెస్టులు మాత్రమే ఆడిన సంగతి తెలిసిందే. ఇది బీసీసీఐ పెద్దలకు నచ్చలేదని తెలుస్తోంది.


గావస్కర్

పనిభారం అన్నమాటే ఉండొద్దు

పనిభారం పేరుతో ఆటగాళ్లు తరుచుగా మ్యాచ్‌లకు దూరమవడంపై మాజీ కెప్టెన్ గావస్కర్ ఘాటుగానే స్పందించాడు. "దేశం తరఫున ఆడుతున్నప్పుడు నొప్పి, బాధల్ని మరిచిపోవాలి. సరిహద్దుల్లో చలి గురించి సైనికులు ఫిర్యాదు చేస్తున్నారని అనుకుంటున్నారా? రిషబ్ పంత్ ఏం చూపించాడు? కాలిలో చీలికతోనే అతను బ్యాటింగ్‌కు వచ్చాడు. ఆటగాళ్ల నుంచి ఆశించేది అదే. భారత్ తరఫున క్రికెట్ ఆడటం గొప్ప గౌరవం. ప్రతి ఒక్క ఆటగాడు 140 కోట్ల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లే. సిరాజ్‌లో మనం చూసింది అదే. అతను హృదయంతో బౌలింగ్ చేశాడు. పనిభారం నిర్వహణ అపోహను శాశ్వతంగా తొలగించాడు. అయిదు టెస్టుల్లో ఏకధాటిగా 7-8 ఓవర్ల స్పెల్‌లు వేశాడు. సిరాజ్‌పై కెప్టెన్ నమ్మకం పెట్టుకోవడం.. అతడిపై దేశం ఆశలు పెట్టుకోవడమే ఇందుకు కారణం. పనిభారం గురించి మాట్లాడే వాళ్లకు లొంగిపోతే దేశం తరఫున అత్యుత్తమ ఆటగాళ్లను ఎప్పటికీ బరిలో దించలేరు. భారత క్రికెట్ నిఘంటువు నుంచి ఆ పదం అదృశ్యం కావాలని కోరుకుంటున్నా. అది మానసిక విషయమే తప్ప శారీరకమైనది కాదు" అని గావస్కర్ వివరించాడు.

వాళ్లిద్దరికి కష్టమేనా?


కోహ్లి | రోహిత్

దిల్లీ: టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ ఆటగాళ్లు కోహ్లి, రోహిత్.. వన్డేల్లో కొనసాగాలని నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. అయితే కుర్రాళ్లతో కూడిన భారత జట్టు అదిరే ప్రదర్శనతో ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌ను సమం చేయడం ఈ సీనియర్ ఆటగాళ్లు వన్డే ఫార్మాట్లో కొనసాగడంపై ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. 36 ఏళ్ల కోహ్లి, 38 ఏళ్ల రోహిత్‌లను ఆస్ట్రేలియాలో మూడు వన్డేల సిరీస్‌లో చూడొచ్చు. ఆ తర్వాత సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ ఉంటుంది. ఆ తర్వాత 2026 జనవరి-జులై మధ్య న్యూజిలాండ్ (స్వదేశంలో), ఇంగ్లాండ్ (వెలుపల)తో ఆరు వన్డేలు ఆడడానికి అవకాశముంది. 2027 నవంబరులో జరిగే వన్డే ప్రపంచకప్‌కు సంసిద్ధం కావడానికి వాళ్లకు ఈ మ్యాచ్‌లు సరిపోతాయా అన్నది ప్రశ్న. కేవలం ఒక్క ఫార్మాట్, ఐపీఎల్‌తో అప్పటి దాకా ఆటలో కొనసాగాలన్న కోరిక వాళ్లలో ఉందా అన్నది మరో ప్రశ్న! "ఈ విషయం గురించి త్వరలో చర్చిస్తాం. ప్రపంచకప్‌నకు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. అప్పటికి రోహిత్‌కు 40 దాటుతాయి. కోహ్లి 40వ ఏట ఉంటాడు. పెద్ద టోర్నీకి చాలా స్పష్టమైన ప్రణాళిక ఉండాలి. మనం చివరిసారి 2011లో వన్డే ప్రపంచకప్‌ను గెలిచాం. వచ్చే టోర్నీ లోపు కొందరు కుర్రాళ్లకు కూడా అవకాశాలు ఇవ్వాల్సిన అవసరముంది" అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. మరి సీనియర్ ఆటగాళ్లకు కోరుకున్నప్పుడు వీడ్కోలు చెప్పే అవకాశం ఇస్తారా లేదా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వాళ్లను పక్కన పెడతారా అన్నది ఆసక్తికరం. "వాళ్లనెవరూ ఒత్తిడి చేస్తారని నేను అనుకోవట్లేదు. కానీ మానసికంగా, శారీరకంగా ఆ ఇద్దరి పరిస్థితేంటో తెలుసుకోవడం కోసం వచ్చే వన్డే చక్రం మొదలు కావడానికి ముందు వాళ్లతో ప్రొఫెషనల్‌గా సంభాషణ ఉంటుంది. అంతా దానిపై ఆధారపడి ఉంటుంది" అని బోర్డు వర్గాలు తెలిపాయి.


సుదర్శన్


ఆసియాకప్ జట్టులో ఆ ముగ్గురు?

దిల్లీ: యువ ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ ఆసియాకప్ జట్టులోకి ఎంపికకు పోటీలో ఉన్నారు. తీరిక లేని షెడ్యూలు కారణంగా జైస్వాల్, గిల్ గత కొన్ని టీ20ల్లో ఆడలేదు. కానీ ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ తర్వాత నెల రోజుల విశ్రాంతి లభిస్తుండడంతో వాళ్లు ఆసియాకప్ (టీ20 ఫార్మాట్) సెలక్షన్‌కు అందుబాటులో ఉంటారని భావిస్తున్నారు. ఒకవేళ టీమ్‌ఇండియా ఆసియాకప్ ఫైనల్‌కు చేరితే.. సెప్టెంబరు 28న జరిగే ఆ మ్యాచ్‌కు, స్వదేశంలో వెస్టిండీస్‌తో సిరీస్ ఆరంభానికి మధ్య వారం కంటే కూడా తక్కువ వ్యవధి ఉంటుంది. అయినా సెలక్టర్లు ఆ ఆటగాళ్లను టోర్నీకి ఎంపిక చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. వెస్టిండీస్‌తో మొదటి టెస్టు అక్టోబరు 2న అహ్మదాబాద్‌లో మొదలవుతుంది. ఈ ఏడాది ఐపీఎల్‌లో జైస్వాల్ 160 స్ట్రైక్‌రేట్‌తో 559 పరుగులు చేయగా.. గిల్ 155పై స్ట్రైక్‌రేట్‌తో 650 పరుగులు సాధించాడు. గుజరాత్ టైటాన్స్ జట్టులో గిల్ ఓపెనింగ్ భాగస్వామి సుదర్శన్ 156 స్ట్రైక్‌రేట్‌తో 759 పరుగులు చేశాడు. మరోవైపు ఫాస్ట్‌బౌలర్లు సిరాజ్, బుమ్రా ఆసియాకప్‌నకు అందుబాటులో ఉంటారా లేదా అన్నది ఆసక్తికరం. సెలక్షన్ సమావేశానికి ముందు వీళ్లకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించే అవకాశముంది.

నేటి నుంచి చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్

చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ బుధవారం ఆరంభం కానుంది. ఈ టోర్నీ క్లాసికల్ రౌండ్ రాబిన్ ఫార్మాట్లో 9 రౌండ్ల పాటు సాగుతుంది. అర్జున్ ఇరిగేశి, విదిత్ గుజరాతి, అనిష్ గిరి వంటి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడుతున్నారు. అర్జున్ తొలి రౌండ్లో లియాంగ్ (అమెరికా)తో పోటీపడతాడు. ఈ టోర్నీలో ఛాలెంజర్స్ విభాగం కూడా ఉంది. టైటిల్ కోసం పోటీ పడే వారిలో హారిక, వైశాలి ఉన్నారు.

బుమ్రా ఉన్నా లేకున్నా.. సిరాజే నాయకుడు


చాపెల్

అడిలైడ్: ఇకపై జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో ఉన్నా లేకున్నా, భారత పేస్ దళపతి మహ్మద్ సిరాజేనని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ గ్రెగ్ చాపెల్ అభిప్రాయపడ్డాడు. ఇంగ్లాండ్‌తో అయిదో టెస్టులో బుమ్రా అందుబాటులో లేకపోయినా.. పేస్ విభాగాన్ని సిరాజ్ ముందుండి నడిపించడంతో భారత్ అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో చాపెల్ ఈ వ్యాఖ్య చేశాడు. "సిరాజ్ ఇంతకుముందే ఎన్నో ఉత్తమ ప్రదర్శనలు చేశాడు. ఎంసీజీ, గబ్బా, పెర్త్, లార్డ్స్, కేప్‌టౌన్, బర్మింగ్‌హామ్‌ల్లో ఆకట్టుకున్నాడు. కానీ ఓవల్‌లో ప్రదర్శనది మరో స్థాయి. ఇకపై బుమ్రా ఉన్నా లేకున్నా.. భారత బౌలింగ్ విభాగాన్ని నడిపించబోయేది అతనే. సిరీస్‌లో ఎన్నో గొప్ప బ్యాటింగ్ ప్రదర్శనలు ఉన్నప్పటికీ.. భారత్ బలమైన పోటీదారుగా నిలిచిందంటే అందుకు సిరాజే కారణం" అని చాపెల్ పేర్కొన్నాడు.

గిల్ ఆ స్పష్టత వల్లే..


సచిన్

ముంబయి: ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో భారత జట్టును ముందుండి నడిపించిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై దిగ్గజ ఆటగాడు సచిన్ తెందుల్కర్ ప్రశంసల జల్లు కురిపించాడు. గిల్ స్పష్టమైన ఆలోచనలతో ఈ సిరీస్‌లో బరిలోకి దిగాడని, కాబట్టే అంత గొప్పగా రాణించాడని సచిన్ అభిప్రాయపడ్డాడు. "ఈ సిరీస్ ఆద్యంతం శుభ్‌మన్ గొప్పగా బ్యాటింగ్ చేశాడు. అతను ఎంతో ప్రశాంతంగా, ఒక ప్రణాళిక ప్రకారం ఆడాడు. బ్యాటింగ్ ఉత్తమంగా సాగాలంటే ఇన్నింగ్స్‌ను ఎలా నిర్మించాలనే విషయంలో సరైన ప్రణాళిక అవసరం. గిల్ స్పష్టమైన ఆలోచనలతో ఉన్నాడు. తన ఫుట్‌వర్క్‌లో అది ప్రతిఫలించింది. నిలకడగా రాణించగలగడానికి అదొక కారణం. ఆలోచనల్లో స్పష్టత లేకుంటే శరీరం సహకరించదు. తన ఆలోచనలకు తగ్గట్లుగా దేహం స్పందించింది. ఆటపై గిల్ ఎంతో నియంత్రణతో కనిపించాడు. బంతిని ఆడడానికి అతడికి చాలా సమయం దొరికింది" అని సచిన్ చెప్పాడు.

ఫిఫా అకాడమీకి రుద్రాక్ష్


రుద్రాక్ష్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ కుర్రాడు రుద్రాక్ష్ బన్సల్ (గ్లెండేల్ అకాడమీ-సన్‌సిటీ) అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్యకు చెందిన ఫిఫా అకాడమీ (భువనేశ్వర్)కి ఎంపికయ్యాడు. దేశవ్యాప్తంగా 19 మంది ఆటగాళ్లు అకాడమీకి ఎంపికవగా.. తెలంగాణ నుంచి రుద్రాక్ష్‌కు మాత్రమే అవకాశం లభించింది. భారత్‌లో అత్యుత్తమ యువ ఫుట్‌బాల్ ఆటగాళ్ల ప్రతిభను గుర్తించి.. శిక్షణ ఇవ్వడం కోసం 'ఫిఫా గోల్ ప్రాజెక్ట్' కింద ఈ అకాడమీ ఏర్పాటైంది. ఫిఫా ప్రపంచకప్‌తో సహా పలు అంతర్జాతీయ టోర్నీల్లో బరిలోకి దిగేలా ఆటగాళ్లను అకాడమీ తీర్చిదిద్దుతుంది.

భారత్‌కు ఏడు పతకాలు ఖాయం

ఆసియా అండర్-19 బాక్సింగ్

బ్యాంకాక్: ఆసియా అండర్-19, అండర్-22 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. అండర్-19లో ఏడుగురు అమ్మాయిలు దేశానికి పతకాలు ఖాయం చేశారు. యక్షిక (51కేజీ), నిషా (54కేజీ), ముస్కాన్ (57కేజీ), విని (60 కేజీ), నిషా (65కేజీ), ఆకాంక్ష ఫలస్వాల్ (70కేజీ), ఆర్తి కుమారి (75కేజీ) సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఒక్క సుమన్ కుమారి (48కేజీ) మాత్రమే ఓడిపోయింది. అండర్-22లో భారత్‌కు ఇప్పటికే డజన్‌కు పైగా పతకాలు ఖాయమయ్యాయి. వీలైనన్ని ఎక్కువ స్వర్ణాలు గెలవడంపై భారత బృందం దృష్టి పెట్టింది.

మన లాకర్.. మన వద్దే!



స్ట్రాంగ్ రూం గురించి వివరిస్తున్న ఆరమ్ లాకర్ ఫౌండర్ విజయ్


విలువైన వస్తువులను భద్రంగా ఉంచాలనుకుంటే లాకర్ల కోసం బ్యాంకుకు వెళతాం. ఇప్పుడా సౌకర్యాన్ని మన ఇంటి వద్దే పొందొచ్చు. దీనికోసం ఏఐ సాంకేతికత... రోబోటిక్స్ నిర్వహణ... మిలటరీ గ్రేడ్ సెక్యూరిటీ ఉన్న స్ట్రాంగ్ రూంలు అందుబాటులోకి వచ్చేశాయి.

ఆలోచన..పుట్టింది ఇలా..

విశాఖకు చెందిన ఆరిశెట్టి విజయ్ తాను స్వయంగా ఎదుర్కొన్న సమస్యకు పరిష్కారంగా చేసిన ఆలోచనే 'ఏఐ రోబోటిక్ ఆటోమేటెడ్ డిజి లాకర్'. వైమానిక దళంలో హెలికాప్టర్ పైలట్‌గా స్క్వాడ్రన్ లీడర్ హోదాలో ఉద్యోగ విరమణ చేసిన ఆయన బెంగళూరులోని బ్యాంకు లాకర్ తీసుకోవడానికి మూడేళ్ల పాటు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఎట్టకేలకు ఇచ్చినా.. అనేక నిబంధనలు, నచ్చిన లాకరు రాకపోవడం వంటివి బాధించాయి. ఒక సగటు వ్యక్తి లాకరు కోసం ఇన్ని వ్యయప్రయాసలకు గురవ్వాలా అనే ప్రశ్నకు సమాధానంగా వచ్చిందే... 'ఆరమ్స్ లాకర్స్' ఆలోచన. మనం ప్రత్యేకంగా బ్యాంకుల వద్దకు వెళ్లకుండా వీటిని గేటెడ్ కమ్యూనిటీల్లో, అపార్ట్‌మెంట్లలో, లేదా మన ఇంట్లో కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. గేటెడ్ కమ్యూనిటీల్లో అయితే అందులోని ఫ్లాట్ యజమానులందరికీ ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నారు.

దుర్భేద్యం..

- బాంబులతో పేల్చినా చెక్కుచెదరని స్ట్రాంగ్‌రూం దీని ప్రత్యేకత.
- గాల్వనైజ్డ్ ఐరన్, క్రాస్‌సెక్షన్ ప్లేట్స్, రీఇన్‌ఫోర్స్‌డ్ ఐరన్, కాంక్రీట్‌లతో దీన్ని నిర్మిస్తారు.
- ఈ గోడలో 200కు పైగా సెన్సర్లను ఉపయోగించారు. ఏ మాత్రం తేడావచ్చినా రక్షణ వ్యవస్థలకు వెంటనే సమాచారం వెళ్లిపోతుంది.
- లోపల ఏఐ రోబోటిక్ సెటప్ దీని ప్రత్యేకత. ఇచ్చే కమాండ్స్ ఆధారంగా సంబంధిత వ్యక్తుల లాకర్లను బయటకు తెస్తుంది.



ఇలా పనిచేస్తుంది

- లాకర్ తీసుకున్న వ్యక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి కేవైసీ అనుసంధానం చేసుకుంటారు. అలా చేసిన వారికి మాత్రమే లాకర్‌ను ఆపరేట్ చేసే అవకాశం ఉంటుంది.
- లాకర్లోకి వెళ్లడానికి ముందు యాప్ తెరిచి వివరాలు నమోదు చేస్తే పాస్‌వర్డ్ వస్తుంది. దాన్ని బయట లాకర్ వద్ద నమోదు చేస్తే క్యూఆర్ కోడ్ వస్తుంది. దాన్ని స్కాన్ చేస్తే బయట డోర్లు తెరుచుకుంటాయి.



- మనం లోపలికి వెళ్లగానే మనకు మరో ఓటీపీ వస్తుంది. దాన్ని లోపలున్న డిజిటల్ లాకర్‌లో నమోదు చేస్తే వెంటనే బయట ఉన్న తలుపులు మూసుకుంటాయి.
- లోపల ఏ రకమైన కెమెరాలు ఉండవు. సెన్సర్ల ఆధారంగా ఎంతమంది వచ్చారో గుర్తిస్తుంది.
- ఆ వెంటనే మన లాకర్ని లోపలి నుంచి రోబో తీసుకొస్తుంది. దానికదే బరువునూ చెబుతుంది.
- లోపలే ప్రీమియం డ్రెస్సింగ్‌రూం ఉంటుంది. గరిష్ఠంగా ఒక్కో వ్యక్తి అరగంట పాటు లోపల ఉండొచ్చు.

ఒక్కో లాకరుకు రూ.కోటి చొప్పున బీమాను ఆరమ్స్ లాకర్స్ వారే చేయిస్తున్నారు.



విశాఖలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన లాకర్ స్ట్రాంగ్ రూం

రూ.పది వేల నుంచి..

ఈ లాకర్‌ను వినియోగించేవారు ఏడాదికి వాటి పరిమాణం ఆధారంగా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. చిన్న వాటికి రూ.10 వేలు, మధ్యస్థాయి రూ.15 వేలు, పెద్దవాటికి రూ.20 వేలు, జంబో లాకర్లకు రూ.25 వేలు చెల్లించాల్సి ఉంటుంది. డిపాజిట్‌గా రూ.2 లక్షలు చెల్లిస్తే జీవితకాలం ఉపయోగించుకోవచ్చు. మళ్లీ లాకర్ అప్పజెప్పినప్పుడు డబ్బులు తిరిగిచ్చేస్తారు.

- ఈనాడు, విశాఖపట్నం, అమరావతి

ఊరంతా ఒకే మాట.. పిల్లలు ప్రభుత్వ బడిబాట



ప్రభుత్వ బడులు బాగు పడాలంటే స్థానికులే ముందుకు రావాలని నిరూపించారు శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం దూగానపుట్టుగ గ్రామస్థులు. ఇక్కడి పెద్దలు ప్రాథమిక పాఠశాల బాగుకు స్థానిక పిల్లలను గ్రామంలోని బడిలోనే చదివించాలనే గొప్ప నిర్ణయం తీసుకుని ఆ మేరకు తీర్మానించారు. దీంతో గత వారం రోజుల్లో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 40 మంది విద్యార్థులు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేరారు. గతంలో ఈ పాఠశాల ప్రాథమికోన్నత స్థాయిలో ఉండేది. 47 మంది పిల్లలు చదవగా.. ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేవారు. ఏటా పిల్లలు తగ్గిపోతుండటంతో ప్రాథమిక పాఠశాలగా మారిపోయింది. గతేడాది పరిస్థితి మరీ దయనీయంగా తయారై 13 మంది విద్యార్థులతో ఏకోపాధ్యాయ పాఠశాల అయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పంచాయతీకి ఒక ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేస్తుండటంతో గ్రామంలోని యువకులు, పెద్దల్లో చైతన్యం వచ్చింది. ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులను ప్రోత్సహించారు. ఆదర్శ పాఠశాల అయితే తరగతికి ఓ ఉపాధ్యాయుడు ఉండి బోధిస్తారని ప్రచారం చేశారు. అయినా కొందరు తల్లిదండ్రుల్లో మార్పు లేకపోవడంతో గ్రామస్థులంతా సమావేశమై ఒక తీర్మానం చేశారు. 1 నుంచి 5 తరగతులు చదివేవారు గ్రామంలోని బడికే వెళ్లాలని..ఎవరైనా ధిక్కరిస్తే అలాంటివారు వేరే చోట నివాసం ఉండి పిల్లలను ప్రైవేటు బడిలో చదివించుకోవాలని తీర్మానించారు. దీంతో గ్రామంలోని ప్రభుత్వ బడిలో విద్యార్థుల సంఖ్య 53కు చేరింది. ఇందులో ఎంఈవో ధనంజయ మజ్జి, ప్రధానోపాధ్యాయులు రాజేష్, సీఆర్పీ తులసి, ఇతర సిబ్బంది కృషి ఉందని గ్రామస్థులు తెలిపారు.

- న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



మట్టిలో 'మాణిక్యాల' వేట

ఏంటీ కుర్రాళ్లు.. బురదలో బంతాట ఆడుతున్నారు.. అనుకుంటున్నా...? ఆటపై ఇష్టం ఎంతైనా శ్రమించేలా చేస్తుంది కదా... ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొనేందుకు వీళ్లు ఇలా ఫుట్‌బాల్ సాధన చేస్తున్నారు. గోల్ పోస్టు దగ్గరకు వచ్చే బంతిని ఎగిరి పట్టుకునే మెలవకులను అభ్యాసం చేస్తున్నారు. మామూలు నేలపైన.. ఎగిరి కింద పడితే దెబ్బలు తగులుతాయి కదా.. అందుకే వరి నాటేందుకు సిద్ధం చేసిన కరిగెట్లో ఇలా ప్రాక్టీస్ చేశారు. వనపర్తి జిల్లా పెబ్బేరు, గోపాల్‌పేట ఫుట్‌బాల్ జట్ల సాధనలో ఓ విన్యాసమిది. ఈ జట్లలోని కొందరు ఆటగాళ్లు గతంలోనూ ఖేలో ఇండియాలో ఆడారు. ఇప్పుడు మరికొందరు ఔత్సాహికులను చేర్చుకుని.. మట్టిలో నుంచి మాణిక్యాల వంటి క్రీడాకారులను వెలికి తీసే పనిలో ఉన్నారు శిక్షకులు. –గోపాల్‌పేట, న్యూస్‌టుడే

కునుకు తీస్తే పని కుదుటపడతది!



కొన్నిసార్లు పని మధ్యలో కాస్త విరామమిచ్చి కునుకు తీస్తే అది మన పనితీరు మెరుగుదలకు ఉపయోగపడుతుందని ఓ కొత్త అధ్యయనంలో తేలింది. ఆ సమయంలో చేతిలో ఉన్న పనికి సంబంధించిన స్వల్పకాలిక సమాచారం.. దీర్ఘకాలిక, బలమైన జ్ఞాపకశక్తిగా పరివర్తనం చెందుతుందని పరిశోధకులు గుర్తించారు. అమెరికాలోని హార్వర్డ్ మెడికల్ స్కూలు పరిశోధక బృందం టైపింగ్ సీక్వెన్సు నేర్చుకొంటూ తర్వాత కునుకు విరామం తీసుకొన్న 25 మంది వ్యక్తుల మెదళ్ల కార్యకలాపాలను పర్యవేక్షించింది. జ్ఞాపకశక్తికి ఎంతగానో తోడ్పడే మెదడు పైపొర 'కోర్టెక్స్' నిద్రించే సమయంలో ఉత్తేజితమవుతుందని ఈ బృందం తెలిపింది. న్యూరోసైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఫలితాలు కూడా కునుకు విరామం తీసుకొంటూ పని చేసేవారి మెదడు పైపొరలో తరంగాల సంఖ్య పెరిగిందని, దీంతో వారి పనితీరు మెరుగుపడిందని వెల్లడించాయి. – దిల్లీ

తల్లిదండ్రులైనా బిడ్డను వేలంలో దక్కించుకోవాల్సిందే..



సొంత బిడ్డలను తల్లిదండ్రులే వేలంలో పాడుకొని తీసుకెళ్లే ఆచారం తమిళనాడులోని ఓ చర్చిలో కొనసాగుతోంది. దిండుక్కల్ జిల్లా మలైకోట్టై సమీపంలోని ముత్తళగుపట్టిలో పురాతన సెయింట్ సెబాస్టియన్ చర్చిలో బిడ్డను వేలం వేస్తున్న దృశ్యం ఇది. ఇక్కడ ఏటా ఆడి మాసంలో నాలుగు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. పెళ్లై చాలా ఏళ్లయినా సంతానం కలగని దంపతులు స్థానిక చర్చిని సందర్శిస్తే సంతానభాగ్యం కలుగుతుందని నమ్మకం. పిల్లలు పుడితే దేవుడికే సమర్పిస్తామని మొక్కుకుంటారు. అలా సంతానం కలిగినవారు ఇక్కడికి వచ్చి బిడ్డను నిర్వాహకులకు అప్పగిస్తారు. వారు వేలంపాట నిర్వహిస్తే తల్లిదండ్రులతో పాటు మిగతావారు పాల్గొంటారు. చివరికి తల్లిదండ్రులే వేలంపాట గెలిచేలా చూస్తారు. వారి స్తోమత ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.లక్ష లోపు పాడతారు. ఆ నగదును చర్చికి అప్పగించి బిడ్డను తీసుకెళ్తారు. – న్యూస్‌టుడే, చెన్నై (ఆర్కే నగర్)



అర్ధశతాబ్దపు స్నేహం..!

స్నేహమేరా జీవితం అంటూ అర్ధశతాబ్దానికి పైగా కలిసి మెలిసి తిరుగుతున్నాయీ ఏనుగులు. తమిళనాడులోని నీలగిరి జిల్లా ముదుమలై తెప్పకాడు శిబిరంలో ఉంటున్న భామ(75), కామాక్షి(65) అనే ఏనుగుల మధ్య విడదీయలేని స్నేహబంధం ఏర్పడింది. ఒకటీ రెండూ కాదు 55 ఏళ్లుగా ఇవి దోస్తులుగా ఉంటూ స్నేహానికి చిరునామాగా మారిపోయాయి. నిద్రపోవడం, వ్యాహ్యాళికి వెళ్లడం దగ్గర నుంచి అన్ని పనుల్లోనూ కలిసే ఉంటాయి. ఊసులు చెప్పుకొంటూ చెరకు తినడం వీటికి నచ్చిన పని. అందుకే 30 ఏనుగులు ఉన్న ఈ శిబిరంలో భామ, కామాక్షిలు ప్రత్యేకమని తమిళనాడు అటవీశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహూ చెబుతున్నారు. ఈ విషయాన్ని ఆమె ఎక్స్‌లో పోస్టు చేశారు.

- న్యూస్‌టుడే, చెన్నై (ప్యారిస్)



నిర్మల్ జిల్లా భైంసా మండలం వానల్‌పాడ్‌లో వరినాట్లు వేస్తున్న భక్తులు

వీరి భక్తి.. వేల మందికి భుక్తి..



రాములు మహరాజ్

నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో వరినాట్లు వేస్తున్న వీరిని చూడండి.. ఇందులో వింతేముంది అనుకుంటున్నారా.. ఇది కొంత భిన్నమైన కథే. వీరు సేద్యం చేస్తున్నది సొంతానికో.. కూలి కోసమో కాదు. అన్నదాన సేవ కోసం. నిజామాబాద్ జిల్లా నందిపేట్ సమీపంలోని పలుగుట్ట కేంద్రంగా కేదారేశ్వర ట్రస్టు పేరిట మంగి రాములు మహరాజ్ వృద్ధాశ్రమం నెలకొల్పారు. ఇందులో 38 మంది వృద్ధులకు ఆశ్రయం కల్పించారు. ఇక్కడి శివాలయానికి, బాసర అమ్మవారి క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులకు ట్రస్టు తరఫున నిత్యాన్నదాన సేవ చేస్తున్నారు. పలుగుట్ట శివాలయానికి ప్రతి అమావాస్య, పౌర్ణమి రోజుల్లో తరలివచ్చే వేల మంది భక్తులకూ ఆకలి తీరుస్తున్నారు. ట్రస్టుకు వానల్‌పాడ్‌లో 18 ఎకరాలు, నందిపేట్‌లో 15 ఎకరాలు.. వెరసి 33 ఎకరాల భూములు న్నాయి. భారీ అన్నదాన కార్యక్రమానికి అవసరమైన ధాన్యాన్ని, కూరగాయలను ఆ భూముల్లో పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నారు. పలుగుట్టలో నిర్వహించే గోశాలలో.. గో ఆధారిత ఎరువులు తయారు చేసి వినియోగిస్తున్నారు. రాములు మహరాజ్‌పై గౌరవంతో భక్తులు, ఆయన శిష్యులే ఇలా ఏటా స్వయంగా సాగుపనుల్లో నిమగ్నమవుతారు. శివాలయానికి వచ్చే ఆదాయంతో పేద విద్యార్థుల చదువు, పేదల కంటి శస్త్ర చికిత్సల వంటి సేవలు కూడా ట్రస్టు అందిస్తోంది. – భైంసా, న్యూస్‌టుడే

చీకటిని ఛేదించిన లిసా రే!



మహేశ్‌బాబు సరసన 'టక్కరిదొంగ'లో నటించిన బాలీవుడ్ నటి లిసా రే గుర్తున్నారా? అప్పట్లో బ్లడ్ క్యాన్సర్ సోకిన ఆమె.. ఆత్మస్థైర్యంతో ఆరోగ్యాన్ని కూడగట్టుకున్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్‌వో) హైదరాబాద్ ఛాప్టర్ మంగళవారం 'ది మెనీ లైవ్స్ ఆఫ్ లిసా రే' పేరిట నిర్వహించిన ఓ కార్యక్రమంలో తన జీవిత ప్రస్థానాన్ని వివరించారు. 'నా జీవితంలో అత్యున్నత విజయక్షణమే.. చీకటి ఘడియ కూడా. కెరీర్ ఉన్నతంగా ఉన్న సమయంలో 37 ఏళ్ల వయసులో నాకు బ్లడ్‌క్యాన్సర్ సోకింది. ఐదేళ్ల కన్నా బతకనని డాక్టర్లు చెప్పారు. అదే సమయంలో నా అంతరాత్మ నన్ను బలంగా నిలిపింది. ఇప్పుడు నాకు 53 ఏళ్లు. సంతృప్తికరంగా జీవిస్తున్నా. మన ఆరోగ్యానికి మనమే సేఈవోలం. ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యమివ్వాలి. రోగం అనేది సిగ్గుపడాల్సిన విషయం కాదు. మనం ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటాం.. కానీ మనసులోని వ్యతిరేక ఆలోచనలను వదులుకోలేకపోతున్నాం. ధ్యానమే నాకు మనోస్థైర్యాన్ని అందించింది. ప్రపంచంలోని 43 నగరాల్లో నేను నివసించా. ఇండియా పరిపూర్ణ దేశం కాకపోయినా జీవించడానికి ఉత్తమమైనదే.' అన్నారు లిసా రే.

– బంజారాహిల్స్, న్యూస్‌టుడే

ఐదు పదుల జంట అడుగేస్తే మాస్!



శకుంతల, ఆనందరావు

ఈ దంపతుల పేర్లు శకుంతల (50), ఆనందరావు (57). ఆయన వృత్తి ఆటో నడపడం, ఆమె వ్యవసాయ కూలీ. ఐదు పదుల వయసులోనూ ఈ జంట క్రీడల్లో అసమాన ప్రతిభ చూపుతున్నారు. వీరిది కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామం. రాష్ట్ర, జాతీయ స్థాయిలో మాస్టర్ అథ్లెటిక్స్ రన్నింగ్, వాకింగ్ పోటీల్లో పతకాలు సాధించడం వీరికి సర్వసాధారణ విషయం. ఇటీవల తెలంగాణ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లోనూ మెరిశారు. 3 కిలోమీటర్ల నడక, 1500 మీటర్ల పరుగులో ఇద్దరూ బంగారు పతకాలు సాధించారు. 2012 నుంచి ఇప్పటి వరకు ఆనందరావు మొత్తం 74 బంగారు, 30 కాంస్య, 33 రజత పతకాలు సాధించారు. ఆయన యోగా, బాడీ బిల్డింగ్ పోటీల్లోనూ సత్తా చాటుతున్నారు. భార్యతోపాటు కుమార్తెలు దీప్తి, సమిత సైతం ఆయన బాటనే అనుసరిస్తున్నారు. కుమార్తెలు యోగా, కరాటే, రన్నింగ్ పోటీల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారు.

– ఆసిఫాబాద్ రూరల్, న్యూస్‌టుడే

20 ఏళ్ల కుర్రాడు రాత్రికి రాత్రి అంబానీలను మించిపోయాడు!



ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడాలో దీపక్ (20) అనే కుర్రాడు ఐశ్వర్యంలో రాత్రికి రాత్రి అంబానీలను మించిపోయాడు. ఇంతకూ ఏమి జరిగిందంటే.. రెండు నెలల క్రితం మరణించిన దీపక్ తల్లి గాయత్రీ దేవి ఖాతాలో రూ.1,13,56,000 కోట్లు (37 డిజిట్లు) జమ అయినట్లు మెసేజ్ వచ్చింది. నిద్ర మబ్బు వదిలిపోయిన దీపక్ డాంకౌర్ పరిధిలోని సంబంధిత బ్యాంకుకు పరుగు తీశాడు. షాక్‌కు గురైన బ్యాంకు అధికారులు వెంటనే ఆ ఖాతాను స్తంభింపజేశారు. ఐటీ విభాగం ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టింది. సాంకేతిక సమస్యా?.. హవాలా లాంటిదేమైనా జరిగిందా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. –ఈటీవీ భారత్

మీ పిల్లల సూపర్‌హీరోలు మీరే!



పిల్లలు మొట్టమొదట సూపర్‌హీరోల్లా ఆరాధించేది సూపర్‌మ్యాన్‌నో, స్పైడర్‌మ్యాన్‌నో కాదు.. తమ తల్లిదండ్రులనే! చిన్నారులు తొలుత ఎక్కువగా విశ్వసించేది, ప్రేమించేది, తాము అనుకరించాలని కోరుకునేది కూడా వారినే. తల్లిదండ్రులు పరిపూర్ణ వ్యక్తులుగా ఉండాల్సిన అవసరం లేదు! కన్నబిడ్డల్ని ప్రేమగా చూసుకుంటూ, వారితో గడిపేందుకు తరచూ సమయం కేటాయించుకుంటే చాలు.. పిల్లలకు గొప్ప మేలు చేసినట్టే.

– ఫ్రెడో, మైండ్ కోచ్

మహిళా కెప్టెన్.. ఆన్ ద వే..!





బైక్, ఆటో హ్యాండిళ్లను చేతబట్టి తమ కుటుంబాల ఆర్థికస్థితిని మార్చేందుకు డ్రైవర్లుగా మారారు పలువురు మహిళలు. రాష్ట్ర ప్రభుత్వం అతివలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకుల నుంచి రుణాలు సమకూర్చి 1,000 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, ఆటోలను తీసుకుంది. డ్రైవింగ్ లైసెన్సు, ఆసక్తి ఉన్న మహిళలను ఎంపిక చేసి వారికి ఆ వాహనాలను అందించడమే కాకుండా మెప్మా ఆధ్వర్యంలో ప్రత్యేకంగా శిక్షణనూ ఇప్పించారు. రోజూ ఉపాధి లభించేలా ర్యాపిడో సంస్థతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం కలిసొచ్చింది. ఆ సంస్థకు వచ్చే ఆర్డర్లను ఈ మహిళా కెప్టెన్లకు కేటాయిస్తున్నారు. ప్రస్తుతం విజయవాడ, విశాఖ, తిరుపతి సహా 8 నగరాల్లో రోజూ 500 నుంచి 550 రైడ్లు బుక్ అవుతున్నాయి. ఒక్కో బైక్‌పై నెలకు రూ.15 వేల నుంచి రూ.18 వేలు, ఆటోపై రూ.25 వేల నుంచి రూ.30 వేల వ్యాపారం జరుగుతోంది. – ఈనాడు, అమరావతి



పార్కు కాదు.. మరుభూమి!

మరణం కూడా గౌరవప్రదంగా ఉండాలని, మరణోత్తర క్రతువులు శాస్త్రబద్ధంగా నిర్వహించాలని మన దేశంలో ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఆ సదుద్దేశంతోనే రాజమహేంద్రవరానికి చెందిన రోటరీ క్లబ్ ప్రతినిధి పట్టపగలు వెంకటరావు గోదావరి గట్టున అత్యంత ప్రతిష్ఠాత్మకంగా 1997లో రోటరీ కైలాస భూమి పేరుతో శ్మశానాన్ని నిర్మించారు. 17.52 ఎకరాల్లో ఉన్న ఈ కైలాసభూమిలో కొంత స్థలాన్ని మృతదేహాలను పూడ్చేందుకు కేటాయించారు. దహనం చేయాలనుకుంటే కట్టెలనూ వారే అందిస్తారు. 3 ఎకరాల్లో చెట్లు, పూల మొక్కలు ఉంటాయి. సంప్రదాయానికి తగినట్లు క్రతువులు నిర్వహించడానికి అన్ని మౌలికవసతులనూ కల్పించారు. అవసరం పడితే కైలాసభూమికి చెందిన వాహనాల్లో మృతదేహాలను తీసుకొచ్చి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తారు. తక్కువ మొత్తాల్లోనే రుసుములు ఉంటాయి. ఇక్కడ దహనం చేసినవారి చితాభస్మంతో కైలాసభూమిని ఆనుకుని ఉన్న మహాకాళేశ్వర ఆలయంలోని శివుడికి తెల్లవారుజామున అభిషేకమూ నిర్వహిస్తారు.

- ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే-రాజమహేంద్రవరం (ఏవీఏ రోడ్డు)

ఈ రోడ్డును పరిచేయవచ్చు!



చతురస్రాకార గడుల్లాగా ఉండే పొడవైన షీట్లు రోడ్లపై చకచకా పరిచేయడం, దానిపై రోడ్డు రోలర్‌తో ఓసారి తొక్కించడం, ఆపై తారు మిశ్రమాన్ని వేసి మళ్లీ రోలింగ్ చేయడం. అంతే.. రోడ్డు పూర్తయిపోతుంది! తక్కువ ఖర్చు, ఎక్కువ మన్నిక అన్నట్లున్న 'గ్లాస్‌గ్రిడ్ రాపిడ్' సాంకేతికతను తొలిసారిగా జాతీయ రహదారుల నిర్మాణంలో వినియోగిస్తోంది ఎన్‌హెచ్ఏఐ. తమిళనాడులోని చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవేపై ఈ సాంకేతికతను పరీక్షిస్తున్నారు. రాణిపేట జిల్లా వాలాజ నుంచి కృష్ణగిరి దాకా 148 కి.మీ. పొడవునా వేస్తున్నారు.

ఏమిటీ సాంకేతికత..

'గ్లాస్‌గ్రిడ్ రాపిడ్' పేరుతో ఫ్రాన్స్‌కు చెందిన సెయింట్ గోబెన్ సంస్థ దీనిని అభివృద్ధి చేసింది. వారు రూపొందించిన షీట్ రోల్ ఒక్కోటి మీటరు వెడల్పుతో ఉంటుంది. దానిపై దృఢత్వాన్ని పెంచే గ్లాస్ ఫైబర్‌తో అల్లిన చతురస్రాకార గడులు ఉంటాయి. ఒక్కో గడి 25 చ.మి.మీ. ఉంటుంది. ఈ షీట్‌కు అనుబంధంగా ఇసుక, తారు మిశ్రమం పొరలు ఉంటాయి. షీట్ కింది భాగాన రోడ్డుకు ఇట్టే అతుక్కునే జిగట పదార్థం ఉంటుంది. ఎక్కడ రోడ్డు వేయాలో అక్కడ ఆ షీట్ పరిచి, ఓసారి రోలింగ్ చేసి, తర్వాత దీనిమీద 40 ఎంఎం తారు మిశ్రమాన్ని వేసి రోడ్డేస్తున్నారు.



గ్లాస్‌గ్రిడ్ రాపిడ్ షీట్

లాభాలు బోలెడు

- రోడ్డు జీవితకాలం 3 రెట్లు పెరగడంతో పాటు నిర్వహణ ఖర్చులో 50 శాతం ఆదా అవుతుందని నిపుణులు వెల్లడిస్తున్నారు. వర్షాకాలంలో నీటిని పీల్చుకోకుండా 10 శాతం అదనపు భద్రత ఇస్తుందని చెబుతున్నారు.
- సహజంగా రోడ్డువేసే ముందు తారుతో కోటింగ్ చేస్తారు. దీనికి ఆ అవసరం ఉండదని అధికారులు వివరిస్తున్నారు. రోడ్డును తవ్వి లేదా తవ్వకుండా కూడా ఈ సాంకేతికతను వినియోగించవచ్చని తెలిపారు.

జారదు.. చీలదు..

ఈ షీట్లను పరిచి రోడ్డు వేశాక.. పైనుంచి వాహనాలు వెళ్లినా చీలికలు రాకుండా, జారిపోకుండా వృద్ధి చేశారని, తమిళనాడులో ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులు వివరిస్తున్నారు. పరీక్షించేందుకే చెప్పారు. ఇదే రాపిడ్ సాంకేతికతను రోడ్డు విస్తరణకు, రోడ్డు మరమ్మతులకు కూడా వినియోగించవచ్చని చెబుతున్నారు. – ఈనాడు–చెన్నై

దుంపతెగ.. ఇంత పొడవా!



కంద మొక్కలు సాధారణంగా 5 నుంచి 6 అడుగులు ఎదుగుతాయి. కానీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లికి చెందిన భాగ్యవతి ఇంటి పెరట్లోని తియ్యకంద మొక్క సుమారు 12 అడుగుల పొడవు పెరిగింది. ఏడాది క్రితం మొక్కను నాటి వదిలేశామని.. ఇంత ఎత్తు పెరుగుతుందని ఊహించలేదని ఆమె తెలిపారు. – న్యూస్‌టుడే, కోనసీమ

తీగ పాము కాకుండా... ప్లగ్ పగబట్టకుండా!

వానల్లో విద్యుత్తు ప్రమాదాలకు చెక్ పెడదాం



● ఆడుకుంటూ బంతి కోసం రింగ్ మెయిన్ యూనిట్ చెంతకు వెళ్లిన బాలుడు విద్యుదాఘాతంతో గాయాలపాలయ్యాడు.

● పొలంలో మోటారు ఆన్ చేయడానికి వెళ్లిన ఓ రైతు షాకొట్టి [illegible] మారారు.

● ట్రాన్స్‌ఫార్మర్‌కు చేరువగా వెళ్లి ఓ మూగ జీవి మృత్యువాతపడింది.

అసలే వానాకాలం... బడి, గుడి, ఇల్లు, పొలం, రోడ్డు... ఎక్కడ చూసినా తెగిపడిన తీగలు... రక్షణ లేని విద్యుత్తు వ్యవస్థలు కాలనాగుల్లా కాచుకుని ఉంటాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా నిండు ప్రాణాలను బలి తీసుకుంటాయి. మరి మనమేం చేయాలి...

ఇంట్లో ఇలా...



● ఐఎస్ఐ మార్క్ ఉన్న విద్యుత్తు ఉపకరణాలు, ఎలక్ట్రిక్ సామగ్రినే ఉపయోగించాలి. ప్రస్తుతం నకిలీవి ఎక్కువగా చెలామణి అవుతున్నాయి. అప్రమత్తంగా ఉండాలి.

● ఇంట్లో మిక్సీ, ఇస్త్రీపెట్టె వంటి వాటికి తప్పక మూడు పిన్‌లు ఉన్న ప్లగ్‌నే ఉపయోగించాలి. ఇందులో మూడో వైర్ ఎర్తింగ్‌గా పనిచేస్తుంది.

● ఇంట్లో 15 ఏళ్లు దాటిన పాత తీగలు, అతుకులు ఉన్నవాటిని మార్చుకోవాలి. లేకపోతే లోడ్ పెరిగినప్పుడు షార్ట్ సర్క్యూట్లు జరిగేందుకు ఆస్కారం ఉంటుంది.

● వానాకాలంలో వర్షపు నీరు ఇంటి గోడల్లోకి దిగుతుంటే వెంటనే మరమ్మతులు చేయించుకోవాలి. ఎక్కడైనా విద్యుత్తు లీకేజీ ఉంటే చాలా ప్రమాదం.

● భవనాల మీద కేబుల్ తీగలతో ప్రమాదాలు జరుగుతుంటాయి. వీటిని వానాకాలంలో తాకవద్దు. ఊరు వెళ్లేటప్పుడు ఇంట్లో ఉన్న విద్యుత్తు మెయిన్ స్విచ్ ఆఫ్ చేయడం మేలు.

తడి చేతులు ప్రమాదం..

● చేతులు తడిగా ఉన్నప్పుడు స్విచ్‌లు, ఇతర పరికరాలను తాకకూడదు. స్విచ్ ఆఫ్ చేయకుండా ఉపకరణాల ప్లగ్‌ను తీయొద్దు.

● పిల్లలకు అందనంత ఎత్తులో ప్లగ్‌లు ఏర్పాటు చేసుకోవాలి. కిందివరకే ఏర్పాటుచేసి ఉంటే పిల్లలు పెట్టకుండా టేపుతో మూసేయాలి.

● కొత్తగా కట్టే ఇంటికి నీటిని పట్టేటప్పుడు సమీపంలో విద్యుత్తు తీగలను, పరికరాలను గమనించాలి. వాటిపై పడకుండా జాగ్రత్తగా నీటిని పట్టాలి.

● ఆరవేసిన బట్టలు తీగలపై పడితే వాటిని తీయడానికి ఇనుప తీగలు, రాడ్లను వాడొద్దు. సహాయం కావాలంటే విద్యుత్తు కంట్రోల్ సెంటర్ నంబరు 1912కి ఫిర్యాదు చేయాలి.

● రహదారులపై వెళ్లేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్తు స్తంభాలను తాకవద్దని పిల్లలకు చెప్పాలి. ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా నడవమని వివరించండి.

● విద్యుత్తు తీగల సమీపంలో మూత్ర విసర్జన చేయకూడదు. షాక్ కొట్టే ప్రమాదం ఉంది.

● విద్యుదాఘాతంతో మంటలు అంటుకుంటే ముందుగా మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. నీళ్ల బదులుగా పొడి ఇసుక, మట్టి పోయాలి. కార్బన్ డైయాక్సైడ్ వాడొచ్చు.



పొలంలో పక్కాగా..

● గ్రామీణ ప్రాంతాల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్తు సిబ్బంది చేయాల్సిన పనులు సొంతంగా చేసేందుకు ప్రయత్నించొద్దు.

● వ్యవసాయ పంపు సెట్లకు తప్పనిసరిగా ఎర్తింగ్ ఉండాలి. తీగలను వదులుగా నేలపై ఉంచకూడదు. కర్రలతో కాకుండా పక్కాగా స్తంభాలు వేసుకోవాలి.

● పంపుసెట్లకు సరైన ఫ్యూజులను ఏర్పాటు చేసుకోవాలి. స్విచ్‌బోర్డులో నీరు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

● అడవి జంతువుల నుంచి పంటలను రక్షించుకునేందుకు పొలం చుట్టు విద్యుత్తు కంచె ఏర్పాటు చేయడం చాలా ప్రమాదకరం.

● చెట్ల మధ్య నుంచి వెళుతున్న విద్యుత్తు తీగలతో జాగ్రత్తగా ఉండాలి. వానాకాలంలో తీగలు వెళ్లిన చెట్లను పశువులు తాకొద్దు.



- ఈనాడు, హైదరాబాద్

సర్క్యూట్లు భద్రం

● ఇళ్లలో ఎర్తింగ్ తీగలు లాగుతున్నారు కానీ ఎర్తింగ్ గుంతలు తీసుకోవడం లేదు. అవి తప్పనిసరిగా ఉండాలి.

● ప్రతి ఇంట్లో రెసిడ్యువల్ కరెంట్ సర్క్యూట్ బ్రేకర్ (ఆర్‌సీసీబీ)ని తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలి. సర్క్యూట్‌లో ఏదైనా లీకేజీ కరెంట్ గుర్తించినప్పుడు ఇది ఆటోమేటిక్‌గా ట్రిప్ అయ్యేలా చేస్తుంది.



● అధిక వేడి, విద్యుత్తు వైఫల్యాలను నివారించడానికి సరైన కేబుల్ ఉండాలి. లైట్ పాయింట్లకు 1.5 స్క్వేర్ ఎం.ఎం., సాకెట్లకు 2.5 స్క్వేర్ ఎం.ఎం., ఏసీ యూనిట్లకు 4 స్క్వేర్ ఎం.ఎం. ఉండాలి.

● ప్రభుత్వం సర్టిఫై చేసిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లతో పనులు చేయించుకోవడం మేలు.

– టి.కాంతారావు, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్

సీఎం చంద్రబాబును కలిసిన థాయ్ ప్రతినిధి బృందం


రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చ



థాయ్ కాన్సుల్ జనరల్ రాచా అరిబార్గ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: చెన్నైలోని రాయల్ థాయ్ కాన్సుల్ జనరల్ రాచా అరిబార్గ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సీఎం చంద్రబాబుతో అమరావతిలో సమావేశమైంది. వీరితో పాటు సీపీఎఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రతినిధులూ ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, పలు అంశాల్లో సహకారంపై సమావేశంలో చర్చించామని సీఎం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ★ రాష్ట్రంలో హైడ్రోజన్, గ్రీన్ డీఏపీ ఉత్పత్తి ప్లాంట్‌ల ఏర్పాటుకు ఆస్ట్రేలియాకు చెందిన హెచ్‌2ఏ ప్రైవేట్ లిమిటెడ్, హెల్క్స్ సంస్థల ప్రతినిధులు ఆసక్తి వ్యక్తం చేశారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని సచివాలయంలో కలిసి తమ ప్రతిపాదనలను వివరించారు.


రాఘవేంద్రస్వామి సప్తరాత్రోత్సవాల్లో పాల్గొనాలని సీఎంకు ఆహ్వానం



సీఎం చంద్రబాబుకు ఆహ్వానపత్రిక ఇస్తున్న శ్రీమఠం సహాయ మేనేజర్ నరసింహమూర్తి, సూపరింటెండెంట్ అనంతపురాణిక్

మంత్రాలయం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్ర స్వామి సప్త రాత్రోత్సవాల్లో పాల్గొనాలని సీఎం చంద్రబాబును శ్రీమఠం అధికారులు ఆహ్వానించారు. మంగళవారం ఆయనను విజయవాడలోని స్వగృహంలో కలుసుకున్న శ్రీమఠం సహాయ మేనేజర్ నరసింహమూర్తి, అనంతపురాణిక్‌లు ఆహ్వానపత్రికతో పాటు జ్ఞాపికను అందజేశారు. ★ వైకాపా అధినేత జగన్‌నూ శ్రీమఠం నిర్వాహకులు కలిసి ఆహ్వానించారు.

శిథిలమవుతున్న 'అరుంధతి' కోట



నవాబు బంగ్లా



లోపలి భాగంలో పెచ్చులూడి పడిపోయిన పైకప్పు

అరుంధతి సినిమా అనగానే అందరికీ గుర్తుకొచ్చేది ఆ చిత్రంలో చూపించిన కోట. నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం పాతపాడు గ్రామ శివారులోనే ఆ కోట ఉంది. ఆ సినిమా చిత్రీకరణ తర్వాతి నుంచి దీన్ని అరుంధతి బంగ్లా అనే పిలుస్తున్నారు. నిజానికి ఈ కట్టడాన్ని బనగానపల్లి చివరి నవాబు మీర్‌ఫజల్ అలీఖాన్ 120 ఏళ్ల క్రితం నిర్మించారు. ఇక్కడ ఎన్నో సినిమాలు, సీరియళ్ల చిత్రీకరణ జరుపుకొన్నాయి. ఇలా చారిత్రకంగానే కాకుండా పర్యాటకంగానూ ఎంతో ప్రాముఖ్యం ఉన్న ఈ బంగ్లా నేడు శిథిలావస్థకు చేరుకుంది. నవాబు వారసులమని చెప్పుకొంటున్న వారు సందర్శకుల దగ్గర రుసుము వసూలు చేస్తున్నా.. కట్టడం సంరక్షణకు చర్యలు తీసుకోవడం లేదు. ఈ కోటకు మరమ్మతులు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పాతపాడు (బనగానపల్లి గ్రామీణం)

పాచిన అన్నం.. జీతం అడిగితే దెబ్బలు!

- రొయ్యల చెరువుల వద్ద ఇతర రాష్ట్రాల కూలీలతో వెట్టిచాకిరీ
- అధికారుల చొరవతో ప్రకాశం జిల్లాలో 40 మందికి విముక్తి





వెట్టిచాకిరీ బాధితులకు విముక్తి కల్పిస్తున్న అధికారులు ★ ఈ బాలలు కూడా బాధితులే

ఈనాడు, ఒంగోలు: 'ఊరు కాని ఊరు.. భాష తెలియదు. ఇరుకు గదిలో పది మందిని కుక్కేశారు.. ఆకలేస్తోందంటే పాచిపోయిన అన్నం పెట్టేవారు. పొద్దున్నే లేచి పని చేయకపోతే కొట్టేవారు. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. అడిగితే గదిలో నిర్బంధించారు. బస్తర్ కలెక్టర్ స్పందించడంతో బయటపడ్డాం' అని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు ఆవేదనతో చెప్పారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని రొయ్యల చెరువుల వద్ద వెట్టిచాకిరీ చేస్తున్న 40 మంది కార్మికులు.. అధికారుల చొరవతో సోమవారం బయటపడ్డారు. ఇందులో పది మంది వరకు బాలలే. తనిఖీల్లో బయటపడకుండా వీరి ఆధార్ కార్డుల్లో వయసు వివరాలు మార్చేయడం గమనార్హం.

రోజుకు రూ.500 ఇస్తామని..

రోజుకు రూ.500 చొప్పున నెలకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి 40 మందిని ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని రొయ్యల చెరువుల వద్ద పనికి తీసుకొచ్చారు. వీరిలో ఎక్కువ మంది 14- 21 సంవత్సరాల వయసువారే. ఇందులో 8 మంది అమ్మాయిలూ ఉన్నారు. వీరందరినీ చెరువుల వద్ద దాణా నిల్వ చేసే గదిలోనే ఉంచారు. భోజనం సరిగా పెట్టడం లేదు. రెండు నెలలయినా వేతనం ఇవ్వకపోయేసరికి కొందరు ప్రశ్నించారు. వారిని గదిలో నిర్బంధించి కొట్టారు. ఈ క్రమంలో ఒక కూలీ తప్పించుకొని ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో స్వస్థలానికి వెళ్లి, అక్కడి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బస్తర్ కలెక్టర్ అక్కడి నుంచి ఓ బృందాన్ని పంపించడంతో వారు స్థానిక అధికారులతో కలిసి టంగుటూరు మండలంలోని రొయ్యల చెరువుల వద్ద దాడులు నిర్వహించారు. భోజనం బాగాలేదని, వేతనాలు అడిగితే కాపలాదారులు ఇనుపరాడ్లు, కర్రలతో కొట్టారని బాధితులు గాయాలను తనిఖీ అధికారులకు చూపించారు. ఉదయం ఆరు గంటల నుంచి చీకటిపడే వరకు తమతో పని చేయిస్తున్నారని వాపోయారు. ఈ తనిఖీల్లో ఒడిశాకు చెందిన 17 మంది, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 23 మందికి విముక్తి కల్పించామని ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న మంగళవారం తెలిపారు. వెట్టిచాకిరీ చేయిస్తున్న రొయ్యల చెరువుల యజమానులపై కేసులు నమోదు చేయించామన్నారు.

దళారులు దోచేస్తున్నారిలా..

విజయవాడకు చెందిన దళారి ఇతర రాష్ట్రాల్లోని ఏజెంట్ల సాయంతో కూలీలను తీసుకొచ్చి ఇక్కడ పనికి కుదురుస్తున్నారు. వీరు కూలీలకు ఇచ్చే వేతనంలో చెరి కొంత తీసుకుంటున్నారు. యజమాని నుంచి ఒక నెల జీతం అడ్వాన్సుగా తీసుకొని, కూలీల కుటుంబాలకు ఇవ్వాలి. దళారులే ఆ మొత్తం జేబులో వేసుకుంటున్నారు.

సాగు మౌలిక వసతుల నిధిగా ఏపీకి రూ.6,540 కోట్లు

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ మౌలిక వసతుల నిధి పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు 2025-26 వరకు రూ.6,540 కోట్లు కేటాయించినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. మంగళవారం లోక్‌సభలో జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. ఈ పథకం కింద మొత్తం రూ.లక్ష కోట్లు కేటాయించామని, అందువల్ల రాష్ట్రాలు ఈ పథకాన్ని రూ.లక్ష కోట్ల కేటాయింపులు పూర్తయ్యేంత వరకూ ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ★ ఏపీలో ప్రతి వ్యవసాయ కుటుంబంపై తలసరి రూ.2.45 లక్షల అప్పు ఉన్నట్లు మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతి రైతు కుటుంబంపై సగటున రూ.74,121 అప్పు ఉందని, దాంతో పోలిస్తే ఏపీలోని కుటుంబాలపై 2.31 రెట్లు అధికంగా ఉన్నట్లు వెల్లడించారు.

విశాఖ ఐఐపీని విస్తరించే ప్రతిపాదన లేదు

విశాఖపట్నం సమీపంలోని అచ్యుతాపురం సెజ్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ సెంటర్‌ను విస్తరించే ఉద్దేశమేమీ ప్రస్తుతానికి లేదని కేంద్ర వాణిజ్య శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. ఆయన లోక్‌సభలో విశాఖ తెదేపా ఎంపీ ఎం.శ్రీభరత్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. 'ఏపీఐఐసీ లీజుకు ఇచ్చిన స్థలంలో ప్రస్తుతం ఐఐపీ కేంద్రం నడుస్తోంది. దీని ప్రాంతీయ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. ప్రస్తుతానికి విశాఖలో స్వల్పకాల శిక్షణ కోర్సులు నడుస్తున్నాయి. దీని కార్యకలాపాలను విస్తరించే ప్రతిపాదన ప్రస్తుతానికి లేదు' అని వివరించారు.

రెండు సర్పంచి, మూడు ఎంపీటీసీ స్థానాల్లో.. తెదేపా బలపరిచిన అభ్యర్థుల ఏకగ్రీవ ఎన్నిక

ఈనాడు, అమరావతి: స్థానిక సంస్థల్లో వివిధ స్థానాలకు మంగళవారం నిర్వహించిన ఉప ఎన్నికల్లో తెదేపా బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ ప్రకటించింది. 'తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం గ్రామీణంలో కడియపులంక సర్పంచిగా ఎం.పద్మావతి, ప్రకాశం జిల్లా కొండపి పంచాయతీ సర్పంచిగా కె.సుశీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొండపి పంచాయతీలోని 14 వార్డు సభ్యుల స్థానాలూ తెదేపా ఖాతాలో చేరాయి. కుప్పం నియోజకవర్గంలో మణీంద్రం, మాచర్ల నియోజకవర్గంలో వేపకంపల్లి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరులోని విడవలూరు-1 ఎంపీటీసీ స్థానాల్లోనూ తెదేపా బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు' అని తెదేపా కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రముఖ రచయిత, గాంధేయవాది కోడూరి శ్రీరామమూర్తి కన్నుమూత



రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రముఖ కథా రచయిత, సాహితీ విమర్శకుడు కోడూరి శ్రీరామమూర్తి (84) తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని స్వగృహంలో మంగళవారం సాయంత్రం కన్నుమూశారు. సాహితీ విమర్శకుడిగా, రచయితగా తెలుగు పాఠకులకు ఆయన సుపరిచితులు. 1941 సెప్టెంబరు 29న రాజమహేంద్రవరంలో జన్మించారు. మూడున్నర దశాబ్దాలపాటు బొబ్బిలిలోని రాజారంగారావు కళాశాలలో ప్రధాన ఉపన్యాసకులుగా పనిచేసిన ఆయన పదవీ విరమణ అనంతరం రాజమహేంద్రవరంలోనే స్థిరపడ్డారు. తల్లి లీలావతీదేవి ప్రసిద్ధ రచయిత్రి. తండ్రి పుల్లేశ్వరరావు. తల్లి నుంచి వచ్చిన సాహితీ వారసత్వంతో 60 ఏళ్లుగా అనేక రచనలు సాగించారు. ముఖ్యంగా గాంధీజీపై పరిశోధించి అనేక పుస్తకాలు రచించి గాంధేయవాదిగా పేరొందారు. మనకు తెలియని మహాత్ముడు, మహాత్ముని ప్రస్థానం, బాపూ నడిచిన బాట, మహాత్ముని సత్యాగ్రహాలు, మరో కోణంలోంచి మహాత్ముడు, గాంధేయ విలువల్లో నైతికత తదితర రచనలు చేశారు. వీటితోపాటు జీవిత చరిత్రలు, బాలసాహిత్యం, కథలు, నవలలతో పాటు 'ఈనాడు'లో అనేక వ్యాసాలు రాశారు. 'తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ' అనే గ్రంథానికి ఉత్తమ సాహితీ విమర్శగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. 'రాగమాలిక' అనే చారిత్రక నవలకు కృష్ణాపత్రిక గోల్డెన్ జూబ్లీ పురస్కారం అందుకున్నారు. 'తెలుగు కథ నాడు నేడు' గ్రంథానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం పొందారు. శ్రీరామమూర్తి చివరి రచనలు 'రచయితగా మహాత్ముడు', 'మహాత్ముని అడుగు జాడలు' గ్రంథాల ఆవిష్కరణ సభ ఈ ఏడాది ఏప్రిల్ 28న జరిగిందని ఆయన బంధువు దేవత సుధాకర్ తెలిపారు. శ్రీరామమూర్తి భార్య భారతి రెండేళ్ల క్రితం కన్నుమూశారు. పెద్దబ్బాయి హైదరాబాద్‌లో, చిన్న కుమారుడు అమెరికాలో ఉంటున్నారు.

దేశ ఎగుమతుల్లో తెలుగు రాష్ట్రాలకు 6, 7 స్థానాలు

ఈనాడు వాణిజ్య విభాగం: మన దేశం నుంచి గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.37.02 లక్షల కోట్ల (437.42 బిలియన్ డాలర్ల) విలువైన ఎగుమతులు జరిగాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఫియో) మంగళవారం వెల్లడించింది. ఇందులో 116.33 బిలియన్ డాలర్ల (రూ.9.83 లక్షల కోట్ల) విలువైన ఎగుమతులతో గుజరాత్ అగ్రస్థానంలో ఉందని తెలిపింది. దేశీయ ఎగుమతుల్లో గుజరాత్ వాటా 26.6 శాతంగా ఉంది. గుజరాత్‌లోని జామ్‌నగర్ నుంచే రూ.3.63 లక్షల కోట్ల విలువైన పెట్రోలియం, రిఫైనరీ ఉత్పత్తులు ఎగుమతి కావడంతో ఆ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని వెల్లడించింది. తెలుగు రాష్ట్రాలు ఎగుమతుల పరంగా 6, 7 రాష్ట్రాల్లో నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ ఎగుమతుల్లో 24.40%, తెలంగాణ ఎగుమతుల్లో 23.60% అమెరికాకే చేరుతున్నాయి. తెలంగాణ ఎగుమతుల్లో 29.47% ఎయిర్‌క్రాఫ్ట్, స్పేస్‌క్రాఫ్ట్‌ల విడిభాగాలు, 26.80% ఔషధ ఫార్ములేషన్లు, బయోలాజిక్స్ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ఎగుమతుల్లో 15.45% మత్స్య ఉత్పత్తులు, 10.38% ఔషధ ఫార్ములేషన్లు-బయోలాజిక్స్ ఉన్నాయి.

రాష్ట్రం	ఎగుమతులు(బి.డా.)	వాటా(%)
గుజరాత్	116.33	26.60
మహారాష్ట్ర	65.86	15.06
తమిళనాడు	52.07	11.90
కర్ణాటక	30.48	6.97
ఉత్తర్‌ప్రదేశ్	21.98	5.03
ఆంధ్రప్రదేశ్	20.78	4.75
తెలంగాణ	19.12	4.37

తప్పుల తడకగా డీఎస్సీ బయాలజీ షిఫ్ట్-2 ప్రాథమిక కీ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: మెగా డీఎస్సీ-2025లో భాగంగా జూన్ 10న నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ బయాలజీ షిఫ్ట్-2 పరీక్షకు సంబంధించి ప్రాథమిక కీలో తప్పులు దొర్లాయని అభ్యర్థులు వాపోతున్నారు. దీనిపై ఫిర్యాదు చేసినప్పటికీ తుది కీ లోనూ ఎటువంటి మార్పూ చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరీక్షకు సంబంధించి 14 నుంచి 16 ప్రశ్నల వరకు తప్పులు దొర్లినట్లు వారు చెబుతున్నారు. షిఫ్ట్ -2లో రాష్ట్ర వ్యాప్తంగా 9వేల మంది పరీక్ష రాశారని, తుది కీలో అభ్యంతరాలను సరిగా పరిశీలించనందున తామంతా నష్టపోతున్నామని వారు వాపోతున్నారు. దీనిపై మంగళగిరిలోని విద్యాభవన్‌కు మంగళవారం పలువురు అభ్యర్థులు వెళ్లి డీఎస్సీ కన్వీనర్ కృష్ణారెడ్డిని కలిసి ఆధారాలతో వివరించినట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

త్వరితగతిన సాగరమాల ప్రాజెక్టుల పనులు

- అధికారులతో మంత్రి జనార్దన్‌రెడ్డి సమీక్ష

ఈనాడు, అమరావతి: సాగరమాల 2.0 కార్యక్రమం కింద ఏపీ మారిటైం బోర్డు ద్వారా రూ.14,733 కోట్లతో చేపట్టబోయే పనుల ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి ఎక్కువ ప్రయోజనం చేకూర్చేలా చూడాలని సూచించారు. సాగరమాల 7వ రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశం సచివాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ పథకంలో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. వాటి అమలులో ఉన్న ఇబ్బందులను అధిగమించి, త్వరగా పూర్తిచేయాలని సూచించారు. 'ఏపీ మారిటైం బోర్డు ద్వారా రూ.1,584 కోట్లతో 6 పనులు, విశాఖ పోర్టు ద్వారా రూ.1,264 కోట్లతో చేపట్టిన 10 ప్రాజెక్టులు, పర్యాటక శాఖ ద్వారా రూ.245 కోట్లతో చేపట్టిన 4 పనులు, మత్స్య శాఖ ద్వారా రూ.32 కోట్లతో చేపట్టిన 2 పనులను వేగంగా పూర్తిచేయాలి' అని మంత్రి ఆదేశించారు.

వ్యాధులపై సంధించే సహజసిద్ధ ఆయుధం!



విటమిన్-సి అనేది కేవలం ఒక పోషకమే కాదు. వ్యాధులపై మన శరీరం సంధించే సహజసిద్ధ ఆయుధమది. విటమిన్-సి.. దేహంలో ఇన్‌ఫ్లమేషన్‌పై పోరాడుతుంది. హానికర ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తుంది. సహజసిద్ధ యాంటీబయాటిక్ ఔషధంలా పనిచేస్తుంది. కణాలు త్వరగా దెబ్బతినకుండా కాపాడుతుంది. విటమిన్-సి పుష్కలంగా లభించే నారింజ, నిమ్మ, కివీ, స్ట్రాబెరీ వంటి ఫలాలను తరచూ తినండి.

– జానీ బ్రౌన్, హెల్త్ కోచ్

గీత కార్మికులతో.. తెదేపాది కుటుంబ బంధం: గురుమూర్తి

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వం గీత వృత్తిని నిర్వీర్యం చేసి, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీసిందని గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి ఆరోపించారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నూతన మద్యం విధానంలో దుకాణాలు, బార్లలో 10 శాతం గీత కార్మికులకు కేటాయించాలనే నిర్ణయంపై హర్షం వ్యక్తంచేస్తూ కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కల్లు గీత కార్మికులతో తెదేపాకు ఉన్నది కుటుంబ బంధమని దానిని ఎవరూ విడదీయలేరని స్పష్టంచేశారు.

ఏటీఎస్ కేంద్రాల్లో చేతివాటం

- వాహనాల ఫిట్‌నెస్‌కు అదనపు వసూళ్లు
- రూ.3 వేల వరకు మామూళ్లు
- కొన్నిచోట్ల ఆర్టీఏ ఏజెంట్లే కీలకం

ఈనాడు, అమరావతి: వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షల్లో రవాణాశాఖ అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతుండటంతో.. దీనికి చెక్‌పెట్టేందుకు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను (ఏటీఎస్) తీసుకొస్తే వాటిలో కూడా మామూళ్ల పర్వం మొదలైపోయింది. కొన్ని కేంద్రాల్లో వాహనాన్ని బట్టి రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. గతంలో రవాణాశాఖ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేవారు. ముందుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న స్లాట్ ప్రకారం వాహనాన్ని.. రవాణాశాఖ కార్యాలయానికి తీసుకెళితే, అధికారులు పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) జారీచేసేవారు. కేంద్ర ప్రభుత్వ సూచనతో రాష్ట్రంలో ఏటీఎస్‌ల ద్వారా ఎఫ్‌సీలు జారీచేసే విధానాన్ని గత ఏడాది అమల్లోకి తీసుకొచ్చారు. జిల్లాకు ఓ ఏటీఎస్ చొప్పున ఏర్పాటుచేసేందుకు అవకాశం కల్పించారు. ఇప్పటివరకు 17 జిల్లాల్లో ఏటీఎస్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఇక్కడ కొన్నింటిలో ఏటీఎస్ నిర్వాహకులు.. మరి కొన్ని చోట్ల ఆర్టీయే ఏజెంట్లే కీలకంగా మారి మామూళ్లు వసూలు చేస్తున్నారు.

వాహనాన్ని బట్టి రేటు..

◆ లారీలు, బస్సులు వంటి భారీ వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్ష ఫీజు రూ.వెయ్యి, సర్టిఫికెట్ కోసం రూ.200, సర్వీస్ ఛార్జి రూ.120 కలిపి మొత్తం రూ.1,320 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. చిన్నతరహా వాహనాలు, కార్లు, ఆటోలు వంటి వాటికి మొత్తం రూ.860 నుంచి రూ.920 వరకు చెల్లించాల్సి ఉంది.

◆ కొన్ని ఏటీఎస్‌ల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో చెల్లించిన ఫీజుతో సంబంధం లేకుండా, భారీ వాహనాలకు రూ.2 వేల నుంచి రూ.3 వేలు వరకు రాబడుతున్నారు. చిన్న వాహనాలకు రూ.వెయ్యి వసూలు చేస్తున్నారు.

◆ కొందరు ఫిక్స్‌డ్‌గా ప్రతి వాహనానికీ రూ.వెయ్యి అనేది నిర్ణయించారు.

◆ ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం పార్వతీపురం జిల్లాల ఏటీఎస్‌లపై ఫిర్యాదులు ఉన్నాయి. వీటిని ఓ రిటైర్డ్ రవాణాశాఖ అధికారి కుటుంబీకులు నిర్వహిస్తున్నారు. ఆ రిటైర్డ్ అధికారే వసూళ్ల వ్యవహారం చూస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

◆ ఎన్టీఆర్ జిల్లా ఏటీఎస్ కొన్ని నెలల కిందట ప్రారంభించగా, కృష్ణా జిల్లా ఏటీఎస్ ఇటీవలే అందుబాటులోకి వచ్చింది. ఈ రెండు చోట్లా అదనపు వసూళ్లు ఆరంభించారు.

◆ గుంటూరు జిల్లా ఏటీఎస్‌పై కూడా ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయి.

◆ అనంతపురం, నంద్యాల, చిత్తూరు, కర్నూలు, తూర్పు గోదావరి.. తదితర ఏటీఎస్‌ల్లోనూ అదనపు సొమ్ము వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇప్పటివరకు 62,130 ఎఫ్‌సీలు జారీ

రాష్ట్రవ్యాప్తంగా 17 ఏటీఎస్‌లలో ఇప్పటివరకు 62,130 వాహనాలకు ఎఫ్‌సీలు జారీ అయ్యాయి. సగటున ప్రతి కేంద్రానికీ వచ్చే వాహనాల్లో 75-80 శాతం ఎఫ్‌సీలు జారీఅవుతున్నాయి. మిగిలినవి ఫెయిల్ అవుతున్నాయి.

ఆర్థికశాఖ కూడా కారణమే!

ఏటీఎస్ కేంద్రాల్లో అదనపు వసూళ్లకు ఆర్థికశాఖ కూడా కారణమనే మాట వినిపిస్తోంది. వాహనదారు చెల్లించే ఫీజులను.. ఏటీఎస్‌ల నిర్వాహకులకు ఇవ్వకుండా నెలల తరబడి ఆర్థికశాఖ మోకాలడ్డుతోంది. వాస్తవానికి తొలి రెండేళ్లు ఫీజు ఏటీఎస్ నిర్వాహకుడి ఖాతాలో చేరాలి. అయితే వేటికీ ఆర్థిక శాఖ బకాయిలు ఇవ్వడంలేదు. ఫీజులు నేరుగా ఏటీఎస్‌ల ఖాతాలో జమయ్యేలా చర్యలూ తీసుకోవడం లేదు. ఒక్కో ఏటీఎస్ నుంచి రూ.లక్షల్లో ముడుపులు ఇస్తేనే.. బకాయిలు చెల్లిస్తామనేలా ఆర్థికశాఖ వ్యవహరిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి.

రాజధానిలో ముంపు నివారణ కాలువలకు నెదర్లాండ్స్ డిజైన్లు

- మూడేళ్లలో రాజధానిని నిర్మించి.. విమర్శకుల నోళ్లు మూయిస్తాం
- మంత్రి పొంగూరి నారాయణ





తుళ్లూరు-అనంతవరం మధ్య కొండవీటి గ్రావిటీ కెనాల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, అధికారులు ● అమరావతిలో నిర్మాణంలో ఉన్న శాఖమూరు జలాశయం

తుళ్లూరు, న్యూస్‌టుడే: 'వచ్చే ఏడాది అక్టోబరు నాటికి అమరావతిలో కాలువలు, రిజర్వాయర్ల పనులు, వచ్చే ఏడాది మార్చి నాటికి రాజధానిలో నిర్మిస్తున్న 4వేల గృహ సముదాయాల తుదిదశ పనులు పూర్తిచేస్తాం. ఎవరెన్ని కుట్రలు పన్నినా, విమర్శలు చేసినా మూడేళ్లలో అమరావతిని పూర్తిచేసి తీరుతాం' అని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరి నారాయణ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన రాజధానిలో పర్యటించారు. ఏడీసీ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఛైర్మన్ లక్ష్మీపార్థసారథి, సీఆర్డీయే అధికారులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతవరం నర్సరీ, పార్కు, కొండవీటి, పాలవాగు, గ్రావిటీ కెనాల్, శాఖమూరు రిజర్వాయర్‌ను సందర్శించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. అమరావతి పనులు జరుగుతున్న విమర్శకుల నోళ్లు మూతపడేలా అనుకున్న సమయానికి రాజధానిని తీర్చిదిద్దుతామని చెప్పారు. రాజధానిలో ముంపు నివారణ కాలువల డిజైన్లను నెదర్లాండ్స్ నిపుణులతో చేయించామని, కొండవీటి వాగును 23.6 కి.మీ, పాలవాగు 16.5 కి.మీ, గ్రావిటీ కెనాల్‌ను 7.843 కి.మీ చొప్పున మొత్తం 47.94 కి.మీ మేర విశాలమైన కాలువలు నిర్మిస్తున్నామని చెప్పారు. వీటితో పాటు 50 ఎకరాల్లో శాఖమూరు రిజర్వాయర్ (0.03 టీఎంసీలు), 190 ఎకరాల్లో కృష్ణాయపాలెం రిజర్వాయర్ (0.1 టీఎంసీలు), 440 ఎకరాల్లో నీరుకొండ రిజర్వాయర్ (0.4 టీఎంసీల)ను నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ప్రతి రైతుకూ కౌలు చెల్లిస్తాం

రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన ప్రతి రైతుకూ కౌలు చెల్లిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ఈ ఏడాది 25 వేలమంది రైతులకు కౌలు సొమ్ము జమచేయాల్సి ఉండగా వివిధ కారణాలతో 7వేల మందికి నిలిచిపోయిందని, వారందరికి ప్రస్తుతం కౌలు చెల్లించామన్నారు. కౌలు అందనివారు సీఆర్డీయే వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

సీఎం చంద్రబాబుపై సింగపూర్ ప్రభుత్వానికి నమ్మకం

గత ప్రభుత్వం సింగపూర్‌కు సీఐడీ అధికారులను పంపి అక్కడి వారిపై విచారణ చేయించిందని, దీంతో ఆ దేశంతో రాష్ట్రానికి ఉన్న సత్సంబంధాలు దెబ్బతిన్నాయని మంత్రి అన్నారు. సీఎం చంద్రబాబు పర్యటనతో పరిస్థితులు మారాయని, ఆయనపై సింగపూర్ ప్రభుత్వానికి నమ్మకం ఉందని చెప్పారు. కార్యక్రమంలో సీఆర్డీయే ఇంజినీర్ గోపాలకృష్ణారెడ్డి, సీఈ ధనుంజయ్, ఇతర ఇంజినీర్లతో పాటు రాజధాని నిర్మాణ పనులను చేస్తున్న గుత్తేదారు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పనులు ముమ్మరం

అమరావతిలో వరదముంపు నివారణ కోసం ఏర్పాటుచేస్తున్న శాఖమూరు రిజర్వాయర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 50 ఎకరాల్లో 0.3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఈ జలాశయాన్ని నిర్మిస్తున్నారు. కొండవీటి వాగు వరదనీరు నీరుకొండ రిజర్వాయర్‌కు చేరుకొని అక్కడ నుంచి ఇందులోకి వస్తుంది.



జస్టిస్ తుహిన్‌కుమార్‌ను సన్మానించి శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చిదంబరం, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, కార్యవర్గ సభ్యులు

మిమ్మల్ని మీరు విశ్వసిస్తే.. విజయం మీ సొంతం

- జూనియర్ న్యాయవాదులను ఉద్దేశించి జస్టిస్ తుహిన్ కుమార్
- హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం

ఈనాడు, అమరావతి: 'నేను ఏది చేయగలను అని మిమ్మల్ని మీరు విశ్వసించండి. [illegible] పుస్తకాలు చదవండి. కేసుల విషయంలో కొంత హోమ్‌వర్క్, హార్డ్‌వర్క్ చేయండి. విజయం మీ సొంతం అవుతుంది' అని జూనియర్ న్యాయవాదులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్‌కుమార్ గేదెల సూచించారు. [illegible] అదనపు న్యాయమూర్తిగా తాజాగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో జస్టిస్ తుహిన్ కుమార్‌ను ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, అదనపు అడ్వొకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, రాష్ట్ర పీపీ మెండ లక్ష్మీనారాయణ, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్, ప్రధాన కార్యదర్శి సి.సుబోధ్, కార్యవర్గ సభ్యులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నాలా రద్దుపై ఆర్డినెన్స్!

- నేటి క్యాబినెట్ భేటీలో ఆమోదం
- మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు మేరకు



మంత్రి సత్యప్రసాద్

ఈనాడు, అమరావతి: భూ వినియోగ మార్పిడి (నాలా) బిల్లు రద్దు సిఫార్సులను బుధవారం జరిగే క్యాబినెట్ సమావేశంలో ప్రవేశపెట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఆ మేరకు ఆర్డినెన్స్ జారీకి గవర్నర్‌కు సిఫార్సు చేస్తూ మంత్రివర్గ భేటీలో నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఇకపై రెవెన్యూ శాఖ ద్వారా కాకుండా, స్థానిక సంస్థల ద్వారా భూ వినియోగ మార్పిడికి సంబంధించిన అనుమతుల జారీ ఉంటుంది. ల్యాండ్ కన్వర్షన్‌కు అనుమతి ఇచ్చేందుకు మార్కెట్ విలువలో 4% వరకు డెవలప్‌మెంట్ ఛార్జీ విధించే అవకాశముంది. దీనిపైనా క్యాబినెట్ భేటీలో అధికారిక నిర్ణయం వెలువడనుంది. కొత్త విధానం అమలుకు తగ్గట్లు పంచాయతీ, మున్సిపల్ శాఖల వద్దనున్న భూముల వివరాలను రెవెన్యూ శాఖకు చెందిన వెబ్‌ల్యాండ్‌తో అనుసంధానించనున్నారు. భూముల వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘంలోని సభ్యులు అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, ఎన్ఎండీ ఫరూక్‌లు సచివాలయంలో మంగళవారం సమావేశమై చర్చించారు. అనంతరం మంత్రి సత్యప్రసాద్ విలేకర్లతో మాట్లాడారు.

నివేదిక ఇచ్చేందుకు మరింత సమయం

'ఫ్రీహోల్డ్ భూముల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక అందించడంలో ఒకట్రెండు నెలలు జాప్యమయ్యే అవకాశముంది. గత వైకాపా ప్రభుత్వం ప్రైవేట్ భూములను అకారణంగా నిషిద్ధ జాబితాలో ఉంచిన వైనంపై సమగ్ర పరిశీలన చేయించి, వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని మంత్రి అనగాని వివరించారు. 'రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కలెక్టరేట్ల నిర్మాణాలకు భూముల అవసరం ఉంది. జిల్లా కేంద్రాలకు శివారు ప్రాంతాల్లో ఉండే ఫ్రీహోల్డ్ భూములను మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేయడానికి అవకాశాలున్నాయా అని ఆలోచిస్తున్నాం. అపరిష్కృతంగా ఉన్న ఇనాం భూముల సమస్యల పరిష్కారంపైనా సమావేశంలో చర్చించాం. రాష్ట్రంలో 70 ఎస్టేట్ ఇనాం, 60 అన్‌సెటిల్డ్ ఇనాం భూములు కలిగిన గ్రామాలున్నాయి. వీటి వివాద పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం అధిక ప్రాధాన్యమిస్తోంది' అని మంత్రి సత్యప్రసాద్ తెలిపారు. ఇదే సందర్భంలో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ 'ఫ్రీహోల్డ్ భూముల విషయంలో ప్రభుత్వం ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. గత ప్రభుత్వంలో భారీగా అవకతవకలు జరిగాయి. వీటిపై సమగ్ర పరిశీలనకు తగిన సమయం అవసరం' అని పేర్కొన్నారు.

రాజధాని అమరావతికి రాజముద్ర

- గెజిట్ నోటిఫికేషన్ తెచ్చేందుకు సమష్టిగా కృషి చేస్తాం
- గుంటూరులో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి- న్యూస్‌టుడే, నగరంపాలెం: 'రాజధాని అమరావతికి రాజముద్ర పడాలి. అందుకోసం గెజిట్ నోటిఫికేషన్ తెచ్చేందుకు సమష్టిగా కృషి చేసి త్వరలోనే సాకారం చేస్తాం. దీనిపై మొదటి నుంచీ మాట్లాడింది భాజపానే. పదేళ్లు ఉమ్మడి రాజధానికి అవకాశం ఉంది కాబట్టి అప్పటి ప్రభుత్వం ఆలోచించలేదు. అప్పుడే గెజిట్ నోటిఫికేషన్ వచ్చి ఉంటే మూడు రాజధానుల ఆలోచన వచ్చి ఉండేది కాదు' అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం రాజధాని రైతులను దగా చేసేందుకు ప్రయత్నించడంతో ఐదేళ్ల విలువైన సమయాన్ని కోల్పోయామన్నారు. భాజపా అమరావతినే రాజధానిగా నమ్ముతోందన్నారు.

రైతులను సంతృప్తి పరచడం ముఖ్యం

రాజధానికి భూములిచ్చిన రైతులకు చెప్పిన మాట ప్రకారం అభివృద్ధి చేసిన ప్లాట్లు అందించి సంతృప్తి పరచడం ప్రభుత్వ మొదటి కర్తవ్యమన్నారు. 12 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ఆ దిశగా అడుగులు లేకపోవడం బాధాకరమని.. వెంటనే దృష్టి పెట్టి భరోసా కల్పించాలన్నారు. రెండో విడత భూసమీకరణకు భాజపా అనుకూలమా? వ్యతిరేకమా అన్న ప్రశ్నపై స్పందిస్తూ ప్రత్యేకంగా ఆలోచించలేదని.. కాలానుగుణంగా ముందుకెళతామన్నారు. అమరావతిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి కేంద్రం ప్రత్యేకంగా నిధులు అందిస్తోందన్నారు. విశాఖలో కింగ్‌జార్జి ఆసుపత్రి, గుంటూరులో జిన్నాటవర్ వంటి వాటి పేర్లు మారుస్తామని ప్రకటించారు.



గుంటూరులో భాజపా ర్యాలీలో పాల్గొన్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు

జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ సాంకేతిక సభ్యుడిగా వేణుప్రసాద్



బాపట్ల, న్యూస్‌టుడే: జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ (జీఎస్టీఏటీ) ప్రిన్సిపల్ బెంచ్-దిల్లీ సాంకేతిక సభ్యుడిగా బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థి ఎ.వేణుప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు కేబినెట్ కమిటీ ఆన్ అపాయింట్‌మెంట్స్ ఉత్తర్వులు జారీచేసింది. పదవీ బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి నాలుగేళ్లు లేదా 67 సంవత్సరాల వయసు వచ్చేవరకు పదవీ కాలం ఉంటుంది. ఈ పదవికి హైకోర్టు న్యాయమూర్తి హోదా ఉంటుంది. వేణుప్రసాద్ గతంలో పంజాబ్ ప్రభుత్వంలో ప్రత్యేక ముఖ్యకార్యదర్శిగా పనిచేశారు.

క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ ప్రారంభం

ఈనాడు, అమరావతి: ఏపీ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్-2025ను మంగళవారం విట్-అమరావతిలో ప్రారంభించారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్ ప్రకటన తర్వాత చేపట్టిన వినూత్న కార్యక్రమమిది. క్వాంటమ్ సాంకేతికత ద్వారా లోతైన వైజ్ఞానిక, సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ హ్యాకథాన్ చేపట్టినట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రకటించింది. రక్షణ, రవాణా, ఔషధాల తయారీ, వ్యవసాయం, వాణిజ్యం లాంటి కీలక రంగాల్లో వాస్తవ సమస్యలకు క్వాంటమ్ ఆధారిత పరిష్కారాలను అందించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమానికి సైన్స్, టెక్నాలజీ విభాగం(డీఎస్‌టీ), ఐబీఎం, టీసీఎస్ వంటి సంస్థలు సహకారం అందిస్తున్నాయి. ఈ హ్యాకథాన్‌లో ప్రభుత్వ విభాగాలు, మంత్రిత్వ శాఖలు, ఎన్జీవోలు, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం తదితర కార్పొరేట్ సంస్థలు ఇచ్చిన సమస్యలపై విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు.

ఎరువుల కొరత అనే ప్రచారం నమ్మొద్దు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: ఎరువుల కొరత అంటూ వైకాపా నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఎక్కడైనా కృత్రిమ కొరత సృష్టించినా, మళ్లించినా, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించినా దుకాణం లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో మంగళవారం ఆయన విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎరువుల సరఫరా, నిల్వలపై సమీక్షించారు. యూరియా సరఫరాలో జాప్యం లేకుండా సహకార సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు దుకాణాల ద్వారా అందుబాటులో ఉంచామన్నారు. కొన్ని ప్రాంతాల్లో యూరియా అందడం లేదనే ఫిర్యాదులను వ్యవసాయ అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. వంశధార ప్రాజెక్టు నుంచి నీటిని ముందే విడుదల చేయడంతో శ్రీకాకుళం జిల్లాలో సాగు విస్తీర్ణం పెరిగిందని అక్కడి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మంత్రికి వివరించారు.

ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలి

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్

ఈనాడు, అమరావతి: ట్రూఅప్ ఛార్జీల పేరుతో గత వైకాపా ప్రభుత్వం రాష్ట్ర ప్రజల నెత్తిన పెద్ద భారాన్ని మోపిందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దాల్సిన కూటమి ప్రభుత్వం.. ప్రజల నుంచి ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేయడం అన్యాయమని ఆమె అన్నారు. ఏనాడో వాడిన విద్యుత్తుకు ఇప్పుడు అదనపు ఛార్జీలు వేయడం ఏంటని మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'ట్రూఅప్ ఛార్జీల వసూళ్లపై విద్యుత్తు నియంత్రణ మండలి ప్రజాభిప్రాయం సేకరిస్తోంది. రూ.12 వేల కోట్ల సర్దుబాటు భారాన్ని ప్రజలపై పడకుండా చూడాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. ఈ విషయంపై సీఎం చంద్రబాబు ఏపీఈఆర్‌సీకి వెంటనే లేఖ రాయాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.

కేసు రికార్డులను మా ముందు ఉంచండి

రెంటచింతల పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: వైకాపా నేత తురకా కిశోర్‌పై నమోదుచేసిన కేసు రికార్డులు, కేసు డైరీని తమ ముందు ఉంచాలని పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులను హైకోర్టు ఆదేశించింది. పోలీసులు చట్ట నిబంధనలను పాటించినట్లు సంతృప్తి వ్యక్తం చేస్తూ మేజిస్ట్రేట్ రిమాండ్ ఉత్తర్వుల్లో పేర్కొనలేదని ప్రాథమికంగా అభిప్రాయపడింది. వ్యాజ్యంపై విచారణను బుధవారానికి వాయిదా వేసింది. న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. తన భర్త కిశోర్‌పై వరుస కేసులు నమోదుచేసి పోలీసులు అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆయన భార్య సురేఖ దాఖలుచేసిన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది.

శ్మశానం పక్కన ఇంటి స్థలం మాకొద్దు!

- లోతట్టు ప్రాంతాల్లోనూ, నడిచే దారి కూడా లేని చోట్లా స్థలాలా?
- వైకాపా ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పట్టాలపై లబ్ధిదారుల అనాసక్తి
- ప్రభుత్వ పరిశీలనలో వెల్లడి

ఈనాడు, అమరావతి: వైకాపా పాలనలో ఇంటి స్థలాలు కేటాయించినప్పటికీ వాటి గురించి తెలియని లబ్ధిదారులు రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మంది వరకు ఉన్నారు. శ్మశానాలకు సమీపంలో, నిర్మాణాలకు అనువుగా లేని లోతట్టు ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చారంటూ వాటిని వద్దంటున్నవారు మరో 50 వేల మంది. గ్రామీణ ప్రాంతాల కాలనీల్లో ప్లాట్ల కేటాయింపు తీరును పరిశీలించగా ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. జగన్ పాలనలో ప్రచారం కోసం హడావుడిగా ఇచ్చేసిన ఇళ్లపట్టాల్లో చాలావరకూ ఇలాంటివే. లబ్ధిదారులకు ఏ మాత్రం ఉపయోగపడకపోగా రూ.వందల కోట్లు ఖర్చు చేసి, ప్రైవేట్ భూములు కొనే ప్రక్రియలో వైకాపా పెద్దలు అప్పట్లో భారీగా వెనకేసుకున్నారు.

కేటాయించిన స్థలాల గురించి సమాచారం లేదు

ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రభుత్వ, ప్రైవేట్ భూములు మొత్తం 31,416 ఎకరాలు సిద్ధం చేశారు. పట్టణాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర భూమి మాత్రమే ఇవ్వడంపై లబ్ధిదారులు అప్పట్లోనే అసంతృప్తి వ్యక్తం చేశారు. గత పాలనలో ఇళ్ల పట్టాల పంపిణీ తీరు, లేఅవుట్లలో ఉన్న పట్టాలెన్ని, ఖాళీగా ఎన్ని ఉన్నాయి? ఎంతమంది నిర్మాణాలు చేపట్టారు? ఎంత మంది ఆ పట్టాల పట్ల అసంతృప్తితో ఉన్నారన్న వివరాలను కూటమి ప్రభుత్వం సేకరిస్తోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం..

- నెల్లూరు, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం, నంద్యాల, అనకాపల్లి, వైఎస్సార్ కడప, ఇతర జిల్లాల్లో లోతట్టు ప్రాంతాల్లో, శ్మశానాలకు చేరువలో అత్యధిక సంఖ్యలో పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చారు.
- నెల్లూరు జిల్లాలో సుమారు 8,500 మంది లబ్ధిదారులు పట్టాల్లో పేర్కొన్న స్థలాలు వద్దంటున్నారు.
- తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 13 వేల మంది లబ్ధిదారులకు కేటాయించిన ఇంటి పట్టాల గురించి వారికి సరైన సమాచారమే లేదు. గ్రామాలకు దూరంలో, కనీసం నడకదారి కూడా లేని ప్రాంతాల్లో వీటిని కేటాయించారు. నెల్లూరు, కోనసీమ, కాకినాడ, ఏలూరు, తిరుపతి, వైఎస్సార్ కడప వంటి జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి.
- 4,19,975 మందికి ఇంటి పట్టాలు ఇచ్చినా కన్వేయన్స్ డీడ్‌లు ఇవ్వలేదు. దీంతో ఇక్కడ ఇంటి నిర్మాణాల జాడే లేదని గృహ నిర్మాణ శాఖ నివేదిక తయారుచేసింది.
- గత పాలనలో ఇంటి పట్టాలు పొందినవారు అవి వద్దంటే.. మరోసారి వారికి పట్టా ఇవ్వడానికి ఉన్న అవకాశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

లేఅవుట్లు వేసినా ప్లాట్ల కేటాయింపులు అరకొరే..

లేఅవుట్ల సంఖ్య	కేటాయింపుల శాతం
16,507	100
4,420	90
2,872	80
1,618	70
1,176	60
973	50
570	40
498	30
7,000	5%లోపే

వైకాపా పాలనలో ఇళ్ల స్థలాల పంపిణీ తీరు

లేఅవుట్లు వేసిన గ్రామాలు	10,410
మొత్తం లేఅవుట్లు	37,295
వీటిలో ప్లాట్లు	24,88,669
కేటాయించిన ప్లాట్లు	6,53,976

విలీనం చేసి, పంచేందుకు సన్నాహాలు

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ఇంటి స్థలం ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో లక్ష మందికి పైగా దరఖాస్తు చేశారు. వీటి పరిశీలన వివిధ దశల్లో ఉంది. గత పాలనలో గ్రామీణ ప్రాంతాల్లోని కాలనీల్లో లబ్ధిదారుల కోసం సెంటున్నర చొప్పున ఇచ్చిన 44,571 ప్లాట్లను మూడు సెంట్ల కింద కలిపి, అందజేసేందుకు ఉన్న మార్గాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నంద్యాల, ప్రకాశం, తూర్పుగోదావరి, విజయనగరం, అనంతపురం, శ్రీసత్యసాయి, నెల్లూరు వంటి జిల్లాల్లో ఇందుకు అనువైన వాతావరణం ఎక్కువగా ఉంది.



తోట్లవల్లూరు మండలం పాములలంక గ్రామం నుంచి కృష్ణా నదిపై పడవలో వస్తున్న గ్రామస్థులు, విద్యార్థులు



పడవ నుంచి ఒడ్డుకు వస్తున్న చిన్నారి

బడికి చేరాలంటే పడవ ఎక్కాల్సిందే

విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి వరద విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణా నది పరీవాహక ప్రాంతంలోని గ్రామాలకు పడవ ప్రయాణాలు తప్పనిసరిగా మారాయి. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం పాములలంక, పెద్దపూరు, తుమ్మలదిబ్బ, పొట్టిదిబ్బ, బ్రాహ్మణలంక తదితర లంక గ్రామాలు, వేల ఎకరాల పంట పొలాలు కృష్ణా నదికి అవతల ఉన్నాయి. రోజూ ఈ గ్రామాల నుంచి సుమారు 250 మందికి పైగా పిల్లలు పడవలపై నది దాటి తోట్లవల్లూరు, ఉయ్యూరుల్లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్నారు. వ్యవసాయదారులు, కూలీలు ఇతరత్రా పనుల మీద వచ్చే వారిదీ అదే పరిస్థితి. 2014లో రూ.13.5 కోట్ల వ్యయంతో ఇక్కడ వంతెన నిర్మాణానికి నాటి పాలకులు శిలాఫలకం వేసినా కార్యరూపం దాల్చలేదు. ఈ అంశంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – ఈనాడు, కృష్ణా

రద్దు జాబితాలో 'పోలవరం ఎత్తిపోతల'!

- రూ.8,148 కోట్ల విలువైన పనులూ అదే కేటగిరీలోకి
- సాగునీటి ప్రాజెక్టుల్లో 55 ప్యాకేజీలకు చెల్లు చీటీ

ఈనాడు, అమరావతి: ఎన్ని విమర్శలు ఎదురైనా లెక్కచేయకుండా జగన్ ప్రభుత్వం చేపట్టిన 'పోలవరం ఎత్తిపోతల' పథకం రద్దు జాబితాలోకి చేరింది. పోలవరం జలాశయంలో 32 మీటర్ల ఎత్తు నుంచి నీటిని ఎత్తిపోసి వేసవిలో ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా మెట్ట ప్రాంతాలకు నీళ్లు ఇచ్చేందుకు రూ.912 కోట్ల అంచనా వ్యయంతో అప్పట్లో ఈ పనులు మొదలు పెట్టారు. అసలు ఈ ఎత్తిపోతల అనవసరమనే విమర్శలు వచ్చినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఒకవైపు పోలవరం దిగువన పట్టిసీమ ఎత్తిపోతల ఉండగా.. పోలవరం రిజర్వాయర్ నుంచి రివర్ స్లూయిస్ గేట్ల సాయంతో నీటిని విడుదల చేసి పట్టిసీమ వద్ద అవసరమైన హెడ్ ఉండేలా చూసి నీటిని మళ్లించే ఆస్కారం ఉండగా.. మరో ఎత్తిపోతల నిర్మాణం చేపట్టడం వివాదాస్పదమైంది. వైకాపా ప్రభుత్వ హయాంలో దీనిపై రూ.130.61 కోట్లు ఖర్చు చేశారు. జలవనరుల శాఖ ఉన్నతాధికారుల సమీక్ష తర్వాత ఈ ఎత్తిపోతల అవసరం లేదని తేల్చి రద్దు జాబితాలో చేర్చారు. ఇదే కాదు.. మొత్తం రూ.8,148 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 55 సాగునీటి ప్రాజెక్టుల ప్యాకేజీలను రద్దు చేయాలని జలవనరులశాఖ నిర్ణయించింది. 69 పనులు కొనసాగించేందుకు నిర్ణయించింది. మరో 31 పనులు కొనసాగించాలా, వద్దా అనే అంశం పెండింగ్‌లో ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టులపై ఆర్థికశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. 2024 మార్చి 31 నాటికి టెండర్లు పిలిచి 25% లోపు మాత్రమే పని చేసిన వాటిని, అసలు పనులే ప్రారంభించని వాటిని ఆపేయాలని పేర్కొంది. ఆ నేపథ్యంలో తీసుకున్న నిర్ణయాలు ఇవి.

5 ఏళ్ల కిందటి పనులకూ దిక్కు లేదు

విచిత్రం ఏమిటంటే, ఎప్పుడో 2018, 2019లలో తెదేపా ప్రభుత్వ హయాంలో పాలనామోదం ఇచ్చిన పనులు సైతం ఈ జాబితాలో ఉన్నాయి. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాడు 25% లోపు పనులు జరిగినవాటిని ఆపేసింది. ఒప్పందం కుదుర్చుకుని పని మొదలుపెట్టని వాటినీ నిలిపింది. దీంతో ఇప్పటికీ వాటికి దిక్కూమొక్కూ లేకుండాపోయింది. ఆరేడేళ్లు గడిచిపోవడం, అప్పటి ధరలతో పనులు చేసేందుకు గుత్తేదారులు సిద్ధంగా లేకపోవడం, ఇతర సమస్యలు తదితర కారణాలతో వాటిని ఇప్పటికిప్పుడు చేపట్టే పరిస్థితులు లేకుండాపోయాయి.

రద్దు చేయనున్న కొన్ని ప్యాకేజీలు ఇవి..

- నాగావళి ఎడమ, కుడి ప్రధాన కాలువల ఆధునికీకరణకు రూ.195.34 కోట్లతో 2018లో పాలనామోదం ఇచ్చారు. ఇంతవరకు రూ.41.22 కోట్లు ఖర్చు చేశారు.
- జంఝావతి కింద రూ.160.13 కోట్లతో ప్రారంభించిన డిస్ట్రిబ్యూటరీల పనులు. కొంత పనికే టెండర్లు పిలిచారు. రూ.6.24 కోట్లు ఖర్చు చేశారు.
- ఏలేరు, తాండవ కాలువల అనుసంధాన ప్రాజెక్టు 2021లో రూ.470.05 కోట్లతో పాలనామోదం ఇచ్చారు. ఇంతవరకు రూ.30 లక్షలే ఖర్చు చేశారు.
- పెదవేగి మండలం జగన్నాథపురం వద్ద పోలవరం కుడి కాలువ వద్ద రూ.68 కోట్ల అంచనా విలువతో ఎత్తిపోతల పథకం.
- సోమశిల ప్రాజెక్టులో అన్నం సంజీవరెడ్డి హైలెవెల్ ఎత్తిపోతల కాలువ రెండో దశ పనులు కూడా.. రూ.459 కోట్ల అంచనా విలువతో 2022లో వీటికి పాలనామోదం ఇచ్చారు.
- కొన్ని అనవసర భవన నిర్మాణాలకు గతంలో పాలనామోదం ఇచ్చారు. వాటిని రద్దు చేస్తున్నారు.

ఈవీఎంలు వద్దు.. పేపర్ బ్యాలెట్ ప్రవేశపెట్టండి


కేంద్ర ఎన్నికల సంఘానికి భారాస వినతి

ఈనాడు, దిల్లీ: ఈవీఎంలపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నందున తిరిగి పేపర్ బ్యాలెట్ విధానానికి వెళ్లాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వెల్లడించారు. ఓటర్ల జాబితా, ఎన్నికల నిర్వహణలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల గురించి రాజకీయ పార్టీలతో చర్చిస్తూ వస్తున్న ఎన్నికల సంఘం మంగళవారం దిల్లీలోని కమిషన్ ప్రధాన కార్యాలయం నిర్వాచన్ సదన్‌లో కేటీఆర్ నేతృత్వంలోని భారాస బృందంతో సమావేశమయ్యారు. అనంతరం కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. "ఈవీఎంల స్థానంలో తిరిగి పేపర్‌బ్యాలెట్ ప్రవేశపెట్టాలని కోరాం. అమెరికా, యూకే, జర్మనీ, ఇటలీలాంటి దేశాల్లో ఈవీఎంలపై ప్రయోగాలు చేసినా తర్వాత అనుమానాల కారణంగా ఆ దేశాలు వాటిని పక్కనపెట్టి తిరిగి బ్యాలెట్‌కు మళ్లాయి. మనదేశంలోనూ వచ్చే బిహార్ ఎన్నికల నుంచే బ్యాలెట్ విధానం ప్రారంభించాలని కోరాం. ఎన్నికల్లో అడ్డగోలు వాగ్దానాలు చేసి ప్రజలను మోసగిస్తున్న నాయకులపై అనర్హత వేటు వేయాలని కోరాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

EENADU Vol: 51, Issue: 358 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

భూమి రయ్ రయ్!

అనూహ్యంగా, అరుదుగా కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైమ్ (యూటీసీ) నుంచి ఒక సెకండును తగ్గించాలని శాస్త్రవేత్తలు, ప్రపంచ టైమ్‌కీపర్స్ భావిస్తున్నారు. ఇలా ఒక లీప్ సెకండు వెనక్కి జరపాలని అనుకోవటం చరిత్రలో ఇదే తొలిసారి. దీనికి కారణం భూ భ్రమణ వేగం పెరగటం. జులైలో భూమి ఒకింత ఎక్కువ వేగంగా తిరుగుతున్నట్టు తాజా సమాచారం సూచిస్తోంది. కొన్నిరోజుల్లోనైతే ఒక మిల్లీసెకండు కన్నా అధిక వేగంతోనూ భ్రమిస్తున్నట్టు తేలింది. ఇదే యూటీసీని సవరించాలనే ఆలోచనకు బీజం వేసింది.



భూమి తన అక్షం మీద తన చుట్టూ తాను ఒకసారి పూర్తిగా భ్రమించటాన్ని ఒక రోజుగా పరిగణిస్తారు. ఇది సగటున 24 గంటలు లేదా 86,400 సెకండ్లకు సమానం. కానీ వాస్తవానికి భ్రమణానికి భ్రమణానికీ మధ్య కొంత వ్యత్యాసం ఉంటోంది. దీనిపై చంద్రుడి గురుత్వాకర్షణ, వాతావరణంలో కాలాల మార్పులు, భూమి లోపలి ద్రవ కేంద్రం వంటి అంశాల వంటివి ప్రభావం చూపిస్తాయి. అందువల్ల 86,400 సెకండ్ల కన్నా కాస్త అటూ ఇటూగా ఒక భ్రమణం పూర్తి అవుతుంటుంది. ఈ భూ భ్రమణ తీరును సమయాన్ని పర్యవేక్షించే ప్రపంచ సంస్థలు నిరంతరం గమనిస్తూ ఉంటాయి. ఇంటర్నేషనల్ ఎర్త్ రొటేషన్ అండ్ రిఫరెన్స్ సిస్టమ్స్ సర్వీసెస్, యూఎస్ నావల్ అబ్జర్వేటరీ తాజా సమాచారం ప్రకారం- జులై 10న 1.36 మిల్లీసెకండ్లు ముందే రోజు పూర్తయ్యింది. ఈ సంవత్సరంలో ఇప్పటివరకూ ఇదే అతి తక్కువ నిడివి గల రోజు. అలాగే జులై 22న 1.34 మిల్లీసెకండ్లు ముందే రోజు పూర్తి కాగా.. ఆగస్టు 5న 1.25 సెకండ్ల లోపు ముగిసే అవకాశముందని భావిస్తున్నారు.

అణుగడియారాల సాయంతో

నిజానికి రోజులో ఒక సెకండు వ్యత్యాసం నిత్య జీవితంలో పెద్ద ప్రభావమేమీ చూపబోవచ్చు. కానీ దీర్ఘకాలంలో ఉపగ్రహాలు, జీపీఎస్, అంతర్జాతీయ కమ్యూనికేషన్ నెట్‌వర్క్స్, కంప్యూటర్ల వంటి సున్నిత వ్యవస్థల మీద ప్రభావం చూపొచ్చు. ఇది వై2కే వంటి సమస్యలకు దారితీయొచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు. అప్పట్లో వై2కే సమస్యతో కంప్యూటర్ వ్యవస్థ కుప్పకూలుతుందని, ఆధునిక నాగరికత స్తంభించిపోతుందని ఆందోళన చెందిన సంగతి తెలిసిందే. అందుకే శాస్త్రవేత్తలు అధునాతన అణు గడియారాల సాయంతో నిరంతరం సమయాన్ని పర్యవేక్షిస్తుంటారు. అణు గడియారాలు తమ శూన్య గదిలోని అణువుల ఊగిసలాటను లెక్కించటం ద్వారా సమయాన్ని కచ్చితంగా గణిస్తాయి. దీన్నే కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైమ్‌గా పిలుచుకుంటారు. దీన్ని సుమారు 450 అణు గడియారాల ఆధారంగా నిర్ణయిస్తారు. సమయ గణనకు ఇదే ప్రామాణికం. దీని ప్రకారమే అన్ని ఫోన్లు, కంప్యూటర్లలోనూ సమయాన్ని నిర్దేశిస్తారు.

పొట్టి రోజులు ఎక్కువగా

భూ భ్రమణ వేగంలో వ్యత్యాసాలు చాలాసార్లు కొద్దికాలమే ఉంటాయి. అంటే ఒక రోజు ఎక్కువ, మరో రోజు తక్కువ వేగంగా తిరగొచ్చన్నమాట. అందువల్ల దీర్ఘకాలంలో చూస్తే ఇదేమీ పెద్ద వ్యత్యాసంగా కనిపించదు. కాబట్టి ఒక ఏడాదిలో దీన్ని అంచనా వేయటమూ కష్టమే. నిజానికి ఇంటర్నేషనల్ ఎర్త్ రొటేషన్ అండ్ రిఫరెన్స్ సిస్టమ్స్ సర్వీస్ కూడా ఏడాది ముందుగా సమయ సవరణను అంచనా వేయదు కూడా. ఒక రోజు పొట్టిదైనంత మాత్రాన ఎలాంటి మార్పూ ఉండదు. కానీ ఇటీవల ఇలాంటి పొట్టి రోజులు ఎక్కువవుతున్న నేపథ్యంలో ఒక సెకండును తొలగించే అవకాశాలూ పెరుగుతున్నాయి. ఇప్పటి నుంచి 2035 మధ్యలో దీనికి 40% వరకు అవకాశముందని వివరిస్తున్నారు. యూటీసీ నుంచి ఒక సెకండును తొలగించటం ఇంతకుముందెన్నడూ జరగకపోవటం గమనార్హం.

శాస్త్రవేత్తలు ఉపగ్రహాల ద్వారా భూమి భ్రమణాన్ని పర్యవేక్షిస్తుంటారు. స్థిర తారలతో పోల్చి చూడటం ద్వారా భూమి స్థితిని తనిఖీ చేస్తుంటారు. ఒకసారి భూమి తన చుట్టూ తాను తిరగటానికి పట్టిన కాలాన్ని, అణు గడియారాల సమయం మధ్య తేడాలేవైనా ఉన్నాయేమో కూడా చూస్తుంటారు. గత సంవత్సరం జులై 5న మామూలుగా కన్నా 1.66 మిల్లీసెకండ్ల ముందే రోజు ముగిసి.. అతి పొట్టి దినంగా రికార్డులకు ఎక్కింది. అణు గడియారాలు వాడటం మొదలెట్టిన తర్వాత ఇలాంటిది గమనించటం అదే తొలిసారి. 1972 నుంచి రోజులు కాస్త త్వరగా ముగుస్తున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

లీప్ సెకండ్ కలపటమే గానీ

భూ భ్రమణానికి తగ్గట్టుగా శాస్త్రవేత్తలు అణు గడియారాల సమయాన్ని సవరిస్తుంటారు. వ్యత్యాసాలను బట్టి ఒక సెకండు తగ్గించటమో, కలపటమో చేస్తుంటారు. దీన్నే లీప్ సెకండు అంటారు. లీప్ సంవత్సరంలో ఫిబ్రవరిలో ఒక రోజు అదనంగా కలిపినట్టుగా అన్నమాట. ఇప్పటివరకూ లీప్ సెకండును కలపటమే గానీ తీయటమనేది జరగలేదు. మొత్తమ్మీద 27 లీప్ సెకండ్లను యూటీసీకి కలిపారు. అంటే భూమి భ్రమణ వేగం పెరగటం వల్ల 1972 నుంచి వీటిని కలపటం నెమ్మదించింది. 70ల్లో 9 లీప్ సెకండ్లను జత చేయగా.. 2016 నుంచి ఒక్క సెకండునైనా కలపలేదు. 2035 కల్లా లీప్ సెకండ్లను విరమించుకోవాలని 2022లో నిర్ణయించారు కూడా. కానీ భూ భ్రమణ వేగం ఇలాగే కొన్నేళ్ల పాటు పెరుగుతూ పోతున్నట్టయితే యూటీసీ నుంచి ఒక సెకండును తొలగించే అవకాశముందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

భూమికి ఎందుకీ వేగం?

భూ భ్రమణ వేగం మీద చంద్రుడు, సముద్ర అలలు గణనీయమైన ప్రభావం చూపుతాయి. చంద్రుడు భూమి చుట్టూ సరిగ్గా వృత్తాకారంలో ఏమీ తిరగడు. భూమధ్యరేఖ నుంచి వీలైనంత ఎక్కువ దూరంలో ఉన్నప్పుడు భూమి భ్రమణ వేగం పెరుగుతుంటుంది. వేసవిలో సహజంగానే భూమి కాస్త ఎక్కువ వేగంతో తిరుగుతుంది. గురుత్వాకర్షణ, గాలులు, నీటి సాంద్రత మూలంగా సముద్ర జలాలు కదలటం.. కాలాలు మారటమూ భూమి వేగాన్ని ప్రభావితం చేస్తాయి. మరోవైపు భూమిలోని ద్రవ అంతర్భాగ వేగమూ గత 50 ఏళ్లుగా నెమ్మదిస్తోంది. దీంతో దాని చుట్టూ ఉన్న ఘన భూమి వేగం పెరుగుతోంది. వీటన్నింటిని బట్టి చూస్తే మున్ముందు రోజు కాలం తగ్గటం తథ్యంగా కనిపిస్తోంది.

వాతావరణ మార్పూ

లీప్ సెకండుకు వాతావరణ మార్పూ దోహదం చేస్తోంది. కాకపోతే వ్యతిరేక దిశలో. భూతాపం మూలంగా మంచు కరగటం భూ భ్రమణం మీద పెద్ద ప్రభావమే చూపుతోంది. అంటార్కిటికా, గ్రీన్‌లాండ్‌లోని మంచు కరగటం వల్ల మహా సముద్రాల్లోకి చేరుతున్న నీరు భూ భ్రమణాన్ని నెమ్మదింప జేస్తున్నట్టు గత సంవత్సరంలో చేపట్టిన అధ్యయనంలో వెల్లడైంది. ఒకవేళ మంచు కరగనట్టయితే, భూతాపం పెరగనట్టయితే ఇప్పటికే ఒక సెకండును తీసేయటమో లేదా ఆ స్థితికి దగ్గరకు రావటమో జరిగేదని భావిస్తున్నారు. మంచు కరగటం మనేది భూ భ్రమణ వేగాన్నే కాదు, అది తన అక్షం మీద తిరగటాన్నీ ప్రభావితం చేస్తోంది. మరోవైపు ఇలాగే పెరుగుతూ పోయినట్టయితే భూ భ్రమణం మీద చంద్రుడి కన్నా వాతావరణ మార్పు ప్రభావమే ఎక్కువగా ఉండొచ్చని అనుకుంటున్నారు. అంటే యూటీసీ నుంచి సెకండును తొలగించటానికి వాతావరణ మార్పు ఒకింత అడ్డు తగులుతోందన్నమాట.

ఇన్‌ఫినిక్స్ కొత్త గేమింగ్ ఫోన్

గేమింగ్ ఫోకస్డ్ స్మార్ట్‌ఫోన్ కోసం చూస్తున్నారా? అయితే ఇన్‌ఫినిక్స్ సంస్థ 8న విడుదల చేయనున్న జీటీ 30 5జీ+ మీద ఓ లుక్కేయండి. ఇది 144హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 4,500 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ రక్షణతో కూడిన 1.5కే అమోలెడ్ డిస్‌ప్లేతో వస్తోంది. మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ప్రాసెసర్ గల ఇది ఆండ్రాయిడ్ 15 ఆధారిత ఎక్స్‌ఓఎస్ 15తో పనిచేస్తుంది. దీని ర్యామ్ 16జీబీ కాగా.. స్టోరేజీ 256జీబీ. పల్స్ గ్రీన్, సైబర్ బ్లూ, బ్లేడ్ వైట్ రంగుల్లో రానున్న దీని



వెనకాల తెలుపు రంగులో ఎల్‌ఈడీ లైట్లు ఉండటం విశేషం. వీటిని బ్రెత్, మెటియర్, రిథమ్ ప్యాటర్న్‌లలో సెట్ చేసుకోవచ్చు. ఇన్‌కమింగ్ కాల్స్, నోటిఫికేషన్స్, గేమ్స్ వంటి పనులకు అనుగుణంగా లైట్ల తీరును మార్చుకోవచ్చు. కుడివక్కన టచ్ సెన్సిటివ్ బటన్లను గేమ్స్ ఆడటానికి ఉపయోగించుకోవచ్చు. కెమెరా కంట్రోల్స్, క్విక్ యాప్ లాంచ్, వీడియో ప్లేబ్యాక్ వంటి పనులకూ వాడుకోవచ్చు. సర్కిల్ టు సెర్చ్, ఏఐ కాల్ అసిస్టెంట్, గేమ్స్ కోసం ఏఐ మ్యాజిక్ వాయిస్ చేంజర్ వంటి ఏఐ ఫీచర్లకూ కొదవలేదు. దీని ధర ₹20వేల లోపు ఉండొచ్చని భావిస్తున్నారు.

వివో వీ60 5జీ



వివో తమ వీ శ్రేణి ఫోన్లను విస్తరిస్తోంది. మనదేశంలో ఆగస్టు 12న వీ60 5జీని విడుదల చేయనున్నట్టు ప్రకటించింది. మిస్ట్ గ్రే, మూన్‌లిట్ బ్లూ, ఆస్పియస్ గోల్డ్ రంగుల్లో రానున్న దీని ఫీచర్లు ఇవీ..

● స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 చిప్‌సెట్ ● ఆండ్రాయిడ్ 15 ఆధారిత ఫన్‌టచ్ ఓఎస్ ● 1.5కే రెజల్యూషన్, 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 1600 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.67 అంగుళాల క్వాడ్ కర్వ్డ్ ఎమోలెడ్ డిస్‌ప్లే ● గూగుల్ జెమినీ లైవ్, ఏఐ క్యాప్షన్స్, స్మార్ట్ కాల్ అసిస్టెంట్ వంటి ఏఐ టూల్స్ ● వెనకల 50ఎంపీ ప్రైమరీ సెన్సర్, 50ఎంపీ టెలిఫొటో లెన్స్, 8ఎంపీ అల్ట్రావైడ్ లెన్స్‌తో కూడిన మూడు కెమెరాల వ్యవస్థ ● ముందు 50ఎంపీ సెల్ఫీ కెమెరా ● 6,500ఎంఏహెచ్ బ్యాటరీ ● 90డబ్ల్యూ ఛార్జింగ్ ● దుమ్ము, ధూళిని తట్టుకునే ఐపీ68, ఐపీ69 రేటింగ్.

కిండిల్ డార్క్‌మోడ్

కిండిల్‌లో పుస్తకం చదువుతుంటే కళ్లు అలసినట్టుగా అనిపిస్తున్నాయా? అయితే డార్క్‌మోడ్‌లో పెట్టుకోండి. చదువుతున్నప్పుడు తెర మీద తట్టి, మూడు చుక్కల మెనూ ద్వారా సెటింగ్స్‌లోకి వెళ్లాలి. అక్కడ **బ్రైట్‌నెస్** నుంచి **అప్పీరెన్స్‌**లోకి వెళ్తే **డార్క్‌మోడ్** కనిపిస్తుంది. కొన్ని కిండిల్ పరికరాల్లో తెర మీది నుంచి కిందికి స్వైప్ చేసి, డార్క్‌మోడ్‌ను ఎంచుకునే సదుపాయమూ ఉంటుంది.

యాప్‌తోనూ చదవొచ్చు: కిండిల్‌లో ఏదో పుస్తకం చదువుతున్నారు. దాన్ని వెంట తీసుకెళ్లటం మరిచారు. అప్పుడెలా? ఫోన్‌లో కిండిల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి ఉంచుకుంటే సరి. ఇందులో మనం చదివే పుస్తకాలు సింక్ అవుతాయి కూడా. ఎక్కడ ఆపామో అక్కడి నుంచే తిరిగి చదువుకోవచ్చు.

ఏ మానిటర్ కావాలో?

మానిటర్ అనగానే అంతా ముందుగా గమనించేది రెజల్యూషన్ గురించే. ఇదే కాదు, రిఫ్రెష్ వేగమూ కీలకమే. కదులుతున్న వీడియో దృశ్యం స్పష్టంగా కనిపించటానికిది తోడ్పడుతుంది. రోజువారీ పనులకు 60హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం సరిపోతుంది. మామూలు గేమ్స్ ఆడేవారికి, వీడియో ఎడిటింగ్ చేసేవారికి 180హెచ్‌జడ్ అవసరం. భారీ గ్రాఫిక్స్‌తో కూడిన ఆన్‌లైన్ వీడియోగేమ్స్ ఆడేవారికైతే 240హెచ్‌జడ్, అంతకన్నా మించిన వేగం కావాలి.

డాక్స్‌లో పాత వర్షన్ చూడాలా?

గూగుల్ డాక్స్‌లో ఇంతకుముందు చేసిన సవరణలను చూడాలంటే- **ఫైల్‌**లోకి వెళ్లి **వర్షన్ హిస్టరీ** ద్వారా సీ విభాగంలోకి వెళ్తే సరి. డాక్యుమెంట్‌లో ఏం మారిందో, ఎవరు మార్చారో చూడొచ్చు. పాత వర్షన్‌ను **రిస్టోర్** చేసుకోవచ్చు కూడా. అసలు ఇతరులెవరకూ మార్పులు చేయొద్దనుకుంటే షేర్ చేసేటప్పుడే అనుమతులను పరిమితం చేస్తే సరి. పైన కుడిమూలన **షేర్** బటన్ మీద క్లిక్ చేసి, **పర్మిషన్స్‌**ను ఎంచుకోవాలి.

వాతావరణం ఎలా ఉంటుందో

వాతావరణ పరిస్థితి ఎలా ఉంటుందో చిటికెలో తెలుసుకోవాలనుకుంటే- డెస్క్‌టాప్‌లో క్రోమ్ బ్రౌజర్‌ను ఓపెన్ చేసి, అడ్రస్ బార్‌లో వెదర్ (weather) అని టైప్ చేస్తే సరి. సంక్షిప్తంగా అంచనా వివరాలు కనిపిస్తాయి. మరే ప్రాంతంలోనైనా వాతావరణాన్ని తెలుసుకోవాలంటే వెదర్ పక్కన ఆ ప్రాంతం పేరు టైప్ చేయాలి. **ఉదా:** weather hyderabad.

మౌజ్ పాయింటర్ కనిపించకపోతే..

విండోస్ పరికరం మీద మౌజ్ పాయింటర్ సరిగా కనిపించట్లేదా? అయితే **సెటింగ్స్‌**లో **యాక్సెసబిలిటీ** విభాగంలో **మౌజ్ పాయింటర్ అండ్ టచ్** మీద క్లిక్ చేయండి. **మౌజ్ పాయింటర్ స్టైల్** కింద **కస్టమ్** మీద క్లిక్ చేసి కొత్త రంగును ఎంచుకోండి. ఇప్పుడు **సైజ్ స్లైడర్‌**ను డ్రాగ్ చేసి పెద్దగా చేసుకోండి.

ఏఐకి సొంత భాష అబ్బితే?



కృత్రిమ మేధ (ఏఐ) సొంతంగా తనకంటూ ఒక ప్రైవేట్ భాషను సృష్టించుకుంటుందా? అదే నిజమైతే అప్పుడు మన పరిస్థితి ఏంటి? మనం దాని భాషను నేర్చుకోవాల్సి ఉంటుందా? అది చెప్పినట్టుగానే వినాల్సి వస్తుందా? ఆశ్చర్యకరంగా, భయం కొల్పేలా ఉన్నా ఇవి నిజమయ్యే రోజులు వచ్చే అవకాశం లేకపోలేదు. కృత్రిమ మేధ త్వరలోనే తనకంటూ ప్రత్యేక భాషను రూపొందించుకోవచ్చని ఏఐ పితామహుడు జెఫ్రీ హింటన్ హెచ్చరించారు మరి. వన్ డిసిషన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఏఐ సృష్టించుకున్న భాషను దాన్ని రూపొందించిన మనుషులూ అర్థం చేసుకోలేకపోవచ్చనీ చెప్పటం మరింత ఆందోళన కలిగిస్తోంది.

"ప్రస్తుతానికి ఏఐ వ్యవస్థలు ఇంగ్లిషులో 'చైన్ ఆఫ్ థాట్' అనే రీజనింగ్‌తో పనిచేస్తున్నాయి. కాబట్టి అవేం చేస్తున్నాయో మనం గమ నించొచ్చు. కానీ అవి తమతో తాము మాట్లాడుకోవటానికి సొంత అంతర్గత భాషను అభివృద్ధి చేసుకుంటే ఎలా అనేదే ఎక్కువ ఆందోళన కలిగిస్తోంది' అనేది హింటన్ భావన. హద్దుల్లేని, గగుర్పాటు కలిగించే స్థాయికి ఏఐ చేరుకుంటోంది. మెషిన్లు ఇప్పటికే 'భయంకర' ఆలోచనలను సృష్టించే సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఈ ఆలోచనలు మనం పర్యవేక్షించగల భాషలోనే సాగుతున్నాయని కచ్చితంగా చెప్పలేమని అంటున్నారు. ఆయన మాటలను కొట్టిపారేయటానికి లేదు. ఎందుకంటే న్యూరల్ నెట్‌వర్క్స్ మీద హింటన్ చేసిన తొలి కృషి ఆధారంగానే నేటి డీప్ లెర్నింగ్ మోడళ్లు, భారీ ఏఐ వ్యవస్థలు పుట్టుకొచ్చాయి. ఏఐతో త్వరలోనే భారీ ప్రమాదాలు ముంచుకురావొచ్చని తనకు తోస్తోందని ఆయన అనటం ఆలోచింపజేస్తోంది. మనం ఏదైనా జ్ఞానాన్ని సముపార్జించాలంటే చాలా సమయం పడుతుంది. ఎన్నో పుస్తకాలు చదవాల్సి ఉంటుంది. ఎంతో నేర్చుకోవాల్సి ఉంటుంది, అనుభవం సంపాదించాల్సి ఉంటుంది. కానీ డిజిటల్ మెదళ్లు అలా కాదు. తమకు తెలిసినదాన్ని తక్షణం కాపీ, పేస్ట్ చేసుకోగలవు. ఉదాహరణకు- 10వేల మంది ఎంతో కష్టపడి ఏదో నేర్చుకున్నారనుకోండి. దీనంతటినీ ఏఐ తక్షణం నేర్చుకోగలదు. ఏఐ వ్యవస్థలు ఒకదాంతో మరోటి అనుసంధానమై ఉండటం వల్ల విషయగ్రహణలో మనుషులనూ మించి పోగలవు. జీపీటీ4 వంటి ప్రస్తుత మోడళ్లు ముడి సమాచారం విషయంలో ఇప్పటికే మనుషులను అధిగమిస్తున్నాయి కూడా. ప్రస్తుతానికి మనం కార్యకారణ వివేచన (రీజనింగ్)లో బలంగా ఉన్నాం. ఏఐ కన్నా ముందున్నాం. కానీ త్వరలోనే ఈ వ్యత్యాసం తగ్గిపోగలదని హింటన్ చెబుతున్నారు.

తానే శుభ్రపరచుకునే గ్లాస్

కిటికీ అద్దాలు చూడటానికి ఆకర్షణీయంగానే కనిపిస్తాయి. కానీ బయటి నుంచి శుభ్రం చేయటమే కష్టం. ఒకవేళ అద్దాలు తమకు తామే శుభ్రం చేసుకుంటే? అలాంటివీ లేకపోలేదు. వీటి విషయంలో చైనా శాస్త్రవేత్తలు మరో ముందడుగు వేశారు. తమకు తామే శుభ్రపరచుకునే కొత్తరకం గ్లాస్‌ను రూపొందించారు. విద్యుత్ క్షేత్రాల సాయంతో దుమ్ము, ఇతర రేణువులను తొలగించుకోవటం దీని ప్రత్యేకత. తరచూ ఎదుర్కొనే సమస్యకు ఇది తేలికైన, స్థిరమైన పరిష్కారం చూపగలదని భావిస్తున్నారు. మారిపోయే విద్యుత్ క్షేత్రాలకు గురైనప్పుడు ఆవేశిత రేణువులు అనూహ్యంగా ప్రవర్తిస్తున్నట్టు పరిశోధకులు తమ ప్రయోగాల్లో గుర్తించారు. అవి పక్కలకు కదలటానికి బదులు కొన్ని రేణువులు వ్యతిరేక దిశకు మళ్లుతున్నట్టు గమనించారు. కొన్నయితే ఉపరితలం నుంచి గెంతుతున్నట్టూ బయటపడింది. ఇదే కొత్తరకం గ్లాస్ తయారీకి



దారితీసింది. కేవలం 0.62 మి.మీ. మందముండే ఇది మనిషి ప్రమేయం, నీరు, రసాయనాలేవీ లేకుండా తనకు తానే కర్బన, అకర్బన రేణువులు రెండింటినీ తొలగించుకుంటుంది. అదీ కేవలం కొన్ని సెకండ్లలోనే. సౌర ఫలకాలు, భవనాల కిటికీల వంటి వాటికిది బాగా తోడ్పడగలదని భావిస్తున్నారు.

మొబైల్ @ 30

మొబైల్ ఫోన్లు మన జీవితంలో విడదీయలేని భాగంగా మారాయి. ఇప్పుడంటే సోషల్ మీడియా, ఆన్‌లైన్, బ్యాంకింగ్ వంటి రకరకాల అవసరాలకు వాడుకుంటున్నాం గానీ మొదట్లో కేవలం కాల్స్‌కే పరిమితం. ఇవి మనదేశంలో అందుబాటులోకి వచ్చి 30 ఏళ్లు దాటింది. కేవలం మూడు దశాబ్దాల్లోనే మొబైల్ ఫోన్లు లేకపోతే రోజు గడవని స్థితికి చేరుకున్నాం. వీటి ప్రస్థానం ఎలా సాగుతూ వచ్చిందో ఓ లుక్కేద్దాం.



1995 మొట్టమొదటి మొబైల్ కాల్

మనదేశంలో మొట్టమొదటి సారిగా మొబైల్ ఫోన్‌లో ఎప్పుడు మాట్లాడారో తెలుసా? 1995లో జులై 31న. అప్పటి కేంద్ర టెలికం మంత్రి సుఖ్‌రామ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు మధ్య ఇది సాగింది. మోడి టెల్‌స్ట్రాకు చెందిన జీఎస్ఎం సర్వీసు ద్వారా జ్యోతిబసు కోల్‌కతాలోని రైటర్స్ బిల్డింగ్ నుంచి దిల్లీలోని సంచార్ భవన్‌లో ఉన్న సుఖ్‌రామ్‌కు కాల్ చేశారు. ఇలా సెల్యులర్ సేవలు ఆరంభమయ్యాయి. ఇది మొబైల్ టెలిఫోన్ విప్లవానికి నాంది పలికింది.

1996-1999 తొలిదశ విస్తరణ

మొదట్లో అన్నిచోట్లా సెల్యులర్ సేవలు అందుబాటులో ఉండేవి కావు. కేవలం మెట్రో నగరాలు, ఎంపిక చేసిన కొన్ని పట్టణాల్లోనే ఇవి ఆరంభమయ్యాయి. అప్పట్లో హ్యాండ్‌సెట్లు, కాల్ రేట్స్ చాలా ఎక్కువగా ఉండేవి. ఇన్‌కమింగ్ కాల్స్‌కూ ఛార్జ్ పడేది. అదీ ఒక నిమిషానికి రూ.8.40 వసూలు చేసేవారు. కాల్స్ ఎక్కువగా వచ్చే సమయాల్లోనైతే నిమిషానికి రూ.16 ఛార్జ్ పడేది. హ్యాండ్‌సెట్స్ కూడా పెద్దగా, ఎబ్బెట్టుగా ఉండేవి. అందువల్ల మొబైల్ ఫోన్లను అంతగా ఇష్టపడేవారు కాదు.

2000-2003 టారిఫ్ యుద్ధాలు, విస్తృత విస్తరణ

కాల్ చేసేవారికే ఛార్జ్ విధించటం ఆరంభమైన తర్వాత కొంత మార్పు వచ్చింది. టారిఫ్‌లు తగ్గటంతోనూ సబ్‌స్క్రయిబర్ల సంఖ్య శరవేగంగా పెరుగుతూ వచ్చింది. అదే సమయంలో బీఎస్ఎన్ఎల్‌తో పాటు ఎయిర్‌టెల్, హచ్, ఐడియా, రిలయన్స్ ఇన్ఫోకామ్ వంటి ప్రైవేట్ టెలికం ఆపరేటర్లు రంగంలోకి దిగటంతో పరిస్థితి మారిపోయింది. సంస్థల మధ్య పోటీ పెరడటం, ఛార్జ్ తగ్గటం వల్ల మొబైల్ సేవల వాడకం ఊపందుకుంది.

2004-2008 ఫీచర్ ఫోన్ల విజృంభణ

చవక ఫీచర్ ఫోన్లు, ప్రిపెయిడ్ ప్లాన్స్ రావటం మొబైల్ ఫోన్ల రంగంలో పెద్ద విప్లవమే సృష్టించింది. రూ.10కే ప్రిపెయిడ్ కార్డులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో గ్రామాలకూ మొబైల్ ఫోన్లు విస్తరించాయి. మిస్డ్ కాల్స్‌తో ఛార్జ్ మిగుల్చుకున్నామని సంతోషించినవారూ కోకొల్లలు. ఎస్ఎంఎస్, రింగ్‌టోన్ సేవలు బహుళ ఆదరణ పొందాయి. అనతికాలంలోనే మొబైల్ ఫోన్ల యూజర్ల సంఖ్య 20 కోట్లు దాటిపోయింది.

2008 3జీ పరిచయం

హైస్పీడ్ ఇంటర్నెట్‌కు మౌలిక సదుపాయాల లేమి వంటి కొన్ని ఆటంకాలుగా మారినప్పటికీ.. మల్టీ మీడియా మెసేజింగ్, వీడియో కాల్స్, యాప్ ఆధారిత సేవలు నెమ్మదిగా వేగం పుంజుకున్నాయి. ఇందుకు 3జీ స్పెక్ట్రమ్ వేలాలు దారి చూపాయి.

2010-2012 స్మార్ట్‌ఫోన్ల రంగ ప్రవేశం, 4జీ పరీక్షలు

మనదేశ మార్కెట్లోకి స్మార్ట్‌ఫోన్ల రాక టెలికం రంగంలో కొత్త విప్లవానికి శ్రీకారం చుట్టింది. అదే సమయంలో 4జీ సేవల ప్రయోగ పరీక్షలూ ఆరంభమయ్యాయి. డేటాతో ముడిపడిన అంతర్జాల వాడకం దిశగా అడుగులు పడ్డాయి. గూగుల్ ఆండ్రాయిడ్ వర్షన్‌తో కూడిన చవక చైనా ఫోన్లు, దేశీయ మైక్రోమ్యాక్స్, కార్బన్ పరికరాలు మార్కెట్‌ను ముంచెత్తాయి. మొబైల్ డేటా సబ్‌స్క్రయిబర్ల సంఖ్య 2011లో 80కోట్లు దాటింది. కమ్యూనికేషన్ విషయంలో ఫేస్‌బుక్, వాట్సప్ సామాజిక మాధ్యమాలు ఎస్ఎంఎస్‌ను అధిగమించాయి. అంతర్జాలం డెస్క్‌టాప్ నుంచి నేరుగా యూజర్ల జేబుల్లోకి వచ్చేసింది. అయినా ఖరీదైన వ్యవహారంగానే ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది దీనికి దూరంగానే ఉండిపోయారు.

2014 డిజిటల్ ఇండియా ఆరంభం

మనదేశాన్ని డిజిటల్ సాధికర సమాజంగా మలచటానికి కేంద్ర ప్రభుత్వం డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని ఆరంభించింది. దీంతో టెలికం మౌలిక వసతుల అభివృద్ధికి జాతీయ ప్రాధాన్యం లభించింది.

2015-2016 మొబైల్ అంతర్జాల విజృంభణ

మొబైల్ అంతర్జాల వాడకాన్ని చవక డేటా ప్లాన్లు కొత్త మలుపు తిప్పాయి. ముఖ్యంగా రిలయన్స్ జియో రాకతో స్మార్ట్‌ఫోన్ల వాడకం, 4జీ సేవలు సర్వత్రా విస్తరించాయి. ఇవి మొబైల్ డేటా విస్తృత వినియోగానికి దారితీశాయి. డేటా ధరలు 90% కన్నా తక్కువకు దిగొచ్చాయి. ఒక్కో యూజర్ మొబైల్ డాటా వాడకంలో మనదేశం ప్రపంచంలోనే తొలిస్థానానికి చేరటం గమనార్హం. సినిమాల దగ్గరి నుంచి క్రికెట్ మ్యాచ్‌ల వరకూ అన్నింటినీ మొబైల్‌లోనే చూడటం అలవాటయ్యింది.

2017-2019 గ్రామీణ అనుసంధానం, వీఏఎస్ పురోగతి

టెలికం నెట్‌వర్కులు గ్రామీణ ప్రాంతాల్లోకి విరివిగా విస్తరించాయి. మొబైల్ పేమెంట్స్, కాలర్ ట్యూన్స్ వంటి వాల్యూ-యాడెడ్ సర్వీసెస్ (వీఏఎస్) బాగా ఆదరణ పొందాయి. స్థానిక కంటెంట్‌కూ విశేష ప్రాధాన్యం లభించింది.

2020 కొవిడ్-19-మొబైల్ జీవధార

కొవిడ్-19 విజృంభణతో మొబైల్ వాడకం తీరుతెన్నులు సమూలంగా మారిపోయాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లలేని స్థితిలో అన్నింటికీ మొబైల్ సేవలే దిక్కయ్యాయి. సరుకుల దగ్గరి నుంచి మందుల వరకూ అన్నింటినీ ఆర్డర్ చేసి, ఇంటికి తెప్పించుకోవటం పరిపాటిగా మారింది. ఆన్‌లైన్‌లో డాక్టర్లతో కన్సల్టేషన్‌కూ ఇదే దారి చూపింది. ఇంటి నుంచే చదువుకోవటానికి, ఆఫీసు పనులను చేయటానికి మొబైల్ నెట్‌వర్క్ తప్పనిసరి అవసరంగా మారింది. ఆధునిక వ్యవహారాలకు జీవధారగా పరిణమించింది. డేటా వినియోగం ఒక్కసారిగా ఆకాశాన్నంటింది.

2022 5జీ ప్రవేశం

మనదేశం అధికారికంగా 5జీ సేవల అమలును ప్రారంభించింది. ముందు పెద్ద నగరాలు, పట్టణాలతో మొదలెట్టింది. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యమూ కలిసొచ్చింది. ప్రపంచంలో మరే దేశంలోనూ లేనంతగా 5జీ సేవలు శరవేగంగా విస్తరించాయి.

2023-2025 5జీ విస్తరణ, టెక్నాలజీ వ్యవస్థ వృద్ధి

ప్రస్తుతానికి మనదేశంలో సుమారు 25 కోట్ల మందికి 5జీ సేవలు వాడుకుంటున్నారు. దాదాపు మొత్తం జిల్లాల్లోనూ (99.6%) 5జీ కవరేజీ ఉంది. దేశంలో 75 కోట్ల మంది స్మార్ట్‌ఫోన్లను ఉపయోగిస్తున్నారు. ఏఐ, ఐఓటీ, స్మార్ట్ సిటీస్, రిమోట్ హెల్త్‌కేర్, ఇ-లెర్నింగ్ వంటి వాటి పురోగతికి టెలికం రంగం గొప్ప చోదకశక్తిగా నిలుస్తోంది.

ఈనాడు సినిమా

రెండు కాలాలు.. రెండు కోణాలు


బాలకృష్ణ

కథానాయకుడు నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం 'అఖండ 2: తాండవం'ను ముగించే పనిలో ఉన్నారు. ఆ వెంటనే గోపీచంద్ మలినేని దర్శకత్వంలో కొత్త చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. 'వీరసింహారెడ్డి' విజయం తర్వాత వీళ్లిద్దరి కలయికలో రూపొందనున్న రెండో సినిమా ఇది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మించనున్నారు. చరిత్రను.. వర్తమానాన్ని ముడిపెడుతూ ఓ వినూత్నమైన పీరియాడిక్ స్టోరీతో దీన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ కథాంశానికి తగ్గట్లుగానే దీంట్లో బాలయ్య రెండు కోణాల్లో సాగే పాత్రలో కనువిందు చేయనున్నట్లు తెలిసింది. ఆయన లుక్కు కూడా చాలా కొత్తగా ఉండనుందని తెలుస్తోంది. ఈ కథలో పోరాట ఘట్టాలు చాలా భారీ స్థాయిలో ఉండనున్నాయని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా నవంబరు నుంచి చిత్రీకరణ ప్రారంభం చుకునే అవకాశముంది.

రివాల్వర్‌తో బాక్సాఫీస్ బరిలో యాక్షన్ హంగామా చేసేందుకు కీర్తి సురేశ్ దూసుకొస్తుంటే ఓ సామాజిక రుగ్మతపై పోరుకు అనుపమ పరమేశ్వరన్ సిద్ధమవుతోంది. భావోద్వేగాలు నిండిన ప్రేమకథను రుచి చూపిస్తానంటూ రష్మిక ఊరిస్తుంటే.. ప్రతీకార పోరాటం ఎలా ఉంటుందో చూపించేందుకు అనుష్క సమాయత్తమవుతోంది. ఇలా ఇప్పుడు స్టార్ నాయికలంతా బాక్సాఫీస్ బరిలో కాసుల వర్షం కురిపించేందుకు నాయికా ప్రాధాన్య చిత్రాలతో దూసుకొస్తున్నారు. కథానాయకులకు దీటుగా వైవిధ్యభరితమైన కథలతో వినోదాల విందు వడ్డిస్తామంటూ భరోసా ఇస్తున్నారు. మరి వీళ్లలో హిట్టు మాట వినిపించేదెవరు? బాక్సాఫీసు వసూళ్ల కళ అందించేదెవరు? అన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది.

అందాల ఫైటింగ్ @ బాక్సాఫీస్


కీర్తి సురేశ్, లావణ్య త్రిపాఠి, రష్మిక


అనుష్క


ఈ ఏడాది అగ్ర కథానాయకుల జోరంతా ద్వితీయార్ధంలోనే కనిపించనుంది. ఇప్పటికే పవన్ కల్యాణ్ 'హరి హర వీరమల్లు'తో బాక్సాఫీస్ బరిలో సందడి చేయగా.. చిరంజీవి, బాలకృష్ణ, ప్రభాస్, ఎన్టీఆర్ తదితరులంతా సినీప్రియుల్ని మురిపించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పుడు వీళ్లకు దీటుగానే థియేటర్లలో జోరు చూపించేందుకు నాయికా ప్రాధాన్య చిత్రాలతో స్టార్ నాయికలు సమాయత్తమవుతున్నారు. ఓవైపు గ్లామర్ నాయికగా కమర్షియల్ చిత్రాల్లో సందడి చేస్తూనే.. మరోవైపు నాయికా ప్రాధాన్య సినిమాలతోనూ సత్తా చాటే ప్రయత్నం చేస్తోంది అనుపమ పరమేశ్వరన్. ఇప్పుడామె నుంచి తెరపైకి రానున్న నాయికా ప్రాధాన్య చిత్రం 'పరదా'. 'సినిమాబండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించారు. దర్శన రాజేంద్రన్, సంగీత ముఖ్య పాత్రలు పోషించారు. ఇది ఓ సామాజిక రుగ్మతపై అల్లుకున్న ఆసక్తికర కథాంశంతో రూపొందినట్లు ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలతో అర్థమవుతోంది. మరి ఈ సినిమాతో అనుపమ బాక్సాఫీస్ బరిలో విజయాన్ని అందుకుంటుందా? లేదా? తెలియాలంటే ఆగస్టు 22వరకు వేచి చూడక తప్పదు. 'మహానటి' సినిమాతో బలమైన నాయికా ప్రాధాన్య కథలకు చిరునామాగా మారిపోయింది కీర్తి సురేశ్. కానీ, ఆ చిత్రం తర్వాత తనకు మళ్లీ అంతటి విజయమేదీ దక్కలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడామె విజయమే లక్ష్యంగా 'రివాల్వర్ రీటా'తో అలరించేందుకు సిద్ధమైంది. జె.కె.చంద్రు దర్శకత్వం వహించిన క్రైమ్ కామెడీ చిత్రమిది. ఇందులో శక్తిమంతమైన యాక్షన్ పాత్రలో సందడి చేయనుంది కీర్తి. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించిన నేపథ్యంలో దీనిపై ప్రేక్షకుల్లో అంచనాలేర్పడ్డాయి. మరి ఈ రీటా ఆ అంచనాల్ని అందుకుంటుందా? లేదా? అన్నది ఈనెల 29న తేలనుంది.

వీళ్లూ వస్తున్నారు..

శక్తిమంతమైన నాయికా ప్రాధాన్య కథలతో సినీప్రియుల్ని అలరించడంలో ముందుంటుంది అనుష్క. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' విజయం తర్వాత ఆమె నుంచి రానున్న కొత్త చిత్రం 'ఘాటి'. 'వేదం' విజయం తర్వాత దర్శకుడు క్రిష్ - అనుష్క కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. ఈ యాక్షన్ క్రైమ్ డ్రామాలో స్వీటీ మునుపెన్నడూ చూడనంత మాస్ యాక్షన్ పాత్రలో కనువిందు చేయనుంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌తో సినిమాలో ఆమె పాత్ర ఎంత వైలెంట్‌గా ఉండనుందన్నది స్పష్టత ఇచ్చేసింది చిత్ర బృందం. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా సెప్టెంబరు లేదా అక్టోబరులో తెరపైకి వచ్చే అవకాశమున్నట్లు సమాచారం. ప్రస్తుతం అనుష్క నటించిన తొలి మలయాళ చిత్రం 'కథనార్ : ది వైల్డ్ సోర్సెరర్' కూడా నిర్మాణానంతర పనుల్లోనే ఉంది. మరి ఈ హారర్ థ్రిల్లర్ ఈ ఏడాదిలోనే తెరపైకి వస్తుందా? లేదా? తేలాల్సి ఉంది. 'యానిమల్', 'పుష్ప 2', 'ఛావా', 'కుబేర'.. ఇలా వరుస విజయాలతో జోరు మీదుంది నటి రష్మిక. ఇప్పుడామె నుంచి రానున్న తొలి నాయికా ప్రాధాన్య చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. 'చిలసౌ' ఫేమ్ రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించారు. దీక్షిత్ శెట్టి ముఖ్య పాత్ర పోషించారు. ఇది బలమైన భావోద్వేగాలు నిండిన ప్రేమకథతో రూపొందిన సినిమా. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు ప్రేక్షకుల్లో అంచనాల్ని రెట్టింపు చేశాయి. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం ఈ సెప్టెంబరులో తెరపైకి రానున్నట్లు సమాచారం. త్వరలోనే విడుదల తేదీపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది. 'హ్యాపీ బర్త్‌డే' అనే నాయికా ప్రాధాన్య చిత్రంతో ఇప్పటికే బాక్సాఫీస్ బరిలో అదృష్టం పరీక్షించుకుంది నటి లావణ్య త్రిపాఠి. అయితే ఆమె తొలి ప్రయత్నం ఆశించిన ఫలితాన్ని అందివ్వలేకపోయింది. ఈ నేపథ్యంలో ఇప్పుడామె రెండో ప్రయత్నంగా 'సతీ లీలావతి'తో అలరించేందుకు సిద్ధమైంది. లావణ్య టైటిల్ పాత్రలో నటించిన ఈ నాయికా ప్రాధాన్య సినిమాని తాతినేని సత్య తెరకెక్కించారు. ఇదొక రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్. కొత్తగా పెళ్లైన జంట మధ్య తలెత్తిన గొడవల నేపథ్యంలో సాగనుంది. లీలావతిగా లావణ్య పాత్ర చిత్రణ కొత్తగా ఉండనున్నట్లు ఇప్పటికే విడుదలైన టీజర్‌తో స్పష్టత వచ్చింది. మరి ఈ సినిమాతో ఆమె ఓ చక్కటి విజయాన్ని ఖాతాలో వేసుకుంటుందా? లేదా? తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం ఈ ఏడాది ద్వితీయార్ధంలోనే తెరపైకి రానుంది.


'పరదా'

ఓలే ఓలే.. లవ్వు అన్‌లిమిటెడ్!


రవితేజ, శ్రీలీల

'లిమిటెడ్ టచ్ చేసిన పిల్లా.. అన్‌లిమిటెడ్‌గా వచ్చేసిందే లవ్వు' అంటూ తన మనసు దోచిన భామతో మాస్ స్టెప్పులు వేస్తున్నారు కథానాయకుడు రవితేజ. ఇప్పుడాయన శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు తెరకెక్కించిన ఈ సినిమాని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వంలో భాగంగా మంగళవారం ఈ చిత్ర రెండో గీతాన్ని విడుదల చేశారు. 'ఓలే ఓలే..' అంటూ సాగిన ఈ మాస్ ఫోక్ గీతానికి భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చడంతో పాటు రోహిణి సోరట్‌తో కలిసి స్వయంగా ఆలపించారు. భాస్కర్ యాదవ్ దాసరి సాహిత్యమందించారు. జానీ మాస్టర్ నృత్యరీతులు సమకూర్చారు. ఈ పాటలో రవితేజ, శ్రీలీల కెమిస్ట్రీ.. వాళ్లిద్దరూ వేసిన హుషారైన స్టెప్పులు ఆకట్టుకున్నాయి. ఇది రవితేజ శైలికి తగ్గట్లుగా సాగే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతోంది. దీనికి కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: విధు అయ్యన్న.

తండ్రి పాత్రలు నచ్చట్లేదు

– సత్యరాజ్


వశిష్ఠ, సత్యరాజ్, ఉదయభాను

"నాయకానాయికలకు తండ్రిగా చేసే పాత్రలంటే నాకు నచ్చడం లేదు. 'త్రిబాణధారి బార్బరిక్'లో చేసినటువంటి శక్తిమంతమైన పాత్రలే ఎక్కువగా రావాలని కోరుకుంటున్నా" అన్నారు నటుడు సత్యరాజ్. ఈ సినిమా మాతృక పరిశ్రమలోని వాళ్లంతా ఈ తరహా పాత్రలే చేయాలని కోరుకుంటున్నారు. భీముడి మనవడు, ఘటోత్కచుడి కుమారుడైన బార్బరికుడి కథతో రూపొందిన చిత్రమే 'త్రిబాణధారి బార్బరిక్'. సత్యరాజ్ ప్రధాన పాత్ర పోషించారు. వశిష్ఠ ఎన్.సింహా, సాంచి రాయ్, ఉదయ భాను తదితరులు కీలక పాత్రలు పోషించారు. మోహన్ శ్రీవత్స తెరకెక్కించారు. విజయ్‌పాల్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 22న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యరాజ్ మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో అందరివీ నటనా ప్రాధాన్యమున్న పాత్రలే. ఇందులో నా పాత్ర అందర్నీ అలరించేలా ఉంటుంది. ఈ సినిమా నాకెంతో ఇష్టమైన చిరంజీవి పుట్టినరోజున విడుదల కానుండటం చాలా ఆనందంగా ఉంది" అన్నారు. "ఇది కథా బలమున్న చిత్రం. తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది" అన్నారు దర్శకుడు మోహన్ శ్రీవత్స. ఈ కార్యక్రమంలో ఉదయభాను, వశిష్ఠ, సాంచి రాయ్, క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అనన్య 'చూమంతర్'?



అనన్య పాండే

'కేసరి ఛాప్టర్ 2'తో న్యాయవాదిగా ఇటీవలే తెరపై సందడి చేసింది బాలీవుడ్ నాయిక అనన్య పాండే. ఇప్పుడామె 'చూమంతర్' అంటూ ప్రేక్షకుల్ని తన మ్యాజిక్‌తో అలరించడానికి సిద్ధమవుతోంది. తాజాగా ఆమె, 'ముంజ్యా' ఫేమ్ అభయ్ వర్మ జంటగా ఓ సినిమాలో నటిస్తున్నట్లు తెలుస్తుంది. దీనికి తరుణ్ దుడేజా దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. 'మడాక్ ఫిల్మ్స్' ఈ ప్రాజెక్టును నిర్మించనుంది. సైన్స్ ఫిక్షన్ కామెడీ కథతో రూపొందుతున్న ఈ చిత్రానికి 'చూమంతర్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఇందులో నటించడానికి అనన్య, అభయ్‌తో ఇప్పటికే చర్చలు మొదలు పెట్టింది నిర్మాణ సంస్థ. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ ఏడాది చివరి నాటికి దీనిని అధికారికంగా ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నార'ని అనన్య సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె లక్ష్యతో కలిసి 'చాంద్ మేరా దిల్'తో బిజీగా ఉంది.

వేతనాల పెంపు అంశంపై చిరంజీవితో నిర్మాతల భేటీ

సినీ కార్మికుల వేతనాల పెంపు అంశంపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. దీనిపై ఫిల్మ్ ఛాంబర్, ఫిల్మ్ ఫెడరేషన్ మధ్య సఖ్యత కుదరడం లేదు. దీంతో ఈ సమస్యను తెలుగు చిత్ర నిర్మాతలు ప్రముఖ కథానాయకుడు చిరంజీవి దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై నిర్మాతలు అల్లు అరవింద్, సురేశ్‌బాబు, సుప్రియ యార్లగడ్డ, మైత్రి చెర్రి, కేఎల్ నారాయణ, ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్, సి.కల్యాణ్ మంగళవారం చిరంజీవి ఇంట్లో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కార్మికుల డిమాండ్లు, నిర్మాతల మండలి తీసుకున్న నిర్ణయాల్ని ఆయనకు వివరించారు. అనంతరం దీనిపై సి.కల్యాణ్ మాట్లాడుతూ.. రెండు మూడు రోజుల్లో పరిస్థితులు చక్కబడకపోతే ఈ విషయంలో తాను జోక్యం చేసుకుంటానని చిరు నిర్మాతలకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. "చిరంజీవిని కలిసి మా సమస్యను చెప్పాం. 'ఇలా అకస్మాత్తుగా చిత్రీకరణలు ఆపడం బాధాకరమైన విషయమ'న్నారు. 'మీ సమస్యలు మీరు చెప్పారు.. అటు వైపు కార్మికుల వెర్షన్‌ను కూడా తెలుసుకుంటాన'న్నారు. 'ఈ రెండు మూడు రోజుల్లో మీ ఇరు వర్గాలు చర్చించి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయాల'ని చిరు మాకు సూచించారు. ఒకవేళ ఈలోగా పరిస్థితులు చక్కబడకపోతే తాను జోక్యం చేసుకుంటానని ఆయన మాకు చెప్పారు. బుధవారం చిన్న సినిమా నిర్మాతలతో పాటు యూనియన్ నాయకులతోనూ మరోసారి సమావేశమై చర్చిస్తాం. సాధ్యమైనంత వరకు సాయంత్రాని కల్లా ఈ సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తామ"ని కల్యాణ్ చెప్పారు. ఇక మరో వైపు మంగళవారం ఉదయం ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు, కార్మిక శాఖ అదనపు కమిషనర్‌తో సమావేశమై తమ సమస్యల్ని వినిపించారు. ఈ సందర్భంగా లేబర్ కమిషన్ ఒక పర్సెంటేజ్ ప్రతిపాదన చేయగా.. దానికి తాము ఒప్పుకోలేదని ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ తెలియజేశారు. "కార్మికుల వేతనాల అంశంపై అదనపు కమిషనర్ గంగాధర్‌ను కలిశాం. 30శాతం పెంపుతో వేతనాలు ఇప్పించాలని సూచించాం. ప్రొడ్యూసర్ కౌన్సిల్ నేతలతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని ఆయన మాకు చెప్పారు. మేము కార్మికుల కష్టానికి ప్రతిఫలం అడుగుతున్నాం తప్ప ఎవరినీ దోచుకోవడం లేదు"అని వల్లభనేని అనిల్ చెప్పారు.

తిండిబోతు దెయ్యంతో తిప్పలు


శివ

"యమలీల', 'ఘటోత్కచుడు'లా ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే సినిమా 'బకాసుర రెస్టారెంట్'" అన్నారు ఎస్‌జే శివ. ఆయన దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో ప్రవీణ్ ప్రధాన పాత్ర పోషించగా.. వైవా హర్ష టైటిల్ పాత్రలో నటించారు. ఇది ఈనెల 8న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శివ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ "ఇది కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం. మన జీవితంలోకి ఓ తిండిబోతు దెయ్యం వస్తే ఆ తిప్పలు ఎలా ఉంటాయన్నది ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఇలాంటి హంగర్ కామెడీ కథ తెలుగులో ఇంత వరకూ రాలేదు. ప్రవీణ్ దీంట్లో రెస్టరెంట్ పెట్టాలని కలలు కనే కుర్రాడిగా కనిపిస్తారు. హర్ష బకాసురగా అలరిస్తారు" అని చెప్పారు.

ఓటీటీలో ఈ వారం

ఉత్కంఠభరిచే చిత్రాలు.. సీటు అంచున కూర్చోబెట్టే థ్రిల్లర్లతో ప్రేక్షకుల్ని అలరిస్తున్నాయి ఓటీటీలు. ప్రతి వారం భాషతో సంబంధం లేకుండా సినీ ప్రేమికులకు కొత్త కొత్త చిత్రాల్ని పరిచయం చేస్తున్నాయి. ఇందులో భాగంగానే ఈ వారం కూడా వైవిధ్యమైన చిత్రాలు, సిరీస్‌లు సినీప్రియుల్ని ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యాయి.

ది పికప్ (చిత్రం)	బుధవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
వెన్స్‌డే సీజన్ 2(సిరీస్)	బుధవారం	నెట్‌ఫ్లిక్స్
మిక్కీ 17 (చిత్రం)	గురువారం	జియో హాట్‌స్టార్
సలాకార్ (సిరీస్)	శుక్రవారం	జియో హాట్‌స్టార్
ఓహో ఎంథన్ బేబీ (చిత్రం)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
ట్రెండింగ్ (చిత్రం)	శుక్రవారం	సన్‌నెక్ట్స్
హెబ్బులి కట్ (చిత్రం)	శుక్రవారం	సన్‌నెక్ట్స్

నేర ప్రపంచంలోకి రియల్ ఎస్టేట్ ఏజెంట్

హంతకుడైన మార్విన్ గేబుల్ (కే హుయ్ క్వాన్) నేర ప్రపంచాన్ని వదిలి రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా స్థిరపడతాడు. ఓ ఉత్తరంతో ప్రశాంతంగా గడుపుతున్న ఆయన జీవితం తలకిందులవుతుంది. దీంతో మళ్లీ హంతకుడిగా అవతారమెత్తాల్సి వస్తుంది. ఆ తర్వాత ఏమైంది? అనేదే 'లవ్ హర్ట్స్' చిత్రం. కే హుయ్ క్వాన్, అరియానా డెబోస్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని జోనాథన్ యూసేబియో తెరకెక్కించారు. ఇప్పటికే థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ఈ నెల 7న జియోహాట్‌స్టార్‌లో విడుదల కానుంది.


'లవ్ హర్ట్స్'


వెన్స్‌డే సీజన్ 2


హెబ్బులి కట్


సలాకార్


ఓహో ఎంథన్ బేబీ


ట్రెండింగ్


మిక్కీ 17

పల్లెటూరి స్నేహితుల కథతో



పల్లెటూరి నేపథ్యంలో శంకర్ చేగూరి తెరకెక్కించిన చిత్రం 'బద్మాషులు'. మహేశ్ చింతల, విద్యాసాగర్ కారంపూరి, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. బాధ్యత లేకుండా తిరుగుతున్న ఓ ఇద్దరి స్నేహితుల చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది. వినోదాత్మక నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా ఇటీవలే థియేటర్లలోకి వచ్చి ప్రేక్షకుల్లో నవ్వులు పూయించింది. ఇప్పుడీ చిత్రం శుక్రవారం నుంచి ఈటీవీ విన్ వేదికగా మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది.

విదేశీ గడ్డపై మత్స్యకారుల పోరాటం



సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవించే కొందరు మత్స్యకారుల జీవితాల ఆధారంగా రూపొందుతున్న సిరీస్ 'అరేబియా కడలి'. సత్యదేవ్, ఆనంది ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌కు సూర్యకుమార్ దర్శకత్వం వహించారు. క్రిష్ జాగర్లమూడి రచయిత. అనుకోకుండా అంతర్జాతీయ సరిహద్దులు దాటి, విదేశీ గడ్డపై బందీలుగా మారిన మత్స్యకారుల పోరాటం గురించి ఇందులో చూపించనున్నారు. ఈ సిరీస్ శుక్రవారం అమెజాన్ ప్రైమ్‌లో విడుదల కానుంది.

చివరి రక్తపు బొట్టు వరకూ పోరాడుతాం!


ఫర్హాన్ అక్తర్

"ఈ యూనిఫాం ధైర్యం మాత్రమే కాదు.. త్యాగం కూడా కావాలని ఓ సారి నాన్న చెప్పార"ని అంటున్నారు బాలీవుడ్ దర్శకుడు, నటుడు ఫర్హాన్ అక్తర్. మరి వాళ్ల తండ్రి మాటలకు విలువనిచ్చి యుద్ధభూమిలో ఆయన ఎలాంటి సాహసాలు చేశారో తెలియాలంటే '120 బహాదుర్' సినిమా చూడాల్సిందే. రజనీశ్ ఘాయ్ తెరకెక్కిస్తున్నారు. రాశీ ఖన్నా కీలక పాత్ర పోషిస్తుంది. 1962లో జరిగిన ఇండో-చైనా యుద్ధంలో ముఖ్యమైనదిగా గుర్తింపు పొందిన రెజాంగ్ లాకు నాయకత్వం వహించిన మేజర్ షైతాన్ సింగ్ జీవితాధారంగా దీన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "మేము చైనీయులపై దాడి చేయడానికి సిద్ధమవుతున్నాం" అంటూ మొదలైన ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. "మేము వెనక్కి తగ్గము.. చివరి రక్తపు బొట్టు వరకు పోరాడటానికి సిద్ధంగా ఉన్నామ"ంటూ ఆఖర్లో మేజర్ షైతాన్ పాత్రలో ఫర్హాన్ చెప్పిన సంభాషణలు అలరిస్తున్నాయి. నవంబరు 21న విడుదల కానుంది చిత్రం.

ఈనాడు బిజినెస్

పన్నుల బకాయిలు రూ.54.53 లక్షల కోట్లు

దిల్లీ: ప్రత్యక్ష, పరోక్ష పన్నుల బకాయిలు రూపేణా జూన్ 30 నాటికి మొత్తంగా రూ.54.53 లక్షల కోట్లు రావాల్సి ఉందని రాజ్యసభకు మంత్రి పంకజ్ చౌద్రి తెలిపారు. ఇందులో పరోక్ష పన్నుల బకాయిలు రూ.7.01 లక్షల కోట్లు కాగా.. ప్రత్యక్ష పన్నులవి రూ.47.52 లక్షల కోట్లు అని వెల్లడించారు. పరోక్ష పన్నుల్లో రూ.10 కోట్లకు మించి బకాయిపడిన వారి నుంచి మొత్తంగా రూ.2.66 లక్షల కోట్లు రావాల్సి ఉందని, ప్రత్యక్ష పన్నుల్లో ఈ విలువ రూ.35.48 లక్షల కోట్లుగా ఉందని తెలిపారు. పరోక్ష పన్ను బకాయిలైన రూ.7.01 లక్షల కోట్లలో రూ.3.71 లక్షల కోట్లు, ప్రత్యక్ష పన్నుల బకాయిలైన రూ.47.52 లక్షల కోట్లలో రూ.31.26 లక్షల కోట్లు న్యాయస్థానాల్లోని వివిధ కేసులతో ముడిపడి ఉన్నాయని మంత్రి వివరించారు.

రూ.17,400 కోట్ల టాటా క్యాపిటల్ ఐపీఓ

దిల్లీ: టాటా సన్స్ నేతృత్వంలోని టాటా క్యాపిటల్.. ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు అనుమతి కోరుతూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద నవీకరించిన ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. వీటి ప్రకారం, కంపెనీ 47.58 కోట్ల ఈక్విటీ షేర్లను ఈ ఐపీఓలో విక్రయించనుంది. ఇందులో 21 కోట్ల షేర్లను తాజాగా జారీ చేయనుండగా, మిగిలిన 26.58 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో విక్రయించనుంది. టాటా సన్స్ 23 కోట్ల షేర్లను, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) 3.58 కోట్ల షేర్లను ఓఎఫ్ఎస్‌లో విక్రయించనున్నాయి. కంపెనీ విలువను సుమారు 11 బిలియన్ డాలర్లు (రూ.96,000 కోట్లు)గా పరిగణించి, 2 బి.డాలర్ల (రూ.17,400 కోట్లు)ను ఐపీఓ ద్వారా టాటా క్యాపిటల్ సమీకరించబోతోంది.

ఎయిర్‌పోర్ట్, ఎయిర్‌లైన్ కార్గో ఆపరేషన్స్‌లో జీఎంఆర్ ఏరో అకాడమీ సర్టిఫికేషన్ ప్రోగ్రాం

ఈనాడు, హైదరాబాద్: విమానయాన శిక్షణ సంస్థ జీఎంఆర్ ఏరో అకాడమీ 'ఎయిర్‌పోర్ట్, ఎయిర్‌లైన్ కార్గో ఆపరేషన్స్'లో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది ఆన్‌లైన్ ద్వారా అందించే 3 నెలల కాల వ్యవధి గల సర్టిఫికేట్ ప్రోగ్రాం. ఇందులో పాల్గొనేవారికి విమానయాన రంగంపై సమగ్ర అవగాహన లభిస్తుందని సంస్థ తెలిపింది. బేసిక్ థియరీతో పాటు ప్రాక్టికల్ శిక్షణ ఉంటుంది. ఈ కోర్సును రెండు దశలుగా విభజించారు. తొలిదశలో పౌర విమానయాన రంగం పునాది అంశాలు, నియంత్రణ సంస్థలు, టైమ్ జోన్స్, కస్టమర్ సర్వీస్ స్కిల్స్.. తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. రెండో దశలో ఎయిర్‌సైడ్ ఆపరేషన్స్, ర్యాంప్ ఆపరేషన్స్, ఏవియేషన్ సెక్యూరిటీ, కార్గో ఆపరేషన్స్ నేర్పిస్తారు. ఇందులో చేరేందుకు 27 సంవత్సరాలు లోపు వయసున్న గ్రాడ్యుయేట్లు, మంచి సంభాషణా చాతుర్యం గల వారు అర్హులు. జీఎంఆర్ ఏరో సిటీ (ఎయిర్‌పోర్ట్ వృత్తులు, కార్యక్రమాలు) అద్భుత అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయని ఈ శిక్షణ వల్ల దేశంలో విమానయాన శిక్షణ ఎంతో సులభతరం అవుతుందన్నారు. డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ కాబట్టి విద్యార్థులకు భౌగోళిక అవరోధాలు ఉండవని తెలిపారు. తత్ఫలితంగా ప్రయాణ ఖర్చులు, సమయం వృథా అయ్యే అస్కారం లేదని పేర్కొన్నారు.

కోడి గుడ్డు

6న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (వంద గుడ్లు రూపాయల్లో)

హైదరాబాద్	435
వరంగల్	437
విజయవాడ	475
గోదావరి	475
విశాఖపట్నం	475
చిత్తూరు	513

యూపీఐ సేవలు ఇక ఉచితం కాదా?

- అగ్రిగేటర్లపై ఛార్జీలు విధిస్తున్న బ్యాంకులు
- ఆ భారం వినియోగదారులకు బదిలీ అయ్యే ఆస్కారం
- నగదు లావాదేవీలకు మళ్లకుండా చూడాలి



ఈనాడు, హైదరాబాద్: దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి నాంది పలికిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఇప్పుడు కీలక మలుపు వైపు సాగుతోంది. ఈ లావాదేవీలను నిర్వహించే పేమెంట్ అగ్రిగేటర్ల (పీఏ) నుంచి ఛార్జీలు వసూలు చేయాలని పలు బ్యాంకులు నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి. కొన్ని బ్యాంకులు వసూలును ప్రారంభించాయి కూడా. ఫలితంగా భవిష్యత్తులో వినియోగదారులపైనా కొంతమేర ఆర్థిక భారం పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఈనెల 1 నుంచి..

ఈ నెల ఒకటో తేదీ నుంచి ఐసీఐసీఐ బ్యాంక్ యూపీఐ లావాదేవీలపై పీఏల నుంచి ఛార్జీ వసూలు చేయడం ప్రారంభించింది. దీనికి సంబంధించి జూన్‌లోనే సమాచారం ఇచ్చిందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఎస్క్రో ఖాతా ఉన్న పీఏలకు లావాదేవీకి 2 బేసిస్ పాయింట్లు (రూ.100 లావాదేవీపై రూ.0.02) ఛార్జీ విధిస్తున్నట్లు, ఇది గరిష్ఠంగా రూ.6 ఉంటుందని పేర్కొంది. ఎస్క్రో ఖాతా లేని పీఏలకు 4 బేసిస్ పాయింట్లు, గరిష్ఠంగా రూ.10 ఛార్జీ విధిస్తోంది. వ్యాపారులు ఐసీఐసీఐ బ్యాంకు ఖాతా ద్వారా లావాదేవీలు నిర్వహిస్తే ఎలాంటి ఛార్జీలు ఉండవని తెలిపింది.

ఆర్‌బీఐ సైతం..

ప్రస్తుతం వినియోగదారులకు యూపీఐ సేవలు ఉచితంగానే లభిస్తున్నాయి. దీర్ఘకాలంలో ఇది ఇలాగే కొనసాగకపోవచ్చని ఇటీవల ఒక కార్యక్రమంలో ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. 'యూపీఐ కోసం అవుతున్న ఖర్చులను ఎవరో ఒకరు భరించాలి' అని ఆయన వ్యాఖ్యానించడం ఈ సందర్భంగా గమనార్హం. నిర్ణీత మొత్తం దాటిన యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధిస్తారని గతంలో వార్తలు వచ్చాయి. ఈ ప్రతిపాదనపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో.. అలాంటిదేమీ లేదని ఆర్‌బీఐ, కేంద్రం పేర్కొన్నాయి.

ప్రస్తుతం ఎండీఆర్ లేదు

ప్రస్తుతం యూపీఐ లావాదేవీలకు మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వర్తించడం లేదు. అదే సమయంలో బిల్‌డెస్క్, రాజోర్‌పే, సీసీఅవెన్యూ, క్యాష్‌ఫ్రీ పేమెంట్స్ వంటి పేమెంట్ అగ్రిగేటర్లకూ ఎలాంటి రుసుములూ లేవు. వినియోగదారులు, వ్యాపారుల మధ్య ఒక వారధిలా పీఏలు పనిచేస్తాయి. క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, యూపీఐ వంటి వివిధ చెల్లింపు పద్ధతులను సులభంగా నిర్వహించేందుకు థర్డ్ పార్టీ సేవలను అందించే సంస్థలివి. ఆర్‌బీఐ వెబ్‌సైట్ ప్రకారం జులై 16 నాటికి దేశంలో 8 పీఏలు ఈ సేవలను అందిస్తున్నాయి. వీటికి అదనంగా మరో 30 సంస్థల దరఖాస్తులూ వివిధ దశల్లో ఉన్నాయి.

యాక్సిస్ బ్యాంక్ సహా పలు ప్రైవేటు బ్యాంకులు కూడా ఇదే తరహాలో 6-9 బేసిస్ పాయింట్ల ఛార్జీలను వసూలు చేయడం ప్రారంభించాయి. ప్రభుత్వ బ్యాంకులూ 2-10 బేసిస్ పాయింట్ల మధ్య ఛార్జీలు విధించేందుకు ప్రణాళికలు వేస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఒక్కో లావాదేవీపై ఎన్‌పీసీఐ 0.02% స్విచ్ ఫీజును వసూలు చేస్తుందని ఒక పీఏ సంస్థ ప్రతినిధి తెలిపారు.

ప్రారంభ దశలోనే..

యూపీఐ లావాదేవీలపై పీఏల నుంచి రుసుము వసూలు చేయాలనే ప్రతిపాదన ప్రారంభ దశలోనే ఉందని పలు పేమెంట్ అగ్రిగేటర్ సంస్థలు అంటున్నాయి. కొన్ని బ్యాంకులు ఈ ఛార్జీలను వసూలు చేస్తున్నాయనే సమాచారాన్ని అవి ఖండించడం లేదు. అన్ని బ్యాంకులూ ఛార్జీలను వసూలు చేయడం ప్రారంభిస్తే, ఆ భారాన్ని వినియోగదారులకు బదిలీ చేయడం మినహా మరో మార్గం ఉండదన్నది పీఏల వాదన. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటేనే వినియోగదారులపై భారం పడదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

● యూపీఐ లావాదేవీలకు ప్రత్యేకంగా రుసుం వసూలు చేయడం లేదు కనుకే, నగదు బదులు ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరుపుతున్నారు. అదనపు భారం పడితే సామాన్యులు డిజిటల్ చెల్లింపులకు కొంతమేర దూరం అయ్యే ప్రమాదముంది.

వాహన కండీషన్ ఎలా ఉందో చెప్పేస్తుంది!

ఏఐ ఆధారిత ప్లాట్‌ఫాంను ఆవిష్కరించిన ఫోర్స్‌మోటార్స్

ముంబయి: ఫోర్స్‌మోటార్స్ ఒక సరికొత్త కనెక్టెడ్ వెహికల్ ప్లాట్‌ఫాంను మంగళవారం ఆవిష్కరించింది.



కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో పనిచేసే ఫ్లీట్ ఇంటెలిజెన్స్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్‌ను ఇది అందిస్తుంది. ఈ కొత్త ప్లాట్‌ఫాంను అన్ని వాణిజ్య వాహనాలకూ అధీకృత డీలర్‌షిప్‌ల ద్వారా అందజేయనున్నారు. క్లౌడ్ పద్ధతిలో ఇది పనిచేస్తుంది.

ఏం చెబుతుందంటే: ప్రస్తుతం, గతంలో వాహన కండీషన్ ఎలా ఉందో మొబైల్‌ఫోన్, డెస్క్‌టాప్ కంప్యూటర్లకు సమాచారం అందిస్తుంది. వాహన ఇంజిన్, పవర్‌ట్రెయిన్, విద్యుత్తు-థర్మల్ వ్యవస్థలన్నింటినీ ఇది పరిశీలిస్తుంది. డ్రైవర్ తీరు, ఇంధన సామర్థ్యం ప్రమాణాలన్నిటినీ వివరిస్తుంది. దీని వల్ల వాహన యజమానులు లోపాలను ముందుగానే సరిచేసుకుని, భారీ వ్యయాలను తగ్గించుకునేందుకు వీలవుతుందని ఫోర్స్‌మోటార్స్ చెబుతోంది. రిమోట్ వెహికల్ మానిటరింగ్, అలర్ట్ వ్యవస్థ, నిపుణులతో పరిష్కారాలను అందించనున్నట్లు తెలిపింది.

ఈడీ విచారణకు అనిల్ అంబానీ




దిల్లీ: మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ మంగళవారం హాజరయ్యారు. దాదాపు 10 గంటల పాటు ఆయన్ను ఈడీ విచారించింది. ఆయన గ్రూప్ కంపెనీలు పలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని అవకతవకలకు పాల్పడ్డాయనే ఆరోపణలతో ఈ కేసు నమోదైంది. మంగళవారం ఉదయం 10.50 గంటలకు మధ్య దిల్లీలోని ఈడీ కార్యాలయానికి అనిల్ అంబానీ చేరుకున్నారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదుచేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. జులై 24న ముంబయిలో రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన 50 కంపెనీలకు చెందిన 35 ప్రాంతాల్లో, 25 మంది వ్యక్తులపై ఈడీ సోదాలు నిర్వహించిన అనంతరం.. విచారణకు హాజరు కావాల్సిందిగా అనిల్ అంబానీకి ఈడీ సమన్లు జారీ చేసింది. అనంతరం ఆ గ్రూప్‌లోని పలువురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకూ సమన్లు జారీ చేసింది. అనిల్ అంబానీ విదేశాలకు వెళ్లకుండా లుకౌట్ సర్క్యులర్‌ను కూడా ఈడీ నోటీపై చేసింది.

✦ రిలయన్స్ గ్రూప్ కంపెనీకి రూ.68 కోట్ల నకిలీ బ్యాంక్ గ్యారెంటీ అందించారన్న ఆరోపణలతో ఒడిశాకు చెందిన బిస్వాల్ ట్రేడ్‌లింక్ ఎండీ పార్థసారథి బిస్వాల్‌ను ఈడీ ఇటీవల అరెస్ట్ చేసింది.

✦ రిలయన్స్ ఇన్‌ఫ్రా సహా పలు రిలయన్స్ గ్రూప్ కంపెనీలు బ్యాంకుల నుంచి రూ.17,000 కోట్ల రుణాలను తీసుకుని, ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలతో అనిల్ అంబానీపై చర్యలు చేపట్టారు.

ఎయిర్‌టెల్ లాభం రూ.5,948 కోట్లు



దిల్లీ: ఎయిర్‌టెల్ జూన్ త్రైమాసికంలో రూ.5,947.8 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.4,160 కోట్లతో పోలిస్తే ఇది 43% అధికం. కార్యకలాపాల ఆదాయం రూ.38,506.4 కోట్ల నుంచి 28.4% వృద్ధి చెంది రూ.49,463 కోట్లకు చేరింది. సంస్థ భారత ఆదాయం 29% వృద్ధితో రూ.37,585 కోట్లకు పెరిగింది.

రూ.250కు అర్పు: ప్రతి వినియోగదారుపై సగటు ఆర్జన (అర్పు) 2024 జూన్ ఆఖరుకు రూ.211 కాగా, సమీక్షా త్రైమాసికం చివరకు రూ.250కి పెరిగింది. మొత్తం ఖాతాదారుల సంఖ్య 6.6% పెరిగి 43.6 కోట్లకు చేరినట్లు కంపెనీ వైస్ ఛైర్మన్, ఎండీ గోపాల్ విత్తల్ పేర్కొన్నారు. 'స్థిరమైన వృద్ధిని సాధించాం. మార్చితో పోలిస్తే ఆదాయాలు 3.3% పెరిగాయి. భారత ఆదాయం 2.3% వృద్ధి చెందగా, ఆఫ్రికా విభాగం 6.7% స్థిర కరెన్సీ వృద్ధిని నమోదు చేసింద'ని వెల్లడించారు. ఎయిర్‌టెల్ స్మార్ట్‌ఫోన్ డేటా వినియోగదారులు గతేడాదితో పోలిస్తే 2.13 కోట్ల మంది పెరిగారు. మార్చితో చూస్తే 39 లక్షలు అధికమయ్యారు. మొత్తం చందాదారుల్లో వీరి వాటా 77 శాతంగా ఉంది. నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకునేందుకు సమీక్షిస్తున్న త్రైమాసికంలో 1800 కొత్త టవర్లు, 7500 మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ సైట్లను కంపెనీ జతచేసుకుంది.

స్వల్పంగా తగ్గిన ఎన్‌సీసీ ఆదాయం

ఈనాడు, హైదరాబాద్: ఎన్‌సీసీ లిమిటెడ్ ఏకీకృత ఖాతాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.5,207.93 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. నికరలాభం రూ.192.14 కోట్లు, ఈపీఎస్ రూ.3.06గా నమోదయ్యాయి. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.5558.33 కోట్లు, లాభం రూ.209.92 కోట్లు, ఈపీఎస్ రూ.3.34గా ఉన్నాయి. దీంతో పోలిస్తే ఈసారి ఆదాయం 6% తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో ఎన్‌సీసీకి కొత్తగా రూ.3,658 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయి. దీంతో మొత్తం రూ.70,087 కోట్ల ఆర్డర్లు చేతిలో ఉన్నట్లు అవుతోంది.

సీసీఎల్ ప్రోడక్ట్స్ ఆదాయంలో 36% వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: ఇన్‌స్టంట్ కాఫీ తయారీ సంస్థ సీసీఎల్ ప్రోడక్ట్స్ ఇండియా.. ఏప్రిల్- జూన్ త్రైమాసికానికి రూ.72.40 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.71.4 కోట్ల పోలిస్తే లాభంలో పెద్దగా మార్పులేదు. అయితే ఆదాయం రూ.773.29 కోట్ల నుంచి 36.5% పెరిగి రూ.1,055 కోట్లకు చేరింది. కంపెనీ షేరు బీఎస్ఈలో 1.75% నష్టపోయి, రూ.910.60 వద్ద స్థిరపడింది. గత 6 నెలల్లో ఈ షేరు 34% లాభపడటం గమనార్హం.

సముద్ర ఆహార ఎగుమతులు 3 రెట్లు పెరిగే వీలు

భారత్-యూకే ఒప్పంద పరిణామం



అహ్మదాబాద్: భారత్-యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో భాగంగా.. మత్స్య ఉత్పత్తులపై సుంకాలు పరిహరించిన నేపథ్యంలో, రానున్న సంవత్సరాల్లో యూకేకు భారత్ నుంచి ఎగుమతులు 3 రెట్లు పెరగొచ్చని పరిశ్రమ అంచనా వేస్తోంది. ప్రస్తుతం రూ.1,000 కోట్ల విలువైన మత్స్య ఉత్పత్తులు యూకేకు ఎగుమతి అవుతుండగా, 3 సంవత్సరాల్లో ఈ విలువ రూ.3,000 కోట్లకు చేరే వీలుందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2,300 కిలోమీటర్ల సముద్రతీరం కలిగిన గుజరాత్, దాదాపు 1,000 కిలోమీటర్ల తీరం కలిగిన ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల వారికి మేలు కలుగుతుందని పేర్కొంటున్నారు.

✦ ఇప్పటివరకు మనదేశం నుంచి ఎగుమతి అవుతున్న చేపలు, రొయ్యలపైన యూకే 8.9% సుంకం విధిస్తున్నట్లు సీఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఈఏఐ) మాజీ అధ్యక్షుడు పీయూష్ ఫోఫాండి తెలిపారు. ఇకపై ఇది సున్నా కానుంది. యూకే ఏటా దిగుమతి చేసుకుంటున్న 5.4 బిలియన్ డాలర్ల (రూ.47,000 కోట్ల) విలువైన మత్స్య ఉత్పత్తుల్లో మనదేశ వాటా 2.2 శాతమే. ఇప్పుడు సుంకాలు లేనందున, మన ఉత్పత్తుల ధరలు అక్కడ తగ్గడం కలిసి రానుంది.

✦ మన మత్స్య ఎగుమతుల్లో 70% వాటా రొయ్యలదే. ప్రస్తుతం అమెరికా, ఇతర మార్కెట్లలో వీటికి సమస్యలు ఎదురవుతున్నాయి.

అదానీ పోర్ట్స్ లాభం రూ.3,311 కోట్లు



దిల్లీ: అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఏపీసెజ్), ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ.3,311 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదుచేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,107 కోట్లతో పోలిస్తే ఇది 6.54% ఎక్కువ. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.8,054 కోట్ల నుంచి రూ.9,422 కోట్లకు వృద్ధి చెందింది. మొత్తం వ్యయాలూ రూ.4,239 కోట్ల నుంచి రూ.5,732 కోట్లకు పెరిగాయి. లాజిస్టిక్స్, మెరైన్ వ్యాపారాలు రాణించడంతో గత త్రైమాసికంలో 21% ఆదాయ వృద్ధి సాధించామని కంపెనీ డైరెక్టర్, సీఈఓ అశ్వనీ గుప్తా పేర్కొన్నారు. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ 121 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకును రవాణా చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఇది 11% అధికం. ఏపీసెజ్ దేశీయ పోర్టుల ఆదాయం 14% పెరిగి రూ.6,137 కోట్లకు, అంతర్జాతీయ పోర్టుల ఆదాయం 22% వృద్ధితో రూ.973 కోట్లుగా నమోదైంది. 2025 జూన్ చివరకు కంపెనీ చేతిలో నగదు నిల్వలు రూ.16,921 కోట్లుగా, కంపెనీ స్థూల రుణాలు రూ.53,089 కోట్లుగా ఉన్నాయి.

✦ అదానీ పోర్ట్స్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా గౌతమ్ అదానీ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆయన కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఆగస్టు 5 నుంచి ఈ మార్పు అమల్లోకి వచ్చింది.

లెక్కాపత్రం లేని ఆదాయం రూ.30,444 కోట్లు

465 సర్వేల్లో గుర్తించిన ఐటీ విభాగం

దిల్లీ: ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం 2024-25లో 465 సర్వేలు నిర్వహించింది. ఇందులో రూ.30,444 కోట్ల మేర లెక్కాపత్రం లేని ఆదాయాన్ని గుర్తించినట్లు పార్లమెంటుకు తెలిపింది. ప్రత్యక్ష పన్నుల ఎగవేతకు సంబంధించి విశ్వసనీయ సమాచారం వచ్చినపుడల్లా సర్వేలు, సోదాలు, జప్తు, మదింపు వంటి చర్యలు చేపట్టి.. వెల్లడించని ఆదాయాలను పన్ను పరిధిలోకి తీసుకువచ్చినట్లు రాజ్యసభకు రాతపూర్వకంగా ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌద్రీ తెలిపారు. 2023-24, 2022-23లలో వరుసగా 737, 1245 సర్వేలు నిర్వహించగా.. రూ.37,622 కోట్లు, రూ.9,805 కోట్లు చొప్పున నల్లధనం బయటపడిందని తెలిపారు.

✦ 2024-25లో మొత్తం 1437 బృందాలు సోదాలు నిర్వహించి, రూ.2504 కోట్ల ఆస్తిని జప్తు చేశారు.

✦ 2023-24లో 1166 బృందాలు సోదాలు జరపగా రూ.2555 కోట్ల ఆస్తి, 2022-23లో 1437 బృందాల సోదాల్లో రూ.1766 కోట్ల ఆస్తిని జప్తు చేశారు.

వర్చువల్ డిజిటల్ ఆస్తులపై రూ.705 కోట్ల పన్ను: 2022-23, 2023-24 సంవత్సరాల్లో వర్చువల్ డిజిటల్ ఆస్తుల (వీడీఏ) లావాదేవీల నుంచి వచ్చిన ఆదాయంపై పన్ను రూపంలో రూ.705 కోట్లు వసూలైనట్లు మంత్రి తెలిపారు.

11 నెలల గరిష్ఠానికి సేవల రంగ వృద్ధి

దిల్లీ: జులైలో దేశీయ సేవల రంగ వృద్ధి 11 నెలల గరిష్ఠాన్ని తాకింది. కొత్త ఎగుమతి ఆర్డర్లు పుంజుకోవడం, విక్రయాల్లో బలమైన వృద్ధి ఇందుకు కారణమని నెలవారీ సర్వే తెలిపింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ సూచీ జులైలో 60.5 పాయింట్లుగా నమోదైంది. జూన్‌లోని 60.4 పాయింట్లతో పోలిస్తే అతిస్వల్పంగా పెరిగింది. పీఎంఐ పరిభాషలో సూచీ 50 పాయింట్ల ఎగువన ఉంటే వృద్ధి ఉన్నట్లు; 50 పాయింట్ల దిగువన ఉంటే క్షీణతగా పరిగణిస్తారు.

జెహ్ ఏరోస్పేస్‌కు రూ.100 కోట్ల పెట్టుబడి

ఈనాడు, హైదరాబాద్: ఏరోస్పేస్ అంకురం జెహ్ ఏరోస్పేస్ సిరీస్-ఎ ఫండింగ్‌లో భాగంగా రూ.100 కోట్ల (11 మిలియన్ డాలర్ల) పెట్టుబడిని సమీకరించింది. ఎలివేషన్ క్యాపిటల్‌తోపాటు, జనరల్ క్యాటలిస్ట్ ఈ నిధులను అందించాయి. ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించేందుకు ఈ నిధులు ఉపయోగించనున్నట్లు కంపెనీ పేర్కొంది. ఏరోస్పేస్ రంగానికి అధిక నాణ్యత గల విడిభాగాలను సరఫరా చేసేందుకు, సాంకేతికతను మరింత మెరుగుపర్చేందుకు ఈ పెట్టుబడి తోడ్పడుతుందని సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ విశాల్ సంఘవి తెలిపారు.

ఎంటార్ టెక్ రూ.11 కోట్ల లాభం

ఈనాడు, హైదరాబాద్: ఎంటార్ టెక్నాలజీస్ ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.156.6 కోట్ల ఆదాయంపై రూ.10.8 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.128.3 కోట్లు, నికరలాభం రూ.4.4 కోట్లు ఉన్నాయి. దీంతో పోలిస్తే ఈసారి ఆదాయం 22.1%, నికరలాభం 144.2% పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో ఇంకా మెరుగైన ఫలితాలు నమోదు చేసే అవకాశం ఉందని ఎంటార్ టెక్నాలజీస్ ఎండీ పర్వత్ శ్రీనివాసరెడ్డి వివరించారు.

విదేశీ మారకపు ద్రవ్య లావాదేవీల నిర్వహణకు 'బీఓబీ ఎఫ్ఎక్స్‌వన్'

ఈనాడు, హైదరాబాద్: విదేశీ మారకపు ద్రవ్య కార్యకలాపాలను సులువుగా నిర్వహించడానికి 'బీఓబీ ఎఫ్ఎక్స్‌వన్' పేరుతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రారంభించింది. ప్రధానంగా కార్పొరేట్ సంస్థలు, ఎంఎస్ఎంఈ వినియోగదార్లకు ఇది అనువుగా ఉంటుందని బ్యాంక్ వెల్లడించింది. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ఫారెక్స్, డెరివేటివ్ కాంట్రాక్టుల ధరలు తెలుసుకోవడంతో పాటు లావాదేవీల నిర్వహణ, కాంట్రాక్టులను డౌన్లోడ్ చేసుకోవడం వీలవుతుందని, బ్యాంకు శాఖలకు వెళ్లే పనిఉండదని పేర్కొంది.

ఆర్‌బీఐ నిర్ణయాలకు ముందు అప్రమత్తత

సెన్సెక్స్ ▼308 80710 | నిఫ్టీ ▼73 24650

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.22.48 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.3,840.39 కోట్లు



సమీక్ష

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల ప్రకటనకు ముందు మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరించడంతో సూచీలు మంగళవారం నష్టపోయాయి. చమురు-గ్యాస్, బ్యాంకింగ్ షేర్లలో విక్రయాల ఒత్తిడి కనిపించింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 22 పైసలు నష్టపోయి జీవన కాల కనిష్ఠమైన 87.88 స్థాయి వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 1.02% తగ్గి 68.06 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, షాంఘై, హాంకాంగ్, జపాన్ సూచీలు సానుకూలంగా ముగిశాయి. ఐరోపా మార్కెట్లు కూడా ఇదే ధోరణిలో ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.83,000 కోట్లు తగ్గి, రూ.447.96 లక్షల కోట్ల (5.10 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 80,946.43 పాయింట్ల వద్ద ప్రతికూలంగా ప్రారంభమైంది. తదుపరి 81,010.49 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకినా, రోజంతా నష్టాల్లోనే సాగింది. ఒక దశలో 80,554.40 పాయింట్ల కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 308.47 పాయింట్ల నష్టంతో 80,710.25 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 73.20 పాయింట్లు కోల్పోయి 24,649.55 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,733.10-24,590.30 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 13 నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ 2.38%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.4%, ఇన్ఫోసిస్ 1.39%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.19%, ఎటెర్నల్ 1% చొప్పున పడ్డాయి. టైటన్ 2.16%, మారుతీ 1.3%, ట్రెంట్ 1.22%, మేర పెరిగాయి.

✦ రంగాల వారీ సూచీలకొస్తే చమురు-గ్యాస్, ఇంధనం, ఎఫ్ఎంసీజీ, సేవలు, ఫోకస్డ్ ఐటీ, ఐటీ, స్థిరాస్తి, ఆరోగ్య సంరక్షణ రంగాలు డీలా పడ్డాయి. వాహన, విద్యుత్, భారీ యంత్ర పరికరాలు, పారిశ్రామిక, మన్నికైన వినిమయ వస్తువులు, లోహ, టెలికాం రంగాలు రాణించాయి. బీఎస్ఈలో 1,672 షేర్లు సానుకూలంగా, 2,371 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి.

సంక్షిప్తంగా..

✦ **ఆర్‌బీఐ** ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను బుధవారం ఉదయం 10 గంటలకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించనున్నారు. ఈసారి కీలక రేట్లను సవరించక పోవచ్చని కొంత మంది విశ్లేషకులు అంచనా వేస్తుంటే, 25 బేసిస్ పాయింట్ల కోత విధించే అవకాశం ఉందని మరికొందరు చెబుతున్నారు.

✦ బెంగళూరులో తన రెండో ప్రాంగణం కోసం 194 మిలియన్ యూరోల (సుమారు రూ.2,000 కోట్ల) పెట్టుబడులు పెట్టబోతున్నట్లు **ఎస్ఏపీ ల్యాబ్స్ ఇండియా** ప్రకటించింది.

✦ **వెదర్‌ఫోర్డ్ ఇంటర్నేషనల్**‌కు చెందిన చమురు క్షేత్ర సేవల కంపెనీ.. ఏఐ ఆధారిత వ్యాపార పరివర్తన కోసం ఐటీ సేవల దిగ్గజం **టీసీఎస్**‌తో ఒప్పందం కుదుర్చుకోవడంతో పాటు అయిదేళ్ల కాంట్రాక్టును రెన్యువల్ చేసుకుంది.

✦ **సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా** (ఎస్ఈసీఐ) నిర్వహించిన ఇ-రివర్స్ వేలంలో 70,000 మెట్రిక్ టన్నుల గ్రీన్ అమ్మోనియా వార్షిక ఉత్పత్తి కోసం తన అనుబంధ సంస్థ ఎన్‌టీపీసీ రెన్యువబుల్ ఎనర్జీ విజయవంతమైన బిడ్డర్‌గా నిలిచిందని ప్రభుత్వ రంగ సంస్థ **ఎన్‌టీపీసీ** వెల్లడించింది.

✦ ఆటోమోటివ్ లైటింగ్ సిస్టమ్స్ సంస్థ వాలియోకు చెందిన లైటింగ్ వ్యాపారాన్ని కొనుగోలు చేసేందుకు **టాటా ఆటోకాంప్ సిస్టమ్స్**, జపాన్‌కు చెందిన **ఇచికో ఇండస్ట్రీస్** సంయుక్త సంస్థను (50:50 నిష్పత్తిలో) ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపాయి.

✦ పేటీఎం మాతృ సంస్థ **వన్97 కమ్యూనికేషన్స్**‌లో తనకున్న మొత్తం 5.84% వాటాను రూ.3,980 కోట్లకు విక్రయించడం ద్వారా యాంట్ ఫైనాన్షియల్ బయటకు వచ్చేసింది.

✦ **ఆదిత్య ఇన్ఫోటెక్** షేరు మంగళవారం స్టాక్ మార్కెట్‌లో నమోదైంది. ఇష్యూ ధర రూ.675తో పోలిస్తే బీఎస్ఈలో 50.81% లాభంతో రూ.1,018 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. చివరకు 60.61% పెరిగి రూ.1,084.10 వద్ద ముగిసింది.

✦ **హైవే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్** ఐపీఓకు బిడ్లు ప్రారంభమైన గంటల్లోనే పూర్తి స్పందన లభించింది. సంస్థ 1,60,43,046 షేర్లను ఆఫర్ చేయగా, మధ్యాహ్నంలోపే 11,97,90,186 షేర్లకు (7.47 రెట్లు) మదుపర్లు బిడ్లు దాఖలు చేశారు.

నేటి బోర్డు సమావేశాలు: బజాజ్ ఆటో, ట్రెంట్, కిమ్స్, దివీస్ ల్యాబ్స్, హీరో మోటోకార్ప్, బేయర్ క్రాప్‌సైన్స్, బజాజ్ హోల్డింగ్స్, పిడిలైట్ ఇండస్ట్రీస్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, భెల్, ఫోర్టిస్ హెల్త్‌కేర్, భారత్ ఫోర్జ్, జిందాల్ స్టెయిన్‌లెస్, హడ్కో, బ్లూస్టార్, ఇర్కాన్ ఇంటర్నేషనల్, ఈఐడీ ప్యారీ, రైట్స్, పీవీఆర్ ఐనాక్స్, సెరా శానిటరీవేర్, వీఐపీ ఇండస్ట్రీస్, వీఆర్ఎల్ లాజిస్టిక్స్

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
బ్రిటానియా	520.13	504.88	4,534.86	4,622.22
ప్రెస్టీజ్ ఎస్టేట్స్	292.5	232.6	2,468.7	2,024.5
శక్తి పంప్స్	96.8	92.7	622.5	567.6
భారతీ హెక్సాకామ్	391.6	511	2,310	2,336
టొరెంట్ పవర్	741.58	996.34	8,011.04	9,110.02
ఎరిస్ లైఫ్‌సైన్సెస్	125	89	773	720
అలెంబిక్ ఫార్మా	154	135	1,717	1,564
హెచ్‌టీ మీడియా	(11.37)	(27.59)	412.15	378.51
బీఎల్ఎస్ ఇంటర్నేషనల్	180.97	120.78	710.56	492.66
బెర్జర్ పెయింట్స్	315	354	3,200.76	3,091.01
ఎక్సైడ్ ఇండస్ట్రీస్	275	221	4,695	4,436
కన్సాయ్ నెరోలాక్	215.6	224.87	2,162.03	2,133.08
క్యాస్ట్రాల్ ఇండియా	244	232	1,497	1,398
కేపీ ఎనర్జీ	25.42	18.21	220.60	135.21
కేపీఐ గ్రీన్ ఎనర్జీ	111.32	66.11	614.12	349.85



ప్రాక్టీస్ బిట్స్ — ఇండియన్ పాలిటీ

1. భారత జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1940, ఆగస్టు 21న ఎక్కడ సమావేశమై 'ఆగస్టు ప్రతిపాదన'ను తిరస్కరించింది?
   1) నాగపూర్ 2) వార్ధా
   3) బెల్గాం 4) మద్రాస్
2. కింది వాటిలో క్రిప్స్ రాయబారానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) రెండో ప్రపంచయుద్ధ సమయంలో భారతీయుల సహకారం పొందడానికి 1942, మార్చిలో బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ నియమించారు.
   బి) దీనిలోని సభ్యులు సర్ స్టాఫర్డ్ క్రిప్స్, పెథిక్ లారెన్స్, ఎ.వి.అలెగ్జాండర్.
   సి) భారత్‌కు యుద్ధానంతరం అధినివేశ ప్రతిపత్తి లభిస్తుందని ప్రతిపాదించారు.
   1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి
3. క్రిప్స్ ప్రతిపాదనలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) భారత రాజ్యాంగ రచన కోసం రాజ్యాంగ సభ ఏర్పాటు చేస్తారు.
   బి) వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలో రక్షణశాఖ తప్పించి మిగతా అన్ని శాఖలు భారతీయులకు బదిలీ చేస్తారు.
   సి) వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలో భారతీయ సభ్యుల సంఖ్య తగ్గుతుంది.
   1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి

సమాధానాలు: 1-2; 2-4; 3-1.

సంఖ్యల విభజనకు సాధనం!

పుట్టిన రోజున పంచుదామని రవి ఇరవై అయిదు చాక్లెట్లు తెచ్చాడు. తరగతిలో పన్నెండు మంది ఉన్నారు. ఒక్కొక్కరికి ఎన్ని చాక్లెట్లు వస్తాయో లెక్కగట్టాడు. ప్రతి ఒక్కరికి రెండు చాక్లెట్లు పంచితే ఒకటి మిగిలింది. ఈ విధంగా ఒక సంఖ్యను మరో సంఖ్యతో భాగించినప్పుడు ఎంత శేషం మిగులుతుందో కనుక్కునే విధానాన్ని వివరించేదే శేష సిద్ధాంతం. గణితంలో ఇదో ప్రాథమిక భావన. అరిథ్‌మెటిక్‌లో భాగంగా తరచూ పోటీ పరీక్షల్లో దీనిపై ప్రశ్నలు వస్తుంటాయి. భాగహారం ప్రాథమిక సూత్రాలను తెలుసుకుని, భాజనీయతా సూత్రాలను నేర్చుకుని, ప్రాక్టీస్ చేస్తే శేషసిద్ధాంతం ఆధారంగా వచ్చే ప్రశ్నలకు తేలికగా సమాధానాలను గుర్తించవచ్చు. పెద్ద పెద్ద సంఖ్యలను విభజించడానికి ఇది సాధనంగా సాయపడుతుంది. దీనిపై పట్టు సాధిస్తే గణితంలోని ఇతర విభాగాల లెక్కలనూ వేగంగా చేయగలుగుతారు.



జనరల్ స్టడీస్ — అరిథ్‌మెటిక్

శేష సిద్ధాంతం

కాన్సెప్ట్:


విభాజ్యం = భాజకం × భాగఫలం + శేషం

$\frac{N}{D} \rightarrow$ శేషం(R) = 0, 1, 2, 3, ... (D – 1)

శేషం '0' వస్తే D ని N కు కారణాంకం అంటారు.

ఉదా: $\frac{83}{12} \rightarrow$ శేషం (R) = 11

$\frac{132}{12} \rightarrow$ శేషం (R) = 0



ముఖ్యమైన పాయింట్లు:

i) $\frac{N}{14} \rightarrow$ శేషం = 5 అయితే

$\frac{N^2}{14}$ అయినప్పుడు శేషం $\Rightarrow \frac{5^2}{14} = \frac{25}{14} \Rightarrow$ శేషం = 11


ii) $\frac{2N}{14} \rightarrow$ శేషం = $\frac{2 \times 5}{14} = \frac{10}{14}$

శేషం = 10

iii) $\frac{2N+3}{7} \rightarrow$ శేషం = $\frac{2.5+3}{7} = \frac{13}{7} \Rightarrow$ శేషం = 6

⇒ ధనాత్మక శేషం/ రుణాత్మక శేషం

13) 95 (7   13) 95 (8
     91   104
     +4   –9



★ $\frac{95}{13}$ → ధనాత్మక శేషం +4 / రుణాత్మక శేషం –9

★ $\frac{45}{7}$ → ధనాత్మక శేషం +3 / రుణాత్మక శేషం –4

★ $\frac{53}{8}$ → ధనాత్మక శేషం +5 / రుణాత్మక శేషం –3

నోట్: $\frac{171}{45} \Rightarrow \frac{19}{5} \rightarrow$ శేషం = 4

ఇచ్చిన భిన్నంలో 9వ ఎక్కంతో క్యాన్సిల్ చేశాం కాబట్టి అసలు శేషం కావాలంటే వచ్చిన శేషాన్ని 9తో గుణించాలి.

∴ అసలు శేషం = 9 × 4 = 36

మాదిరి ప్రశ్నలు

1. $\frac{7361 + 11829 + 1769}{8}$ శేషం ఎంత?
   1) 9 2) 8 3) 7 4) 6

వివరణ: $\frac{\overset{(+1)}{7361} + \overset{(+5)}{11829} + \overset{(+1)}{1769}}{8}$

$= \frac{1+5+1}{8} = \frac{7}{8} \Rightarrow$ శేషం = 7 **జ: 3**

2. $\frac{83 \times 84 \times 85 \times 86}{87}$ శేషం ఎంత?
   1) 25 2) 24 3) 14 4) 35

వివరణ: $\frac{\overset{(-4)}{83} \times \overset{(-3)}{84} \times \overset{(-2)}{85} \times \overset{(-1)}{86}}{87}$

$= \frac{(-4) \times (-3) \times (-2) \times (-1)}{87}$

$= \frac{24}{87} \Rightarrow$ శేషం = 24 **జ: 2**

3. $\frac{132 \times 135 \times 136 \times 138 \times 142}{137}$ శేషం ఎంత?
   1) 50 2) 57 3) 80 4) 87

వివరణ: $\frac{\overset{(-5)}{132} \times \overset{(-2)}{135} \times \overset{(-1)}{136} \times \overset{(+1)}{138} \times \overset{(+5)}{142}}{137}$

$\frac{(-5) \times (-2) \times (-1) \times (+1) \times (+5)}{137}$

$= \frac{-50}{137}$ రుణాత్మక శేషం

శేషం = 137 – 50 = 87 **జ: 4**

4. $\frac{344 \times 1932 \times 171 \times 68129}{153}$ శేషం ఎంత?
   1) 13 2) 9 3) 117 4) 39

వివరణ: $\frac{344 \times 1932 \times 171 \times 68129}{153}$

(9 తో క్యాన్సిల్ చేశాం)



$= \frac{\overset{(4)}{344} \times \overset{(-6)}{1932} \times \overset{(+2)}{19} \times \overset{(-7)}{68129}}{17}$

$= \frac{4 \times (-6) \times (+2) \times (-7)}{17} = \frac{336}{17} \Rightarrow$ శేషం = 13

అసలు శేషం = 13 × 9 = 117 **జ: 3**



5. $\frac{1! + 2! + 3! + ... + 30!}{24}$ శేషం ఎంత?
   1) 9 2) 15 3) 18 4) 22

వివరణ: $\frac{1! + 2! + 3! + ... + 30!}{24}$



$= \frac{1 + 2 + 6 + (24 + 120 + ...)}{24}$

$= \frac{9}{24}$ (∵ బ్రాకెట్‌లో ఉన్న విలువ 24తో నిశ్శేషంగా భాగించబడుతుంది.)

శేషం = 9 **జ: 1**

6. $\frac{19^{120}}{18}$ శేషం ఎంత?
   1) 1 2) 18 3) 17 4) 3

వివరణ: $\frac{19^{120}}{18}$

(లవంలో ఉన్న బేస్ నంబరును హారంలో ఉన్న నంబరు కంటే 1 ఎక్కువ లేదా 1 తక్కువ ఉండేలా చూసుకోవాలి.)

$\frac{19^{120}}{18} = \frac{(18+1)^{120}}{18} = \frac{1^{120}}{18} = \frac{1}{18} \Rightarrow$ శేషం = 1 **జ: 1**

7. $\frac{(42)^{105}}{43}$ శేషం ఎంత?
   1) 1 2) 42 3) 41 4) 39

వివరణ: $\frac{(42)^{105}}{43} = \frac{(43-1)^{105}}{43} = \frac{(-1)^{105}}{43} = \frac{-1}{43}$

శేషం = –1 ⇒ 42 **జ: 2**

8. 7^{101} ను 48 తో భాగిస్తే వచ్చే శేషం ఎంత?
   1) 17 2) 7 3) 27 4) 47

వివరణ: $\frac{7^{101}}{48} = \frac{(7^2)^{50} \times 7^1}{48} = \frac{49^{50} \times 7}{48}$

$= \frac{(1)^{50} \times 7}{48} = \frac{1 \times 7}{48} = \frac{7}{48} \Rightarrow$ శేషం = 7 **జ: 2**

9. $(2^{18} – 1)$ను 9తో భాగిస్తే వచ్చే శేషం ఎంత?
   1) 0 2) 1 3) 2 3) 3

వివరణ: $\frac{2^{18} - 1}{9} = \frac{(2^3)^6 - 1}{9} = \frac{8^6 - 1}{9}$

$= \frac{(-1)^6 - 1}{9} \Rightarrow 1 - 1 = 0$ **జ: 1**

10. ఒక సంఖ్యను 296 తో భాగిస్తే వచ్చే శేషం 75, అదే సంఖ్యను 37 తో భాగిస్తే వచ్చే శేషం ఎంత?
    1) 1 2) 2 3) 8 4) 11

వివరణ: $\frac{N}{296} \rightarrow$ శేషం = 75

$\frac{N}{37} \rightarrow$ శేషం → ?



$\frac{75}{37} \rightarrow$ శేషం = 1 **జ: 1**

11. ఒక సంఖ్యను 6 తో భాగిస్తే శేషం 3. ఆ సంఖ్య వర్గాన్ని 6 తో భాగిస్తే శేషం ఎంత వస్తుంది?
    1) 0 2) 1 3) 2 4) 3

వివరణ: $\frac{N}{6} \rightarrow$ శేషం = 3 $\frac{N^2}{6} \rightarrow$ శేషం = ?

$\frac{3^2}{6} = \frac{9}{6} \rightarrow$ శేషం = 3 **జ: 4**

ప్రాక్టీస్ బిట్స్

1. $(67^{67} + 67)$ ను 68 తో భాగిస్తే వచ్చే శేషం ఎంత?
   1) 1 2) 68 3) 66 4) 67
2. 8991 × 3002 × 5989 × 6999 × 7007 లబ్ధంలో చివరి 2 అంకెలు?
   1) 92 2) 94 3) 14 4) 24
3. 64329 ను ఒక సంఖ్యతో భాగిస్తే వరుసగా శేషాలు 175, 114, 213 వస్తాయి. అయితే ఆ సంఖ్యలోని అంకెల మొత్తం ఎంత?
   1) 6 2) 8 3) 9 4) 7
4. ఏ కనిష్ఠ సంఖ్యను 5, 3, 7 లతో భాగిస్తే వరుసగా శేషాలు 2, 1, 2 లు వస్తాయి, అయితే ఆ సంఖ్య?
   1) 142 2) 242 3) 246 4) 251

సమాధానాలు: 1-3; 2-3; 3-3; 4-1.



రచయిత: పిరాది నరేష్

అత్యంత శక్తిమంతమైన అణ్వాయుధేతర బాంబు ఆవిష్కరణ!

భారత్, అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థలు సంయుక్తంగా చేపట్టిన తొలి ప్రయోగం విజయవంతమైంది. అత్యంత సురక్షిత దేశంగా యూఏఈ వార్తల్లో నిలిచింది. ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ నేతగా భారత ప్రధాని మోదీ కొనసాగుతున్నారు. మహిళల చెస్ ప్రపంచకప్‌ను నాగ్‌పుర్‌కు చెందిన దివ్యా దేశ్‌ముఖ్ గెలుచుకున్నారు. ఏకధాటి భరతనాట్య ప్రదర్శనతో మంగళూరుకు చెందిన రెమోనా పెరేరియా రికార్డు సృష్టించారు. గనుల ఆధారిత పర్యాటకానికి ఝార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టగా, మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో నో హెల్మెట్-నో పెట్రోల్ విధానాన్ని తీసుకొచ్చారు. ఇలాంటి జాతీయ, అంతర్జాతీయ ముఖ్యాంశాలు, ఆసక్తికర పరిణామాలు, సంఘటనలు, వివిధ రంగాల్లో సరికొత్త రికార్డులు తదితర వర్తమాన వ్యవహారాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకుంటూ ఉండాలి. ఇటీవల విడుదలైన ప్రఖ్యాత రచయితల పుస్తకాలు, దేశీయంగా, ప్రపంచవ్యాప్తంగా కీలక పోస్టుల్లో జరిగిన నియామకాలు, అవార్డుల విజేతల వివరాలను గుర్తుంచుకోవాలి.

కరెంట్ అఫైర్స్

1. నెల్సన్ మండేలా అవార్డును 2025 సంవత్సరానికి ఎవరికి ప్రకటించారు?



   1) కెన్నెడీ ఒడెడే (కెన్యా)
   2) బ్రెండా రేనాల్డ్స్ (కెనడా)
   3) 1, 2
   4) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, న్యూరో సైన్సెస్ (ఇండియా)
2. అంతర్జాతీయ వృద్ధి రేటు 2025లో ఎంత శాతం ఉండొచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది?
   1) 3% 2) 3.8% 3) 4% 4) 4.5%
3. గోదావరి నదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు?
   1) బీపీ ప్రధాన్ 2) బీపీ పాండ్యా
   3) రావు కిషన్ 4) నంద కిషన్
4. కింది వాటిలో 'ప్రళయ్' క్షిపణికి సంబంధించి సరైనవి గుర్తించండి.



   ఎ) 'ప్రళయ్' క్షిపణిని ఇండియా ఇటీవల ఒడిశాలోని అబ్దుల్ కలాం దీవి నుంచి విజయవంతంగా పరీక్షించింది.
   బి) ఈ క్షిపణి ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదిస్తుంది.
   సి) ఇది 150 - 500 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు.
   డి) 500 - 1000 కిలోల సంప్రదాయ వార్‌హెడ్‌ను మోసుకెళుతుంది.
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, సి, డి

నోట్: ప్రళయ్ క్షిపణి ఉపరితలం నుంచి ఉపరితల లక్ష్యాలను ఛేదిస్తుంది.

5. కింది వాటిలో సరైంది?
   ఎ) మహిళల చెస్ ప్రపంచకప్ - 2025 జార్జియాలోని ఒటుమిలో జులై 5 - 29 వరకు జరిగింది.
   బి) భారత్‌కు చెందిన దివ్యా దేశ్‌ముఖ్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది.
   సి) దివ్యా దేశ్‌ముఖ్ మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన వారు.
   డి) 88వ చెస్ గ్రాండ్‌మాస్టర్ దివ్యా దేశ్‌ముఖ్.
   ఇ) దివ్యా ఫైనల్‌లో కోనేరు హంపిపై నెగ్గింది.


దివ్యా దేశ్‌ముఖ్

   1) ఎ, బి, సి, డి
   2) ఎ, బి, సి
   3) బి, సి, డి 4) ఎ, బి, సి, డి, ఇ

నోట్: హంపి, హారిక, వైశాలి తర్వాత దేశంలో నాలుగో మహిళా గ్రాండ్‌మాస్టర్ దివ్యా దేశ్‌ముఖ్.

6. స్విట్జర్లాండ్‌లో జులై 2 – 27 వరకు జరిగిన 14వ మహిళల యూరో ఛాంపియన్‌షిప్ – 2025 విజేత ఎవరు?
   1) స్పెయిన్ 2) ఫ్రాన్స్
   3) జర్మనీ 4) ఇంగ్లాండ్
7. ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు డైరెక్టర్‌గా ఎవరు నియమితులయ్యారు?
   1) రంజిని నారాయణ్ 2) అనురాధ ఠాకూర్
   3) అజయ్ భూషణ్ 4) మహేంద్ర సింగ్
8. కింది వాటిలో సరైంది?
   ఎ) వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్ 2025, జులై 16 - 27 వరకు జర్మనీలో జరిగాయి.
   బి) 34 స్వర్ణాలు, 21 రజతాలు, 24 కాంస్యాలు మొత్తంగా 79 పతకాలతో జపాన్ మొదటి స్థానంలో నిలిచింది.
   సి) 2, 3 స్థానాల్లో చైనా, అమెరికా నిలిచాయి.
   డి) 2 స్వర్ణాలు, 5 రజతాలు, 5 కాంస్య పతకాలు మొత్తంగా 12 పతకాలతో ఇండియా 20వ స్థానానికి పరిమితమైంది.
   1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
   3) బి, సి, డి 4) ఎ, సి, డి
9. 2025 సంవత్సరానికి ఎంత మంది పార్లమెంటు సభ్యులకు సంసద్‌రత్న అవార్డులు ప్రదానం చేశారు?
   1) 12 2) 13 3) 16 4) 17
10. ఇగ్నో తొలి మహిళా వైస్ ఛాన్సలర్‌గా ఎవరు నియమితులయ్యారు?


ఉమా కాంజిలాల్

    1) ఉమా కాంజిలాల్
    2) మేఘన లాల్
    3) సరస్వతి కుమారి
    4) శ్యామలా నాథ్
11. దేశంలో తొలి మైనింగ్ టూరిజం ప్రాజెక్టును ఏ రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించింది?
    1) కేరళ 2) తమిళనాడు
    3) ఝార్ఖండ్ 4) ఆంధ్రప్రదేశ్
12. 'వన్స్ ఎలిఫెంట్స్ లివ్డ్ హియర్' పుస్తక రచయిత?
    1) తిశ్శాని దోషి 2) మేఘ రావు
    3) గీతాంజలి శ్రీ 4) గుల్జార్

నోట్: ఈ పుస్తకానికి 'పెన్ ట్రాన్స్‌లేట్ అవార్డు-2025' వచ్చింది.


13. బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) కొత్త ఛైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు?
    1) మహేంద్ర దేవ్ 2) అర్జున్ సింగ్
    3) అజయ్ సేథ్ 4) దేవినాష్
14. కింది వాటిలో సరైంది?
    ఎ) అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా'తో కలిసి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ 'ఇస్రో' చేపట్టిన తొలి అంతరిక్ష ప్రయోగం 'నైసార్' 2025, జులై 30న విజయవంతమైంది.



    బి) నైసార్ (ఇస్రో, నాసా సింథటిక్ ఎపర్చర్ రాడార్) ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వీ - ఎఫ్16 రాకెట్ ద్వారా ప్రయోగించారు.
    సి) ఇస్రో ఇప్పటివరకు జీఎస్ఎల్‌వీ రాకెట్‌ను జియో సింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీఓ) ప్రయోగాలకే వినియోగించగా, నైసార్‌ను ఎస్ఎస్‌పీఓ (సన్ సింక్రనస్ పోలార్ ఆర్బిట్) లో ప్రవేశపెట్టడానికి తొలిసారి ఉపయోగించారు.
    డి) సుమారు రూ.13,155 కోట్ల వ్యయంతో చేపట్టిన నైసార్ ప్రయోగంతో భూఉపరితలంపై జరిగే మార్పులను నిశితంగా పరిశీలించవచ్చు.
    1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
    3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి
15. నంబియో సేఫ్టీ ఇండెక్స్–2025 ప్రకారం ప్రపంచంలోనే అత్యంత సురక్షిత దేశం?
    1) అమెరికా 2) యూఏఈ
    3) సౌదీ అరేబియా 4) చైనా

నోట్: 1) అండోరా, ఖతార్, తైవాన్ 2, 3, 4 స్థానాల్లో నిలిచాయి.
2) ఇండియా 67వ స్థానంలో నిలిచింది.


16. ఇటీవల మరణించిన ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త మేఘనాథ్ దేశాయ్‌కు ఏ సంవత్సరంలో పద్మభూషణ్ అవార్డు వచ్చింది?
    1) 2008 2) 2010
    3) 2009 4) 2016
17. కింది వాటిలో సరైంది?
    ఎ) 'ది వెస్ట్ అండ్ ది రెస్ట్: గ్లోబలైజేషన్ అండ్ ది టెర్రరిస్ట్ థ్రెట్' పుస్తక రచయిత - రోగర్ స్క్రుటన్




    బి) 'ద లోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సన్నీ' పుస్తక రచయిత - కిరణ్ దేశాయ్
    సి) 'ది డైరీ ఆఫ్ ఎ క్రికెటర్స్ వైఫ్: ఏ వెరీ అన్‌యూజ్‌వల్ మెమాయిర్' పుస్తక రచయితలు - పూజా పూజారా, నమిత కళ
    డి) 'ఒరిజినల్ సిన్: ప్రెసిడెంట్ బైడెన్స్ డిక్లైన్, ఇట్స్ కవర్ అప్ అండ్ హిజ్ డిజాస్ట్రస్ ఛాయిస్ టూ రన్ అగైన్' పుస్తక రచయితలు - జేక్ టాప్పర్, అలెక్స్ థాంప్సన్
    1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
    3) బి, సి, డి 4) ఎ, సి, డి
18. అమెరికాకు చెందిన 'మార్నింగ్ కన్సల్ట్ సంస్థ' నిర్వహించిన 'గ్లోబల్ లీడర్ సర్వే'లో ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ నేతగా 75% మంది మద్దతు ఎవరికి లభించి తొలి స్థానంలో నిలిచారు?
    1) డొనాల్డ్ ట్రంప్ 2) లీజే - మ్యంగ్
    3) నరేంద్ర మోదీ 4) మార్క్ కార్నే

నోట్: దక్షిణ కొరియా అధ్యక్షుడు లీజే - మ్యంగ్, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలి, కెనడా ప్రధాని మార్క్ కార్నే వరుసగా 2, 3, 4 స్థానాల్లో నిలిచారు.

19. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన అణ్వాయుధేతర బాంబు (గజెప్)ను ఇటీవల ఏ దేశం ఆవిష్కరించింది?



    1) చైనా
    2) అమెరికా
    3) రష్యా 4) తుర్కియే
20. ఇండియాలో ప్రధాని పదవిని చేపట్టి ఎలాంటి విరామం లేకుండా సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న రెండో ప్రధానిగా నరేంద్ర మోదీ ఇటీవల రికార్డు సృష్టించారు. అయితే మోదీ మొదటిసారిగా ఎప్పుడు ప్రధాని అయ్యారు?



    1) 2018, మే 12 2) 2024, జూన్ 6
    3) 2014, మే 26 4) 2023, మే 12

నోట్: ఇందిరా గాంధీ 4,077 రోజులు ప్రధానిగా ఉన్న రికార్డును మోదీ అధిగమించారు.

21. జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్ జనరల్‌గా ఎవరు నియమితులయ్యారు?
    1) ఆనంద్ స్వరూప్ 2) హర్ష కుమార్
    3) లాస్య నందన్ 4) అరుణ్ స్వరూప్
22. 2025, ఆగస్టు 1 నుంచి కింది ఏ పట్టణంలో 'నో హెల్మెట్ – నో పెట్రోల్' విధానం అమలు చేస్తున్నారు?
    1) పనాజీ 2) ఇందౌర్
    3) కోల్‌కతా 4) కాకినాడ
23. 170 గంటలు ఏ నృత్యంలో నిరంతరంగా ప్రదర్శన చేసి రెమోనా పెరేరియా రికార్డు నెలకొల్పింది?



    1) ఒడిస్సీ 2) కథాకళి
    3) భరతనాట్యం
    4) కూచిపూడి
24. ఇండియాలో మొదటి హిందీ మీడియం ఎంబీబీఎస్ కళాశాల ఏ నగరంలో ప్రారంభం కానుంది?
    1) ముంబయి 2) దిల్లీ
    3) జబల్‌పుర్ 4) ఇందౌర్
25. ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో 1500 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో 15 నిమిషాల 26.44 సెకన్లలో లక్ష్యాన్ని చేరి స్వర్ణ పతకం సాధించిన మహిళా స్విమ్మర్ కేథీలెడెకీ ఏ దేశానికి చెందిన వారు?



    1) రష్యా 2) కెనడా 3) అమెరికా 4) జర్మనీ
26. ఇటీవల మరణించిన 'డేవిడ్ నబ్రో' ఏ రంగానికి చెందిన వ్యక్తి?
    1) క్రీడాకారుడు
    2) రాజకీయ నాయకుడు
    3) రచయిత 4) వైద్యుడు




రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-3; 2-1; 3-2; 4-4; 5-4; 6-4; 7-2; 8-2; 9-4; 10-1; 11-3; 12-3; 13-3; 14-3; 15-2; 16-1; 17-2; 18-3; 19-4; 20-3; 21-1; 22-2; 23-3; 24-3; 25-3; 26-4.

దశ మారాలంటే దిశ తేలాల్సిందే!

పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగంలో దిశలు - స్థానాలు అనేది ఒక ముఖ్యమైన అంశం. దీని నుంచి తప్పనిసరిగా ప్రశ్నలు వస్తుంటాయి. ఇందులో ఒక వస్తువు లేదా వ్యక్తి ఒక చోటు నుంచి మరో చోటుకి పలు దిశల్లో, వివిధ దూరాలను అనుసరించి ప్రయాణిస్తున్నట్లుగా ఇచ్చి, చివరిగా వారు ఏ దిశలో ఉన్నారు? ఎంత దూరంలో ఉన్నారు? అనే కోణంలో ప్రశ్నలు సంధిస్తుంటారు. ఈ రకమైన సమస్యలను పరిష్కరించేటప్పుడు ఇచ్చిన దత్తాంశాన్ని చిత్రరూపంలోకి మార్చుకుంటే సమాధానం తేలిగ్గా కనిపెట్టొచ్చు.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం


రీజనింగ్

దిశలు - స్థానాలు

1. A, B అనే ఇద్దరు వ్యక్తులు సైకిల్ తొక్కడానికి ఉత్తరం వైపు నుంచి సిద్ధంగా ఉన్నారు. అక్కడి నుంచి A ఎడమవైపు, B కుడివైపు తిరిగారు. కొంత దూరం తర్వాత A అనే వ్యక్తి 90°ల చొప్పున రెండుసార్లు ఎడమవైపు తిరిగాడు. B మాత్రం మొదటి దిశలోనే ప్రయాణిస్తున్నాడు. అయితే A, B లు ప్రస్తుతం ఏ దిశల్లో ప్రయాణిస్తున్నారు?

1) A ఉత్తరం, B తూర్పు 2) A దక్షిణం, B తూర్పు
3) A ఉత్తరం, B పడమర 4) A తూర్పు, B తూర్పు

సాధన:




పైపటం నుంచి A, B లు తూర్పు వైపు ప్రయాణిస్తున్నారు.

సమాధానం: 4

2. సంతోష్ సాయంత్రం 6 గంటలకు ఒక కాఫీ దుకాణం వద్ద ఉన్నాడు. అతడు ఉత్తరం వైపు నుంచి తూర్పు వైపు 2 కి.మీ. నడిచాడు. అక్కడి నుంచి తిరిగి ఉత్తరం వైపు 4 కి.మీ. నడిచిన తర్వాత ఎడమవైపు తిరిగి 2 కి.మీ. నడిచాడు. అయితే ప్రస్తుతం తాను ఉన్న స్థానం నుంచి తొలి స్థానానికి కనిష్ఠ దూరం ఎంత?

1) 5 కి.మీ. 2) 3 కి.మీ. 3) 4 కి.మీ. 4) 6 కి.మీ.



సాధన:

పైపటం నుంచి సంతోష్ చివరి స్థానం = D

తొలిస్థానం A నుంచి చివరి స్థానానికి కనిష్ఠ దూరం


= AD = BC = 4 కి.మీ.

సమాధానం: 3

3. రామ్ అనే వ్యక్తి తన ఇంటి నుంచి 5 కి.మీ. తూర్పునకు నడిచి, అక్కడి నుంచి కుడివైపు తిరిగి మరో 8 కి.మీ. నడిచాడు. ఆ తర్వాత ఎడమవైపు తిరిగి 2 కి.మీ. నడిచి A అనే దుకాణం వద్దకు చేరుకున్నాడు. ఆ తర్వాత మళ్లీ కుడివైపు తిరిగి 7 కి.మీ. నడిచి B అనే మరో దుకాణం వద్దకు చేరుకున్నాడు. అయితే రామ్ తన ఇంటి నుంచి A అనే దుకాణం వద్దకు చేరుకునేందుకు ఎంత దూరం నడిచాడో కనుక్కోండి?

1) 13 కి.మీ. 2) 7 కి.మీ. 3) 22 కి.మీ. 4) 15 కి.మీ.

సాధన:



P అనే బిందువు రామ్ ఇంటిని సూచిస్తుందని అనుకుందాం.

రామ్ తన ఇంటి నుంచి దుకాణం A వద్దకు నడిచిన దూరం = P నుంచి Qకి దూరం + Q నుంచి Rకి దూరం + R నుంచి Aకి దూరం


= 5 కి.మీ. + 8 కి.మీ. + 2 కి.మీ.

= 15 కి.మీ.

సమాధానం: 4

సూచన (ప్ర. 4 – 5): కింది దత్తాంశం ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

రీనా అనే వ్యక్తి A అనే బిందువు నుంచి తూర్పువైపు 8 మీ. నడిచి B అనే బిందువుకు చేరుకుంది. అక్కడి నుంచి ఎడమవైపు తిరిగి 5 మీ. నడిచి C అనే బిందువుకు చేరుకుంది. మళ్లీ అక్కడి నుంచి ఎడమవైపు తిరిగి 6 మీ. నడిచి D అనే బిందువుకు చేరుకుంది. ఈ బిందువు నుంచి కుడివైపు తిరిగి 4 మీ. వెళ్లి E వద్దకు చేరుకుంది. పిదప అక్కడి నుంచి కుడివైపు తిరిగి 9 మీ. నడిచి F అనే బిందువు వద్దకు చేరుకుంది. చివరగా ఆమె కుడివైపు తిరిగి 4 మీ. నడిచి G అనే బిందువు వద్దకు చేరుకుంది.



4. G అనే బిందువు ప్రకారం A అనే బిందువు ఏ దిశలో ఉంది?

1) ఈశాన్యం 2) వాయవ్యం
3) ఆగ్నేయం 4) నైరుతి

సాధన: పైన సూచించిన పటం ప్రకారం A అనే బిందువు G అనే బిందువు దృష్ట్యా నైరుతి దిశలో ఉంది.

సమాధానం: 4

5. T అనే బిందువు G అనే బిందువు నుంచి దక్షిణ దిశలో 5 మీ. దూరంలో ఉంటే T, Aల మధ్య కనిష్ఠ దూరం ఎంత?

1) 12 మీ. 2) 11 మీ.
3) 7 మీ. 4) 9 మీ.

సాధన: పటం నుంచి A నుంచి Tకి లేదా T నుంచి Aకి కనిష్ఠ దూరం = AT (లేదాTA)

= AB + BT

= 8 మీ. + CG


= 8 మీ. + 3 మీ. = 11 మీ.

సమాధానం: 2

6. సురేష్ ఒక బిందువు నుంచి బయలుదేరి ఉత్తర దిశలో 3 కి.మీ. వరకు వెళ్లాడు. ఆ తర్వాత పడమర దిశగా తిరిగి 2 కి.మీ. వెళ్లాడు. ఆ తర్వాత ఉత్తరం వైపు 1 కి.మీ వెళ్లాడు. అక్కడి నుంచి తూర్పు దిశలో 5 కి.మీ. వెళ్లాడు. ఇప్పుడు అతను ప్రారంభ బిందువు నుంచి ఎంత దూరంలో ఉన్నాడు?

1) 11 కి.మీ. 2) 5 కి.మీ. 3) 10 కి.మీ. 4) 8 కి.మీ.

సాధన:



పైపటం నుంచి ఒక వ్యక్తి A అనే బిందువు వద్ద బయలుదేరి F అనే బిందువు వద్దకు చేరుకున్నాడు.

లంబకోణ త్రిభుజం AEF నుంచి $AF^2 = AE^2 + EF^2$

AE = AB + BE = 3 + 1 = 4 కి.మీ.

EF = DF – DE = 5 – 2 = 3 కి.మీ.

$AF^2 = 4^2 + 3^2 = 16 + 9 = 25$

$AF^2 = 25$

$\therefore AF = \sqrt{25} = 5$ కి.మీ.


ప్రారంభ బిందువు నుంచి చివరి బిందువు మధ్య ఉన్న కనిష్ఠ దూరం = 5 కి.మీ.

సమాధానం: 2

7. శ్యామ్ అనే వ్యక్తి ఉత్తర దిశలో 7 కి.మీ. నడిచి కుడివైపు తిరిగి 3 కి.మీ. నడిచాడు. తర్వాత కుడివైపు తిరిగి 7 కి.మీ. ముందుకు నడిచాడు. అయితే శ్యామ్ తన ప్రారంభ స్థానం నుంచి ఎంత దూరంలో ఉన్నాడు?

1) 7 కి.మీ. 2) 3 కి.మీ. 3) 6 కి.మీ. 4) 14 కి.మీ.

సాధన:



పైపటం ఆధారంగా ప్రారంభ స్థానం నుంచి శ్యామ్ ఉన్న దూరం = AD

AD = BC = 3 కి.మీ.

సమాధానం: 2



రచయిత

రాజేశ్ మధు,
విషయ నిపుణులు

733 Word of the Day

Oblique

Telugu meaning: వాలుగా, వంకర

English meaning: The word oblique (అబ్లీక్) is an adjective that describes something that is slanted or indirect in direction, approach, or meaning.

Synonyms: Indirect, Diagonal

Antonyms: Direct, Explicit

Usage: 1. The soldier moved in an oblique path to avoid direct enemy fire.

2. Her oblique remarks made it hard to understand what she truly meant.

కరెంట్ అఫైర్స్



ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) స్థాపకులు శిబూ సోరెన్ (81) 2025, ఆగస్టు 4న దిల్లీలో మరణించారు. అవిభాజ్య బిహార్ రాష్ట్రంలోని రామ్‌గఢ్ జిల్లా నెమ్రా గ్రామంలో 1944, జనవరి 11న జన్మించిన శిబూ సోరెన్ గిరిజనోద్యమానికి జాతీయ గుర్తింపు తెచ్చిన నాయకుడు. 1973లో జేఎంఎం స్థాపించారు. ఆ సంస్థ చేపట్టిన ఉద్యమం కారణంగా 2000 నవంబరు 15న ప్రత్యేక ఝార్ఖండ్ రాష్ట్రం ఆవిర్భవించింది. మూడు పర్యాయాలు ఝార్ఖండ్ ముఖ్యమంత్రిగా (2005, 2008-09, 2009-10) పని చేశారు.



ప్రపంచంలోనే అయిదో అతి పెద్ద విమానయాన విపణిగా భారత్ అవతరించినట్లు అంతర్జాతీయ విమానయాన సంస్థల సంఘం ఐఏటీఏ పేర్కొంది. 2024లో 24.1 కోట్ల మంది విమానాల్లో గమ్యస్థానాలకు చేరారని ఆ సంఘం వెల్లడించింది. ఐఏటీఏ విడుదల చేసిన 'వరల్డ్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్' గణాంకాల ప్రకారం ప్రపంచంలో అత్యధిక విమాన ప్రయాణికులతో అమెరికా (87.6 కోట్లు) తొలిస్థానంలో నిలిచింది. చైనా (74.1 కోట్లు), యూకే (26.1 కోట్లు), స్పెయిన్ (24.1 కోట్లు) కూడా భారత్ కంటే ముందున్నాయి.



ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ మహిళల 800 మీటర్ల విభాగంలో అమెరికా స్టార్ కేటీ లెడెకీ వరుసగా ఏడోసారి విజేతగా నిలిచింది. 2025, ఆగస్టు 2న సింగపూర్‌లో జరిగిన రేసును లెడెకీ 8:05.62తో పూర్తి చేసి స్వర్ణం నెగ్గింది. ఆస్ట్రేలియా స్విమ్మర్ లాని పాలిస్టర్ (8:05.98) రజతం గెలుచుకుంది. కెనడాకు చెందిన మెకింతోష్ (8:07.29) మూడో స్థానానికి పరిమితమైంది. ఒక విభాగంలో ఇలా అత్యధికసార్లు వరుస స్వర్ణాలు గెలిచిన స్విమ్మర్‌గా లెడెకీ రికార్డు సృష్టించింది.

ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్ గేదెల ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టులో 2025, ఆగస్టు 4న నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆయనతో ప్రమాణం చేయించారు. తాజా నియామకంతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ట్రైఫెడ్ వ్యవస్థాపక దినోత్సవం

ఆగస్టు 6

చరిత్రలో ఈనాడు

Tribal Co-Operative Marketing Development Federation of India Limited
Ministry of Tribal Affairs, Govt. of India

భారతీయ సమాజంలో గిరిజన సమూహాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. సామాజికంగా, సాంస్కృతికంగా వీరికి అనేక ప్రత్యేకతలున్నాయి. మానవ శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఏ దేశానికైనా ఆదివాసులు/ గిరిజనులు మూలవాసులు. ఈ సమూహాలకు కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉంటాయి. అందులో కొన్ని తెగలు మానవ సమాజానికి దగ్గరగా ఉంటే మరికొన్ని నాగరిక ప్రపంచానికి దూరంగా అడవులు, కొండకోనల్లో జీవనాన్ని సాగిస్తున్నాయి. వీరంతా అభివృద్ధికి దూరంగా, ఆర్థికంగా వెనుకబాటుతనంతో జీవనాన్ని సాగిస్తున్నారు. అటవీ ఉత్పత్తుల సేకరణ, కళాత్మక వస్తువుల రూపకల్పన వీరి ప్రధాన జీవనాధారం. వీరిని ఆర్థికంగా పరిపుష్టం చేయడంతోపాటు వీరు నివసించే ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో ఏర్పడిందే ట్రైబల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ట్రైఫెడ్). ఆగస్టు 6న దీని వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కొన్ని ముఖ్యమైన విషయాలను పరిశీలిద్దాం..!

- ట్రైఫెడ్ అనేది కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ నియంత్రణలో ఉండే జాతీయ స్థాయి సహకార సంస్థ. ప్రధాన కార్యాలయం న్యూదిల్లీలో ఉంది.
- దీన్ని మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్ 1984 ద్వారా 1987, ఆగస్టు 6న ఏర్పాటు చేశారు. అప్పట్లో ఇది కేంద్ర సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలో ఉండేది.
- గిరిజనులు సేకరించిన అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు; హస్తకళలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెటింగ్‌ను కల్పించి, వారికి ప్రభుత్వం ద్వారా ఆర్థిక చేయుతతోపాటు జీవనోపాధిని కల్పించడం ట్రైఫెడ్ ఏర్పాటు ముఖ్య ఉద్దేశం.
- గిరిజనులను స్వయం సహాయక బృందాలుగా ఏర్పాటు చేసి, వారికి శిక్షణ ఇవ్వడంలో ఇది సాయం చేస్తుంది.
- ట్రైఫెడ్‌కు దేశవ్యాప్తంగా 15 ప్రాంతీయ కార్యాలయాలు, 110 రిటైల్ ఔట్‌లెట్స్ ఉన్నాయి. గిరిజన హస్తకళలను ప్రోత్సహించేందుకు వివిధ రాష్ట్రస్థాయి సంస్థలతో కలిపి 35 షోరూంలను సైతం ఇది ఏర్పాటు చేసింది. ఇవేకాక ఆన్‌లైన్ వేదికగానూ ఈ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పిస్తోంది.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

నీతి ఆయోగ్ - రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచీ 2025

దేశం ఆర్థికంగా అభివృద్ధి సాధించాలంటే రాష్ట్రాల పాత్రే కీలకం. దేశం లేదా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలో, పాలనా విధానాల్లో ఆర్థిక క్రమశిక్షణ ఎంతో అవసరం. అది కొరవడితే ఆర్థిక విధ్వంసం జరిగి, వ్యవస్థలన్నీ అస్తవ్యస్తంగా మారతాయి. అందుకే నీతి ఆయోగ్ ఎప్పటికప్పుడు దేశం, రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులను విశ్లేషిస్తూ వివిధ నివేదికలను తయారు చేసి సూచనలు, సలహాలు అందిస్తోంది. ఇటీవల 'రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచిక-2025' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. దీనిపై పోటీపరీక్షార్థులకు అవగాహన అవసరం.

2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని 18 పెద్ద రాష్ట్రాల్లో ఆర్థిక స్థితిగతులను విశ్లేషిస్తూ నీతి ఆయోగ్ 'రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచిక - 2025' పేరిట ఒక నివేదికను తయారు చేసింది. కాగ్, ఆర్‌బీఐతో పాటు వివిధ సంస్థల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా దీన్ని రూపొందించారు. 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ ప్రొఫెసర్ అరవింద్ పనగడియా, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షులు సుమన్ బేరి, సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం దీన్ని 2025 జనవరి 24న విడుదల చేశారు.

పరిగణించిన అంశాలు

రాష్ట్ర ప్రభుత్వ మొత్తం ఖర్చులో అభివృద్ధి పనులకు చేసిన వ్యయం వాటా.

- రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో మూలధన వ్యయం వాటా.
- రాష్ట్ర స్థూల ఉత్పత్తికి, రెవెన్యూ రాబడికి మధ్య పోలిక.
- రెవెన్యూ లోటు, స్థూల ద్రవ్యలోటు.
- మొత్తం ఖర్చులో సొంత రెవెన్యూ వాటా.
- మొత్తం రెవెన్యూ రాబడి, ప్రతిగా వడ్డీ చెల్లింపుల స్థాయి.



నివేదికలోని ముఖ్యాంశాలు, ద్రవ్య వివేచన, ఆర్థిక ఆరోగ్య సూచీ - 2025లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Group-C&D Jobs

Western Railway Mumbai (WR) is inviting applications for the vacant Group-C and Group-D jobs in various departments under the Sports Quota. The total no. of posts is 64. The application fee is Rs.500. Eligible candidates can apply online before 29 August 2025.

AICTE Pragati, Saksham & Swanath Scholarships 2025

The All India Council for Technical Education (AICTE), Ministry of Education, Government of India, has opened online applications for its Pragati Scholarship for Girl Students, Saksham Scholarship for Specially-Abled Students, and Swanath Scholarship for Orphan/Wards of Armed Forces/Parents affected by COVID-19 for the academic year 2025-26. Fresh and renewal applications are now invited through the NSP - total Scholarship Amount up to Rs.50,000 per annum. The last date for application submission is 31 October 2025.

IGI Aviation Services Recruitment 2025

IGI Aviation Services, Delhi, is inviting online applications from eligible candidates to recruit Airport Ground Staff and Loader positions at various airports across India. The total no. of posts is 1,446. The last date for online applications is 21 September 2025.

Did You Apply..?

Today (August 6) is the last date for the following Jobs

- 40 Assistant Manager Jobs in PFRDA. *Eligibility:* Degree or PG.

For more information and other notifications - scan QR code

Bank Exams

English

Antonyms

***Directions (Qs. 1 - 10):** In each of the questions given below, a sentence is given with one word printed in bold letters, along with five options to choose from. Choose the appropriate antonym from those options that suits the word given in bold letters.*

1. Despite the initial excitement, the meeting quickly turned **tedious** as the speaker droned on about irrelevant data.

A) Lively B) Monotonous
C) Boring D) Dull
E) Repetitive

2. Her **generosity** toward the underprivileged made her widely admired in the community.

A) Charity B) Kindness
C) Selfishness D) Support
E) Helpfulness

3. The committee appreciated his **concise** explanation, which saved a lot of time during the review.

A) Clear B) Precise
C) Perfect D) Wordy
E) Accurate

4. The scientist remained **obscure** for years until his breakthrough research was published.

A) Unknown B) Popular
C) Invisible D) Shadowed
E) Minor

5. His **audacity** during the board meeting surprised everyone, especially when he challenged the CEO.

A) Boldness B) Confidence
C) Arrogance D) Nerve
E) Hesitation

6. The manager's tone was so **abrasive** that even his valid points were dismissed.

A) Harsh B) Smooth
C) Rude D) Cutting
E) Bitter

7. The CEO made a **prudent** decision by diversifying the investment portfolio during the economic slowdown.

A) Careless B) Wise
C) Cautious D) Sensible
E) Smart

8. The document was written in a **lucid** style, making even complex ideas understandable.

A) Clear B) Simple
C) Coherent D) Fluent
E) Confusing

9. Her behaviour was considered **erratic**, shifting moods unpredictably throughout the day.

A) Unstable B) Wild
C) Consistent D) Impulsive
E) Irregular

10. The new intern was **meticulous** in compiling the reports, leaving no room for error.

A) Thorough B) Detailed
C) Precise D) Careless
E) Accurate

***Directions (Qs. 11 - 20):** In each of the questions given below, a word is given in bold letters and five options are presented. Choose the appropriate antonym from those options that suits the word given in bold letters.*

11. Affluent
A) Rich B) Impoverished
C) Wealthy D) Prosperous
E) Opulent

12. Tranquil
A) Peaceful B) Serene
C) Calm D) Noisy
E) Silent

13. Credible
A) Believable B) Reliable
C) Honest D) Trustworthy
E) Dubious

14. Reluctant
A) Eager B) Unwilling
C) Hesitant D) Lazy
E) Confused

15. Benign
A) Kind B) Harmless
C) Cruel D) Gentle E) Mild

16. Loquacious
A) Reserved B) Talkative
C) Chatty D) Verbose
E) Noisy

17. Frivolous
A) Silly B) Foolish
C) Trivial D) Playful
E) Thoughtful

18. Rigid
A) Inflexible B) Strict
C) Flexible D) Hard E) Solid

19. Impartial
A) Fair B) Objective
C) Neutral D) Biased
E) Honest

20. Ample
A) Abundant B) Scarce
C) Sufficient D) Wide
E) Plentiful

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

అమెజాన్‌ను మెప్పించారు!

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థినులు సుప్రసిద్ధ సంస్థ అమెజాన్‌లో ఇటీవల 46.3 లక్షల వార్షిక వేతనంతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ ఉద్యోగాలు సాధించారు. ఈనెల్లోనే ఉద్యోగంలో చేరుతున్న వీరు ఈ విజయానికి ఎలాంటి ప్రయత్నం, కృషి చేశారో వారి మాటల్లోనే తెలుసుకుందాం!



భావన పుల్లూర్
స్వస్థలం: నందిపేట్, నిజామాబాద్ జిల్లా.
తండ్రి: భోజగౌడ్, తల్లి: జయశ్రీ
పదో తరగతి: 9.5 జీపీఏ
ఇంటర్ (ఎంపీసీ): 970/1000 మార్కులు
టీజీ ఈఏపీసెట్: 70,000 ర్యాంకు
బీటెక్: కంప్యూటర్స్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్
కళాశాల: ఏస్ ఇంజినీరింగ్ కళాశాల (అంకుశాపూర్, ఘట్‌కేసర్ మండలం)

నిరంతర సాధన

మా కాలేజ్ ప్లేస్‌మెంట్ టీమ్, బీయింగ్ జీరో టీమ్ నుంచి అమెజాన్ పోస్టు కోసం దరఖాస్తులు వచ్చాయి. లింక్‌డిన్ ద్వారానూ నాకు ఈ రోల్ గురించి తెలుసు. అమెజాన్‌లో చాలా రోల్స్‌కు అప్లై చేశాను. మొదట రిజెక్ట్ అయ్యాను. కానీ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ 6 నెలల ఇంటర్న్‌షిప్‌కు ఎగ్జామ్ లింక్ వచ్చింది. దాన్ని 1-2 వారాల్లో అటెంప్ట్ చేశాను. 2-2 సెమిస్టర్ చివర్లో నుంచే డేటా స్ట్రక్చర్స్ అల్గారిథమ్స్ (డీఎస్ఏ) ప్రాక్టీస్ ప్రారంభించాను. ఆ టాపిక్స్‌కు సంబంధించిన బేసిక్ ప్రోగ్రామ్స్ రాయడం మొదలుపెట్టాను. 3-1 సెమిస్టర్లో బీయింగ్ జీరో టీమ్ పరిచయమైంది. వారంలో ఒక్కసారి ఇన్‌స్ట్రక్టర్లు వచ్చి డీఎస్ఏ ప్రాబ్లమ్స్ ఎలా సాల్వ్ చేయాలో నేర్పించేవారు. ప్రాక్టీస్ కోసం కొన్ని ప్రాబ్లమ్స్ కూడా ఇచ్చేవారు. ఎక్కువగా MentorPick అనే Being Zero వారి వెబ్‌సైట్లో ప్రాబ్లమ్స్ సాల్వ్ చేశా. LeetCode, CodeChef, Codeforces లాంటి ప్లాట్‌ఫామ్స్ కూడా కొన్నిసార్లు వాడేదాన్ని. ఈవిధంగా కొద్దిగా కొద్దిగా కోడింగ్ ప్రాక్టీస్ చేస్తూ ముందుకు సాగిపోయాను.

కోడింగ్‌లో సందేహాలు వస్తే.. మొదట ఆ ప్రాబ్లమ్‌ను సొంతంగా ప్రయత్నించేదాన్ని. సరైన సమాధానం రాకపోతే మెంటర్స్‌ను అడిగేదాన్ని. లేకపోతే సొల్యూషన్ వీడియోలు / నోట్సు చూసేదాన్ని. కోడింగ్ బాగా వచ్చిందని చెప్పలేను కానీ మీడియం స్థాయికి సాధన చేశాను. ఎవరైనా కోడింగ్‌లో స్ట్రాంగ్ అవ్వాలంటే నిరంతర ప్రాక్టీస్ చాలా అవసరం.

కొత్త కాన్సెప్టులు నేర్చుకోవడంలో, నిర్దిష్ట ప్రాబ్లమ్ ఇంట్యూయిషన్‌ను అర్థం చేసుకోవడంలో యూట్యూబ్ వీడియోలు చాలా ఉపయోగపడ్డాయి. డీఎస్ఏ సమస్యలను నేర్చుకోవడంలో అప్నా కాలేజ్, GeeksforGeeks, Take U Forward లాంటి యూట్యూబ్ వీడియోలను తరచూ చూసేదాన్ని. వీటితో పాటు నా విజయానికి ప్రధాన కారణం- ఇంటి ఆర్థిక పరిస్థితులు. ప్రతి చిన్న అవకాశాన్నీ పెద్దదిగా మార్చుకోవాలంటే కష్టపడడం తప్పనిసరి అన్న ఆలోచన చిన్నప్పటినుంచే పెరిగింది. అమ్మానాన్నల ప్రేమ, మద్దతు వల్లే ఏ సందర్భమైనా వెనకడుగు వేయకుండా ముందుకు సాగగలిగా.



పెనుమత్స నిఖిత
స్వస్థలం: ఏలూరు జిల్లా, భీమడోలు మండలం మల్లవరం
తండ్రి: సోమరాజు, తల్లి: విజయదుర్గ
పదో తరగతి: 9.8 జీపీఏ
ఇంటర్ (ఎంపీసీ): 972/1000 మార్కులు
ఏపీ ఈఏపీసెట్: 22,000 ర్యాంకు
బీటెక్: కంప్యూటర్స్ సైన్స్ (ఏఐ, డేటా సైన్స్)
కళాశాల: సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (ఏలూరు)

ఆన్‌లైన్‌లో శిక్షణ

ఎంత బాగా చదివి ఎన్ని మంచి మార్కులు సాధించినా సరే, అమెజాన్ లాంటి సంస్థలో ఉద్యోగం పొందడం మాత్రం కష్టతరమని తెలుసుకున్నా. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనేది నా ఆశయం. అందుకే ఎంతో ప్రధానమైన కోడింగ్‌పై పట్టు సాధించాలని లక్ష్యంగా ఎంచుకున్నాను. నన్ను బాగా చదివించడం కోసం నా తల్లిదండ్రులు ఏలూరుకు మకాం మార్చారు. నిత్యం కళాశాల చదువు పూర్తయ్యాక కొంత సమయం ఆన్‌లైన్‌లో తర్ఫీదు పొందడానికి కేటాయించాను. దీనికి యూట్యూబ్ నాకు దిక్సూచి అయింది. కోడింగ్‌పై పట్టు సాధించాలంటే డీఎస్ఏను అనుసరించాలని తెలుసుకున్నా. కోడింగ్‌కు సంబంధించి ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవడానికి స్ట్రైవర్స్ డీఎస్ఏ షీట్‌ను అనుసరించేదాన్ని. అమెజాన్ సంస్థలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత దాదాపు రెండు నెలలపాటు రోజుకు నాలుగు గంటలపాటు వీటిపై అధ్యయనం చేసేదాన్ని. ఇంజినీరింగ్ చివరి సంవత్సరంలో అమెజాన్‌లో కొలువుకు ఎంపికయ్యాను. ఈ విషయం తెలిసిన నా తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. నా విజయం వెనుక వారి మద్దతుతో పాటు చదువు చెప్పిన ఎంతోమంది గురువులున్నారు. వారందరికీ ఎంతో రుణపడి ఉంటాను.

– జానకి సుబ్బారావు, న్యూస్‌టుడే, ఏలూరు

మనం రోజువారీ జీవితంలో కప్పు కాఫీలో ఓ చెంచాడు చక్కెర వేసుకోకుండా తాగలేం. ఓ పార్టీనో, పండగనో వచ్చిందంటే స్వీట్ లేకుండా సాగదు. బర్త్ డేనో, మరో సెలబ్రేషనో ఉంటే తీయటి కేకు ఉండాల్సిందే. వీటన్నింటిలో ఐక్యమై మరుపురాని రుచినిచ్చే చక్కెర దేశంలో గొప్ప ఉపాధి కల్పతరువుగా నిలుస్తోంది! అదెలాగో చూద్దాం!

తీయని కెరియర్



'అన్ని దారులూ రోమ్ వైపే' అన్నట్టు ఉపాధి కోసం ప్రతి గ్రాడ్యుయేటూ ఐటీ వైపు చూడనక్కర లేదు. తనలో నిక్షిప్తమై ఉన్న నిజమైన ఆసక్తిని గుర్తించి ఆ దిశగా నడిస్తే చాలు. తినే ఆహారం, వెళ్లే రెస్టారెంట్లు, ఉపయోగపడే వాహనం, అరక్షణం వదలకుండా ఉండే స్మార్ట్ ఫోన్, ట్యాబ్.. ఇవే కాకుండా పొద్దున్నే వాడే టూత్‌పేస్ట్, తాగే నీరు, ఇష్టపడే టీ, కాఫీలూ, అందులో వేసుకునే చక్కెర.. ఇలా దేనిలోనైనా అద్భుత కెరియర్ అవకాశాలను గుర్తించవచ్చు.

సాంప్రదాయికంగా భారత వ్యవసాయ రంగంతో పెనవేసుకుపోయిన పంచదార పరిశ్రమ మూలాల దాకా వెళ్లి పరిశీలిస్తే- క్రీస్తుపూర్వం 1200 నాటికే చెరకు సాగు ఆనవాళ్లున్నాయి. గుప్తుల కాలం వచ్చేసరికి పంచదార తయారీకి పునాదులు పడ్డాయి. చెరకు రసం నుంచి స్ఫటికాల (క్రిస్టల్స్) ఉత్పత్తి సాధ్యం చేయడంతో పంచదార భారీ పరిశ్రమగా అవతరించింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారుగా భారత్ నిలిచింది. ఉత్తరప్రదేశ్, బిహార్, పంజాబ్, హర్యానాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని 5 కోట్ల మంది చెరకు రైతులు గత సీజన్లో మూడు కోట్ల టన్నుల చెరుకును ఉత్పత్తి చేశారు. ప్రపంచ ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉన్న బ్రెజిల్‌ను పక్కకు నెట్టి ఇండియా పీఠం ఎక్కింది. ఇదే ఊపు కొనసాగితే పంచదార ఉత్పత్తిలో ప్రపంచంలో మొదటి స్థానం శాశ్వతంగా దక్కుతుంది.

యువతకు మంచి అవకాశాలు

దేశంలో 5 కోట్ల రైతుల ఉపాధికి ఆధారమైన చక్కెర పరిశ్రమ 5 లక్షల మందికి ప్రత్యక్షంగా కొలువులు కల్పిస్తోంది. ఇండియన్ షుగర్ మిల్స్ అసోసియేషన్ ప్రకారం దేశం నలుమూలలా ఉన్న 500 భారీ మిల్లుల్లో వివిధ విభాగాల్లో ఉద్యోగావకాశాలున్నాయి. ఉత్పత్తి, మిల్లుల సాంకేతిక నిర్వహణ, నాణ్యత నియంత్రణ (క్వాలిటీ కంట్రోల్), పరిశోధన- అభివృద్ధి (ఆర్ అండ్ డీ), సేల్స్, మార్కెటింగ్ విభాగాల్లో ఆసక్తి ఉన్న చురుకైన యువతకు మంచి అవకాశాలున్నాయి. మీరట్, ముజఫర్ నగర్, షహరన్‌పూర్, మహారాష్ట్రలోని చెరకు ఉత్పత్తికి సమీపంలో ఉన్న షుగర్ మిల్స్‌కు వెళితే షిఫ్టుల వారీగా పనిచేసే కార్మికుల నుంచి ఇంజినీర్ల వరకూ వివిధ వయసుల, విద్యా నేపథ్యాల వారు తారసపడతారు.

చెరకు నుంచి పంచదారను ఉత్పత్తి చేసే పరిశ్రమలో మొలాసిస్ ఉప ఉత్పత్తిగా లభ్యమవుతుంది. స్థాయిని బట్టి మూడు రకాల మొలాసిస్ బయటకు వస్తాయి. వీటిని వంటకాల్లో స్వీట్‌నర్ దగ్గర నుంచి గాఢత, రుచి స్వభావాన్ని బట్టి ఆల్కహాల్‌లో కూడా వినియోగిస్తారు. మొలాసిస్ కూడా ఒక పరిశ్రమగా రూపుదిద్దుకోవడంతో దీని ఉత్పత్తి, ప్రాసెసింగ్, సేల్స్, మార్కెటింగ్‌లలో యువతకు ఉపాధి అవకాశాలున్నాయి.

ఎథనాల్: చెరకును మొక్కజొన్న, కొన్ని సేంద్రియ పదార్థాలతో కలిపి పులియబెట్టడం వల్ల ఎథనాల్ ఉత్పత్తి అవుతుంది. దీనిని బయోఫ్యూయల్‌గా వినియోగించవచ్చు. బ్రెజిల్, అమెరికా దేశాల్లో ఎథనాల్‌ను నేరుగా ఇంధనానికి ప్రత్యామ్నాయంగా వాహనాల్లో ఉపయోగిస్తారు. కొన్ని చోట్ల కిరోసిన్‌లో కలిపి వాడతారు.

ప్రతిభావంతులకోసం నిరీక్షణ

దేశంలో ఐదు లక్షల మంది ప్రత్యక్షంగా పనిచేస్తున్నా.. ఈ పరిశ్రమ ప్రతిభావంతులైన యువత కోసం నిరీక్షిస్తోంది. ప్రధానంగా మెరుగైన వ్యవసాయ విధానాలు, ఉత్పాదకత అనే రెండు సవాళ్లను ఎదుర్కొంటోందీ పరిశ్రమ. ఒకప్పుడు హెక్టారుకు 45 టన్నులు పండుతుండగా ప్రస్తుతం 80 టన్నులు పండించగలుగుతున్నాం. కానీ పెడుతున్న పెట్టుబడి వ్యయంతో చూసుకుంటే మెరుగైన సేద్యపు విధానాలు అవలంబించి దిగుబడి పెంచుకోవాల్సిన అవసరం ఉంది. రిమోట్ సెన్సింగ్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని వ్యవసాయ పద్ధతులను మెరుగుపరచాలని చెరకు పరిశ్రమ కోరుకుంటోంది.

ఈ సవాళ్లకు పరిష్కారాలు కనుగొనే సామర్థ్యమున్న యువత కోసం పరిశ్రమ నిరీక్షిస్తోంది. చెరుకు సాగుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్వయించి ఉత్పాదకతను పెంచగలిగే నైపుణ్యాలుంటే ఈ రంగంలో ఉజ్వల భవిష్యత్తు వేచి ఉంది. దీనితో పాటు ఇంజినీరింగ్‌లోని వివిధ బ్రాంచుల్లో పొందిన కౌశలాలు ఈ రంగానికి దోహదపడతాయి. ఏయే విద్యా నేపథ్యాలకు ఈ పరిశ్రమలో అవకాశాలున్నాయో అవగాహన చేసుకొని కృషిచేస్తే ఈ తియ్యని కెరియర్లో భాగస్వాములు కావచ్చు.


ఉపాధి పథం
నైపుణ్య సాధనం



– యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

దేనికి ఇవ్వాలి ప్రాధాన్యం?

బీఈడీని ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ కాంబినేషన్లో పూర్తిచేశాను. డీఎస్సీలో ఎస్‌జీటీ పేపర్‌తోపాటు.. ఎస్ఏ ఇంగ్లిష్, ఎస్ఏ సోషల్ స్టడీస్ రాద్దామనుకుంటున్నాను. ఏ పేపర్‌కు ప్రాధాన్యమివ్వాలి? - నైటింగేల్



■ మీరు బీఈడీలో ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ మెథడాలజీలు రెండూ చేశారు కాబట్టి మీ విద్యార్హతల ప్రకారం స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేయవచ్చు. కానీ సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) ఉద్యోగానికి మాత్రం అర్హులు కారు. ఒకవేళ మీరు డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఈడీ) కూడా పూర్తి చేసివుంటేనే ఎస్‌జీటీ ఉద్యోగానికి అర్హులవుతారు.

ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల్లో మీ సామాజిక కేటగిరీకి ఎక్కువ ఉద్యోగాలు దేనికి ఉన్నాయో, మీకు ఏ సబ్జెక్టుపై ఎక్కువ పట్టు, ఆసక్తి ఉందో దానికి ప్రాధాన్యం ఇవ్వాలి. సాధారణంగా ఎస్‌జీటీ ఉద్యోగాలతో పోలిస్తే స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాల సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. అందుకని మీరు ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసి, సమయపాలన పాటిస్తూ రెండిటికీ సన్నద్ధం అవ్వండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

ఫోరెన్సిక్ సైన్స్ వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

గాంధీనగర్‌లోని కేంద్ర హోం మంత్రిత్వశాఖకు చెందిన నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ.. ఒప్పంద ప్రాతిపదికన 7 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ఫోరెన్సిక్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ.
అర్హత: మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ, నెట్ అర్హతతో పాటు ఉద్యోగానుభవం.
వేతనం: నెలకు రూ.90,000. **దరఖాస్తు ఫీజు:** రూ.500. ఎస్సీ/ ఎస్టీ/ ఈడబ్ల్యూఎస్/ పీడబ్ల్యూడీ/ మహిళా అభ్యర్థులకు రూ.250. **ఎంపిక:** విద్యార్హతలు, ఇంటర్వ్యూలతో.
చిరునామా: ది క్యాంపస్ డైరెక్టర్, ఎన్ఎఫ్ఎస్‌యూ- త్రిపుర క్యాంపస్, రాధానగర్.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.08.2025. **వెబ్‌సైట్:** https://www.nfsu.ac.in/

కొచ్చిన్ పోర్ట్ అథారిటీలో మేనేజర్లు

కొచ్చిన్ పోర్ట్ అథారిటీ, కేరళ ఒప్పంద ప్రాతిపదికన 6 మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ సీనియర్ మేనేజర్(బీడీ): 01 ◗ మేనేజర్(ఐటీ/లీగల్/ఎస్టేట్): 03 ◗ డిప్యూటీ మేనేజర్(హెచ్‌ఆర్): 01 ◗ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్: 01
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, బీటెక్/బీఈ, ఎల్ఎల్‌బీ, పీజీ, డిప్లొమాతో పాటు పని అనుభవం. **గరిష్ఠ వయసు:** సీనియర్ మేనేజర్‌కు 45 ఏళ్లు, మేనేజర్‌కు 40 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్‌కు 45 ఏళ్లు.
వేతనం: నెలకు సీనియర్ మేనేజర్‌కు రూ.1,60,000, మేనేజర్‌కు రూ.1,20,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.80,000, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్‌కు రూ.1,60,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 22.08.2025
ఎంపిక: ఇంటర్వ్యూతో. వెబ్‌సైట్: https://www.cochinport.gov.in/careers

ఎన్‌సీఈఎస్ఎస్‌లో ప్రాజెక్ట్ అసోసియేట్లు

కేరళలోని నేషనల్ సెంటర్ ఫర్ ఎర్త్ సైన్స్ స్టడీస్, (తిరువనంతపురం) ఒప్పంద ప్రాతిపదికన 7 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ ప్రాజెక్ట్ అసోసియేట్-1: 05 ◗ కన్సల్టెంట్ ఇంజినీర్(సివిల్): 01 ◗ సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: 01 **అర్హత:** పోస్టును అనుసరించి పీజీ, డిగ్రీతో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: 28.08.2025 నాటికి ప్రాజెక్ట్ అసోసియేట్-1కు 35 ఏళ్లు, కన్సల్టెంట్ ఇంజినీర్ (సివిల్)కు 63 ఏళ్లు, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 40 ఏళ్లు.
వేతనం: నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్-1కు రూ.31,000, కన్సల్టెంట్ ఇంజినీర్‌కు రూ.50,000, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28.08.2025. ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://www.ncess.gov.in/vacancies.php

ఏపీలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. (జోన్-I: 13, జోన్-II: 12, జోన్-III: 12, జోన్-IV: 05) **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ లా డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత. ఇంటర్మీడియట్ తరువాత ఐదేళ్ల న్యాయ కోర్సులో ఉత్తీర్ణులూ అర్హులే. 04.08.2025 నాటికి రాష్ట్రంలోని క్రిమినల్ కోర్టుల్లో కనీసం మూడేళ్లు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన అనుభవం. **వేతన శ్రేణి:** నెలకు రూ.57,100- రూ.1,47,760.
వయసు: 01.07.2025 నాటికి 42 ఏళ్లు మించకూడదు. (ఓబీసీ, ఎస్సీ/ఎస్టీ, దివ్యాంగులకు సడలింపు ఉంటుంది). ఎంపిక: రాత పరీక్ష (పేపర్-1, పేపర్-2), ఇంటర్వ్యూలతో.
దరఖాస్తు ఫీజు: ఓసీ/ బీసీలకు రూ.600. ఎస్సీ/ఎస్టీలకు రూ.300.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07.09.2025. **వెబ్‌సైట్:** https://slprb.ap.gov.in/

ఎయిమ్స్ నాగ్‌పూర్‌లో సీనియర్ రెసిడెంట్లు

నాగ్‌పూర్‌లోని ఎయిమ్స్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 108 సీనియర్ రెసిడెంట్ నాన్-అకడమిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి మెడికల్ డిగ్రీతో పాటు పని అనుభవం .
గరిష్ఠ వయసు: 45 ఏళ్లు. **వేతనం:** నెలకు రూ.67,700. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 19.08.2025. **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.500. ఎస్సీ, ఎస్టీలకు రూ.250. ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://aiimsnagpur.edu.in/pages/vacancies

యూనియన్ బ్యాంక్‌లో వెల్త్ మేనేజర్లు

యూనియన్ బ్యాంక్ ఇండియా ముంబయి 250 వెల్త్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి ఎంబీఏ/పీజీడీఎం, పీజీడీబీఎం, పీజీడీబీఏ, పీజీడీఎంతో పాటు పని అనుభవం. **వయసు:** 25 ఏళ్ల నుంచి 35 ఏళ్లు ఉండాలి. **వేతన శ్రేణి:** నెలకు రూ.68,820 - రూ.93,960. **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీలకు రూ.177. ఇతరులకు రూ.1180.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.08.2025
ఎంపిక: రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://www.unionbankofindia.co.in/en/common/recruitment

వర్క్ ఫ్రమ్ హోమ్

క్యాంపస్ మార్కెటింగ్

సంస్థ: ఎడ్యువేద అకాడమీ
నైపుణ్యాలు: డిజిటల్ మార్కెటింగ్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మార్కెటింగ్ క్యాంపెయిన్స్, మార్కెటింగ్ స్ట్రాటజీస్, నెట్‌వర్కింగ్ స్టైపెండ్: రూ.10,000-25,000
☛ https://shorturl.at/0lKDW

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: వార్తాలాప్ మీడియా
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.15,000-28,000
☛ https://shorturl.at/ZsLtF

వర్డ్‌ప్రెస్ డెవలప్‌మెంట్

సంస్థ: సెలెక్టిక్స్ (వాన్‌కోవర్, కెనడా)
నైపుణ్యాలు: సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, వర్డ్‌ప్రెస్ స్టైపెండ్: రూ.25,000
☛ https://shorturl.at/wtsXX

ఇంటర్న్‌షిప్స్

సప్లయ్ చెయిన్ అండ్ లాజిస్టిక్స్ ఆపరేషన్స్

సంస్థ: జోసన్ మెషిన్స్ ఓపీసీ ప్రై.లి.
నైపుణ్యాలు: లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ స్టైపెండ్: రూ.10,001-30,002
☛ https://shorturl.at/GEaEh
వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 25

కంటెంట్ రైటింగ్

సంస్థ: ఫ్లోబిజ్ నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడం, స్క్రిప్ట్ రైటింగ్ స్టైపెండ్: రూ.18,000-20,000
☛ https://shorturl.at/PIQFh

ఇంటర్నేషనల్ బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: లాగిక్వాడ్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: కోల్డ్ కాలింగ్, డిజిటల్, ఈమెయిల్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, సేల్స్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.12,000-15,000
☛ https://shorturl.at/jwom7
వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 24

రిక్రూట్‌మెంట్

సంస్థ: నవిర్ కన్సల్టెంట్స్
నైపుణ్యం: ఇంగ్లిష్ మాట్లాడటం
స్టైపెండ్: రూ.20,000-30,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 27
☛ https://shorturl.at/qLrH8

క్రియేటివ్ డిజైన్

సంస్థ: లిటిల్ బిగ్ థింగ్స్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్ ఎక్సెల్, సేల్స్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.20,000- 27,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 23
☛ https://shorturl.at/dwkyS

వాయుసేనలో అగ్నివీర్ వాయు

భారత వాయుసేన క్రీడల విభాగంలో అగ్నివీర్ వాయు నియామకాల నోటిఫికేషన్ విడుదల చేసింది.
క్రీడాంశాలు: అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, క్రికెట్, సైక్లింగ్, ఫుట్‌బాల్, గోల్ఫ్, లాన్ టెన్నిస్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్/ డైవింగ్, షూటింగ్, వాటర్ పోలో, రెజ్లింగ్, సైకిల్ పోలో, జిమ్నాస్టిక్స్, హాకీ, స్క్వాష్, కబడ్డీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, ఉషు.
అర్హత: కనీసం 50% మార్కులతో ఇంటర్మీడియట్/ 10+2 (మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్) లేదా ఏదైనా స్ట్రీమ్/ సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్/ 10+2/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. లేదా ఇంజినీరింగ్‌లో డిప్లొమా కోర్సు (మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ). నిర్దిష్ట శారీరక/ వైద్య ప్రమాణాలతో పాటు స్పోర్ట్స్ విజయాలు.
కనీస ఎత్తు: 152 సెం.మీ. **వయసు:** 01.01.2005 - 01.07.2008 మధ్య జన్మించివుండాలి.
ఎంపిక: డాక్యుమెంట్ వెరిఫికేషన్ & ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, స్పోర్ట్స్ నైపుణ్య పరీక్షలు (క్రీడా విభాగాల ప్రకారం), మెడికల్ ఎగ్జామినేషన్‌తో. **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.100.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: 11.08.2025.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 20.08.2025.
రిక్రూట్‌మెంట్ ట్రయల్స్ షెడ్యూల్: సెప్టెంబరు 8 నుంచి 10 వరకు. **మెడికల్ పరీక్షలు:** సెప్టెంబర్ 15 నుంచి.
ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంప్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ న్యూదిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూదిల్లీ.
వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in/AV/

వాక్-ఇన్

భారత్ ఎలక్ట్రానిక్స్‌లో..

ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ, నవరత్న హోదా కలిగిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) ఘజియాబాద్ ఒప్పంద ప్రాతిపదికన 8 మేనేజ్‌మెంట్ ఇండస్ట్రియల్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
అర్హత: పోస్టును అనుసరించి ఐసీడబ్ల్యూఏ/సీఏ ఇంటర్‌తో పాటు పని అనుభవం. **వయసు:** 31.07.2025 నాటికి 25 ఏళ్లు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
వేతనం: నెలకు రూ.25,000 - రూ.30,000.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీ: 19.08.2025
వేదిక: హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, సైట్-4, సహిబాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, ఘజియాబాద్, ఉత్తర్ ప్రదేశ్- 201010.
వెబ్‌సైట్: https://bel-india.in/job-notifications/

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: **చదువు,** ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512 edc@eenadu.in

Wordwise

ఆహ్లాదకరంగా ఇంగ్లిష్ పదజాలం పెంచుకుందామా? ఇక్కడ ఇచ్చిన Wordwise ను పూర్తిచేయండి. పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుంది!


ACROSS

1. Not daily, not weekly, but it comes just once every 365 days
7. This red-haired teen from Riverdale stars in famous comics with friends like Betty and Jughead.
8. Short in size, but heavy to bear — a word for grief, pain, and despair
9. "Traffic Light" abbr.
10. When you're unsure what to say, just type these two letters your way!
11. 'Nevertheless'
12. A sport played on horseback with a mallet and a ball
13. Before an exam or after watching a movie, you might write or do this.

DOWN

1. Not a sleeper, but close to it— wide open mouth, that's the fit!
2. In Greek myths, he's the god of love—shoots arrows from above
3. Number one in cards or skill — three letters that fit the bill!
4. It tells if your blood type is positive or negative — just two letters
5. Tiny in size, not much at all
6. The color of the sun, bananas, and bright smiley faces!
11. It's 'ion' flipped around — can you spot it backward?
12. The initials of the former Indian Prime Minister known for economic reforms in the 1990s.

- డా. వంగీపురం శ్రీనాథాచారి



ANSWERS

DOWN
1. YAWNER
2. EROS
3. ACE
4. RH (RH = Rhesus)
5. LITTLE
6. YELLOW
11. NOI
12. PV (PV Narasimha Rao)

ACROSS
1. YEARLY
7. ARCHIE
8. WOE
9. TL
10. SN
11. NTL
12. POLO
13. REVIEW


ఆర్టికల్ 370 రద్దుకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా జమ్మూలో భాజపా శ్రేణుల సంబరాలు

ఆర్టికల్ 370 రద్దుకు ఆరేళ్లు

- రాత్రి 15 నిమిషాలపాటు లైట్లు బంద్‌తో నిరసన

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370, 35ఏలను రద్దు చేసి ఆరేళ్లు గడిచిన నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్, పీడీపీ సహా మరికొన్ని పార్టీలు మంగళవారం బ్లాక్ డేగా పాటించాయి. అలాగే మాజీ సీఎం, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ పిలుపు మేరకు మంగళవారం రాత్రి 9 గంటల నుంచి 15 నిమిషాల పాటు కశ్మీర్ వ్యాప్తంగా లైట్లను బంద్ చేశారు. ఆర్టికల్ 370 రద్దు అనేది రాజ్యాంగ విలువలపై దాడిగా పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా జమ్మూకశ్మీర్ యూనిట్ కాంగ్రెస్ మంగళవారం స్థానికంగా నిరసన చేపట్టింది. ఇదిలా ఉండగా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను ఎప్పుడిస్తారని అధికార నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా కేంద్రాన్ని ప్రశ్నించారు.

శాంతికి బాటలు వేసిన గొప్ప రోజు

ఆగస్టు 5: భాజపా

ఆగస్టు 5 జమ్మూకశ్మీర్‌లో శాంతి, వికాసం, సమాన హక్కులకు బాటలు వేసిన గొప్ప రోజని భాజపా అధికార ప్రతినిధి అల్తాఫ్ ఠాకూర్ తెలిపారు. దీన్ని ఇతర రాజకీయ పార్టీలు బ్లాక్‌డేగా పాటించడం సరికాదన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు ముందు జమ్మూకశ్మీరులో వేర్పాటువాదులు, తీవ్రవాదుల సానుభూతిపరుల కారణంగా శాంతిభద్రతలు అదుపులో ఉండేవి కావని తెలిపారు. ఆ అధ్యాయం ముగిసిపోయి, మంచి రోజులు వచ్చాయన్నారు.

ఎర్రకోటలోకి డమ్మీ బాంబు

- ఏడుగురు అధికారుల సస్పెన్షన్

ఇంటర్నెట్‌డెస్క్: మరికొన్ని రోజుల్లో స్వాతంత్య్ర వేడుకలు జరగనున్న నేపథ్యంలో ఎర్రకోటలో తీవ్ర భద్రతా వైఫల్యం బయటపడింది. విధుల్లో ఉన్న భద్రతాధికారులు డమ్మీ బాంబును గుర్తించలేకపోయారు. దీంతో ఉన్నతాధికారులు వారిని సస్పెండ్ చేశారు. స్వాతంత్య్ర దినోత్సవం నేపథ్యంలో భద్రతా సిబ్బంది అప్రమత్తతను, సంసిద్ధతను పరీక్షించేందుకు ఎర్రకోటలో స్పెషల్ డ్రిల్ నిర్వహించినట్లు దిల్లీ పోలీసులు తెలిపారు. అందులో భాగంగా కొందరు భద్రతా అధికారులు సాధారణ వ్యక్తుల్లా డమ్మీ బాంబుతో ఎర్రకోటలోకి ప్రవేశించినట్లు వెల్లడించారు. అయితే, అక్కడ విధుల్లో ఉన్న అధికారులు ఆ బాంబును గుర్తించడంలో విఫలమయ్యారని తెలిపారు. దీంతో వారిపై చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని తెలిపారు.



నేడు కర్తవ్య భవన్‌ను ప్రారంభించనున్న మోదీ


దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఉమ్మడి కేంద్ర సచివాలయ (సీసీఎస్) ప్రాజెక్టు కింద మొత్తం 10 కార్యాలయ భవనాల నిర్మాణాన్ని 22 నెలల్లో పూర్తిచేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. వాటిలో మొదటిదైన కర్తవ్య భవన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభిస్తున్నారు. ఈ విషయాన్ని కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ విలేకరులకు తెలిపారు. సీసీఎస్-3గా పరిగణిస్తున్న కర్తవ్య భవన్‌లోకి కేంద్ర హోం, విదేశీ వ్యవహారాలు, పెట్రోలియం శాఖ, ప్రధానమంత్రికి ముఖ్య శాస్త్ర వ్యవహారాల సలహాదారు కార్యాలయాలు తరలివెళతాయి. 2019లో ప్రారంభించిన సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో సిద్ధమైన మొదటి భవనమిదే. ప్రస్తుతం శాస్త్రి భవన్, కృషి భవన్, నిర్మాణ్ భవన్, ఉద్యోగ్ భవన్‌లలో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు సీసీఎస్ ప్రాజెక్టు కింద నిర్మితమయ్యే కొత్త భవనాల్లోకి క్రమంగా మారిపోతాయి. పాత భవనాల కూల్చివేతకు టెండర్లు పిలవనున్నారు.

డేరా బాబాకు మళ్లీ పెరోల్



చండీగఢ్: తన శిష్యురాళ్లు ఇద్దరిపై అత్యాచారానికి ఒడిగట్టిన నేరానికి 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ (డేరా బాబా) మంగళవారం 40 రోజుల పెరోల్‌పై విడుదల అయ్యారు. ఈ ఏడాదిలో ఇంతవరకు రెండుసార్లు ఆయన పెరోల్‌పై విడుదల అయ్యారు. తాజా పెరోల్ మూడవది. పెరోల్ కాలంలో ఆయన సిర్సాలోని తమ డేరా (శిబిర) ప్రధాన కార్యాలయంలో ఉంటారు. ఆగస్టు 15న రామ్ రహీమ్‌కు 58 ఏళ్లు వస్తాయి. 2017లో ఆయనకు ఇద్దరు శిష్యురాళ్లపై అత్యాచారం చేశారని ఆరోపణ వచ్చింది. 16 ఏళ్ల క్రితం ఒక జర్నలిస్టును హత్య చేసిన నేరానికి రామ్ రహీమ్ తోపాటు మరో ముగ్గురికి 2019లో శిక్ష పడింది. రామ్ రహీమ్ పదేపదే పెరోల్ మీద బయటకు వస్తుంటే, శిక్షా కాలం పూర్తయిన తరువాత కూడా బందీ సింగ్‌లు (సిక్కులు) జైళ్లలోనే మగ్గిపోతున్నారని శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ విమర్శించింది. జైలు శిక్ష పడినప్పటి నుంచి రామ్ రహీమ్ ఇంతవరకు 13సార్లు జైలు నుంచి బయటికొచ్చారు.

హిరోషిమా అణు విలయానికి నేటితో 80 ఏళ్లు



హిరోషిమా... ఈ పేరే అణు విస్ఫోటం సృష్టించగల విలయానికి ప్రతీక. మానవాళి ఎన్నటికీ మరువలేని ఆ విధ్వంసం సంభవించి బుధవారం నాటికి 80 ఏళ్లు పూర్తికానున్నాయి. నాటి భీతావహ ఘటనాక్రమం ఇలా ..

ఆగస్టు 6, 1945... ఉదయం దాదాపు 7 గంటల ప్రాంతంలో గగనతలంలో దక్షిణ దిక్కు నుంచి ఏవో విమానాలు చొచ్చుకు వస్తున్నాయని జపాన్ రాడార్ వ్యవస్థ గుర్తించింది. కొద్దిసేపటి తర్వాత గానీ అర్థం కాలేదు అవి అమెరికా యుద్ధ విమానాలని. అప్పటికి ఇంకా రెండో ప్రపంచ యుద్ధం ముగియలేదు. జర్మనీ, ఇటలీ అస్త్ర సన్యాసం చేసినా జపాన్ మాత్రం ఇంకా దాడులను కొనసాగిస్తోంది. యుద్ధాన్ని ఆపకపోతే రేపో మాపో జపాన్‌పై తమ రహస్య ఆయుధాన్ని ప్రయోగించాల్సి వస్తుందని...అది మానవాళి ఎన్నడూ చూడని విధ్వంసాన్ని సృష్టిస్తుందని అమెరికా హెచ్చరించింది. యుద్ధ భయాల మధ్యే ఆ రోజు కూడా హిరోషిమా మేల్కొంది. రోజువారీ పనుల్లో నిమగ్నమైంది. పిల్లలు పాఠశాలలకు వెళ్తున్నారు. ఆ సమయంలోనే అమెరికా యుద్ధ విమానాన్ని గుర్తించిన జపాన్... రేడియో ప్రసారాలను ఆపేసి సైరన్లను మోగించింది. ఉదయం 8 తర్వాత 'ది స్ట్రెయిట్ ఫ్లాష్' అనే అమెరికా బి-29 యుద్ధ విమానం వెనుతిరగడంతో సైరెన్లు ఆపేసింది.



అగ్నిగోళమై మండిన నగరం

ది స్ట్రెయిట్ ఫ్లాష్ వెనుతిరిగిన కొద్ది నిమిషాలకే కర్నల్ పాల్ టిబెట్స్ నడుపుతున్న 'ఎనోలా గే' యుద్ధ విమానం హిరోషిమా గగనతలంపై ప్రత్యక్షమైంది. దాని వెనకే కాస్త దూరంలో 'ది గ్రేట్ ఆర్టిస్ట్' అనే మరో బి-29 యుద్ధ విమానం ఎగురుతోంది. 'నెస్సెసరీ ఈవిల్' అనే యుద్ధ విమానం దాన్ని అనుసరిస్తోంది. కొన్ని నిమిషాల తర్వాత జరగనున్న విధ్వంసాన్ని ప్రపంచానికి చూపించేందుకు ఫోటోలను తీయడం కోసం మాత్రమే దీనిని అక్కడికి పంపించారు. వాతావరణం అనుకూలంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాత ఎనోలా గే నుంచి 'లిటిల్ బాయ్' అనే పేరు గల అణుబాంబును ప్రయోగించేందుకు పాల్ సిద్ధమయ్యారు. హిరోషిమాలోని ఏవోయీ వంతెనను లక్ష్యంగా చేసుకుని విమానంలోంచి మూడున్నర మీటర్ల పొడవు, నాలుగు టన్నుల బరువు ఉన్న 'లిటిల్ బాయ్' అణుబాంబును జారవిడిచారు. అది సరిగ్గా ఉదయం 8.15 గంటల సమయంలో 31 వేల అడుగుల ఎత్తునుంచి 43 సెకన్లలో భూమిపై పడి ఒక్కసారిగా అగ్నిగోళంలా మండిపోయింది. ఆ సమయంలో వెలువడిన శక్తి 15 వేల టన్నుల టీఎంటీ (ట్రైనైట్రో టోలీన్) విస్ఫోటక పదార్థం పేలుడు వల్ల ఉద్భవించే శక్తితో సమానం. ఈ పేలుడు వల్ల 7 వేల డిగ్రీల ఉష్ణోగ్రత జనించింది. ధ్వని తరంగాల కంటే వేగంగా ప్రయాణించే ప్రకంపనలు పుట్టుకొచ్చాయి. అణుబాంబు పేలిన 15 కి.మీ. దూరం వరకూ భవనాలన్నీ నేలమట్టమయ్యాయి. క్షణాల్లో హిరోషిమాలో 80 వేల మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. 70శాతం నివాసాలు, భవనాలు కాలి బూడిదయ్యాయి. 3 వేల అడుగుల పైకి పుట్టగొడుగు ఆకారంలో బూడిద ఎగసిపడింది. అనంతరం మూడు రోజుల తర్వాత అమెరికా ఆగస్టు 9న నాగసాకిపై 'ఫ్యాట్ మాన్' అనే మరో అణుబాంబును ప్రయోగించి లక్షల మంది ప్రాణాలను బలితీసుకుంది.



"అణు బాంబు దాడిలో కాలి గాయాలతో జీవిస్తున్న వారి పట్ల ఆ రోజుల్లో వివక్ష చూపేవారు. మా గ్రామంలో చాలా మందికి ముఖాలు, వీపు భాగంలో తీవ్రంగా గాయాలయ్యాయి. కళ్లు తప్ప వారి అవయవాలేవీ సక్రమంగా ఉండేవి కావు. వారిని సమాజం బహిష్కరించింది. పెళ్లి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. అణుబాంబు బాధితులకు చర్మవ్యాధి ఉంటుందని, అది తమకు సోకుతుందని భయపడేవారు" *–లీ జంగ్ సూన్ (88)*



"అణుబాంబు పేలినప్పుడు నా వయసు మూడేళ్లు. పేలుడు తీవ్రత ఇప్పటికీ నాకు గుర్తుంది. నన్ను ఎవరో భవనం లోంచి బయటకు విసిరేసినట్లు అనిపించింది. కళ్లు తెరచి చూస్తే నేను శిథిలాల కింద ఒంటరిగా పడి ఉన్నాను. అమ్మా కాపాడు అని అరుద్దామన్నా గొంతు పెగల్లేదు. ఆ తర్వాత నన్ను మా తాతయ్య రక్షించారు. అప్పటి నుంచి నోరు తెరచి మాట్లాడటానికే నాకు చాలా సంవత్సరాలు పట్టింది. అణ్వాయుధాలన్నింటినీ నాశనం చేయడమే శాంతికి మార్గం" *– కునిహికో ఐడా (83)*

వారి కోసం ఇప్పటికీ వెదుకుతున్నారు...

అణు విధ్వంసం తర్వాత జపాన్ అధికారులు వేల మంది క్షతగాత్రులను అప్పటికప్పుడు పడవల్లో నినోషిమా ద్వీపానికి తరలించారు. వీరిలో చాలామంది సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోయారు. అప్పటి ప్రభుత్వం హడావుడిగా వీరి అంత్యక్రియలు నిర్వహించింది. అప్పట్లో తప్పిపోయిన వారి కోసం దశాబ్దాలు దాటినా నేటికీ వెదుకులాట కొనసాగుతోంది. చనిపోయిన తమ ఆత్మీయుల అవశేషాలనైనా గుర్తించి వారి ఆత్మకు శాంతి చేకూర్చేందుకు ఎంతో మంది ఇంకా ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు.

భాజపా నేతల కాన్వాయ్‌పై దాడి

కూచ్‌బిహార్: పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బిహార్‌లో రాష్ట్ర భాజపా నాయకుడు, ప్రతిపక్ష నేత సువేందు అధికారి కాన్వాయ్‌పై దాడి జరిగింది. ఓ ఆందోళన కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం కేంద్ర మాజీ మంత్రి నిశీత్ ప్రమాణిక్‌తో కలిసి ఆయన కూచ్‌బిహార్‌కు వచ్చారు. అదే సమయంలో ఎస్పీ ఆఫీసు వద్ద 'భాజపా పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలపై దాడులు ఆపాలి.. బెంగాల్‌లో ఎన్‌ఆర్‌సీ అమలు ప్రయత్నాలను నిలిపివేయాలి' అంటూ టీఎంసీ కార్యకర్తలు నిరసనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో భాజపా నేతలు ప్రయాణిస్తున్న వాహనంపై కొందరు దాడికి దిగారు. దీంతో నేతల బుల్లెట్‌ప్రూఫ్ కారు అద్దాలు, వారికి ఎస్కార్టుగా వచ్చిన ఓ పోలీసు వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. ప్రణాళిక ప్రకారమే తమపై రోహింగ్యాలతో టీఎంసీ నేతలు దాడి చేయించారని సువేందు అధికారి ఆరోపించారు.

ఇక క్షిపణుల మోహరింపునకు సై

- అణ్వాయుధ ప్రయోగానికి వెనకాడబోమని రష్యా సంకేతం

మాస్కో: అణ్వస్త్రాల ప్రయోగానికి అనువైన మధ్యస్థాయి క్షిపణుల్ని మోహరించకుండా ఇంత వరకూ తనకు తానుగా పాటించిన సంయమనాన్ని ఇకపై పాటించబోనని రష్యా ప్రకటించింది.

ఉక్రెయిన్‌తో యుద్ధం తీవ్రమవుతుండడం, రష్యా సమీప జలాల్లోకి జలాంతర్గాముల్ని పంపుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం, ఐరోపా దేశాలు రష్యా వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్న నేపథ్యంలో అధ్యక్షుడు పుతిన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. తాజా పరిణామం రష్యా, అమెరికాల మధ్య ఆయుధ పోటీని మరింత తీవ్రం చేస్తుందని పరిశీలకులు పేర్కొంటున్నారు. అమెరికా, దాని మిత్రదేశాలు మధ్యస్థాయి క్షిపణుల్ని అభివృద్ధిపరచి వాటిని ఐరోపాలోను, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లోను మోహరించాలని నిశ్చయించిన నేపథ్యంలో తాము ఈ నిర్ణయానికి వచ్చినట్టు రష్యా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. వచ్చే సంవత్సరం అమెరికా టైఫూన్, డార్క్ ఈగిల్ క్షిపణుల్ని జర్మనీలో మోహరించనున్న విషయాన్ని రష్యా తన ప్రకటనలో ప్రస్తావించింది.

మరోవైపు నాటో దేశాలు పరస్పర సమన్వయంతో ఉక్రెయిన్‌కు భారీ ఆయుధాల నిరంతర సరఫరాను ప్రారంభించాయి. ఇందులో భాగంగా ఉక్రెయిన్‌కు 50 కోట్ల యూరోల విలువైన గగన తల రక్షణకు వినియోగించే సామగ్రిని ఇతర ఆయుధ సంపత్తిని అందిస్తున్నట్టు నెదర్లాండ్స్ ప్రకటించింది.

9 ఒప్పందాలపై భారత్-ఫిలిప్పీన్స్ సంతకాలు

- రెండు దేశాల మైత్రి వ్యూహాత్మక సహకారస్థాయికి ఎదిగింది
- ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్య

దిల్లీ: భారత్- ఫిలిప్పీన్స్‌ల మైత్రి ప్రబలమై వ్యూహాత్మక సహకార స్థాయికి ఎదిగిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. మంగళవారం ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్ మార్కోస్ జూనియర్‌తో చర్చల అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. "భారత్- ఫిలిప్పీన్స్‌లు మిత్రదేశాలుగా ఉండాలని నిర్ణయించాయి. ఇరుదేశాల మధ్య భాగస్వామ్యం విధి లిఖితం" అని మోదీ అన్నారు. రెండు దేశాలు వ్యూహాత్మక సహకార ఒడంబడికతో సహా మొత్తం 9 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. హిందూ మహాసముద్రం నుంచి పసిఫిక్ మహాసముద్రం వరకూ ఇరు దేశాల మధ్య స్నేహం విలువల ప్రాతిపదికన పరిఢవిల్లుతోందని ఆయన అన్నారు. ప్రధాని ప్రకటన చేస్తుండగా ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఆయన పక్కనే ఉన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిని నిర్ద్వంద్వంగా ఖండించడంతో పాటు ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు మద్దతు పలికినందుకు మోదీ ఫిలిప్పీన్స్ అధ్యక్షునికి మోదీ ధన్యవాదాలు తెలిపారు.


దిల్లీలోని హైదరాబాద్ హౌస్ వద్ద ప్రధాని మోదీతో ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు మార్కోస్ జూనియర్

రాష్ట్రపతి భవన్‌లో ముర్ము, మోదీ స్వాగతం

ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఐదురోజుల అధికారిక పర్యటన కోసం సోమవారం సతీసమేతంగా భారత్ విచ్చేశారు. తన పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం రాష్ట్రపతి భవన్ సందర్శించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు స్వాగతం పలికారు. ఫిలిప్పీన్స్‌తో భారత దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో మార్కోస్ జూనియర్ దంపతుల అధికారిక పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

రూ.200 వివాదం.. కొత్తగా పెళ్లైన వ్యక్తి హత్య

- ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘటన

గోండా: రెండు వందల రూపాయలపై వివాదంతో కొత్తగా పెళ్లైన ఓ వ్యక్తిని ఐదుగురు వ్యక్తులు కర్రలతో దాడి చేసి హతమార్చారు. ఈ ఘటన మంగళవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోండా జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...లక్ష్మణ్‌పుర్ జాట్‌కి చెందిన హృదయ్ లాల్(22), అదే గ్రామస్థుడైన రామ్ అనుజ్ అనే వ్యక్తికి రూ.700 అప్పుగా ఇచ్చాడు. ఈ నెల 1న రూ.200 తిరిగి ఇవ్వాలని అనుజ్‌ని కోరగా.. ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో అనుజ్, అతని సోదరుడు రామ్ కిశోర్, తనయుడు జగ్‌దీశ్, మేనల్లుడు పంకజ్, చందన్ కలిసి లాల్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్రంగా గాయపడిన లాల్‌కు లఖ్‌నవూలోని ఓ ఆసుపత్రిలో చికిత్స అందించగా మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. దీంతో తమకు న్యాయం జరగాలని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు.

కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘన జరగలేదు

- స్పష్టంచేసిన సైన్యం

దిల్లీ: 'ఆపరేషన్ సిందూర్' అనంతరం పాకిస్థాన్ తొలిసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందంటూ వచ్చిన వార్తలను మన సైన్యం ఖండించింది. దాయాది సైన్యం మంగళవారం జమ్మూకశ్మీర్ పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి ఉన్న భారత సైనిక స్థావరాలపై కాల్పులు జరిపినట్లు పలు కథనాలు పేర్కొన్నాయి. అప్రమత్తమైన భారత సైన్యం దీటుగా తిప్పికొట్టినట్లు ప్రచారం జరిగింది. "మన్‌కోట్ సెక్టార్‌లో ఇరుపక్షాల మధ్య దాదాపు 15 నిమిషాల పాటు కాల్పులు కొనసాగాయి. ఈ పరిణామంతో సరిహద్దు వెంబడి భద్రతా దళాలను హై అలర్ట్‌లో ఉంచాం" అని సైనిక అధికారులు వెల్లడించినట్లు పలు జాతీయ మీడియా సంస్థలు కథనాలు వెలువరించాయి. అయితే, అలాంటిదేమీ లేదని సైన్యం విస్పష్టంగా ప్రకటించింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా మే నెలలో భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన విషయం తెలిసిందే. మే 10న ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ కుదరడంతో ఘర్షణలు సద్దుమణిగాయి.

పాక్‌కు సాయపడటం అమెరికాకు కొత్తేమీ కాదు: భారత సైన్యం

దిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని భారత్‌పై అమెరికా చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేలా సైన్యంలోని ఈస్టర్న్ కమాండ్ మంగళవారం చేసిన ఓ నర్మగర్భ పోస్టు వైరలయింది. దీనిలో.. కొన్ని దశాబ్దాలుగా పాకిస్థాన్‌కు అమెరికా ఆయుధాలను సరఫరా చేస్తోందని 1971 ఆగస్టు 5వ తేదీన ప్రచురితమైన వార్తను పోస్ట్ చేసింది. "ఆ సంవత్సరం ఇదేరోజు యుద్ధమేఘాలు కమ్ముకుంటున్న వేళ- 1971 ఆగస్టు 5' అని క్యాప్షన్ ఇచ్చింది. నాటి రక్షణ మంత్రి వీసీ శుక్లా రాజ్యసభకు వెల్లడించిన అంశాలు దీనిలో ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో పాకిస్థాన్ అరాచకాలకు పాల్పడుతున్నవేళ నాటో శక్తులు, సోవియట్ యూనియన్ ఆయుధ సరఫరాకు ఎలా ప్రయత్నించాయనే అంశాన్ని ఆయన ప్రస్తావించారు. అయితే.. సోవియట్, ఫ్రాన్స్ మాత్రం ఆయుధ సరఫరా అంశాన్ని తోసిపుచ్చినట్లు నాడు శుక్లా పేర్కొన్నారు. అమెరికా ఆయుధాల సరఫరాను, తన మద్దతును కొనసాగించిందని చెప్పారు. అమెరికాతో పాటు చైనా కూడా కారుచౌకగా ఆయుధాలను పాక్‌కు విక్రయించిందని నాడు రాజ్యసభకు వెల్లడించారు. సైన్యం పెట్టిన పోస్టులో ఈ ఆర్టికల్ పక్కనే నాటి పాక్ అధ్యక్షుడు యాహ్యా ఖాన్ కవ్వింపు వ్యాఖ్యలపై వచ్చిన వార్త ఉంది. 1971 యుద్ధంలో పాక్‌కు మద్దతుగా అమెరికా తన సెవెంత్ ఫ్లీట్‌ను బంగాళాఖాతంలోకి పంపిన విషయం తెలిసిందే. నాడు సోవియట్ మద్దతు భారత్‌కు ఉండటంతో.. అమెరికా ఎత్తులు పారలేదు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే మరిన్ని టారిఫ్‌లు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరిస్తున్న తరుణంలోనే ఈ పోస్టు చేయడం గమనార్హం.

అక్టోబరులో ఆకాశ్ జాతీయ ప్రతిభా పరీక్ష

హైదరాబాద్: ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ 16వ వార్షిక ట్యాలెంట్ హంట్ పరీక్ష - 2025 (అంథే -2025)ను వచ్చే అక్టోబరులో 4 నుంచి 12వ తేదీల మధ్య నిర్వహించనుంది. గడచిన పదహారు సంవత్సరాలుగా విద్యార్థుల ఆకాంక్షలను వారి విజయాలుగా మలుస్తూ తమ సంస్థ సాగిస్తున్న జైత్రయాత్రకు ఇది నిదర్శనమని ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ పరీక్షలో విజేతల కోసం రూ.250 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్టు ఆ సంస్థ తెలిపింది. క్లాస్‌రూమ్, ఆకాశ్ డిజిటల్, ఇన్‌విక్టస్ కోర్సులు చేసే ప్రతిభావంతులకు ఈ స్కాలర్‌షిప్ అందిస్తామని తెలిపింది. ఇది కాక క్యాష్ అవార్డులూ ఉంటాయని పేర్కొంది. ఆకాశ్ ట్యాలెంట్ హంట్ పరీక్ష నీట్, జేఈఈ, స్టేట్ సీఈటీలు, ఎన్‌టీఎస్ఈ, ఒలంపియాడ్ వంటి పోటీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు స్ఫూర్తినందిస్తుందని తెలిపింది. అలాగే 8 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం 'ఆకాశ్ ఇన్విక్టస్ ఏస్ టెస్ట్' అనే పోటీ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆకాశ్ ఇన్విక్టస్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రిపరేషన్ కార్యక్రమంలో ప్రవేశం కల్పించి స్కాలర్‌షిప్ అందిస్తారు. జాతీయ స్థాయి అర్హత స్కాలర్ షిప్ పరీక్ష ఈనెల 24న, 31న, సెప్టెంబరు 7న నిర్వహించనున్నామని తెలిపింది.

సంక్లిష్ట ఆర్థిక నేరాల విచారణకు ప్రత్యేక కోర్టులు అవసరం

- సర్వోన్నత న్యాయస్థానం వెల్లడి

దిల్లీ: న్యాయపరమైన అంశాలతో పాటు సంక్లిష్ట ఆర్థిక నేరాలతో ముడిపడిన కేసుల సత్వర విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ కేసులను త్వరగా తేల్చేందుకు ఆర్థికంతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులతో శాస్త్రీయ దర్యాప్తు జరగాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యాబాగ్చి ధర్మాసనం పేర్కొంది. ఛత్తీస్‌గఢ్ బొగ్గు కుంభకోణంలో నిందితుడైన వ్యాపారవేత్త సూర్యకాంత్ తివారీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. సంక్లిష్టమైన ఆర్థిక వ్యవహారాల్లో విచారణలను వేగంగా కొనసాగించి త్వరగా తీర్పులు వెలువరించడానికి గాను జడ్జీలకు కూడా శిక్షణ ఇవ్వాలని తెలిపింది. ఈ కేసులో తీర్పును రిజర్వు చేసింది.

బ్రెజిల్‌లో ట్రంప్ మిత్రునికి గృహనిర్బంధం

- బోల్సొనారోకు శిక్ష ఖరారుచేసిన ఆ దేశ సుప్రీంకోర్టు

సావోపాలో: బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో (70)కు దేశ సుప్రీం కోర్టు గృహనిర్బంధ శిక్ష విధించింది. 2022 అధ్యక్ష ఎన్నికలో ఓడిపోయి కూడా తన అనుయాయులతో తిరుగుబాటుకు ప్రయత్నించి, ఎన్నికల ఫలితాన్ని తారుమారు చేయడానికి ప్రయత్నించినందుకు ఆయనకు ఈ శిక్ష పడింది. 2023 జనవరి 8న బోల్సొనారో అనుయాయులు బ్రెజిల్ ప్రభుత్వ భవనాలపై దాడికి ప్రయత్నించారు. బోల్సొనారోకు క్షమాభిక్ష ఇవ్వాలని కోరుతూ సావోపాలో, రియో డి జనీరో నగరాల్లో ఆదివారం వేలమంది అభిమానులు భారీ ప్రదర్శన నిర్వహించారు. వారిలో ఆయన ఓటమి అనంతరం ప్రభుత్వ భవనాలపై దాడి చేసినవారు కూడా చాలామంది ఉన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి అలెగ్జాండ్రే డి మొరేస్ సోమవారం బోల్సొనారోకు గృహ నిర్బంధ శిక్ష విధించగానే అమెరికా విదేశాంగ శాఖ ఆ నిర్ణయాన్ని ఖండించింది. అంతకుముందు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మిత్రుడు, అతిమితవాద మాజీ అధ్యక్షుడు బోల్సొనారోను బ్రెజిల్ వామపక్ష ప్రభుత్వం వేధిస్తోందని మండిపడ్డారు. ఆయనపై కోర్టు విచారణ జరుపుతున్నందుకు బ్రెజిల్ ఎగుమతులపై 50 శాతం సుంకం విధించారు. 2022లో బోల్సొనారో ఓడిపోయినప్పుడు నాటి ఎన్నికల్లో విజేత, ప్రస్తుత దేశాధ్యక్షుడు డ సిల్వా, సుప్రీం కోర్టు న్యాయమూర్తి డి మొరేస్‌లను హతమార్చాలని చూశారని ప్రాసిక్యూషన్ ఆరోపణ.

విపక్ష కూటమి ర్యాలీ 11న

దిల్లీ: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వరకు ఈ నెల 8న జరపతలపెట్టిన ర్యాలీని 11వ తేదీకి వాయిదా వేయాలని విపక్షాలు నిర్ణయించాయి. ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ మృతి కారణంగా దీనిని మూడురోజులు వాయిదా వేశాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ నెల 7న విపక్ష కూటమి నేతలకు ఇవ్వనున్న విందు మాత్రం యథావిధిగా జరగనుంది. రాహుల్ నేతృత్వంలో మంగళవారం బెంగళూరులో జరగాల్సిన నిరసన ప్రదర్శనను 8వ తేదీకి వాయిదా వేశారు.

'రాహుల్ వ్యాఖ్యలు సరైనవే'

ఇండియా కూటమి పక్షాల నేతలు మంగళవారం సమావేశమయ్యారు. భారత్ జోడో యాత్ర సమయంలో దేశ సైన్యంపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు సరైనవేనని అభిప్రాయపడ్డారు. జాతీయ అంశాలను ప్రశ్నించే బాధ్యత రాజకీయ పార్టీలకు ఉంటుందని నొక్కి చెప్పారు. భద్రతా దళాలను రాహుల్ ఎంతో గౌరవిస్తారని, ప్రతిపక్ష నాయకుడిగా ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఆయనకు ఉందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ అన్నారు. రాహుల్ ఎప్పుడూ సైన్యానికి వ్యతిరేకంగా మాట్లాడరని స్పష్టంచేశారు.

100 మంది సమాజ సేవకులకు సన్మానం

దిల్లీ: సమాజంలో కింది స్థాయిలో సేవచేసే 100 మందిని దిల్లీలోని 'భారత గౌరవ రత్నశ్రీ సమ్మాన్' వేదికపై సన్మానించారు. వీరంతా సామాజికసేవ, మహిళా సాధికారత, సాంస్కృతిక పరిరక్షణ, విద్య, పర్యావరణ సంరక్షణ వంటి రంగాల్లో సేవలందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఉరుగ్వే, వెనెజువెలా, ఇరాక్, రువాండా, మాల్దీవులుతో సహా మొత్తం 10 దేశాల రాయబారులు, దౌత్యవేత్తలు హాజరయ్యారు. అస్సాం, నాగాలాండ్, మిజోరం మాజీ గవర్నర్ ప్రొఫెసర్ జగదీశ్ ముఖి, బాలీవుడ్ నటి నుశ్రత్ బరూచా వంటి ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. నిజమైన సేవకులను గుర్తించడం మన కర్తవ్యమే కాదు, బాధ్యత కూడా అని ఈ కార్యక్రమం కన్వీనర్ డాక్టర్ తపన్‌కుమార్ రౌతరాయ్ వ్యాఖ్యానించారు.

నో ఫ్లై జాబితాలో 48 మంది ప్రయాణికులు

దిల్లీ: ఈ ఏడాది వివిధ కారణాలతో జులై 30 వరకు 48 మంది విమాన ప్రయాణికులను నో ఫ్లై జాబితాలో చేర్చినట్లు పౌరవిమానయాన సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ రాజ్యసభకు తెలియజేశారు. విమానంలో ప్రయాణం సందర్భంగా అనుచిత ప్రవర్తన, గొడవ పడటం, సిబ్బందితో అమర్యాదగా ప్రవర్తించే వారు విమాన ప్రయాణ నిషేధం ఎదుర్కోవలసి ఉంటుంది. వారి ప్రవర్తన తీవ్రతను అనుసరించి నిషేధిత కాలం ఆధారపడి ఉంటుంది. 2020లో 10మందిని, 2021లో 63మంది, 2022లో 63 మంది, 2023లో 110 మంది, 2024లో 82 మందిని ఈ జాబితాలో చేర్చారు.

ఇథనాల్ పెట్రోల్‌తో ఏ సమస్యా లేదు

- కేంద్రం స్పష్టీకరణ

దిల్లీ: ఇథనాల్ కలిసిన పెట్రోల్(ఇ20)తో ఎలాంటి ఇంజిన్ సమస్యలు తలెత్తబోవని కేంద్రం వెల్లడించింది. ఇ20 ఇంధనం పాత వాహనాల సామర్థ్యాన్ని, డ్రైవింగ్‌ను దెబ్బతీస్తుందా..? అంటూ ఓ పోస్టు వైరల్ అయిన నేపథ్యంలో పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ స్పందిస్తూ.. ఇథనాల్ వల్ల కర్బన ఉద్గారాలు తగ్గుతాయని, గ్రామీణ ఆర్థికవ్యవస్థ మెరుగు పడుతుందని వ్యాఖ్యానించింది. పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్ ఎనర్జీ డెన్సిటీ తక్కువగా ఉంటుంది. దానివల్ల మైలేజీలో తగ్గుదల ఉన్నప్పటికీ.. అది అతి స్వల్పమేనని వెల్లడించింది. లక్ష కి.మీ. మేర సంప్రదాయ, ఇ20 ఇంధనం నింపిన వాహనాలకు జరిపిన పరీక్షల్లో పవర్, టార్క్, ఇంధన సామర్థ్యంలో గణనీయమైన తేడాలు కనిపించలేదని పేర్కొంది. ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పరిశీలనల్లో.. ఈ మిశ్రమ ఇంధనంతో ఇంజిన్ దెబ్బతిన్న సంకేతాలు లేవని తెలిపింది. ఇథనాల్ సేకరణ కార్యక్రమం ద్వారా రూ.1.20 లక్షల కోట్లు రైతుల చెంతకు చేరాయని, దీంతో ఉద్యోగాలు కల్పించామని వెల్లడించింది.

రంజాన్ పండుగలోపు బంగ్లాదేశ్‌లో కొత్త సర్కారు

ఢాకా: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తమ దేశ పార్లమెంటు ఎన్నికలు నిర్వహించనున్నట్లు బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ మంగళవారం ప్రకటించారు. దీర్ఘకాలం ప్రధాని పదవిలో కొనసాగిన షేక్ హసీనాను గద్దె దింపేందుకు విద్యార్థుల నేతృత్వంలో 2024లో జరిగిన 'జులై ఉద్యమం' ఏడాది పూర్తిచేసుకొన్న సందర్భంగా టెలివిజను ద్వారా యూనస్ జాతినుద్దేశించి ప్రసంగించారు. ఈ మేరకు తాత్కాలిక ప్రభుత్వం తరఫున ఎన్నికల సంఘానికి తాను లేఖ పంపి, రంజాన్ పండుగలోపు ప్రక్రియను ముగించాలని కోరనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 17 లేదా 18 నుంచి రంజాన్ నెల ప్రారంభం కానుంది.

లోక్‌సభలో తృణమూల్ చీఫ్ విప్‌గా కాకోలీ



కోల్‌కతా: లోక్‌సభలో తన పార్లమెంటరీ పార్టీ చీఫ్ విప్‌గా కాకోలీ ఘోష్ దస్తిదార్‌ను తృణమూల్ కాంగ్రెస్ నియమించింది. ఆమె లోక్‌సభలో బారాసాత్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. చీఫ్ విప్ పదవికి కల్యాణ్ బెనర్జీ రాజీనామా చేయడంతో పార్టీ కాకోలీ ఘోష్‌ను ఆ స్థానంలో నియమించింది. తృణమూల్‌కు చెందిన ఫైర్‌బ్రాండ్ ఎంపీ మహువా మొయిత్రాతో విభేదాల నేపథ్యంలో కల్యాణ్ బెనర్జీ తన పదవికి రాజీనామా చేసినట్టు తెలిసింది. పార్టీ ఛైర్‌పర్సన్ ఆయన రాజీనామాను ఆమోదించారని టీఎంసీ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొంది.